
‘ప్రజా ప్రతినిధులు చేయాల్సింది రెండే, ప్రజా సేవలో సమర్థతను చాటుకోవడమా! లేక తప్పుకోవడమా!’

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+12 వెల: ₹ 5.00

సంపుటి: 12
సంచిక: 217

మంగళవారం 29-10-2019

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




**హరియాణా సీఎంగా ఖట్టర్**

ఖట్టర్ రెండో సారి సీఎం పీఠమెక్కగా.. దుష్యంత్ ‘డిప్యూటీ’గా బాధ్యతలు – 5లో



**రన్నరప్ సాత్విక్–చిరాగ్ జంట**

ఫ్రెంచ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ డబుల్స్ ఫైనల్లో పరాజయం – స్పోర్ట్స్‌లో

# దూసుకెళ్తున్న కారు..



- దేశంలో ఎక్కడా లేని విధంగా 32 జిల్లా పరిషత్ స్థానాలు కైవసం
- 2019 లోక్‌సభ ఎన్నికల్లోనే తడబాటు..
- పైచేయి సాధించలేకపోతున్న కాంగ్రెస్
- బలోపేతం కాలేక బీజేపీ ఆపసోపాలు

ఎన్నికలు ఏవైనా ఆరేళ్లుగా టీఆర్‌ఎస్‌దే విజయం నారాయణఖేడ్ నుంచి హుజూర్‌నగర్ వరకు అన్నింటా గెలుపే

సాక్షి, హైదరాబాద్: 2014 ఎన్నికల్లో 63 అసెంబ్లీ, 11 లోక్‌సభ స్థానాల్లో విజయం.. ఆ తర్వాత జరిగిన మెదక్, వరంగల్ లోక్‌సభ, నారాయణ్‌ఖేడ్, పాలేరు అసెంబ్లీ ఉప ఎన్నికల్లోనూ గెలుపు.. 2018 ముందస్తు ఎన్నికల్లో ఏకంగా 88 అసెంబ్లీ స్థానాల్లో విజయం.. అనంతరం జరిగిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ ఎన్నికల్లో 60శాతం పైగా స్థానాలు, దేశ చరిత్రలో ఏ పార్టీ సాధించని విధంగా ఏకంగా 32 జడ్పీ పీఠాలు కైవసం.. తాజాగా హుజూర్‌నగర్ ఉప ఎన్నికలో 50 శాతానికి పైగా ఓట్లతో రికార్డు విజయం.. ఒక్క 2019 లోక్‌సభ ఎన్నికల్లో తడబాటు మినహా రాష్ట్రంలో ఏ ఎన్నికలు జరిగినా.. అది ఈవీఎం అయినా, బ్యాలెట్ అయినా.. కారు జోరుగా దూసుకుపోతోంది. ఎన్నికల పేరు మారడమే తప్ప.. ఆరేళ్లుగా విజయం మాత్రం టీఆర్‌ఎస్‌నే వరిస్తోంది. దీంతో అధికార పార్టీ జైత్రయాత్రకు ఎలా అడ్డుకట్ట వేయాలి? ఆ పార్టీ అధినేత కేసీఆర్ చరిష్మాకు గండికొట్టి ఎన్నికల్లో టీఆర్‌ఎస్‌ను ఎలా ఓడించాలన్న దానిపై రాష్ట్రంలోని ప్రతిపక్ష పార్టీల్లో అంతర్మథనం ప్రారంభమైంది. ముఖ్యంగా ప్రభుత్వానికి అనుకూల పరిస్థితుల్లో జరిగాయని భావిస్తున్న హుజూర్‌నగర్ ఉప ఎన్నికల్లోనూ 43వేల మెజార్టీతో గులాబీ సేన విజయం సాధించడంతో తమ భవిష్యత్తు

మిగతా 2వ పేజీలో ▶



చినజీయర్ స్వామిని పూలమాలతో సత్కరిస్తున్న కేసీఆర్ దంపతులు

## యాదాద్రి తలమానికం

త్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్ స్వామి 2 లో

# 4,000 రూట్లు ప్రైవేటుకు!

- తరచూ సమ్మెల నేపథ్యంలో సర్కారు యోచన
- రెండు మూడు రోజుల్లో నిర్ణయం తీసుకోనున్న కేబినెట్
- ఇప్పటికే వెయ్యి రూట్లకు టెండర్లు.. 21 వేల దరఖాస్తులు
- ఆర్థిక సంక్షోభంతో డీజిల్‌కు సైతం డబ్బుల్లేవు..
- ఏ క్షణంలోనైనా ఆర్టీసీ బస్సులు ఆగిపోవచ్చు
- అందుకే ప్రైవేటు ఆపరేటర్లకు పర్మిట్లు ఇవ్వాలని నిర్ణయం

సాక్షి, హైదరాబాద్

ఆర్టీసీ కార్మిక సంఘాలు తరచూ సమ్మెలకు దిగడం వల్ల ప్రజలకు కలుగుతున్న అసౌకర్యాన్ని శాశ్వతంగా అధిగమించడానికి రాష్ట్రంలోని 3 నుంచి 4 వేల రూట్లలో ప్రైవేటు వాహనాలకు పర్మిట్లు ఇవ్వాలని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. రెండు మూడు రోజుల్లోనే కేబినెట్ సమావేశమై ఈ మేరకు నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఆర్టీసీ సమస్యను కార్మిక సంఘాలు న్యాయ స్థానాలకు తీసుకెళ్లినందున, అది తేలే వరకు చాలా సమయం పట్టే అవకాశం ఉంది. ఈ లోపు ప్రజలకు మరింత అసౌకర్యం కలగనుంది. దీంతో ప్రత్యామ్నాయాలు ఆలోచిస్తోంది. కొత్తగా కేంద్రం తీసుకొచ్చిన మోటార్ వెహికల్ (అమెండ్‌మెంట్ యాక్టు)–2019 ప్రైవేటు వాహనాలకు పర్మిట్లు జారీ చేసే

మిగతా 4వ పేజీలో ▶

## ఆర్టీసీ సమ్మెపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు..

# బకాయిలు ఇస్తారా?

**రూ. 4వేల కోట్ల బకాయిలు ఉన్నాయి**
**రూ.47 కోట్లు తక్షణమే ఇస్తారా లేదా?**

- ఆర్టీసీకి డబ్బిచ్చే స్థితిలో ప్రభుత్వం ఉందా?
- సమ్మెను ప్రజల ఇబ్బందుల కోణంలో చూడండి
- యూనియన్ కోణంలో కాదు..
- విలీనం సహా అన్ని డిమాండ్లపైనా చర్చించాలని చెప్పాం
- 21 డిమాండ్లు ఆర్థికంగా ఇబ్బందికాదని మాత్రమే చెప్పాం
- ప్రతీ చిన్న దానిపై న్యాయ సమీక్షకు తావులేదు: ఏజీ
- ఇది ప్రజా సమస్య.. ఆకాశమే హద్దన్న ధర్మాసనం



“ చర్చలకు ముందే ఫలితాలు ఎలా ఉండాలో ముందే ఓ నిర్ణయానికి వచ్చి ఈడీ కమిటీ నివేదిక రూపొందించినట్లు ఉంది. క్లోజ్‌డ్ మైండ్ ఫలితం కూడా అలాగే ఉంటుంది. అలాంటప్పుడు చర్చలు జరపడం ఎందుకు? నాలుగు డిమాండ్లు ఆర్థిక అంశాలతో ముడిపడి ఉన్నాయని తేల్చిన కమిటీ.. మిగిలిన డిమాండ్లను ఎందుకు పట్టించుకోలేదు?

– హైకోర్టు ధర్మాసనం

సాక్షి, హైదరాబాద్

‘ఆర్టీసీకి చట్ట ప్రకారం చెల్లించాల్సిన రూ.4 వేల కోట్ల బకాయిల్లో కనీసం రూ.47 కోట్లయినా ప్రభుత్వం ఇచ్చే స్థితిలో ఉందో లేదో వెంటనే తెలపాలి. సమస్యను యూనియన్, ఇతర అంశాల కోణంలో చూడొద్దు. సామాన్య ప్రజల రవాణా ఇబ్బందుల కోణంలోనే చూడాలి. నెల రోజులు కావొస్తున్నా ఇప్పటికీ 40 శాతమే బస్సులు నడుస్తున్నాయి. ఆదిలాబాద్‌లో ఓ గిరిజన వ్యక్తి తన బిడ్డకు జబ్బు చేస్తే చేతుల్లో పెట్టుకుని వరంగల్ ఆస్పత్రికి తీసుకెళ్లగలడా. మహబూబ్‌నగర్ నుంచి హైదరాబాద్‌కు డెంగీతో బాధపడే రోగిని అంబులెన్స్, ప్రైవేటు వాహనాల్లో తీసుకురాలేని వాళ్లు తన బిడ్డల ప్రాణాలపై ఆశలు వదులుకోవాలా? అలాంటి వాళ్లను చచ్చిపోనిస్తుందా ప్రభుత్వం? ప్రభుత్వం తక్షణమే రూ.47 కోట్లు ఇస్తే.. బిడ్డల ప్రాణాలు నిలుస్తాయి కదా.. ప్రభుత్వం ఆర్థికంగా ఆర్టీసీని ఎలా ఆదుకుని నాలుగు డిమాండ్ల పరిష్కారానికి ఏ నిర్ణయం తీసుకుంటుందో మంగళవారం చెప్పాలి’అని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

ఆర్టీసీ సమ్మెను చట్ట విరుద్ధంగా ప్రకటించాలని, అలాగే కార్మికుల డిమాండ్ల పరిష్కారానికి చిత్తశుద్ధి గల ఉన్నతాధికారి నేతృత్వంలో ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ ఉస్మానియా విశ్వవిద్యాలయం రీసెర్చ్ స్కాలర్, ఇతరులు దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాల్ని మంగళవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం 2 గంటల పాటు విచారించింది.

**అన్ని డిమాండ్లపై చర్చించాలి కదా..**

తొలుత ఆర్టీసీ తరఫున అదనపు అడ్వకేట్ జనరల్ (ఏఏజీ) జె.రామచంద్రరావు వాదిస్తూ.. ఈ నెల 26న యూనియన్ ప్రతినిధులతో చర్చలకు ఆహ్వానించామని, అయితే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ఆంశంపై చర్చిస్తేనే ఇతర అంశాల్లోకి వెళ్తామని యూనియన్

మిగతా 2వ పేజీలో ▶

## కలెక్టరేట్ల ముట్టడి ఉద్రిక్తం

- 24వ రోజు రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కార్మికుల ఆందోళనలు
- అన్ని జిల్లాల్లో మానవహారాలు, రాస్తారోకోలు

4 లో

## మహిళా కండక్టర్ ఆత్మహత్య

- సమ్మెపై సర్కార్ తాత్సారం చేస్తోందని మనస్తాపం
- కండక్టర్ మృతితో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉద్రిక్తత

4 లో



## ఐసిస్ చీఫ్ బాగ్దాదీ హతం

సిరియాలో అమెరికా ‘ఆపరేషన్’
‘సిట్యుయేషన్ రూం’లో ప్రత్యక్ష ప్రసారం ద్వారా చూసిన ట్రంప్.. కుక్కచావు చచ్చాడంటూ వ్యాఖ్య 5 లో



## మహా ‘సస్పెన్స్’..!

మహారాష్ట్ర ప్రభుత్వ ఏర్పాటులో కొనసాగుతున్న ప్రతిష్టంభన బీజేపీ, శివసేనల మధ్య ‘ఫార్ములా 50:50’ పీటముడి.. రేపు ముంబైకి అమిత్ షా 5 లో

## రాఘవాచారి కన్నుమూత



- అనారోగ్యంతో తుదిశ్వాస విడిచిన ప్రముఖ సంపాదకుడు

-వివరాలు 13లో






## సోషల్ మీడియా... మనమే నం.1

టిక్‌టాక్, ఫేస్‌బుక్, యూట్యూబ్ వినియోగంలో టాప్
పట్టణాలు, పల్లెల్లో పెరిగిన ఇంటర్నెట్ వాడకం
‘సెన్సర్ టవర్ డేటా’ గణాంకాల్లో వెల్లడి



**ఉదయాన్నే లేస్తూ ఓ సెల్ఫీ.. వెంటనే దానిని ఫేస్‌బుక్, వాట్సాప్‌ల్లో పోస్టింగ్.. కొత్త సాంగ్ వచ్చిందా.. కొత్త స్టెప్పులు నేర్చుకుని వెంటనే టిక్‌టాక్‌లో డాన్సింగ్.. ఈసారి నా డబ్‌స్మాష్ వీడియో యూట్యూబ్‌లో ఎలాగైనా సరే వైరల్ అవ్వాల్సిందే.. ఇవీ భారతీయుల ఆలోచనలు**

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా పిల్లల నుంచి వృద్ధుల వరకు అందరూ స్మార్ట్‌ఫోన్ చేతపట్టుకుని ఇంటర్నెట్‌ను తెగ వాడేస్తున్నారు. ఎంతలా అంటే ప్రపంచంలో డేటా వినియోగిస్తున్న వారిలో మనమే టాప్‌లో ఉండేంతలా. ఇదే విషయాన్ని ఇటీవల మొబైల్ యాప్స్‌ల రేటింగ్‌లను నిర్ధారించే ‘సెన్సర్ టవర్ డేటా’విడుదల చేసిన గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రస్తుత దేశ జనాభా

మిగతా 14వ పేజీలో ▶

## కశ్మీర్‌లో ఉగ్ర దాడులు

జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదులు పేట్రేగిపోయారు. ఉధంపూర్ జిల్లాలోఓ ట్రక్కు డ్రైవర్‌ను కాల్చి చంపారు. మరో వైపు కశ్మీర్‌లోని బస్టాప్ వద్ద గ్రనేడ్ దాడిలో 20మంది గాయపడ్డారు.

-వివరాలు 5లో










## క్లుప్తంగా...

### బంగాళాఖాతంలో అల్పపీడనం

**నేడు, రేపు మోస్తరు వర్షాలు**

**సాక్షి, హైదరాబాద్:** దక్షిణ శ్రీలంక తీరానికి దగ్గరలో నైరుతి బంగాళాఖాతంలో సోమవారం ఉదయం అల్పపీడనం ఏర్పడింది. దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఇది రానున్న 24 గంటల్లో కోమోరిన్ దాని పరిసర ప్రాంతాల్లో తీవ్రంగా మారే అవకాశం ఉంది. అలాగే తదుపరి 48 గంటల్లో ఆగ్నేయ అరేబియా సముద్రం, దాన్ని ఆనుకుని ఉన్న లక్ష దీవులు, మాల్దీవులు ప్రాంతాల్లో వాయుగుండంగా మారే అవకాశముంది. దీంతో మంగళ, బుధవారాల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు.

### కేంద్ర సర్వీసులకు కాటా అమ్రపాలి



**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ కేడర్ ఐఏఎస్ అధికారిణి కాటా అమ్రపాలి కేంద్ర సర్వీసులకు వెళ్లనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ సిఫారసుల మేరకు నాలుగేళ్ల పాటు కేంద్ర సర్వీసుల్లో డిప్యుటేషన్‌పై పని చేసేందుకు అనుమతిస్తూ కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర సర్వీసుల్లో డిప్యూటీ సెక్రటరీగా పనిచేసేందుకు ఆమెను ఎంపిక చేసినట్లు వెల్లడించింది.

### కచ్చులూరి లాంచీ బాధితులకు నేడు చెక్కుల పంపిణీ

**సాక్షి, హైదరాబాద్:** కచ్చులూరిలో జరిగిన గోదావరి లాంచీ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబ సభ్యులకు నేడు చెక్కుల పంపిణీ ఉంటుందని కార్మిక, ఉపాధిశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి వెల్లడించారు. మధ్యాహ్నం 3 గంటలకు ఆర్టీసీ క్రాస్‌రోడ్, అంజయ్య భవన్‌లో ఈ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని ప్రకటించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్, అసెంబ్లీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, వర్ధన్నపేట ఎమ్మెల్యే తదితరులు పాల్గొన్నారు.



### రిజర్వాయర్లలో చేపల వేటపై మత్స్యకారులకు హక్కు

**సాక్షి, హైదరాబాద్:** రిజర్వాయర్ల నిర్మాణంలో ముంపునకు గురైన చిన్న నీటి వనరులపై గతంలో చేపలు పట్టే హక్కును కలిగి ఉన్న మత్స్యకారులకు సంబంధిత రిజర్వాయర్లలో ఈ హక్కు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసింది. భూసేకరణ చట్టం ప్రకారం 2013 సెప్టెంబర్ 27 తర్వాత నిర్మితమైన రిజర్వాయర్లు, చెరువులు, ఇతర నీటి నిల్వల్లో చేపలు పట్టుకోవచ్చని తెలిపింది. దీనిపై 2018 ఆగస్టులోనే ప్రభుత్వం జీవో 74ను తెచ్చింది. ఇందులో ప్రభావిత ప్రాంతంలోని చెరువులపై ఆధారపడ్డ మత్స్యకారుల కుటుంబాలకే తొలి ప్రాధాన్యమిచ్చింది. వీరికి అదనంగా ప్రాజెక్టు ప్రభావిత ప్రాంతాల్లోని చిన్న, సన్నకారు రైతులు, భూములు లేని నిరుపేదలకు కూడా ఈ హక్కును కల్పించింది. ప్రస్తుతం ఈ జీవోకు సవరణ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

### తాగునీటి కోసం అటవీ భూమి మళ్లింపు

**సాక్షి, హైదరాబాద్:** ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల పరిధిలోని వివిధ ప్రాంతాలకు రక్షిత తాగునీటి సరఫరా కోసం పైప్‌లైన్ వేసేందుకు ఆదిలాబాద్ డివిజన్‌లోని దాదాపు 9.6 హెక్టార్లు, మంచిర్యాల డివిజన్‌లోని 3.8 హెక్టార్ల అటవీ భూమిని రాష్ట్ర ప్రభుత్వం మళ్లించింది. సోమవారం ఈ మేరకు అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారి ఉత్తర్వులిచ్చారు. ఏ అవసరం కోసమైతే అటవీ భూమిని మళ్లించారో అందుకే ఉపయోగించాలని ఆదేశించారు. నియమ, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే తగిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

### సుప్రసన్నాచార్యకు వానమామలై పురస్కారం

**హైదరాబాద్:** ప్రముఖ సాహితీవేత్త ఆచార్య కోవెల సుప్రసన్నాచార్యకు వానమామలై వరదాచార్య పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్లు తెలంగాణ సారస్వత పరిషత్తు తెలిపింది. ఏటా ప్రముఖ సాహితీ వేత్తలకు ఈ పురస్కారం అందజేసేందుకు సారస్వత పరిషత్తులో ప్రముఖ కవి, విమర్శకులు డాక్టర్ తిరుమల శ్రీనివాసాచార్య నిధిని ఏర్పాటు చేశారని పరిషత్తు ప్రధాన కార్యదర్శి కె.చెన్నయ్య సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 31న సాయంత్రం 6 గంటలకు బొగ్గులకుంటలోని పరిషత్తు ప్రాంగణంలో మొట్టమొదటి పురస్కార ప్రదానోత్సవం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని, ముఖ్య అతిథిగా తెలంగాణ ప్రభుత్వ సలహాదారుడు డాక్టర్ కె.వి.రమణాచారి హాజరవుతారని తెలిపారు.

# పీజీ చేసినా కాన్పు చేయడం రాదాయే!

- ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లోని వైద్య విద్యార్థుల గోస
- కేసీఆర్ కిట్‌తో బోధనాస్పత్రులకు తగ్గిన గర్భిణులు
- తప్పక బయట ప్రత్యేకంగా శిక్షణ తీసుకుంటున్న వైనం
- తక్కువ ఫీజుకే ప్రసవాలు చేస్తామంటూ బోర్డులు పెడుతున్న కళాశాలలు
- సీట్లు కాపాడుకునేందుకు ఎంసీఐకి ఎక్కువ ప్రసవాలు చూపిస్తున్న కాలేజీలు
- సర్కార్‌కు విద్యార్థుల ఫిర్యాదులు.. కనీసం ప్రసవం చేయలేకుంటే ఎలాగని ఆవేదన
- కేసీఆర్ కిట్‌ను తమకూ అమలు చేయాలని ప్రైవేటు బోధనాస్పత్రుల విన్నపం



**సాక్షి, హైదరాబాద్:** ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో పీజీ గైనకాలజీ పూర్తి చేసిన అనేకమంది విద్యార్థులు కనీసం కాన్పులు చేయలేని దుస్థితి నెలకొంది. పీజీ సీటు కోసం లక్షలకు లక్షలు.. మేనేజ్‌మెంట్ కోటాలోనైతే కోట్లు పెట్టి గైనిక్ పూర్తిచేసినా కనీసం ప్రసవం చేస్తామన్న ఆత్మవిశ్వాసం వారిలో లేకుండా పోయింది. దీంతో అనేకమంది విద్యార్థులు కోర్సు పూర్తయిన తర్వాత ఎక్కడో ఒకచోట సీనియర్ గైనకాలజీ డాక్టర్ వద్ద ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నారు. ఈ పరిస్థితి రాష్ట్రంలో అనేక ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో నెలకొంది. మరోవైపు గైనిక్ సీట్లను కాపాడుకునేందుకు ప్రసవాలు ఎక్కువగానే చేస్తున్నామంటూ ప్రైవేటు కాలేజీలు మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ)కి తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సమర్పిస్తున్నారు. కాన్పులు చేయలేని పరిస్థితి ఏర్పడటంతో ప్రైవేటు కార్పొరేట్ ఆస్పత్రులు కూడా ఉద్యోగం ఇవ్వడం లేదని కొందరు జూనియర్ గైనిక్ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై సోమవారం కొందరు గైనిక్ విద్యార్థులు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. తమకు ఎలాగైనా సాయం చేయాలని కోరుతున్నారు.

#### ప్రభుత్వాస్పత్రులకే గర్భిణులు..

రాష్ట్ర ప్రభుత్వం కేసీఆర్ కిట్‌ను ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పులు చేయించుకుంటే మగ బిడ్డను కన్న తల్లికి రూ.12 వేలు, ఆడ బిడ్డను కన్న తల్లికి రూ.13 వేలు ప్రోత్సాహకం ఇస్తుంది. దీంతోపాటు బిడ్డ, తల్లికి కలిపి వారి అవసరాల కోసం కొన్ని రకాల వస్తువులను కూడా ఉచితంగా ఇస్తుంది. దీంతో 2017 నుంచి ఇప్పటివరకు 6.5 లక్షల మంది మహిళలు కేసీఆర్ కిట్ పథకం ద్వారా లబ్ధి పొందారు. దీంతో ప్రైవేటు బోధనాస్పత్రులకు వెళ్లే గర్భిణీల సంఖ్య భారీగా పడిపోయింది.

#### విద్యార్థుల ఆందోళన..

రాష్ట్రంలో 12 ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో మెడికల్ పీజీ గైనకాలజీ కోర్సు ఉంది. ఆయా కాలేజీలకు అనుబంధంగా ఉన్న ఆస్పత్రులకు కేసీఆర్ కిట్ వల్ల గర్భిణీల సంఖ్య తగ్గింది. దీంతో పీజీ గైనిక్ విద్యార్థులకు ప్రసవాలు ఎలా చేయాలన్న దానిపై ప్రయోగాత్మకంగా నేర్చుకునే వెసులుబాటు తగ్గింది. దీంతో తమకు సరైన శిక్షణ అందడం లేదని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. జూనియర్ గైనిక్ డాక్టర్లు సాధారణ ప్రసవాలు కూడా చేయలేని పరిస్థితి నెలకొందని సీనియర్ వైద్యులు చెబుతున్నారు. సాధారణ ప్రసవం చేయాలన్నా అత్యంత జాగ్రత్తలు తప్పనిసరి. ఏమాత్రం తేడా వచ్చినా మాతా శిశువుల ప్రాణానికే గండం ఏర్పడనుంది. ఇక సిజేరియన్ ఆపరేషన్ల ద్వారా చేయడమంటే ఇంకా ఎక్కువ రిస్క్ చేయాల్సి ఉంటుంది. వీరికి ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో సరైన ప్రాక్టికల్ శిక్షణ లేకపోవడంతో సాధారణ, సిజేరియన్ ప్రసవాలు చేయలేని పరిస్థితి నెలకొంటుంది.

#### తక్కువ ఫీజుకే ప్రసవాలంటూ బోర్డులు

కేసీఆర్ కిట్ దెబ్బతో అధికార పార్టీలోని ఓ కీలక ప్రజాప్రతినిధికి చెందిన ప్రైవేటు మెడికల్ కాలేజీకి చెందిన అనుబంధ ఆస్పత్రి ఇటీవల ఓ నిర్ణయం తీసుకుంది. గర్భిణీలను ఆకర్షించేందుకు ఒక బోర్డు తగిలించింది. గర్భిణీ స్త్రీలు మొదట రూ.2 వేలు చెల్లిస్తే చాలు.. వారికి మొదటి నుంచి తమ వద్దే చెకప్‌లు చేసి, ఆ తర్వాత కాన్పు కూడా చేసి పంపిస్తామని బోర్డులో పేర్కొంది. దీనికై నా ఆకర్షితులై గర్భిణీలు తమ వద్దకు వస్తారని, తద్వారా గైనిక్ పీజీ విద్యార్థులకు ప్రాక్టికల్ శిక్షణ అందుతుందని ఆశిస్తున్నారు. అలాగే మరో ప్రైవేటు అనుబంధ ఆస్పత్రి కూడా ఇలాగే బోర్డు తగిలించింది. మొదట తమకు రూ.2,500 చెల్లిస్తే చాలు, మిగిలిన మొత్తం ప్రక్రియ పూర్తి చేసి తల్లీబిడ్డలను క్షేమంగా ఇంటికి చేర్చుతామని హామీయిస్తుంది. అయితే ఈ హామీలు ఇంకా పూర్తిస్థాయి ఫలితాలు ఇవ్వడం లేదని ఆయా కాలేజీలు అంటున్నాయి. తమకు కూడా కేసీఆర్ కిట్ పథకాన్ని అమలు చేస్తే ఈ సమస్య తీరుతుందని, సర్కారు ప్రోత్సాహకం వల్ల గర్భిణీలు అధికంగా వస్తారని, గైనిక్ విద్యార్థులకు మంచి శిక్షణ కూడా ఉంటుందని బోధనాస్పత్రులు ప్రభుత్వానికి అనేక సందర్భాల్లో విన్నవించాయి. అయితే ఇలా చేస్తే పథకం దుర్వినియోగం అవుతుందన్న భయం సర్కారులో ఉంది.

#### తప్పుడు లెక్కలు..

ఇదిలావుంటే ప్రైవేటు మెడికల్ కాలేజీలు తమకు రోజుకు అవసరమైన గర్భిణీలు వస్తున్నారని, విద్యార్థులకు సరైన గైనిక్ ప్రాక్టికల్ శిక్షణ అందుతుందని మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ)కు తప్పుడు నివేదికలు ఇస్తున్నాయి. తద్వారా తమ పీజీ గైనిక్ సీట్లు కోల్పోకుండా చూసుకుంటున్నాయి. ప్రైవేటు బోధనాస్పత్రులకు కాన్పు కేసులు కరువవుతుండగా, ప్రభుత్వ బోధనాస్పత్రుల్లో కేసులు ఎక్కువై వైద్య సిబ్బంది ఒత్తిడికి గురవుతున్నారు.

#### ఔను కేసీఆర్ కిట్ ప్రభావమే

కేసీఆర్ కిట్ అమలు తర్వాత ప్రభుత్వ బోధనాస్పత్రులకు, ఇతర సర్కారు ఆస్పత్రులకు గర్భిణీల రాక మరింత పెరిగింది. దీంతో ప్రైవేటు బోధనాస్పత్రులకు గర్భిణీల సంఖ్య కాస్తంత తగ్గి ఉండొచ్చు. దీంతో అక్కడ చదివే పీజీ విద్యార్థులకు సరైన ప్రాక్టికల్ శిక్షణ పెద్దగా ఉండటంలేదని అంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో గైనిక్ పూర్తి చేసిన జూనియర్ డాక్టర్లకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో 3 నెలలపాటు ప్రాక్టికల్ శిక్షణ ఇప్పిస్తే బాగుంటుంది.

– డాక్టర్ కరుణాకర్‌రెడ్డి, వీసీ, కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం

# బకాయిలు ఇస్తారా?

▶ మొదటి పేజీ తరువాయి

ప్రతినిధులు షరతు విధించారని చెప్పారు. యూనియన్ల తరపు సీనియర్ న్యాయవాది దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి వాదిస్తూ.. విలీనం డిమాండ్ వదులుకున్నామని తాను చెప్పినట్లు ప్రభుత్వ న్యాయవాదే చెప్పడం శోచనీయమని పేర్కొన్నారు. 21 డిమాండ్లనే చర్చించాలని హైకోర్టు చెప్పినట్లు అధికారులు తప్పుగా పేర్కొన్నారని చెప్పారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. 21 డిమాండ్లు ఆర్థికంగా పెద్దగా సంబంధం లేనివని మాత్రమే చెప్పామని, అన్ని డిమాండ్లపైనా చర్చ జరపాలనే 18న ఉత్తర్వులు ఇచ్చామని స్పష్టం చేసింది.

#### కార్మికులు కారణం కాదు

ప్రకాశ్‌రెడ్డి వాదిస్తూ.. ప్రభుత్వం ఇచ్చిన రాయితీల వల్ల ఆర్టీసీకి రావాల్సిన బకాయిలు రూ.4 వేల కోట్లకుపైగా ఉన్నాయని, వీటిని ప్రభుత్వం చెల్లించకపోగా అప్పులు చేసి ఆర్టీసీ కార్పొరేషన్‌ను ఆర్థికంగా అప్పుల ఊబిలోకి నెట్టేస్తోందని చెప్పారు. సిటీ బస్సులకు జీహెచ్ఎంసీ 1,492 కోట్లు, ప్రభుత్వ రాయితీల నిమిత్తం రూ.1,099 కోట్లు, ఉద్యోగుల పీఎఫ్ రూ.454 కోట్లు, ఉద్యోగుల సహకార సంఘం నిధులు రూ.400 కోట్ల వరకు మొత్తం రూ.4 వేల కోట్లు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందని పేర్కొన్నారు. డిపోలను 95 నుంచి 97కు పెంచారని, ఉద్యోగులు 65,740 నుంచి 49,733కు తగ్గినా సగటు ఉత్పాదక పెరిగిందని, నష్టాలకు ప్రభుత్వ/ఆర్టీసీ సంస్థ యాజమాన్య నిర్వాకమే కారణమని చెప్పారు. ఆక్యుపెన్సీ 69 శాతం నుంచి 74.5 శాతానికి పెరిగేందుకు ఆర్టీసీ కార్మి కులు శ్రమించారని చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన రాయితీల బకాయిల్లో రూ.47 కోట్లు చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందా.. అని ధర్మాసనం ప్రశ్నించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్–226 కింద ప్రతీది న్యాయ సమీక్ష చేసేందుకు హైకోర్టుకు తావులేదని ఏఏజీ అనడాన్ని కోర్టు తప్పుపట్టింది. '10 వేల బస్సుల్లో 4 వేలు మాత్రమే నెల రోజులుగా నడుస్తున్నాయి. ప్రజా రవాణా కుంటుపడింది. రోగుల ఇక్కట్లు వర్ణనాతీతం. సామాన్య ప్రజల కష్టాలే మా ముందున్న ప్రధాన అంశం. పౌరహక్కులు, మానవహక్కుల అంశంతో ముడిపడిన వ్యవహారమిది. మాకు ఆకాశమే హద్దు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 226 ప్రకారం న్యాయ సమీక్ష చేస్తాం' అని ప్రధాన న్యాయమూర్తి తేల్చి చెప్పారు.

#### ఏజీ హాజరుకు ఆదేశం

చాలా కార్యక్రమాలకు, పథకాలకు వందల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం ప్రజా రవాణా సమస్య పరిష్కారానికి రూ.47 కోట్లు ఇవ్వగలదో లేదో, ఆ విధమైన ఆర్థిక స్థోమత ఉందో లేదో చెప్పాలని ధర్మాసనం ఆదేశించింది. ఆర్టీసీ సొంతగా ఆర్థికాభివృద్ధి సాధించాలని, ఎంత కాలం ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకుంటుందని ఏఏజీ బదులిస్తూ.. ప్రస్తుతం రూ.10 కోట్లు మాత్రమే ఉన్నాయన్నారు. దీనికి ధర్మాసనం తీవ్రంగా స్పందిస్తూ తాము ప్రభుత్వం నుంచి సమాచారాన్ని తెలుసుకోవాలని నిర్ణయించామని, హైకోర్టు ప్రభుత్వ ప్రతినిధిగా ఏజీని విచారణకు పిలిపించాలని ఆదేశించింది. ఏజీ వచ్చిన వెంటనే 'ఈడీ కమిటీ నివేదికలో 4 డిమాండ్ల పరిష్కారానికి రూ.47 కోట్లు అవసరం అవుతాయని తేల్చింది. ఆ మొత్తాన్ని ప్రభుత్వం ఇవ్వగలదో లేదో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిని సంప్రదించి మంగళవారం చెప్పండి. మిగిలిన డిమాండ్లకు ఆర్థికంగా ఎంత భారం పడుతుందో తెలుసుకోండి. వీటి విషయంలో కసరత్తు చేసినట్లుగా ఈడీల నివేదికలో లేదు' అని పేర్కొంది. విచారణను బుధవారానికి వాయిదా వేయాలని ఏజీ కోరితే మంగళవారం ఉదయం బదులు మధ్యాహ్నం విచారిస్తామని ఉత్తర్వులు జారీ చేసింది.

#### అలాంటప్పుడు చర్చలెందుకు..?

చర్చలకు ముందే ఫలితాలు ఎలా ఉండాలో ఓ నిర్ణయానికి వచ్చి ఈడీ కమిటీ నివేదిక రూపొందించినట్లు ఉందని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. క్లోజ్‌డ్ మైండ్ ఫలితం కూడా అలాగే ఉంటుంది. అలాంటప్పుడు చర్చలు జరపడం ఎందుకు? అని ఘాటుగా వ్యాఖ్యానించింది. 4 డిమాండ్లు ఆర్థిక అంశాలతో ముడిపడి ఉన్నాయని తేల్చిన కమిటీ.. మిగిలిన డిమాండ్లను ఎందుకు పట్టించుకోలేదని నిలదీసింది. కోర్టు అంటే ఆషా మాషీగా తీసుకున్నట్లుగా ఉందని, ప్రధానంగా ఉన్నతాధికారుల వైఖరి దారుణంగా ఉందని తీవ్ర వ్యాఖ్యలు చేసింది. తీవ్ర ఆర్థిక భారమయ్యే డిమాండ్లు రెండే ఉన్నాయని, మిగిలిన డిమాండ్లపై అధికారులు ఎందుకు కసరత్తు చేయలేదని ప్రశ్నించింది. గతంలో కార్మికులకు 44 శాతం వేతనం పెంచామని ఏఏజీ చెప్పగానే, అప్పుడు అంత విశాల హృదయంతో ఉదారంగా ఇవ్వడమెందుకో, ఇప్పుడు ఏమీ ఇవ్వలేమనడం ఎందుకో, అప్పుడు 22 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చి ఉంటే ఇప్పుడు ఈ పరిస్థితులు ఉండేవి కాదు కదా అని ధర్మాసనం పేర్కొంది.



తిరునక్షత్ర మహోత్సవంలో మాట్లాడుతున్న త్రిదండి చినజీయర్ స్వామి. చిత్రంలో సీఎం కేసీఆర్ దంపతులు, రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్

# నరసింహ క్షేత్రాలకు యాదాద్రి తలమానికం

- త్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్ స్వామి
- రాజకీయాల్లో కేసీఆర్ కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు
- వైభవంగా చినజీయర్ తిరునక్షత్ర మహోత్సవాలు
- హాజరైన సీఎం కేసీఆర్ దంపతులు

**శంషాబాద్ రూరల్ (రాజేంద్రనగర్):** యాదగిరిగుట్ట దేవస్థానాన్ని కాంతులీనే యాదాద్రిగా.. దేశంలోని నరసింహస్వామి క్షేత్రాల్లో కెల్లా తలమానికంగా ఉండేలా తీర్చిదిద్దుతున్నారని శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్‌స్వామి కొనియాడారు. యాదాద్రిని ఉత్తమ క్షేత్రంగా తయారు చేయడానికి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు కృషి చేయడం అభినందనీయమన్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలోని జీవా ప్రాంగణంలో సోమవారం జరిగిన చినజీయర్ స్వామి 'తిరునక్షత్ర'మహోత్సవానికి సీఎం కేసీఆర్ దంపతులు, వారి కుటుంబ సభ్యులు హాజరయ్యారు. జీయర్‌స్వామికి పండ్లు, కానుకలు అందజేసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా జీయర్‌స్వామి మాట్లాడుతూ ''నా పుట్టిన రోజున కేసీఆర్ పండ్లు, పరివారంతో రావడం చాలా ఆనందదాయకం. రాజకీయంగా వారికంటూ ఓ స్థానాన్ని ఏర్పాటు చేసుకోవడంతోపాటు రాజకీయ నాయకుల్లో కొత్త ఒరవడికి దారి చూపించిన మహనీయుడు కేసీఆర్. వ్యక్తిగతంగా అందరిలో దైవభక్తి ఉన్నప్పటికీ రాజకీయాల్లో ఉండేవారు దేవుడి గురించి మాట్లాడానికి సిగ్గు, మొహమాట పడతారు. కానీ కేసీఆర్ ఇందుకు భిన్నం. భగవద్భక్తికి ఆయన నిదర్శనం. యాదాద్రి ప్రాజెక్టు ముఖ్యమంత్రిగా కేసీఆర్ చేసిన తొలి అడుగు. అందులో భాగంగా యజ్ఞాలు, ఇతర ఆలయాలైన వేములవాడ, భద్రాద్రి, మట్టపల్లిని అభివృద్ధిపరిచే అవసరాన్ని గుర్తించడం సంతోషకరం. మనసులో మాటను స్పష్టంగా, అందంగా, ఆనందంగా చెప్పే చొరవను ఆయనకు భగవంతుడు కల్పించారు. మొదటిసారి ముఖ్యమంత్రిగా నా వద్దకు వచ్చినప్పుడు బక్కవాడైనా.. గొప్పవాడని అనుకున్నా''అని పేర్కొన్నారు. అనంతరం పెద్దజీయర్‌స్వామి జీవిత చరిత్రకు సంబంధించిన 'సత్య సంకల్ప'గ్రంథంతోపాటు మంగళ శాసనాలను కేసీఆర్‌కు అందజేశారు.

#### ఫిబ్రవరిలో యాదాద్రి ఆలయ ప్రారంభోత్సవానికి కృషి: కేసీఆర్

శ్రీ రామానుజాచార్య భారీ విగ్రహంతో ఇక్కడ సమతా స్ఫూర్తి కేంద్రం ఏర్పాటు చేయడం మనకు ఎంతో గర్వకారణమని సీఎం కేసీఆర్ అభిప్రాయపడ్డారు. 108 దివ్యక్షేత్రాలను ఒకేచోట దర్శించుకునే భాగ్యం ఇక్కడ కల్పించడం దేశంలోనే మొదటిదన్నారు. ఇందులో మై హోం గ్రూప్ అధినేత రామేశ్వర్‌రావు కృషి ఎంతో కీలకమని ప్రశంసించారు. ఖర్చుకు వెనకాడకుండా భారీ కార్యక్రమాన్ని పట్టుదలతో చేపట్టడం అభినందనీయమన్నారు. స్వామివారి అనుగ్రహంతో యాదాద్రి ప్రధాన ఆలయం దాదాపు పూర్తి కావొస్తోందని, అక్కడ ఇంకా చాలా అభివృద్ధి జరగాల్సి ఉందని కేసీఆర్ వివరించారు. బాలాలయంలో భక్తుల ఇబ్బందులను తొలగించేందుకు ప్రధాన ఆలయాన్ని వచ్చే ఫిబ్రవరిలో ప్రారంభించేలా కృషి చేస్తామన్నారు. 1,008 కుండాలతో మహా సుదర్శన యాగం, ప్రపంచంలోని అన్ని వైష్ణవ పీఠాల నుంచి స్వాములను యాగానికి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. మహా సుదర్శన యాగానికి అందరూ రావాలని ఆహ్వానించారు. ''రాష్ట్రంలో రెండు గొప్ప కార్యక్రమాలు జరుగబోతున్నాయి. అందులో ఒకటి యాదాద్రిలో మహా యాగం. రెండోది జీవా ప్రాంగణంలో సమతా స్ఫూర్తి కేంద్రం ప్రారంభం. ఈ పవిత్రమైన రోజున చినజీయర్‌స్వామిని దర్శించుకోవడం నా అదృష్టంగా భావిస్తున్నా. మీ చేతి ద్వారా చిన్న పండు ప్రసాదంగా దొరికితే చాలు అనుకునే భక్తులు చాలా మంది ఉంటారు. అందుకోసం మీకు పండ్లు సమర్పించుకున్నా''అని కేసీఆర్ పేర్కొన్నారు. ఈ మహోత్సవాల్లో భాగంగా సలక్షణ ఘనాపాఠి మద్దులపల్లి సూర్యనారాయణకు జీయర్ పురస్కారం అందజేశారు. వేద పండితులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మైహోం గ్రూప్ చైర్మన్ జూపల్లి రామేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

# దూసుకెళ్తున్న కారు

▶ మొదటి పేజీ తరువాయి

ఏమిటన్న దానిపై ఆ పార్టీల్లో చర్చోపచర్చలు జరుగుతున్నాయి.

#### ఏం చేద్దాం చెప్మా...!

టీఆర్ఎస్ జోరుకు అడ్డుకట్ట వేయడం ఎలా అన్నది ఇప్పుడు రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలకు పెద్ద సవాల్‌గా మారింది. మున్సిపల్ ఎన్నికలు రాబోతున్న తరుణంలో వెలువడిన హుజూర్‌నగర్ ఉప ఎన్నికల ఫలితం ప్రతిపక్షాల ఆశలపై నీళ్లు చల్లింది. ఈ ఎన్నికల్లోనూ అదే ఫలితం పునరావృతం అయితే రాష్ట్రంలోని అన్ని స్థాయిల్లోని పదవుల్లోనూ టీఆర్ఎస్‌దే పూర్తిస్థాయిలో ఆధిపత్యం కానుంది. ఓ వైపు అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తూనే పార్టీ పరంగా సంస్థాగతంగా వేళ్లూనుకుంటున్న టీఆర్ఎస్‌కు పట్టణ ప్రాంతాల్లో అయినా కళ్లెం వేయడం ప్రతిపక్ష పార్టీలకు తక్షణ కర్తవ్యం కానుంది. అయితే, రాష్ట్రంలోని ప్రధాన పార్టీల ప్రస్తుత పరిస్థితి, ప్రజల మూడ్ చూస్తే ఇది సాధ్యమేనా అనే సందేహాలు వస్తున్నాయి. రాష్ట్రంలో మంచి కేడర్, క్షేత్రస్థాయిలో నేతలు, కార్యకర్తలున్న కాంగ్రెస్ పార్టీ ప్రతి ఎన్నికలోనూ అధికార పార్టీని ఢీకొడుతోంది కానీ పైచేయి సాధించలేకపోతోంది. దీంతో వరుస ఓటములు ఆ పార్టీ కేడర్‌ను నైరాశ్యంలో ముంచేస్తున్నాయి. కేసీఆర్ గురించి, రాష్ట్ర ప్రభుత్వం గురించి ఏం చెప్పినా ఎన్నికల బరిలో కాంగ్రెస్ నేతల మాటలు ప్రజలు విశ్వసించకపోవడంతో ఆ పార్టీ కేవలం పోటీకి మాత్రమే పరిమితమవుతోంది. ఇక, టీఆర్ఎస్‌ను గద్దె దించి 2023లో తెలంగాణపై జెండా ఎగరవేస్తామని చెబుతున్న బీజేపీ కేవలం మాటలకే పరిమితమవుతోందనే అభిప్రాయం వినిపిస్తోంది. 2014 నుంచి జరిగిన ఎన్నికల్లో ఒక్క 2019 లోక్‌సభ ఎన్నికల్లో మినహా ఆ పార్టీ కనీసం టీఆర్ఎస్‌కు పోటీ ఇవ్వడమే కాదు.. రెండో స్థానానికి కూడా ఆమడ దూరంలో నిలిచింది. ఇక, హుజూర్‌నగర్ ఉప ఎన్నికలో అయితే డిపాజిట్ కూడా కోల్పోయి పరాభవం మూటగట్టుకుంది. ఇలాంటి పరిస్థితుల్లో టీఆర్ఎస్‌ను దీటుగా ఎదుర్కోవడం ప్రతిపక్షాలకు పద్మవ్యూహంగానే కనిపిస్తోంది.

#### క్షేత్రం.. మరింత పటిష్టం

టీఆర్ఎస్ ఆవిర్భావ దశ నుంచి ఉత్తర తెలంగాణలో బలంగా ఉండగా, దక్షిణ తెలంగాణలో కొంత వెనుకబడేది. అయితే, 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పరిస్థితిలో మార్పు వచ్చింది. ఇక 2019 అక్టోబర్ నాటికి చూసుకుంటే రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో బలీయ శక్తిగా ఎదిగింది. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రాబల్యం కొట్టిచ్చినట్టు కనిపించే నల్లగొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్‌లతో పాటు ఖమ్మంలోనూ పటిష్ట స్థితికి చేరింది. తాజా ఉపఎన్నికతో పాటు ఖమ్మం కార్పొరేషన్‌ను స్వంతంగా దక్కించుకునే స్థాయికి అధికార పక్షం వేళ్లూనుకుంది. ఇక, ఇతర పార్టీల నుంచి చాలా రోజులుగా పెద్ద ఎత్తున జరుగుతున్న వలసలు క్షేత్రస్థాయిలో గులాబీ పార్టీకి టానిక్‌లా పనిచేస్తున్నాయి. ఇటీవలి ఉప ఎన్నికల్లో పోలింగ్ రోజున కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రచారం నిర్వహించేందుకు కూడా కొన్ని గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు లేనంతగా అవి ఉపయోగపడ్డాయి. రాష్ట్రంలోనే కాంగ్రెస్ పార్టీకి పటిష్ట కేడర్ ఉన్న హుజూర్‌నగర్‌లోనే ఆ పరిస్థితి ఉందంటే మిగిలిన చోట్ల పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. గ్రామాలు, మండలాలు, జిల్లాల స్థాయిలో పేరు మోసిన నేతలందరినీ పార్టీలో చేర్చుకోవడం, గ్రామాల్లో కనీసం పార్టీ జెండాలు మోసేందుకు, మోయించేందుకు కూడా ఇతర పార్టీలకు మనుషులు లేకుండా చేయడమే వ్యూహంగా పథకం ప్రకారం టీఆర్ఎస్ ఆడుతున్న రాజకీయ చదరంగం.. ప్రతిపక్షాలకు భవిష్యత్తు లేకుండా చేస్తోందని రాజకీయ విశ్లేషకులంటున్నారు.

#### ఆ పార్టీలు 'ఖల్లాస్'..

రాష్ట్రంలోని టీడీపీ, వామపక్షాల ఓటు బ్యాంకును టీఆర్ఎస్ తమ ఖాతాలో వేసేసుకున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. హుజూర్‌నగర్‌లో 2014 ఎన్నికల్లో పోటీ చేసిన టీడీపీకి 25వేల పైచిలుకు ఓట్లు రాగా, తాజా ఉప ఎన్నికలో 1500 ఓట్లు మాత్రమే వచ్చాయి. 2014 తర్వాతి రాజకీయ పరిణామాల్లో ఆ పార్టీకి రాష్ట్రవ్యాప్తంగా నష్టం జరిగినా హుజూర్‌నగర్‌లో ఉన్న ప్రత్యేక పరిస్థితుల్లో టీడీపీకి కనీసంగా 7వేలకు తగ్గకుండా ఓట్లు రావాల్సి ఉంది. కానీ, అందులో పావు వంతు కూడా రాకపోవడంతో తెలుగు తమ్ముళ్లు సైకిల్‌ను వదిలి కారెక్కినట్టు అర్థమవుతోంది. వామపక్షాలదీ అదే పరిస్థితిగా కనిపిస్తోంది. సీపీఎంకి 2018 ముందస్తు ఎన్నికల్లో 2వేల పైచిలుకు ఓట్లు రాగా, ఇప్పుడు ఆ పార్టీ బలపర్చిన స్వతంత్ర అభ్యర్థికి వెయ్యి ఓట్లు కూడా రాలేదు. ఇక, సీపీఐ పోటీలో లేనప్పటికీ ఆ పార్టీ ఓట్లు కూడా కారుకే పడ్డాయనేది అంచనా. ఒక్క హుజూర్‌నగర్‌లో కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉందనేది రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ, వామపక్షాల ఓట్లు టీఆర్ఎస్ వైపు దాదాపు మళ్లినట్టేనని, ఆ పార్టీల ఓటు బ్యాంకును కారు కొల్లగొట్టిందని హుజూర్‌నగర్ ఉప ఫలితమే చెబుతోంది.

### 'డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయండి'

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని వివిధ యూనిట్లలో అటాచ్‌మెంట్‌లో ఉన్న 32 మంది డీఎస్పీలను మంగళవారం తమ కార్యాలయంలో రిపోర్ట్ చేసేలా చూడాలని ఆయా యూనిట్ ఆఫీసర్లకు డీజీపీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

#### ఇదం జగత్




భానుశ్రీ, వరుణ్ (ఫైల్)

# కన్న తల్లి కర్కశం

## మటన్ కత్తితో ఇద్దరు పిల్లల గొంతు కోసి హత్య

- ఆపై ఆత్మహత్యాయత్నం
- జనగామ జిల్లాలో దారుణం

**నర్మెట:** కన్నపేగే బిడ్డలపై పాశవికం చూపింది. అతి దారుణంగా మటన్ కోసే కత్తితో గొంతులు కోసి నిద్రించిన మంచంపైనే హత్య చేసింది. ఆపై అదే కత్తితో తానూ గొంతు కోసుకుని ఆత్మహత్నాయత్నానికి పాల్పడింది. ఈ ఘటన జనగామ జిల్లా నర్మెట మండలం మల్కపేట శివారు శివబీక్యా తండాలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది.

**అనారోగ్యంతో తల్లిగారింటికి**

మల్కపేట శివారు శివబీక్యా తండాకు చెందిన గోపాల్‌తో రమకు ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి కుమార్తె భానుశ్రీ (4), కుమారుడు వరుణ్ (2.5 ఏళ్లు) ఉన్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రమ తల్లి గారిల్లయిన మల్కపేటకు వెళ్లింది. పిల్లలు ఎక్కువగా తండ్రితోనే ఉంటున్నారు. సోమవారం ఉదయమే ఆమె అత్తవారింటికి వచ్చింది.

**అత్తామామలు పనికి.. భర్త ఊరికి..**

రమ వచ్చాక అత్తామామలు పొలం పనులకు పోగా, భర్త గోపాల్ పని మీద వేరే ఊరికి వెళ్లాడు. మధ్యాహ్నం రమ పిల్లలకు భోజనం చేయించి నిద్రపుచ్చింది. మటన్ కోసే కత్తితో నిద్రలో ఉన్న పిల్లలిద్దరీ గొంతు కోసి అతి కిరాతకంగా హత్య చేసింది. అనంతరం అదే కత్తితో తానూ గాయపరచుకుని మంచంపైనే పడిపోయింది. సాయంత్రం పొలం నుంచి వచ్చిన అత్తామామలు ఈ దృశ్యాలను చూసి నివ్వెరపోయారు. అప్పటికే పిల్లలిద్దరికీ తీవ్ర రక్తస్రావమై మృతి చెందారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న రమను జనగామ ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లారు. నర్మెట సీఐ రాపెల్లి సంతోష్‌కుమార్, జనగామ సీఐ మల్లేశ్ యాదవ్, ఎస్సై జక్కుల పరమేశ్వర్ ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

### అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులే కారణం

రమ గత ఆరు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతోంది. దీనికితోడు ఆర్థిక ఇబ్బందులు కూడా ఉండటంతో పిల్లలను చంపి తనూ ఆత్మహత్య చేసుకోవాలని భావించింది. ఈ మేరకు సోమవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో పిల్లల గొంతును కత్తితో కోసింది. ఈ ఘటనలో ఇంకా మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

– జనగామ సీఐ మల్లేశ్ యాదవ్




## క్లుప్తంగా...

### పాలమూరు జైలులో ఖైదీ ఆత్మహత్య


వీరేశ్ (ఫైల్)

**మహబూబ్‌నగర్ క్రైం:** మహబూబ్‌నగర్ జిల్లా జైలులో ఓ ఖైదీ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇతర ఖైదీలందరూ నిద్రిస్తుండగా తన దుప్పటిని చించి బ్యారక్ గదిలో ఉండే ఇనుప కిటికీకి ఉరివేసుకుని ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. జోగులాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలం పాతపాలెం గ్రామానికి చెందిన ఉరబావి వీరేశ్ (29) అదే గ్రామానికి చెందిన ఓ బాలికపై అత్యాచారం చేసిన కేసులో రెండు నెలల కిందట జిల్లా జైలుకు రిమాండ్ ఖైదీగా వచ్చాడు. శనివారం అర్ధరాత్రి తర్వాత ఆత్మహత్య చేసుకున్న వీరేశ్ మృతదేహాన్ని సెక్యూరిటీ సిబ్బంది తెల్లవారుజామున గమనించి జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఆదివారం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. అయితే అతని మానసిక పరిస్థితి బాగోలేకపోతే ఈనెల 21న వైద్యుడు పరిశీలించాడని జైలు అధికారులు పేర్కొన్నారు. జిల్లా జైలు సూపరింటెండెంట్ సంతోష్‌కుమార్ రాయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ రాజేశ్వర్‌గౌడ్ వెల్లడించారు.

**ఆగస్టు 20న రిమాండ్**

వీరేశ్ వృత్తిరీత్యా వ్యవసాయ కూలీ. ఇతనికి 2011లో పెళ్లి కాగా భార్య, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉంది. అతను ఆగస్టు 2న పాతపాలెంకు చెందిన ఓ మైనర్ అమ్మాయిని అత్యాచారం చేశాడని కేటీదొడ్డి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. ఆగస్టు 20న అతడిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. అప్పటి నుంచి జిల్లా జైలులో ఉన్నాడు. వీరేశ్ ఆత్మహత్య చేసుకున్న బ్యారక్ దగ్గర ఆ రోజు విధుల్లో ఉన్న గార్డుపై సస్పెన్షన్ వేటు వేసినట్లు తెలుస్తోంది.

### గుండెపోటుతో మహిళా కండక్టర్ మృతి

**హుస్నాబాద్:** సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్ ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పని చేస్తున్న జి.లతామహేశ్వరి సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందింది. వరంగల్ అర్బన్ జిల్లా ఎల్కతుర్తి మండలం గోపాల్‌పూర్‌కు చెందిన ఆమె హుస్నాబాద్ డిపోలో పది సంవత్సరాల నుంచి కండక్టర్‌గా విధులు నిర్వహిస్తోంది. ఆమెకు ఇద్దరు పిల్లలున్నారు. గోపాల్‌పూర్‌లోని తమ ఇంట్లో టీవీలో వార్తలు చూస్తూ ఇక ఉద్యోగం ఉండదేమోనన్న మనస్తాపంతో గుండెపోటు రావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్టు కార్మికులు తెలిపారు.

### తలాక్ చెప్పిన భర్తపై కేసు నమోదు

**నారాయణఖేడ్:** ఓ వివాహితను బెదిరించిన ముగ్గురితోపాటు ఫోన్‌లో తలాక్ చెప్పిన ఆమె భర్తపై కేసు నమోదు చేసినట్లు సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ ఎస్‌ఐ సందీప్ సోమవారం తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం.. నారాయణఖేడ్ పట్టణానికి చెందిన ఓ ముస్లిం యువతికి 2011లో హైదరాబాద్ చింతల్ గణేశ్‌నగర్‌లోని హెచ్ఎంటీ రోడ్‌లో ఉండే మహమ్మద్ ఫసియోద్దీన్‌తో వివాహం జరిగింది. కాగా, అదనపు కట్నం కోసం భర్త, అతని కుటుంబీకులు వేధించగా ఆమె హైదరాబాద్ జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అక్కడి పోలీసులు కేసు నమోదు చేయగా మేడ్చల్ కోర్టులో కేసు నడుస్తోంది. కాగా, ప్రస్తుతం ఆ యువతి నారాయణఖేడ్‌లోని పుట్టింట్లో ఉండగా భర్త ఉపాధి కోసం దుబాయ్ వెళ్లాడు. ఈ క్రమంలో గత జూలై 19న భర్తకు బంధువులైన షహనాజ్‌ఖాన్, అజీజ్‌ఖాన్, గఫూర్‌లు నారాయణఖేడ్‌కు వచ్చి ఆ యువతిని బెదిరించారు. దుబాయ్ నుంచి నీ భర్త ఫోన్‌లో మాట్లాడతాడని చెబుతూ వాళ్ల ఫోన్ స్పీకర్ ఆన్ చేసి ఆమె భర్తతో మాట్లాడించారు. కాగా, ఆమెతో భర్త ఫోన్‌లో మాట్లాడుతూ మూడుసార్లు తలాక్ అని చెప్పి వివాహం రద్దయ్యిందని, నీవు ఇక నుంచి నా భార్యవి కావని చెప్పి ఫోన్ పెట్టేశాడని ఎస్‌ఐ వివరించారు. దీనిపై బాధితురాలు సోమవారం తమకు ఫిర్యాదు చేసిందని చెప్పారు. ఈ నేపథ్యంలో ఆమె భర్తతోపాటు బెదిరించిన ముగ్గురిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

# గురువుకు గుండెపోటు

## కుర్చీలోనే కుప్పకూలి మృతి చెందిన హెడ్‌మాస్టర్

### బోరున విలపించిన విద్యార్థులు

**సాక్షి, మహబూబాబాద్:** ఓ ప్రధానోపాధ్యాయుడు గుండెపోటుతో మృతి చెందారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం వెలికట్ట గ్రామంలో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రధానోపాధ్యాయుడు విజయ్‌సింగ్ (56) ఎప్పటిలాగానే ఉదయం విధులకు హాజరయ్యారు. మధ్యాహ్నం విద్యార్థులు భోజనం చేయడానికి తరగతి గది నుంచి బయటకు వెళ్లారు. మరో తరగతి గదిలో ఉన్న తన టిఫిన్ బాక్స్ తెచ్చుకోవడానికి వెళ్లిన హెచ్ఎం.. ఎంతకూ రాకపోవడంతో 'పెద్దసార్‌ను పిలుచుకురండి'అంటూ అంగన్‌వాడీ టీచర్ విద్యార్థులకు చెప్పింది. పిలిచినా కదలిక లేవకపోవటం, సెల్‌ఫోన్ కిందపడి ఉండటంతో పరుగున వెళ్లి అంగన్‌వాడీ టీచర్‌కు చెప్పారు. తోటి ఉపాధ్యాయులు పరిస్థితిని గమనించి వైద్యుడిని తీసుకురాగా పరీక్షించి గుండెపోటుతో మృతి చెందాడని నిర్ధారించారు. ఉదయం వచ్చి ఉత్సాహంగా పాఠాలు బోధించిన హెచ్ఎం మృతి చెందటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు కన్నీరుమున్నీరుగా విలపించారు.


కుర్చీలోనే కుప్పకూలిన హెడ్మాస్టర్ విజయ్‌సింగ్

# 1.20 లక్షల ఎకరాల్లో పంట నష్టం

## 142 మండలాల్లో నష్టపోయిన 56 వేల మంది రైతులు

- రాష్ట్ర ప్రభుత్వానికి వ్యవసాయశాఖ ప్రాథమిక నివేదిక
- ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన పత్తి, వరి తదితర పంటలు
- నష్టానికి పరిహారం ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం విన్నపం

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో ఇటీవల కురిసిన వర్షాలకు పంట నష్టం భారీగా జరిగింది. నైరుతి, ఈశాన్య రుతుపవనాలతో కురిసిన భారీ వర్షాలకు చేతికొస్తున్న పంట దెబ్బతింది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. వ్యవసాయశాఖ ప్రాథమిక లెక్కల ప్రకారం 1.20 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. ఫలితంగా 56 వేల మంది రైతులు నష్టపోయారు. ఈ మేరకు ప్రభుత్వానికి వ్యవసాయశాఖ నివేదిక సమర్పించింది. వరి పంట ఎక్కువ విస్తీర్ణంలో దెబ్బతిన్నట్లు నివేదికలో పేర్కొంది. మరో వారం, పది రోజుల్లో కోతకు వచ్చే వరి 80,447 ఎకరాల్లో వర్షాలకు నష్టపోయినట్లు నివేదించింది. కరీంనగర్ జిల్లాలో 25,595 ఎకరాల్లో వరి పంట నీటమునిగింది. రాష్ట్రవ్యాప్తంగా 35,610 ఎకరాల్లో పత్తి పంట వర్షాలకు నష్టపోయినట్లు వ్యవసాయ శాఖ నివేదికలో పేర్కొంది. ఇప్పటికే పత్తి మొదటితీత కొనసాగుతోంది. ముందుగా వేసిన పత్తిని రైతులు తీస్తున్నారు. ప్రతిరోజూ వర్షాలు కురుస్తుండటం వల్ల పత్తి తడిచి నల్లబడిపోయింది. కాయలు కూడా మచ్చలు వచ్చి పూర్తిగా నల్లపడ్డాయి. అలా రంగు మారిన పత్తిని వ్యాపారులు కొనుగోలు చేసే పరిస్థితి ఉండదు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదముంది. 4,022 ఎకరాల్లో మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లింది. జిల్లాల వారీగా చూస్తే సూర్యాపేటలో 29 వేల ఎకరాల్లో, కరీంనగర్‌లో 25 వేల ఎకరాల్లో, పెద్దపల్లి జిల్లాలో 8,354 ఎకరాల్లో, నిజామాబాద్‌లో 8,730 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ఆదిలాబాద్, నిర్మల్, వనపర్తి, యాదాద్రి భువనగిరి, మెదక్, సిద్దిపేట, కామారెడ్డి, వరంగల్ రూరల్, వరంగల్ అర్బన్, మంచిర్యాల, జనగాం, జయశంకర్ భూపాలపల్లి, జగిత్యాల జిల్లాల్లో మొత్తంగా 142 మండలాల్లో పంట నష్టం వాటిల్లింది. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభంలో వర్షాలు ఆలస్యంగా వచ్చాయి. నైరుతి ఒక నెల ఆలస్యంగా రావడంతో పాటు నెల ఆలస్యంగా వెనుతిరిగింది. అదే సమయంలో ఈశాన్య రుతుపవనాలు కూడా చురుగ్గా కదలడంతో వారం, పది రోజులు రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిశాయి.

**రైతాంగాన్ని ఆదుకోవాలి: తెలంగాణ రైతు సంఘం**

రాష్ట్రంలో ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి.జంగారెడ్డి, టి.సాగర్‌లు సోమవారం డిమాండ్ చేశారు. మొత్తం 1.20 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ నిర్ధారించిందని చెప్పారు. అమ్మకానికి వచ్చిన మొక్కజొన్న తడవడంతో రైతులు ఆందోళన పడుతున్నారని పేర్కొన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని పంట నష్టాల్ని అంచనా వేయించి, పరిహారం చెల్లింపునకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# విద్యార్థిని ఆత్మహత్య

## కళాశాల భవనంపై నుంచి దూకి అఘాయిత్యం



**సుభాష్‌నగర్ (నిజామాబాద్‌అర్బన్):** ఓ విద్యార్థిని ప్రైవేట్ కళాశాల భవనం పై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నిర్మల్ జిల్లా చిట్యాల గ్రామానికి చెందిన శ్రీ వర్ష (20) నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలోని హాస్టల్‌లో ఉంటూ ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. సెలవులు ముగిసిన తర్వాత ఆమె కళాశాలకు వచ్చింది. ఈ క్రమంలో సోమవారం శ్రీ వర్షను కలిసేందుకు ఓ యువకుడు వచ్చాడు. యువకుడిని కలిసేందుకు ప్రిన్సిపాల్ నిరాకరించి, ఆమె కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. దీంతో మనస్తాపానికి గురైన శ్రీ వర్ష మధ్యాహ్నం కళాశాలలోని నాలుగో అంతస్తు నుంచి కిందికి దూకింది. వెంటనే కళాశాల సిబ్బంది నగరంలోని ఓ ప్ర యివేటు ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. కాగా శ్రీ వర్ష మృతికి కళాశాల యాజమాన్యమే కారణమని మృతురాలి తండ్రి రాజేందర్ ఆరోపించారు.

### తెలంగాణ ఎంపీటీసీల సంఘం ఏర్పాటు

**అధ్యక్షురాలిగా శైలజ, ప్రధాన కార్యదర్శిగా కుమార్‌గౌడ్**

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్తగా తెలంగాణ ఎంపీటీసీల సంఘం ఏర్పడింది. వచ్చే నెలాఖరులోగా తమ డిమాండ్లను పరిష్కరించకుంటే తమ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపింది. సోమవారం నగరంలోని ఒక హోటల్‌లో వివిధ జిల్లాలకు చెందిన ఎంపీటీసీ సభ్యులు సమావేశమై ఈ సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్షురాలిగా చింపుల శైలజ సత్యనారాయణ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గడిల కుమార్ గౌడ్, కొన్ని జిల్లాలకు కన్వీనర్లను ఎన్నుకున్నారు. తెలంగాణ పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు చింపుల సత్యనారాయణ రెడ్డి అధ్యక్షతన సోమవారం జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఎంపీటీసీల సమస్యలపై చర్చించారు.

# మేడారం జాతరకు ఏర్పాట్లు

## రూ.75కోట్లతో శాశ్వత ప్రాతిపదికన నిర్మాణ పనులు

**సాక్షి, హైదరాబాద్:** మేడారం జాతరను పకడ్బందీగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సోమవారం దామోదరం సంజీవయ్య సంక్షేమ భవనంలో మేడారం జాతర ఏర్పాట్లపై మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఇంద్రకరణ్‌రెడ్డి, సత్యవతి రాథోడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం జరిగింది. మంత్రులు మాట్లాడుతూ మేడారం జాతరకు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు ఉందని, ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకుని భక్తుల సంఖ్యకు తగినట్లుగా వసతులు కల్పించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. జాతర నిర్వహణకు ప్రభుత్వం రూ.75కోట్లు విడుదల చేసిందని, వీటిని వినియోగించి శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. జాతరకు కోటిన్నరకు పైగా భక్తులు సందర్శించే అవకాశం ఉందని.. జాతర చరిత్ర, విశిష్టతలు తెలిసేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

**ప్లాస్టిక్ రహితంగా జాతర**

మేడారం జాతరలో ప్లాస్టిక్ నిర్మూలనపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మంత్రులు స్పష్టం చేశారు. త్వరలోనే పూజారుల కమిటీ ఏర్పాటు చేస్తామని, ఆదివాసీల అభిప్రాయం మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. జాతరకు వెళ్లే దారుల్లో మరమ్మతు పనులు వెంటనే పూర్తి చేయాలని, నేషనల్ హైవేస్ ఆధ్వర్యంలో పనులు చేస్తున్న రోడ్లను త్వరిత గతిన పూర్తి చేయాలని, సెల్‌ఫోన్ సిగ్నల్స్‌కు ఇబ్బంది లేకుండా టవర్ల సంఖ్యను పెంచాలని సూచించారు. సమావేశంలో ఎంపీలు దయాకర్, కవిత తదితరులు పాల్గొన్నారు.

# ముక్కలుగా నరికి.. మూట గట్టి..

## ఏడుపాయల్లో మహిళ దారుణ హత్య

**పాపన్నపేట:** రాష్ట్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల్లో గుర్తు తెలియని మహిళ దారుణ హత్యకు గురైంది. మహిళ శరీరాన్ని ఆరు ముక్కలుగా నరికి వేర్వేరుగా మూటగట్టి మంజీరానది ఒడ్డున పారవేశారు. శనివారం రాత్రి ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో నలుగురు ఎస్‌ఐలు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. పాపన్నపేట మండలం ఏడుపాయల్లో మంజీరానది వద్ద గుర్తుతెలియని మహిళ శరీర భాగాలను స్థానికులు శనివారం రాత్రి గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో మెదక్ రూరల్, పట్టణ సీఐలు రాజశేఖర్, వెంకట్, పాపన్నపేట ఎస్‌ఐ ఆంజనేయులుతోపాటు కొల్చారం, టేక్మాల్, మెదక్ రూరల్ ఎస్‌ఐలు సంఘటన స్థలానికి చేరుకొని మహిళ మృతదేహ భాగాలను బయటకు తీశారు. తల, కాళ్లు, చేతులు, మొండెం భాగాలను చీరలు, బట్టలతో మూటగట్టి ఓ చెట్టుకింద పడేశారు. డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీం, ఫింగర్‌ప్రింట్ నిపుణులు ఆధారాల కోసం ప్రయత్నించారు. మృతదేహం కుళ్లిపోవడంతోపాటు అక్కడ ఎలాంటి ఆధారాలు దొరకలేదని తెలుస్తోంది. కాగా మృతురాలి వయసు 25 నుంచి 35 మధ్య ఉంటుందని, ముక్కు పక్కన కుడివైపు నల్లటి పుట్టుమచ్చ, నుదుటిపైన పచ్చబొట్టు ఉందని సీఐ రాజశేఖర్ తెలిపారు. మృతురాలి శరీర భాగాలను చీర, ప్యాంట్, పిల్లో కవర్, బనియన్లు, పంజాబీడ్రెస్‌లతో మూటగట్టారని తెలిపారు. ఎక్కడైనా మిస్సింగ్ కేసులున్నా.., ఏవైనా వివరాలు చెప్పాలనుకున్నవారు 9440627014, 9490617015 నంబర్‌లకు ఫోన్‌చేసి సమాచారం అందించాలని సీఐ కోరారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# ఎస్‌బీఐలో చోరీకి విఫలయత్నం

## వెనుక ద్వారం నుంచి చొరబడిన దొంగ

- డబ్బు దొరక్క స్వీట్లు, బిస్కెట్లు తిని వచ్చిన దారినే వెనక్కి
- నల్లగొండ పట్టణంలో ఘటన

**నల్లగొండ క్రైం:** అతను ఓ దొంగ.. బ్యాంకులో పలికి చొరబడ్డాడు.. అయితే ఎక్కడ చూసినా డబ్బు కనిపించలేదు. చివరికి బిస్కెట్లు, స్వీట్లు, బాదంపప్పు కనిపించాయి. కుర్చీలో కూర్చుని తాపీగా వాటిని తిన్నాడు. తర్వాత వచ్చిన దారినే వెనుదిరిగిపోయాడు. ఆదివారం అర్ధరాత్రి నల్లగొండ జిల్లాకేంద్రంలో ఈ ఘటన చోటుచేసుకుంది. బ్యాంకు అధికారులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ పట్టణం క్లాక్‌టవర్ సెంటర్‌లో గల ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్‌లో ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత బ్యాంక్ వెనుక ద్వారం తాళం పగలగొట్టిన దొంగ లోనికి జొరబడ్డాడు. రెండు బీరువాలను ఓపెన్ చేసి చూడగా అన్నీ ఫైల్స్ కనిపించాయి. బ్యాంక్ సిబ్బంది కూర్చునే డెస్క్‌లను పరిశీలించగా రశీదులు మాత్రమే కనిపించాయి. చివరికి ఒకదగ్గర అధికారులు వదిలేసిన బాదంపప్పు, స్వీట్స్, బిస్కెట్స్ కనిపించాయి. వాటిని అక్కడే కూర్చుని తింటూ చుట్టూ ఉన్న బీరువాలను నిశితంగా పరిశీలించాడు. అనంతరం వచ్చిన దారినే వెళ్లిపోయాడు. సోమవారం ఉదయం వాచ్‌మన్ వెనుక గేట్ తాళం పగులగొట్టి ఉండడం చూసి బ్యాంక్ చీఫ్ మేనేజర్ గున్‌రెడ్డి శ్రీనివాస్‌రెడ్డికి సమాచారం ఇచ్చాడు. ఆయన వెంటనే బ్యాంకు వద్దకు చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. టూటౌన్ ఎస్సై నర్సింహులు బ్యాంక్‌ను పరిశీలించి నిందితుడి వేలిముద్రలను సేకరించారు. సీసీ టీవీ పుటేజీలను పరిశీలించారు. దొంగ ఏయే బీరువాను తెరిచాడు.. ఏమేం చేశాడో పరిశీలించారు. కాగా, బ్యాంకులో ఉన్న ఓ లాకర్‌లో పెద్దమొత్తంలో నగదు ఉన్నట్లు తెలిసింది. కానీ దొంగ దానిని మాత్రం ముట్టుకోలేదు.

**భద్రత డొల్ల..!**

ఈ బ్యాంక్‌లో సుమారు రూ.80 లక్షల వరకు ఉన్నట్లు సమాచారం. లాకర్ సదుపాయం ఉండడంతో ఖాతాదారులకు సంబంధించిన కోట్లాది రూపాయల బంగారం కూడా ఉంది. గేట్ తీయగానే అలారం వచ్చే ఏర్పాటు లేకపోవడం.. రాత్రి వాచ్‌మన్ లేకపోవడం, వెనుకగేట్ పశువుల కొట్టం గేట్ తరహాలో ఉండటంతో దొంగ సులభంగా బ్యాంక్‌లోకి వచ్చినట్లు తెలుస్తోంది. బ్యాంక్ అధికారులు భద్రతా ప్రమాణాలను గాలికి వదిలేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. బ్యాంక్ చీఫ్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, బ్యాంక్‌లో ఎలాంటి చోరీ జరగలేదని ఎస్సై నర్సింహులు తెలిపారు.



బ్యాంక్‌ను పరిశీలిస్తున్న ఎస్‌ఐ నర్సింహులు



# కలెక్టరేట్ల ముట్టడి ఉద్రిక్తం

- 24వ రోజు రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కార్మికుల ఆందోళనలు
- మహిళా కండక్టర్ ఆత్మహత్యతో మానవహారాలు, రాస్తారోకోలు
- 69 శాతం బస్సులు తిప్పాం: ఆర్టీసీ

సాక్షి, హైదరాబాద్

ఆర్టీసీ కార్మికుల సమ్మెలో భాగంగా సోమవారం తలపెట్టిన కలెక్టరేట్ల ముట్టడి ఉద్రిక్తంగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ఉదయం నుంచే ఆందోళన కార్యక్రమాలు మొదలయ్యాయి. అఖిలపక్ష పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల ముట్టడి నిర్వహించారు. ఆర్టీసీ కార్మికులతో పాటు వారి కుటుంబ సభ్యులు, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు ఈ ఆందోళనలో పాల్గొని ప్రభుత్వ వైఖరిపట్ల నిరసన వ్యక్తం చేశారు. 24 రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నియంతృత్వ ధోరణి వీడకపోవడాన్ని తప్పుబట్టారు. కలెక్టరేట్ల ముట్టడితో పాటు బస్ డిపోల ముట్టడి, తాలూకా, మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టి ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. సత్తుపల్లి బస్ డిపోకు చెందిన మహిళా కండక్టర్ నీరజ ఆత్మహత్య చేసుకోవడంతో స్థానికంగా తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఆమె ఆత్మహత్యతో అన్ని జిల్లాల్లోని కార్మికులు మానవహారాలు, రాస్తారోకోలు నిర్వహించారు. కార్మికులు ఆత్మహత్యలు చేసుకుని చనిపోతున్నా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడంలేదని విమర్శించారు. డిమాండ్లు సాధించే వరకు పోరాటాన్ని ఆపేది లేదని కార్మిక నేతలు స్పష్టం చేశారు. నల్లగొండ కలెక్టరేట్ వద్ద జరిగిన ఆందోళనలో టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం, తెలంగాణ ఇంటిపార్టీ అధ్యక్షుడు చెరుకు సుధాకర్ తదితరులు పాల్గొని మద్దతు తెలిపారు.

**ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు..**

దీపావళికి వివిధ ప్రాంతాలకు వెళ్లిన ప్రయాణికులు తిరిగి రావడానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నామని ఆర్టీసీ యాజమాన్యం తెలిపింది. అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగే అంశాలపై చర్యలు చేపట్టాలని రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, సంస్థ ఇన్‌చార్జ్ మేనేజింగ్ డైరెక్టర్ సునీల్ శర్మ అధికారులకు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు సంస్థ ప్రకటించింది. సోమవారం సాయంత్రం వరకు రాష్ట్రవ్యాప్తంగా 6,209 బస్సులు తిప్పినట్టు తెలిపింది. ఇందులో 4,309 అద్దె బస్సులు, 1,900 ప్రైవేటు బస్సులు ఉన్నట్టు వివరించింది. రోజువారీ నడవాల్సినవాటిలో 69.38 శాతం బస్సులు తిప్పినట్టు పేర్కొంది.

## ఆర్టీసీ చరిత్రలో అతిపెద్ద సమ్మె

డిమాండ్ల సాధనలో భాగంగా ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారం 25వ రోజుకు చేరుకుంటుంది. ఆర్టీసీ చరిత్రలో ఇదే అతిపెద్ద సమ్మె. తెలంగాణ రాష్ట్ర సాధనలో భాగంగా గతంలో సకల జనుల సమ్మె జరిగినప్పుడు ఆర్టీసీ కార్మికులు కూడా అందులో భాగస్వాములయ్యారు. అప్పట్లో తెలంగాణ ప్రాంత ఆర్టీసీ కార్మికులు 27 రోజులపాటు సమ్మె చేశారు. అయితే, కార్మికుల డిమాండ్ల సాధనే ఎజెండాగా జరిగిన సమ్మెల్లో మాత్రం ఇదే పెద్దది. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు హయాంలో ఆర్టీసీ కార్మికులు 'ఆర్టీసీ పరిరక్షణ–వేతన సవరణ'డిమాండ్‌తో 24 రోజుల పాటు సమ్మె చేశారు. ఈ క్రమంలోనే బస్‌పాసులతో జరుగుతున్న నష్టాన్ని ప్రభుత్వం భరించాలనే డిమాండ్‌కు పరిష్కారం లభించింది. బస్‌పాసులకు సంబంధించి 50శాతం రాయితీని ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఆ తర్వాత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం ఈ రాయితీని నూరుశాతానికి పెంచింది. వేతన సవరణ డిమాండ్‌తో గత ప్రభుత్వంలోనూ ఆర్టీసీ కార్మికులు 7రోజుల పాటు సమ్మె చేశారు. 1967లో దాదాపు 20 రోజులపాటు ఆర్టీసీ సమ్మె జరిగింది.



నీరజ మృతదేహంతో కలెక్టరేట్‌లోకి వెళ్తున్న కార్మికుల నుంచి మృతదేహాన్ని లాక్కుంటున్న పోలీసులు



కలెక్టరేట్ ఎదుట మృతదేహంతో ఆందోళన చేస్తున్న అఖిలపక్ష ఆర్టీసీ జేఏసీ నాయకులు

# మహిళా కండక్టర్ ఆత్మహత్య

- సమ్మెపై సర్కార్ తాత్సారం చేస్తోందని మనస్తాపం
- కండక్టర్ మృతితో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉద్రిక్తత
- కలెక్టర్ కార్యాలయం ఎదుట మృతదేహంతో ఆందోళన
- సత్తుపల్లి డిపోలో బస్సు అద్దాలు ధ్వంసం
- మృతురాలి కుటుంబానికి తక్షణ సాయం రూ.7.50 లక్షలు

**సాక్షి ప్రతినిధి, ఖమ్మం:** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సోమవారం మరో ఆర్టీసీ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడింది. ఆర్టీసీ కార్మికుల సమ్మెపై ప్రభుత్వ వైఖరికి తీవ్ర మనస్తాపం చెంది ఈ అఘాయిత్యానికి పాల్పడింది. విషయం తెలియగానే ఆర్టీసీ కార్మికులు కోపోద్రిక్తులయ్యారు. మృతదేహంతో కలెక్టర్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఖమ్మం జిల్లాకే చెందిన డ్రైవర్ శ్రీనివాస్ రెడ్డి ఆత్మహత్య ఘటన మరవక ముందే.. కండక్టర్ బలవన్మరణం చెందడంతో కార్మికుల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. వివరాలు.. సత్తుపల్లి ఆర్టీసీ డిపోలో కొమరబత్తిని నీరజ (30) కండక్టర్‌గా పనిచేస్తోంది. సమ్మెపై ప్రభుత్వం తాత్సారం చేయడంతో సోమవారం తెల్లవారుజామున ఖమ్మంలోని తన నివాసంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిందని ఆమె కుటుంబ సభ్యులు ఆరోపించారు. కండక్టర్ ఆత్మహత్య వార్త తెలియగానే.. సత్తుపల్లి, ఖమ్మం, మధిర డిపోల వద్ద కార్మికులు ఆందోళనకు దిగారు. ఆమె పనిచేస్తున్న సత్తుపల్లి డిపోలో అక్కడి కార్మికులు డిపోలోకి చొచ్చుకెళ్లి బస్సు అద్దాలు ధ్వంసం చేశారు. ప్రభుత్వ వైఖరి వల్లే కండక్టర్‌ను కోల్పోయాం.. అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులు, అఖిలపక్ష నేతలు, ప్రజా సంఘాలు రోడ్డుపై బైఠాయించారు.

**ఇది ప్రభుత్వ హత్యే**

ఆర్టీసీ కార్మికుల సమ్మెపై ప్రభుత్వం చేస్తున్న తాత్సారమే ఖమ్మం జిల్లాలో మరో ఆర్టీసీ ఉద్యోగి ఉసురు తీసిందని, ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని పలు రాజకీయ పక్షాల నేతలు ఆరోపించారు. ప్రభుత్వ వైఖరికి కలత చెందుతూ కార్మికులు పిట్టల్లా రాలిపోతున్నారని, ఇంకా ఎంత మందిని చంపుతారని నిలదీశారు. వెంటనే కార్మికులతో చర్చలు జరిపి వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.



మృతురాలు నీరజ

**తక్షణ సాయం రూ.7.50 లక్షలు**

పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో అడిషనల్ డీసీపీ మురళీధర్‌రావు, ట్రెయినీ కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఏసీపీ వెంకట్రావు, అర్బన్ తహసీల్దార్ అఖిలపక్ష నేతలతో చర్చలు జరిపారు. ఉన్నతాధికారులతో మాట్లాడి నీరజ కుటుంబానికి తక్షణ సాయం కింద రూ.7.50 లక్షలతో పాటు భర్తకు ప్రభుత్వ ఉద్యోగం, పిల్లలను చదివించే బాధ్యత, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, మూడెకరాల భూమి ఇస్తామని అధికారులు హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు.

**మూడేళ్ల క్రితం సత్తుపల్లి డిపోకు..**

నీరజ భర్త భీమిలి రాజశేఖర్ నగరంలోని ఓ గ్రానైట్ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పని చేస్తుండగా, నీరజ పిల్లలు పూజిత 4వ తరగతి, విశాల్ 2వ తరగతి చదువుతున్నారు. పదేళ్ల క్రితం ఖమ్మం బస్సు డిపోలో కండక్టర్‌గా విధుల్లో చేరింది. మూడేళ్ల క్రితం సత్తుపల్లి డిపోకు బదిలీపై వెళ్లింది. కాగా, నీరజ మృతదేహం వద్ద భర్త, కుటుంబ సభ్యులు బోరున విలపించారు. పండగ రోజు ఇంటి వద్ద లేకుండా సమ్మెలో పాల్గొంటానని చెప్పిందన్నారు.

## కలెక్టరేట్ వద్ద ఉద్రిక్తత

మరోవైపు ఖమ్మంలో నీరజ మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం తరలించే సమయంలో కార్మికులు, అఖిలపక్షం, ప్రజా సంఘాల నేతలు అడ్డుకున్నారు. నీరజ కుటుంబానికి న్యాయం చేసే వరకు పోస్టుమార్టం జరగనివ్వమంటూ భీష్మించారు. అనంతరం మృతదేహంతో కలెక్టర్ కార్యాలయంలోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు అడ్డుకునే ప్రయత్నంలో తోపులాట జరిగింది. నీరజ కుటుంబానికి న్యాయం చేయాలంటూ రోడ్డుపై మృతదేహంతో బైఠాయించారు. నాలుగు గంటలకు పైగా ఆందోళన చేయడంతో నగరంలో ట్రాఫిక్ భారీగా స్తంభించి పోయింది.

## ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

### బస్సు కింద పడేందుకు యత్నం

**పరిగి:** సమ్మెలో ఉన్న ఓ ఆర్టీసీ డ్రైవర్ బస్సు కింద పడి ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన వికారాబాద్ జిల్లా పరిగి పట్టణంలోని బాహర్‌పేట్‌లో సోమవారం చోటుచేసుకుంది. పరిగిలో నివాసముండే గొల్ల వెంకటయ్య పరిగి డిపోలో ఆర్టీసీ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ప్రస్తుతం వారు సమ్మెలో కొనసాగుతున్నారు. గత రెండు నెలలుగా వేతనాలు లేకపోవటంతో ఆర్థిక ఇబ్బందులు మొదలయ్యాయి. అతని కూతురు పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదువుతోంది. కూతురు రెండు రోజులుగా పరీక్ష ఫీజు కోసం డబ్బులివ్వమని వెంకటయ్యను అడుగుతూ వస్తోంది. ఈ క్రమంలో వెంకటయ్యకు ఏమిచేయాలో పాలుపోక పరిగిలోని బాహర్‌పేట్‌లో పదిమీటర్ల దూరం నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ముందుకు దూసుకెళ్లి రోడ్డుపై పడుకున్నాడు. డ్రైవర్ వెంటనే బ్రేకులు వేయడంతో బస్సు రెండడుగుల దూరంలో ఆగింది. బస్సులో ఉన్న ప్రయాణికులు, గమనించిన స్థానికులు వెంకటయ్యను వారించే క్రమంలో తలరోడ్డుకేసి బాదుకున్నాడు. దీంతో అక్కడే స్పృహ కోల్పోయాడు. వెంటనే అతడిని పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించగా కోలుకున్నాడు. కాగా, రాత్రి సమయంలో మరోసారి రోడ్డుపైకి వచ్చి ఆత్మహత్యాయత్నం చేశాడు. తోటి కార్మికులు వారించి అతడిని తీసుకెళ్లారు.

## గ్రూప్‌-2లో స్టడీ సర్కిల్ అభ్యర్థుల ప్రతిభ

### బీసీ స్టడీ సర్కిల్ నుంచి 242 మంది ఎంపిక

**సాక్షి, హైదరాబాద్:** గ్రూప్–2 ఉద్యోగాల్లో బీసీ స్టడీ సర్కిల్ అభ్యర్థులు సత్తా చాటారు. బీసీస్టడీ సర్కిల్ ద్వారా శిక్షణ పొందిన వారిలో ఏకంగా 242 మంది అభ్యర్థులు గ్రూప్–2 ఉద్యోగాలు సాధించారు. వీరిలో 61 మంది డిప్యూటీ తహసీల్దార్లు, 37 మంది ఏసీటీఓలు, 84 మంది ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్‌తోపాటు వివిధ కేటగిరీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరికి ఈ నెల 30న ఖైరతాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ ఆడిటోరియంలో బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్ చేతుల మీదుగా సన్మానం చేస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఎన్.బాలాచారి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

తెలంగాణ ప్రభుత్వం
**సూపరింటెండింగ్ ఇంజినీర్, P.R. రీజినల్ ఆఫీస్: ఖమ్మం**
NIT No. 33 & 34/2019-20 **ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటిస్** తేది: 23.10.2019
**పనిపేరు:** భద్రాది కొత్తగూడెం జిల్లాలో అశ్వరావుపేట వద్ద గ్రీన్ ఫీల్డ్ స్టేడియం నిర్మాణం మరియు దమ్మపేట (మం॥) మల్కారం GP వద్ద తాళ్లమడ నుండి పెనదవారిపాలెం వరకు రోడ్‌పై (1/850 కి.మి) ప్రస్తుతమున్న 5 వెంట్ పైప్ కల్వర్ట్‌కు ప్రొటెక్షన్ వాల్ నిర్మాణం. 2వ పిలుపు, గ్రాంట్: SATs & SCA, **అంచనా వ్యయం:** రూ.280 లక్షలు. అన్ని ఇతర వివరాలను 28.10.2019 నుండి https://tender.telangana.gov.inలో లభించును. సవరణ, మార్పులు ఏవేని ఉంటే వెబ్‌సైట్‌లో మాత్రమే ప్రచురించబడును. టెండర్ ఆన్‌లైన్ దాఖలుకు చివరి తేది: 16.11.2019, సంప్రదించు నం. 08742226893.
**సం/– సూపరింటెండింగ్ ఇంజినీర్, P.R.R.O. ఖమ్మం**
DIPR Ro.No. 1491-DP/CL/ADVT/1/2019-20, Dt: 28/10/2019

**THE SINGARENI COLLIERIES COMPANY LIMITED**
(A Government Company)
R.O: Kothagudem Collieries - 507101, Telangana.
**e-Procurement TENDER NOTICE**
Tender has been published for the following work through e-procurement platform.
For details, please visit https://tender.telangana.gov.in. - or - https://www.scclmines.com
NIT No., Date - Name of the work - Last date & time for Submission of bids
**CRP/CVL/KGM/TN-70/19-20, Dt.25.10.2019** - Construction of additional compound wall with pre-stressed pre cast concrete posts and panels for Solar Power Plant at KGM area, Bhadradri Kothagudem, **T.S - upto 4.30 PM on 11.11.2019.**
PR/2019-20/CVL/SLK/73 Chief (Civil)

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ టెక్స్ట్ బుక్ ప్రెస్
**ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన**
ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ టెక్స్ట్ బుక్ ప్రెస్, గుంటూరుకు 70 GSM S.S. మ్యాప్లితో పేపర్ మిల్కీ షేడ్ రీల్ 10000 MTs మరియు షీట్స్‌లో వైట్ ఆర్ట్ కార్డ్ కవర్ పేపర్ 200 GSM 750 MTs మల్టీ కలర్‌లో టెక్స్ట్ బుక్స్ ప్రింటింగ్ కొరకు వర్జిన్ పల్ప్ పేపర్ సరఫరా కొరకు ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. ఆన్‌లైన్ టెండర్ ఫారాల దాఖలు కాల వ్యవధి: 29.10.2019 నుండి 14.11.2019. టెండర్ తెరచు తేది: 18.11.2019న ఉ.11.00 గం. హార్డ్ కాపీల టెండర్ ఫారాల దాఖలుకు చివరి తేది: 15.11.2019న మ.3.00 గం.కు. టెక్నికల్ బిడ్ తెరచు తేది: 18.11.2019 ఉ.11.00 గం.కు. తదుపరి వివరాలను ఇ-మార్కెట్‌ప్లేస్ అనగా www.apeprocurement.gov.in లో చూడవచ్చును.
**సం/– డైరెక్టర్, AP గవర్నమెంట్ టెక్స్ట్ బుక్ ప్రెస్, గుంటూరు**
DIPR RO No. 904/CL/Advt/1/1/2019-20, Dt:28-10-19

**Andhra Pradesh State FiberNet Limited**
(An Enterprise of the Government of Andhra Pradesh)
3rd Floor, NTR Administrative Block, Pandit Nehru Bus Station, NH-65, Vijayawada-520013. Andhra Pradesh
Website: www.apsfl.in E-mail: apsfl@ap.gov.in
**Notice No.APSFL/Recruitment/34/2019 Dt: 28-10-2019**
Online Applications are invited from Suitable Candidates for the Following position.
Executive Director (Business Operations)
For further details regarding job description and eligible criteria, please visit our website **www.apsfl.in.** Interested eligible candidates may send their profile/updated CV to Email: **apsfl@ap.gov.in** on or before 04.11.2019.
**Sd/- Managing Director**
DIPR Ro. 199PP/CL/ADVT/1/1/2019-20 Dt: 28/10/2019

# 'పుర'పోరుపై నేడు స్పష్టత!

- కీలక నిర్ణయం తీసుకోనున్న ఎస్ఈసీ
- ఎన్నికల సన్నద్ధతపై కలెక్టర్లు, కమిషనర్లతో సమావేశం
- వచ్చే వారం నోటిఫికేషన్

**సాక్షి, హైదరాబాద్:** పురపోరుపై మంగళవారం రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) కీలక నిర్ణయం తీసుకోనుంది. ఎన్నికల సన్నద్ధతపై జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనుంది. ఈ సమావేశంలో ఎన్నికల నగారా ఎప్పుడు మోగిస్తారనే దానిపై స్పష్టతనిచ్చే అవకాశముంది. నవంబర్‌లో ఎన్నికలు నిర్వహించాలని కృతనిశ్చయంతో ఉన్న సర్కార్.. న్యాయపరమైన చిక్కులు వీగిపోయేలా చకచకా పావులు కదుపుతోంది. పురపాలక సంఘాల ఎన్నికలకు ప్రధాన అడ్డంకిగా ఉన్న ప్రజాహిత వ్యాజ్యాన్ని హైకోర్టు కొట్టివేయడంతో ప్రభుత్వం ఊపిరిపీల్చుకుంది. అయితే, 78 మున్సిపాలిటీల పరిధిలో ఎన్నికలు నిలుపుదల చేస్తూ సింగిల్ జడ్జి ధర్మాసనం విధించిన స్టే ఉత్తర్వులు తొలిగిపోయేలా మూడు రోజుల క్రితం హైకోర్టులో కౌంటర్ కూడా దాఖలు చేసింది. దీనిపై గురువారం విచారణ జరగనుంది. ప్రధాన కేసు కొలిక్కి వచ్చినందున.. ఈ కేసులో కూడా తీర్పు తమకే అనుకూలంగా వస్తుందని అంచనా వేస్తున్న ప్రభుత్వం.. ఎన్నికల నిర్వహించడానికి సన్నాహాలను ముమ్మరం చేసింది. ఇదివరకే వార్డుల విభజన, ఓటర్ల జాబితా రూపకల్పన కొలిక్కిరావడంతో కేవలం రిజర్వేషన్ల ఖరారు మాత్రమే మిగిలిపోయింది. దీనిపై కూడా అంతర్గతంగా కసరత్తు పూర్తి చేసినట్లు తెలుస్తోంది. ఎస్టీ, ఎస్సీ, బీసీలకు 50 శాతం సీట్లను రిజర్వ్ చేయనున్నారు. పంచాయతీరాజ్ ఎన్నికల్లో అనుసరించిన నిష్పత్తినే మున్సిపోల్స్‌లోను అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. కాగా, మొత్తం స్థానాల్లో సగం సీట్లను మహిళలకు రిజర్వ్ చేస్తారు.

**ఏ క్షణమైనా నోటిఫికేషన్..**

గత శాసనసభ ఎన్నికల్లో వినియోగించిన ఓటర్ల జాబితానే పురపోరులోను వాడనున్నట్లు ఎస్ఈసీ ప్రకటించింది. ఈ మేరకు వార్డుల వారీగా ఓటర్ల జాబితాల తయారీ, పోలింగ్ బూత్‌ల ఏర్పాట్లు, ఎన్నికల సిబ్బంది నియామకం, అధికారులకు శిక్షణ, పోలీస్ భద్రత, ఇతరత్రా ఏర్పాట్లపై కలెక్టర్లు, కమిషనర్లతో సమీక్షించనుంది. ఎన్నికల సన్నద్ధతపై అధికారులిచ్చే సమాధానాలు సంతృప్తికరంగా ఉంటే.. ఎస్ఈసీ ఈ నెలాఖరులోగా పురభేరి మోగించనుంది. కాగా, ప్రభుత్వం మాత్రం గురువారం న్యాయస్థానం విచారించే కేసుకు అనుగుణంగా ఎన్నికల నిర్వహణపై తుది అడుగు వేయనుంది. ఒకవేళ ఆ రోజే తీర్పు వెలువడితే.. మూడు రోజుల్లో రిజర్వేషన్ల క్రతువును పూర్తి చేసి.. ఈసీకి జాబితాను అందజేయనుంది. ఆ తర్వాత ఏ క్షణమైనా ఎన్నికల నోటిఫికేషన్‌ను ఈసీ ప్రకటించనుంది. నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచి 16 రోజుల్లో ఎన్నికల ప్రక్రియ ముగియనుంది.

**మీర్‌పేట ఎన్నికలపై సందిగ్ధత..**

మీర్‌పేట నగర పాలక సంస్థ ఎన్నికలపై సందిగ్ధత కొనసాగుతోంది. గతంలో పురపాలికగా ఉన్న మున్సిపాలిటీలో వార్డుల విభజన ప్రక్రియను పూర్తి చేశారు. అయితే, ఈ మున్సిపాలిటీని కాస్తా కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ చేయడమే గాకుండా.. జిల్లెలగూడ మున్సిపాలిటీని ఇందులో విలీనం చేశారు. దీంతో మరోసారి వార్డులను పునర్విభజించాల్సి ఉంది. ఈ కసరత్తుకు కనిష్టంగా 15 రోజులు పడుతుంది. ఒకవేళ దీనికి కూడా ఇప్పుడే ఎన్నికలు జరపాలనుకుంటే మాత్రం.. ఎన్నికల నోటిఫికేషన్ ఆలస్యం కానుంది. లేదంటే ఈ కార్పొరేషన్‌ను పక్కనపెట్టి ఎన్నికలకు వెళ్లాల్సి ఉంటుంది.



నిమ్స్‌లో కూనంనేనిని పరామర్శిస్తున్న చాడ వెంకట్‌రెడ్డి తదితరులు

# కూనంనేని దీక్ష భగ్నం

- నిమ్స్‌కు తరలింపు..

**సాక్షి, హైదరాబాద్:** ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతుగా సీపీఐ సహాయ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షను పోలీసులు భగ్నం చేశారు. అనంతరం నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. దీంతో ఆయన నిమ్స్‌లోనే దీక్ష కొనసాగిస్తున్నారు. సోమవారం తెల్లవారుజామున 1.45 నిమిషాల ప్రాంతంలో మఖ్దూంభవన్ శిబిరంలోకి ప్రవేశించిన పోలీసులు దీక్ష చేస్తున్న కూనంనేనితోపాటు రిలే దీక్షలో పాల్గొన్న 13 మందిని అరెస్ట్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందని, పోలీసులు అక్రమ అరెస్టులు చేస్తున్నారంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. సోమవారం రాత్రి ఆయన షుగర్ లెవల్స్‌తోపాటు పల్స్‌రేట్ పడిపోయి ఆరోగ్యం క్షీణించడం మొదలైందని సీపీఐ కార్యదర్శి చాడ వెంకటరెడ్డి తెలిపారు. కూనంనేనిని నేతలు కె.నారాయణ, అజీజ్‌పాషా, చాడ వెంకటరెడ్డి, పశ్య పద్మ, ప్రేంపావని, డి.సుధాకర్, బీసీ సంక్షేమ సంఘం నేత ఆర్.కృష్ణయ్య, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, విమలక్క పరామర్శించారు.

## కేసీఆర్ కిట్ టెండర్లతో సర్కారుకు ఆదా

**సాక్షి, హైదరాబాద్:** కేసీఆర్ కిట్ ఆన్‌లైన్ గ్లోబల్ టెండర్లతో ఈ ఏడాది సర్కారుకు రూ. 7 కోట్లు ఆదా అయినట్లు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ వెల్లడించారు. ఈసారి టెండర్లలో 8 కంపెనీలు పాల్గొనగా ఎల్–1 వచ్చిన కంపెనీ రూ. 1593.97 కోట్ చేసిందని, గత టెండర్ కంటే ఇది రూ. 120 తక్కువ అని తెలిపారు. మొత్తం 6 లక్షల కిట్లకు గాను రూ. 7.14 కోట్లు ఆదా అయిందన్నారు. కేసీఆర్ కిట్ల పంపిణీలో అంతరాయం కలగకుండా ఉండేందుకు బిడ్ చేసిన ధరకే ఎల్–1కు 50 శాతం, ఎల్–2కు 30 శాతం, ఎల్–3కి 20 శాతం కేటాయించినట్లు తెలిపారు. రాబోయే రెండేళ్లలో 6 లక్షల కిట్లు అవసరమవుతాయన్న అంచనా వేస్తున్నా మన్నారు. ప్రస్తుతం సర్కారు దవాఖానాల్లో ప్రసవాల శాతం బాగా పెరిగిందన్నారు. 2017–18 లో 2.24 లక్షల మందికి, 2018–19 లో 2.27 లక్షల మందికి కేసీఆర్ కిట్లను పంపిణీ చేశామన్నారు. ఈ ఏడాది అక్టోబర్ నాటికే 2లక్షల కిట్లు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. పథకం ప్రారంభం నుంచి ఇప్పటివరకు 6.5 లక్షల కేసీఆర్ కిట్లు మహిళలకు అందించామని చెప్పారు.

**GOVERNMENT OF ANDHRA PRADESH**
Information & Public Relations Department
**AMENDMENT NOTICE**
The sale of tender schedules for RFP from reputed Communications and Public Relations Agency to provide services to Government of Andhra Pradesh will be extended upto 04.11.2019 during working hours. Sealed tenders should reach this office on or before 1.00 PM on 05.11.2019. The Cost of Tender Schedule (RFP) : Rs. 10,000/- (Non-refundable) and EMD Rs. 10,00,000/- in shape of DD from Nationalized Bank in favour of "Accounts Officer, I&PR Department, Vijayawada". For further details can be viewed in the website: **www.ipr.ap.nic.in**
**Sd/- T. Vijay Kumar Reddy, I.I.S., Commissioner**
DIPR Ro.No. 909/CL/Advt/1/1/2019-20, Dt: 28/10/2019

**Infrastructure Corporation of Andhra Pradesh Ltd.**
(Under the Control of Department of Industries, Infrastructure, Investment & Commerce)
**GOVERNMENT OF ANDHRA PRADESH**
**Request for Proposal for Selection of Technical Consultant for Preparation of Detailed Project Report(s) for development of Machilipatnam Port in the State of Andhra Pradesh**
**RFP Notice No.INCAP/P/Dev.of Machilipatnam Port/DPR/18/2019, Dt:29-10-2019**
Infrastructure Corporation of Andhra Pradesh (INCAP) under the control of Department of Industries, Investment, Infrastructure & Commerce, Government of Andhra Pradesh invites bids from interested Technical Consultant for Preparation of Detailed Project Report(s) for development of Machilipatnam Port in the State of Andhra Pradesh.
This RFP document can be downloaded from the website - **www.incap.co.in.** Interested Agencies are required to submit thier proposals as per the schedule indicated below. Applicants may please note that all other details including any date extensions, clarifications, amendments, corrigendum etc., will be uploaded only on the above website and will not be published in News Papers.
**Schedule:**

| | |
|---|---|
| Availability of RFP document on website | 10:00 AM, 30.10.2019 (Wednesday) |
| Last date and time for submission of bids | 3:00 PM, 13.11.2019 (Wednesday) |
| Date & time for opening of bids | 4:00 PM, 13.11.2019 (Wednesday) |

**Contact:**
General Manager (Technical), INCAP
O/o Infrastructure Corporation of Andhra Pradesh,
A Block, I floor, Sri Anjaneya Towers,
Ibrahimpatnam-521456.
Email: incap@incap.co.in:
DIPR Ro.No.201PP/CL/Advt/1/1/2019-20, Dt:28-10-2019

# 4,000 రూట్లు ప్రైవేటుకు!

▶ మొదటి పేజీ తరువాయి

అధికారాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు ఇచ్చింది. ఈ చట్టం 2019 సెప్టెంబర్ 1 నుంచి అమల్లోకి వచ్చింది. ఈ చట్టం కల్పించిన అధికారాల ద్వారా ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందించేందుకు 3 నుంచి 4 వేల రూట్లలో ప్రైవేటు వాహనాలకు పర్మిట్లు ఇవ్వాలని ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ప్రైవేటు వాహనాలకు పర్మిట్లు ఇవ్వడం వల్ల వారు ఆదాయం కోసం తమకు కేటాయించిన రూట్లలో ఎక్కువ ట్రిప్పులు నడుపుతారు. షిఫ్టుల గొడవ లేకుండా ఎక్కువ సమయం వాహనాలను ప్రజల రవాణాకు అందుబాటులో ఉంచుతారు. ప్రజలకు ఇప్పటి కంటే ఎక్కువ రవాణా సౌకర్యం అందుబాటులో ఉంటుందని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం.

**డీజిల్‌కు సైతం డబ్బుల్లేవ్..**

ప్రస్తుతం ఆర్టీసీ సమ్మెపై వివిధ కేసులను హైకోర్టు విచారణ జరుపుతోంది. ఇది ఎప్పటికి పరిష్కారం అవుతుందో తెలియదు. హైకోర్టు తీర్పు వచ్చినా ఎవరైనా సుప్రీం కోర్టుకు వెళ్లే అవకాశాలున్నాయి. మరోవైపు ఆర్టీసీ నష్టాల్లో ఉందని, సమ్మె వల్ల వచ్చే



ఆదాయం కూడా రావట్లేదని ప్రభుత్వం వాదిస్తోంది. తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఆర్టీసీ చిక్కుకుంది. దీని ఫలితంగా బస్సులకు డీజిల్ పోసే పంపులకు బకాయిలు పేరుకుపోయాయి. ఏ క్షణమైనా బంకులు డీజిల్ పోయడం ఆపేయొచ్చు. దీనివల్ల ప్రస్తుతం తిరుగుతున్న బస్సులు కూడా ఏ క్షణమైనా ఆగిపోయే అవకాశం ఉంది. మరోవైపు తీసుకున్న అప్పులకు కిస్తీలు చెల్లించలేని స్థితిలో ఆర్టీసీ కూరుకుపోతోంది. ఏ క్షణమైనా ఆర్టీసీని నాన్ పెర్ఫార్మింగ్ అసెట్ (ఎన్‌పీఏ)గా గుర్తించే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## టెండర్లకు అనూహ్య స్పందన

రూట్లకు పర్మిట్లు ఇస్తే నడపడానికి ప్రైవేటు వాహన యజమానులు కూడా సిద్ధంగా ఉన్నారు. ఇటీవల ప్రభుత్వం వెయ్యి రూట్లలో పర్మిట్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తే, 21,453 దరఖాస్తులు వచ్చాయి. దీన్ని బట్టి రాష్ట్రంలోని ప్రైవేటు వాహన యజమానులే కాకుండా, ఇతర రాష్ట్రాల నుంచి కూడా వాహనాలు కూడా వచ్చే అవకాశం ఉందని రవాణా అధికారులు అంచనాకు వచ్చినట్లు తెలిసింది. విద్యార్థులకు పరీక్షలు ఉన్నప్పుడు, పండుగల సీజన్ ఉన్నప్పుడు.. ఇలా అదను చూసుకుని కార్మిక సంఘాలు సమ్మెలకు పిలుపునిస్తున్నాయి. ప్రభుత్వాన్ని బెదిరింపులకు గురి చేస్తున్నాయి. ఇలా సమ్మె జరిగినప్పుడల్లా ప్రజలకు విపరీతమైన అసౌకర్యం కలుగుతున్నది. దాదాపు 40 ఏళ్ల నుంచి ఇదే తంతు నడుస్తున్నది. దీన్నుంచి శాశ్వతంగా విముక్తి కావడానికి వివిధ రూట్లలో బస్సులు నడిపేందుకు ప్రైవేటు వారికి అవకాశం కల్పించడమే ఉత్తమమని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. త్వరలో జరిగే కేబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకుని అధికారికంగా వెలువరించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# మహా 'సస్పెన్స్'..!



- మహారాష్ట్రలో ప్రభుత్వ ఏర్పాటులో కొనసాగుతున్న ప్రతిష్టంభన
- బీజేపీ, శివసేన మధ్య '50:50'పై పీటముడి
- అధికారం సమం కావాలంటున్న సేన
- మెజారిటీలేక ఇరుకునపడిన బీజేపీ
- బుధవారం ముంబైకి అమిత్ షా రాక

**ముంబై:** 'ఇత్నా సన్నాటా క్యోం హై భాయి (ఇంత నిశ్శబ్దం ఎందుకు సోదరా?)' బాలీవుడ్ బ్లాక్ బస్టర్ సినిమా షోలేలో ఫేమస్ డైలాగ్ ఇది. ఈ డైలాగ్‌ను ఉటంకిస్తూ దేశవ్యాప్తంగా నెలకొన్న ఆర్థికమాంద్యంపై విమర్శలు గుప్పిస్తూ సోమవారం పార్టీ పత్రిక సామ్నాలో శివసేన సంపాదకీయం రాసింది. మాంద్యం మూలంగా దీపావళి రోజు కళకళలాడాల్సిన మార్కెట్లలో నెలకొన్న స్తబ్దతను మిత్రపక్షం బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి ఎత్తి చూపుతూ ఆ డైలాగ్‌ను శివసేన వాడుకుంది. ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం రాజకీయంగానూ మహారాష్ట్రలో ఒక రకమైన నిశ్శబ్దమే నెలకొని ఉండటమే ఇక్కడ విశేషం. రాష్ట్రంలో అధికారాన్ని సమంగా పంచుకోవాలన్న శివసేన డిమాండ్‌కు బీజేపీ అంగీకరిస్తుందా?, బీజేపీ ఒత్తిడి తెస్తే ఆ డిమాండ్‌ను శివసేన వదిలేస్తుందా?' తదితర ప్రశ్నలకు ప్రస్తుతం నిశ్శబ్దమే సమాధానంగా వస్తోంది.

**హరియాణాలో స్మూత్.. 'మహా' ఉత్కంఠ**

ఒకేసారి ఎన్నికలు జరిగిన మహారాష్ట్ర, హరియాణాల్లో నిజానికి హంగ్ అసెంబ్లీ ఏర్పడిన హరియాణాలో ప్రభుత్వ ఏర్పాటులో కొంత అస్థిరత, ఉత్కంఠ నెలకొనాల్సి ఉండగా.. అక్కడ ప్రభుత్వ ఏర్పాటు సజావుగా సాగింది. ప్రాంతీయ పార్టీ జననాయక జనతా పార్టీ(జేజేపీ) మద్దతుతో బీజేపీ సీఎం ఖట్టర్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. పొత్తు షరతుల్లో భాగంగా జేజేపీ నేత దుష్యంత్ చౌతాలా ఉప ముఖ్యమంత్రి అయ్యారు. మరోవైపు, ఎన్నికలకు ముందే పొత్తు పెట్టుకున్న బీజేపీ– శివసేన కూటమికి ఈ ఎన్నికల్లో సంపూర్ణ మెజారిటీ వచ్చినప్పటికీ.. ఆశ్చర్యకరంగా మహారాష్ట్రలో ప్రభుత్వ ఏర్పాటులో సందిగ్ధత, ఉత్కంఠ కొనసాగుతున్నాయి. శివసేనతో పొత్తు ఉన్నప్పటికీ ఎన్నికల్లో సొంతంగా మెజారిటీ వస్తుందని బీజేపీ ఆశించింది. అలా జరిగితే బీజేపీకి సమస్య ఉండకపోయేది. కానీ, అలా జరగలేదు. 288 స్థానాల అసెంబ్లీలో 2014లో కన్నా 17 స్థానాలు తక్కువగా 105 సీట్లకే బీజేపీ పరిమితమైంది. దాంతో ప్రభుత్వ ఏర్పాటుకు శివసేన సహకారం అనివార్యమైంది. ఈ పరిస్థితిని అనుకూలంగా తీసుకున్న శివసేన పొత్తుకు ముందు అంగీకరించిన షరతులను తెరపైకి తీసుకువచ్చింది. 50 : 50 ఫార్ములాను అమలు చేయాల్సిందేనని పట్టుబడుతోంది. ఠాక్రే కుటుంబం నుంచి తొలిసారి అసెంబ్లీలోకి అడుగుపెడ్తున్న ఠాక్రే వంశాంకురం ఆదిత్య ఠాక్రేకు ప్రభుత్వంలో 'సముచిత' గౌరవం లభించాలన్నది సేన ఆలోచన. ముఖ్యమంత్రిత్వం తప్పితే ఉప ముఖ్యమంత్రి పదవి తీసుకోవడానికి కూడా శివసేన సుముఖంగా లేదని తెలుస్తోంది.

**సంకీర్ణ ధర్మం పాటించాలి**

శివసేన చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే, పార్టీ నేత సంజయ్ రౌత్ తదితరులు తమ డిమాండ్లు చెప్పారు. '2019 లోక్‌సభ ఎన్నికల ముందే.. పొత్తు చర్చల సమయంలోనే ఈ విషయమై ఒక అంగీకారానికి వచ్చాం' అని ఉద్ధవ్ ఠాక్రే గుర్తు చేస్తున్నారు. అధికార పంపిణీకి సంబంధించిన ఫార్ములాను అమలు చేస్తామని ప్రభుత్వ ఏర్పాటుపై జరిపే చర్చలకు ముందే తమకు లిఖితపూర్వకంగా హామీ ఇవ్వాలని సేన ఇప్పుడు డిమాండ్ చేస్తోంది. ఈ విషయమై బీజేపీ నుంచి స్పందన లేదు. కానీ, ముఖ్యమంత్రిగా బీజేపీ వ్యక్తే ఉంటారనే విషయంలో ఎలాంటి రాజీ లేదనే సంకేతాలు మాత్రం ఇస్తోంది. జూనియర్ పార్ట్‌నర్‌గా శివసేన సంకీర్ణ ధర్మం పాటించాలని, ప్రభుత్వంలో చేరి ఆదిత్య ఠాక్రే సీనియర్ అయిన సీఎం ఫడ్నవిస్ వద్ద పాఠాలు నేర్చుకోవాలని బీజేపీ నాయకత్వం భావిస్తోంది. 1989లో శివసేన బీజేపీల తరఫున బాల్ ఠాక్రే, ఎల్‌కే అద్వానీల మధ్య పొత్తు కుదిరినప్పుడు.. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఎక్కువ స్థానాల్లో, అసెంబ్లీ ఎన్నికల్లో శివసేన ఎక్కువ స్థానాల్లో పోటీ



చేయాలని స్థూలంగా ఒక అంగీకారానికి వచ్చారు. అయితే, 2009 నుంచి పరిస్థితి మారుతూ వచ్చింది. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఎక్కువ స్థానాల్లో గెలుస్తూ వస్తోంది. 2014 శాసనసభ ఎన్నికల్లో వేర్వేరుగా పోటీ చేసిన బీజేపీ, శివసేనలు వరుసగా 122, 63 సీట్లు గెల్చాయి. త్వరలో బీజేపీ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడుతుందని ఆ పార్టీ నేత జీవీఎల్ నరసింహారావు సోమవారం స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో బీజేపీ అతి పెద్ద పార్టీగా అవతరించిందని, విపక్ష కూటమి అయిన కాంగ్రెస్(44), ఎన్సీపీ(54)లు కలిసి సాధించిన సీట్ల కన్నా తాము ఎక్కువ సీట్లలోనే గెలిచామని ఆయన వివరించారు. బుధవారం బీజేపీ చీఫ్ అమిత్ ముంబై రానుండటంతో అప్పటివరకు ఈ సస్పెన్స్ కొనసాగే అవకాశముంది.

**రాముడు సత్యమే మాట్లాడేవాడు..**

అధికారాన్ని సమంగా పంచుకోవాలనే విషయంలో అమిత్– ఉద్ధవ్‌ల మధ్య గతంలోనే ఒక అంగీకారానికి వచ్చిన విషయంపై నిజాలు మాట్లాడాలని సంజయ్‌రౌత్ డిమాండ్ చేశారు. 'బీజేపీ ఎప్పుడూ శ్రీరాముడిని స్మరిస్తూ ఉంటుంది. రాముడు సత్యవాక్పరిపాలకుడు. ఇప్పుడు బీజేపీ కూడా 50:50 ఫార్ములాపై నిజాలు మాట్లాడాలి' అని రౌత్ వ్యాఖ్యానించారు.

**గవర్నర్‌ను కలిసిన ఇరు పార్టీల నేతలు**

బీజేపీ నేత, సీఎం ఫడ్నవిస్, శివసేన నాయకుడు దివాకర్ రౌతె సోమవారం రాష్ట్ర గవర్నర్‌తో వేర్వేరుగా భేటీ అయ్యారు. చర్చల వివరాలు వెల్లడి కాలేదు కానీ.. అవి మర్యాదపూర్వకమైనవేనని రాజ్‌భవన్ అధికారులు చెప్పారు. అక్టోబర్ 21న జరిగిన శాసనసభ ఎన్నికల్లో బీజేపీకి 105, శివసేనకు 56 సీట్లు వచ్చిన విషయం తెలిసిందే.

## శివసేనకు కాంగ్రెస్, ఎన్సీపీ మద్దతు!

ప్రభుత్వ ఏర్పాటులో శివసేనకు కాంగ్రెస్, ఎన్సీపీలు మద్దతివ్వనున్నాయని ముంబై వర్గాలు చెబుతున్నాయి. ఒకవేళ ఈ సమీకరణాలు నిజమైతే.. శివసేన 56, ఎన్సీపీ 54, కాంగ్రెస్ 44 సీట్లు.. మొత్తం 154 సీట్లతో 288 స్థానాల అసెంబ్లీలో మెజారిటీ సులభంగానే లభిస్తుంది. శివసేన నుంచి ప్రతిపాదన వస్తే దానిపై పార్టీ హైకమాండ్ నిర్ణయం తీసుకుంటుందని మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు బాలాసాహెబ్ వ్యాఖ్యానించారు.

## సామ్నాలో బీజేపీపై విమర్శలు

సోమవారం శివసేన పత్రిక సామ్నా సంపాదకీయం కూడా బీజేపీపై నిప్పులు చెరిగింది. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ఆర్థిక విధానాల వల్లనే ఆర్థికమాంద్యం పరిస్థితులు నెలకొన్నాయని విమర్శించింది. దీపావళి సమయంలో మార్కెట్లలో స్తబ్దత నెలకొనడంపై స్పందిస్తూ.. 'ఇత్నా సన్నాటా క్యోం హై భాయి(ఇంత నిశ్శబ్దం ఎందుకు సోదరా?)' అనే షోలే సినిమా డైలాగ్‌ను ఉటంకించింది. కేంద్రం తీసుకున్న నోట్ల రద్దు, జీఎస్టీ అమలు వంటి నిర్ణయాల వల్లనే ఈ పరిస్థితి నెలకొందనే కథనాలు వినిపిస్తున్నాయని వ్యాఖ్యానించింది. 'అమ్మకాలు తగ్గిపోయాయి. కొన్ని పరిశ్రమలు మూత పడ్డాయి. ఉద్యోగాలు పోతున్నాయి. దీపావళి సమయంలోనే మార్కెట్లలో నిశ్శబ్దం రాజ్యమేలుతోంది. మరోవైపు, పలు విదేశీ కంపెనీలు ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్‌పై విపరీతంగా అమ్మకాలు జరిపి మన డబ్బుల్తో తమ ఖజానాలను నింపుకుంటున్నాయి' అని పేర్కొంది.

# ఉగ్ర ప్రోత్సాహకులపై చర్యలు

- ఈయూ ఎంపీలతో భేటీలో మోదీ
- నేడు కశ్మీర్‌లో పర్యటించనున్న ఈయూ ఎంపీలు
- ఆక్షేపించిన కాంగ్రెస్

**న్యూఢిల్లీ:** ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే వారిపై తక్షణ చర్యలు అవసరమని ప్రధాని మోదీ పేర్కొన్నారు. యూరోపియన్ యూనియన్(ఈయూ)కు చెందిన 28 మంది పార్లమెంట్ సభ్యులతో సోమవారం మోదీ మాట్లాడారు. 'ఉగ్రవాదంపై పోరుకు సన్నిహిత అంతర్జాతీయ సహకారం కీలకం. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించి, ప్రేరేపించడంతో పాటు దానిని ఒక దేశీయ విధానంగా మార్చుకున్న దేశాలపై తక్షణ చర్యలు అవసరం. దీనిని ఏమాత్రం ఉపేక్షించరాదు'అని పరోక్షంగా పాకిస్తాన్‌నుద్దేశించి పేర్కొన్నారు. కశ్మీర్‌లో పర్యటించడం ద్వారా జమ్మూ, కశ్మీర్, లదాఖ్ ప్రాంతాల సాంస్కృతిక, మతపరమైన వైవిధ్యంతోపాటు అక్కడ జరుగుతున్న అభివృద్ధి, పాలనపరమైన అంశాలపై అవగాహన ఏర్పడుతుందన్నారు. సాధ్యమైనంత త్వరగా ఈయూతో సముచిత, సమతుల్య వాణిజ్య, పెట్టుబడి ఒప్పందం కుదుర్చుకునేందుకు తమ ప్రభుత్వం ఆసక్తిగా ఉందన్నారు. సులభతర వాణిజ్యం ర్యాంకింగ్స్‌లో 2014తో పోలిస్తే భారత్ ఎంతో మెరుగైందని తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్..జమ్మూకశ్మీర్‌లో సీమాంతర ఉగ్రవాదం ఫలితంగా ఉత్పన్నమైన పరిస్థితిని ఈయూ ప్రతినిధి బృందానికి వివరించారు. ఈయూ బృందం నేడు కశ్మీర్‌లో పర్యటించి, ఆర్టికల్ 370 రద్దు అనంతరం ఏర్పడిన పరిస్థితులను ప్రజలను అడిగి తెలుసుకోనుంది.



రాజౌరీలో ప్రధాని మోదీతో షేక్‌హ్యాండ్ కోసం ఎగబడుతున్న సైనికులు

**పార్లమెంట్‌కు అవమానకరం: కాంగ్రెస్**

కశ్మీర్‌లో పర్యటించకుండా, అక్కడి ప్రజలతో మాట్లాడకుండా దేశంలోని రాజకీయ పార్టీల నేతలను నిర్బంధించిన ప్రభుత్వం..ఈయూ బృందానికి అనుమతి ఇవ్వడం దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు తీవ్ర అవమానకరమని కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. ఆ పార్టీ అధికార ప్రతినిధి ఆనంద్ శర్మ ప్రభుత్వ నిర్ణయం భారత ఎంపీల హక్కులకు భంగకరమని తెలిపారు. కశ్మీర్ అంతర్గత విషయమని చెప్పే ప్రభుత్వం ఈయూకు స్వాగతం పలికి విరుద్ధంగా వ్యవహరిస్తోందన్నారు.

## కిచెన్‌లో ఉన్నది కోట్లు పలికింది



చాన్నాళ్లు ఫ్రాన్స్‌లోని పారిస్‌లో ఓ ముసలావిడ ఇంటి వంటగదిలో ఉన్న అరుదైన పెయింటింగ్ ఇది. జూన్‌లో ఆ ఇంటి వస్తువుల విలువను లెక్కిస్తుండగా ఈ పెయింటింగ్ ప్రాముఖ్యత బయటపడింది. పాశ్చాత్య చిత్రకళకు ఆద్యుడిగా భావించే 13వ శతాబ్దికి చెందిన సిమబూ గీసిందీ చిత్రం. ఆదివారం పారిస్‌లో దీన్ని వేలంవేయగా రూ.190 కోట్లు (2.7 కోట్ల డాలర్లు) ధర పలికింది.

## జవాన్లతో మోదీ దీపావళి

**జమ్మూ:** దీపావళి వేడుకలను ప్రధాని మోదీ ఆదివారం జమ్మూకశ్మీర్‌లోని దేశ సరిహద్దుల సమీపంలో జవాన్లతో కలిసి జరుపుకున్నారు. ఆదివారం ఉదయం ఎల్‌వోసీకి సమీపంలోని రాజౌరి ఆర్మీ బ్రిగేడ్ ప్రధాన కార్యాలయానికి చేరుకున్న ఆయన అక్కడున్న వెయ్యిమంది సైనికులకు పండగ శుభాకాంక్షలు తెలిపి, స్వీట్లు పంచారు. సైనికుల మాదిరిగా ఆర్మీ జాకెట్ ధరించిన ఆయన జవాన్లతో రెండు గంటలపాటు గడిపారని అధికారులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఎంతో కఠిన తరమైన నిర్ణయాలను సైతం ధైర్యసాహసాలతోనే అమలు చేయగలిగామని ఈ సందర్భంగా అన్నారు. దీపావళి పండగను కుటుంబసభ్యులతో జరుపుకోవాలని ప్రతి ఒక్కరూ ఆకాంక్షిస్తారని, అందుకే, తన కుటుంబంలాంటి జవాన్లతో గడిపేందుకే ఇక్కడి వచ్చానన్నారు. అమర జవాన్లకు నివాళులర్పించారు. ప్రధాని వెంట ఆర్మీ చీఫ్ జనరల్ రావత్ ఉన్నారు. 2014లో ప్రధాని పదవి చేపట్టినప్పటి నుంచి మోదీ ఏటా సరిహద్దుల్లో జవాన్లతో గడుపుతున్నారు.

## క్లుప్తంగా...

### దీపికా ఫాలోవర్స్ 4 కోట్లు



**సాక్షి, న్యూఢిల్లీ:** బాలీవుడ్ స్టార్ కథానాయిక దీపికా పదుకుణె ఇన్‌స్టాగామ్‌లో అరుదైన రికార్డు సొంతం చేసుకుంది. ఇన్‌స్టాలో ఆమెను అనుసరిస్తున్న అభిమానుల సంఖ్య సోమవారం 4 కోట్లకు చేరుకుంది. తన వ్యక్తిగత, వృత్తి జీవిత విషయాలను ఎప్పటికప్పుడు ఇన్‌స్టాలో పంచుకొనే ఈ బాజీరావ్ 'మస్తానీ' అనేక మంది అభిమానులను సంపాదించుకుంది. అలా దీపికను అనుసరిస్తున్న వారి సంఖ్య 4 కోట్లకు చేరకుంది. ఇదే వరుసలో 4.5 కోట్ల మంది ఫాలోవర్స్‌తో ప్రియాంకా చోప్రా బాలీవుడ్‌లో అందరికంటే ముందుంది. శ్రద్ధాకపూర్‌ను 3.5 కోట్ల మంది అనుసరిస్తున్నారు. ప్రధాని మోదీ ఇటీవల 3 కోట్ల మార్కుకు చేరుకున్నారు.

### ఢిల్లీలో మహిళల భద్రతకు కీలక నిర్ణయం

**బస్సుల్లో 10వేల మంది మార్షల్స్**

**న్యూఢిల్లీ:** మహిళల భద్రత పెంపొందించే దిశగా ఢిల్లీ ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. బస్సుల్లో మహిళల భద్రత కోసం మార్షల్స్ సంఖ్యను దాదాపు 10వేలు పెంచుతున్నట్లు ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ప్రకటించారు. ఢిల్లీలో ప్రభుత్వ వాహనాల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించాలన్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) పథకంలో భాగంగా కేజ్రీవాల్ ఈమేరకు నిర్ణయం తీసుకున్నారు. 'ఈరోజు నేను మీకు ప్రభుత్వ వాహనాల్లో మహిళల భద్రత బాధ్యతను అప్పగిస్తున్నాను. దీని వల్ల వారు బస్సుల్లో తమ ఇంటిలో ఉన్నట్లు భావించి ప్రయాణం చేస్తారు'అని సోమవారం త్యాగరాజ స్టేడియంలో నూతనంగా నియామకమైన మార్షల్స్‌నుద్దేశించి మాట్లాడారు. మహిళల పట్ల ఎవరైనా అనుచితంగా ప్రవర్తిస్తే సహించకూడదని స్పష్టంచేశారు. ప్రస్తుతం ఢిల్లీలో 3,400 మంది మార్షల్స్ ఉన్నట్లు కేజ్రీవాల్ పేర్కొన్నారు.

### ఎయిమ్స్‌కు చిదంబరం



**న్యూఢిల్లీ:** తీహార్ జైల్లో ఉన్న ఆర్థిక శాఖ మాజీ మంత్రి చిదంబరానికి కడుపునొప్పి రావడంతో ఎయిమ్స్‌కు సోమవారం తరలించారు. చికిత్స ముగిశాక తిరిగి జైలుకు తీసుకెళ్లారు. ప్రస్తుతం ఆయన ఈడీ పర్యవేక్షణలో ఐఎన్‌ఎక్స్ కేసుకు సంబంధించి తీహార్ జైల్లో ఉన్నారు. మొదట ఆర్‌ఎమ్మెల్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం సాయంత్రం సమయంలో ఎయిమ్స్‌కు పంపించి, అక్కడి వైద్యులతో చికిత్స చేయించారు. ఇదంతా ముగిశాక ఏడు గంటలప్పుడు తిరిగి జైలుకు తీసుకెళ్లారు. ఆయనకున్న సమస్యను డాక్టర్లు వెల్లడించడంలేదు.

# హరియాణా సీఎంగా ఖట్టర్ ప్రమాణం

**చండీగఢ్:** హరియాణాలో బీజేపీ–జేజేపీల సంకీర్ణ ప్రభుత్వం కొలువుదీరింది. రాష్ట్ర గవర్నర్ సత్యదేవ్ నారాయణ్ ఆర్య ఆధ్వర్యంలో ముఖ్యమంత్రిగా ఖట్టర్, ఉప ముఖ్యమంత్రిగా దుష్యంత్ చౌతాలాలు ఆదివారం ప్రమాణస్వీకారం చేశారు. వీరిలో ఖట్టర్ రెండో సారి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించగా, దుష్యంత్ మొదటిసారి ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. మరికొద్ది రోజుల్లో మంత్రివర్గ కూర్పు చేపట్టనున్నారు. ఇటీవలే జైలు నుంచి సెలవు మీద బయటకు వచ్చిన దుష్యంత్ చౌతాల తండ్రి అజయ్ చౌతాలా, ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచిన దుష్యంత్ తల్లి నైనా చౌతాలాలు కూడా హాజరయ్యారు. ప్రమాణ స్వీకారాల అనంతరం సీఎం ఖట్టర్, డిప్యూటీ సీఎం దుష్యంత్‌లు మీడియాతో మాట్లాడారు. సంకీర్ణ ప్రభుత్వం స్థిరమైన ప్రభుత్వంగా నిలుస్తుందని దీమా వ్యక్తం చేశారు.



ప్రమాణస్వీకారంచేసిన ఖట్టర్, దుష్యంత్

# బ్రెగ్జిట్ గడువు జనవరి 31

**పొడిగింపునకు ఈయూ ఆమోదం**

**లండన్/బ్రసెల్స్:** బ్రిటన్ పార్లమెంట్‌లో బ్రెగ్జిట్ ఒప్పందం ఆమోదం పొందడంలో తలెత్తిన అనిశ్చితి నేపథ్యంలో మరో కీలక పరిణామం సంభవించింది. బ్రిటన్‌కు మరింత వెసులుబాటు ఇచ్చేందుకు యూరోపియన్ యూనియన్(ఈయూ) అంగీకరించింది. బ్రెగ్జిట్‌పై ఈనెలాఖరు వరకు ఉన్న గడువును మరో మూడు నెలలపాటు అంటే వచ్చే ఏడాది జనవరి 31వ తేదీ వరకు పొడిగించేందుకు ఈయూ సుముఖత వ్యక్తం చేసింది. ఈ నిర్ణయంపై యూనియన్‌లోని 27 సభ్య దేశాలు సూత్రప్రాయంగా అంగీకారం తెలిపాయని ఈయూ అధ్యక్షుడు డొనాల్డ్ టస్క్ తాజాగా ట్విట్టర్‌లో ప్రకటించారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలను త్వరలోనే రాత పూర్వకంగా వెల్లడిస్తామన్నారు. బ్రెగ్జిట్ ఒప్పందాన్ని బ్రిటన్ పార్లమెంట్ ఆమోదించిన పక్షంలో సాధ్యమైనంత త్వరగా..తాజాగా ప్రకటించిన గడువులోగానే ఈయూతో తెగదెంపులు చేసుకునే అవకాశం బ్రిటన్‌కు ఉందన్నారు. బ్రెగ్జిట్ గడువు పొడిగింపుపై ఈయూ పార్లమెంట్ చర్చించి, ఆమోదం తెలపాలంటే సత్వరమే దీనిపై బ్రిటన్ లాంఛనప్రాయంగా ఆమోదముద్ర వేయాల్సి ఉందని తెలిపారు. బ్రెగ్జిట్ పొడిగింపుపై ఈయూ ఇప్పటికే సానుకూలత వ్యక్తం చేసింది. ప్రస్తుతం జరుగుతున్న ఈయూ పార్లమెంట్ సమావేశాల్లో దీనిపై చర్చించి, రెండు రోజుల్లో సానుకూల నిర్ణయం వెలువరించనుంది. దీని ప్రకారం.. జాన్సన్ ప్రభుత్వం తమతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని పార్లమెంట్ నవంబర్ 30, డిసెంబర్ 31, జనవరి 31వ తేదీల్లో ఎప్పుడు ఆమోదించినా.. ఆ వెంటనే బ్రెగ్జిట్ అమల్లోకి వస్తుందని స్పష్టం చేయనుంది. డిసెంబర్ 12వ తేదీన సాధారణ ఎన్నికలు జరపాలంటూ ప్రవేశపెట్టనున్న తీర్మానంపై వచ్చే సోమవారం పార్లమెంట్‌లో ఓటింగ్ జరగనుంది.



# బోరుబావిలోనే బాలుడు

**100 అడుగుల లోతుకి జారినట్లు తెలిపిన అధికారులు**

**సాక్షి ప్రతినిధి, చెన్నై:** తమిళనాడులో బోరు బావిలో పడ్డ మూడేళ్ల బాలుడు సుజిత్‌ను రక్షించేందుకు సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. 72 గంటలుగా బోరుబావిలోనే ఉన్న బాలుడు.. ప్రస్తుతం 100 అడుగుల లోతులో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. బోరుబావికి సమాంతరంగా మరో గుంత తవ్వేందుకు ఆదివారం నుంచి ప్రయత్నిస్తుండగా.. తాజాగా ఇందుకోసం జర్మన్ నుంచి తెచ్చిన అత్యాధునిక హెవీ డ్రిల్లింగ్ మెషీన్‌ను ఉపయోగిస్తున్నట్లు రెవెన్యూ విభాగంకమిషనర్ రాధాకృష్ణన్ తెలిపారు. కెమెరాల ద్వారా పరిశీలించినప్పుడు బాలుడిపై కొంత మట్టి పడినట్లు ఉందని మరో ఉన్నతాధికారి తెలిపారు. తమిళనాడులోని తిరుచిరాపల్లి జిల్లా మనప్పారై సమీపం నాడుకాట్టుపట్టికి చెందిన ప్రిట్లో ఆరోగ్యరాజ్ (40), కళామేరీ (35) దంపతుల కుమారుడు సుజిత్ శుక్రవారం సాయంత్రం ఆడుకుంటూ చిన్నారి బోరుబావిలో పడిన విషయం తెలిసిందే. 'సుజిత్‌ను సురక్షితంగా బయటకు తీసుకొచ్చేందుకు అన్ని ప్రయత్నాలు జరుగుతున్నాయి. బాలుడు క్షేమంగా బయటకు రావాలని ప్రార్థిస్తున్నాను. సహాయక చర్యలపై సీఎంతో మాట్లాడాను'అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ట్విట్టర్‌లో పేర్కొన్నారు.



బావిలో బాలుడి తాజా చిత్రం

# కశ్మీర్‌లో ఉగ్రదాడులు

**శ్రీనగర్:** కశ్మీర్‌లో ఉగ్రవాదులు మరో ట్రక్ డ్రైవర్‌ను పొట్టనబెట్టుకున్నారు. ఉదంపూర్ జిల్లాలోని కట్రాకు చెందిన నారాయణ్ దత్‌ను సోమవారం సాయంత్రం తుపాకీతో కాల్చి చంపారు. కాల్పుల శబ్దం వినగానే దగ్గర్లోనే ఉన్న సీనియర్ పోలీసు ఘటనా స్థలానికి చేరుకొని దగ్గర్లోనే ఉన్న మరో ఇద్దరు ట్రక్ డ్రైవర్లను కాపాడారు. దక్షిణ కశ్మీర్‌లోని అనంతనాగ్ జిల్లా బిజ్‌బెహరాలో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. అనంతరం పోలీసులు ఘటన జరిగిన ప్రాంతంలో సోదాలు చేపట్టారు. ఆర్టికల్ 370 రద్దు చేసిన నాటి నుంచి ఇప్పటి వరకూ మొత్తం నలుగురు ట్రక్ డ్రైవర్లను ఉగ్రవాదులు కాల్చి చంపడం గమనార్హం. మరణించిన వారంతా కశ్మీరీయేతర ప్రాంతాలకు చెందినవారే.

**కశ్మీర్‌లో గ్రెనేడ్ దాడి..**

కశ్మీర్‌లో ఉగ్రవాదులు గ్రెనేడ్ దాడి చేశారు. నగరంలోని ఓ బస్‌స్టాప్ వద్ద వేచి ఉన్న జనాలే లక్ష్యంగా గ్రెనేడ్ విసిరారు. ఈ పేలుడులో 20 మంది ప్రజలు గాయపడ్డారని పోలీసులు వెల్లడించారు. వీరిలో ఆరుగురికి తీవ్రగాయాలయ్యాయి. పేలుడు జరిగిన చుట్టుపక్కల్లో ప్రాంతాల్లో సోదాలు మొదలుపెట్టారు.

# ఐసిస్ చీఫ్ బాగ్దాదీ హతం

- సిరియాలో అమెరికా 'ఆపరేషన్'
- వైట్‌హౌస్ నుంచి వైమానిక దాడిని ప్రత్యక్షప్రసారంలో చూసిన ట్రంప్
- కుక్కచావు చచ్చాడన్న ట్రంప్

**వాషింగ్టన్:** ఉగ్రమార్గంలో ఇస్లాం రాజ్యస్థాపనే లక్ష్యంగా ప్రపంచవ్యాప్తంగా దాడులకు తెగబడుతున్న ఐసిస్ అంతర్జాతీయ ఉగ్రసంస్థ వ్యవస్థాపకుడు అబు బకర్ అల్ బాగ్దాదీ(48)ను అమెరికా సేనలు సిరియాలో అంతమొందించాయి. దాదాపు మూడు సంవత్సరాలుగా అమెరికా సైన్యం కన్నుగప్పి దాడులకు పాల్పడుతున్న మోస్ట్‌వాంటెడ్ ఉగ్రవాది బాగ్దాదీ.. వాయవ్య సిరియాలోని ఇడ్లిబ్ ప్రావిన్స్‌లోని బరీషా గ్రామంలోని అమెరికా సేనలు చేసిన 'రహస్య దాడి' సందర్భంగా చనిపోయాడని వాషింగ్టన్‌లోని వైట్‌హౌస్‌లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. బాగ్దాదీ మరణించాక ఆ దాడి ప్రాంతం నుంచి అత్యంత విలువైన డాక్యుమెంట్లను అమెరికా సేనలు స్వాధీనంచేసుకున్నాయి. ఐసిస్ ఉగ్రసంస్థ కార్యకలాపాలు, భవిష్యత్ కార్యాచరణ, అంతర్జాతీయ సంబంధాల వివరాలు వాటిలో ఉన్నట్లు సమాచారం. ట్రంప్, అమెరికా సైనికాధిపతుల పర్యవేక్షణలో జరిగిన ఘటన క్షణ క్షణం నాటకీయంగా సాగినవైనమిది. బాగ్దాదీ స్థావరం ఇటీవల ఇరాక్ నుంచి వాయవ్య సిరియాకి మారింది. ఒక నెలక్రితం కుర్దుల నుంచి కచ్చితమైన సమాచారమందింది. ఆ గ్రామంలోనే బాగ్దాదీ ఉంటున్నట్లు రెండు వారాల క్రితం అమెరికా సేనలు నిర్ధారించుకున్నాయి. వాయవ్య సిరియాలోని స్థావరంపై దాడికి మూడు రోజుల ముందే ట్రంప్‌కి సమాచారం ఉంది. రష్యా, ఇరాక్, టర్కీ దేశాల అనుమతితో వాయు సేనలు సాగాయి.



బాగ్దాదీపై దాడి జరిపిన ప్రాంతం



వైట్‌హౌస్‌లో దాడి వీడియో ప్రత్యక్షప్రసారాన్ని చూస్తున్న అధ్యక్షుడు ట్రంప్, ఉపాధ్యక్షుడు పెన్స్, జాతీయ భద్రతా సలహాదారు రాబర్ట్

**ఆపరేషన్ కైలా ముల్లర్**

బాగ్దాదీని పట్టుకోవడం కోసం బాగ్దాదీ చేతిలో తీవ్ర చిత్రహింసలపాలై, అత్యాచారానికి గురై హతమైన అమెరికా మానవహక్కుల కార్యకర్త 26 ఏళ్ళ కైరా ముల్లర్ పేరుని ఈ ప్లాన్‌కి పెట్టారు.

**అసలేం జరిగింది?**

వర్జీనియాలో ఒక రౌండ్ గోల్ఫ్ ఆట ముగించుకొని సరిగ్గా సాయంత్రం 5 గంటలకు వైట్ హౌస్‌లోని 'సిట్యుయేషన్ రూమ్'కి అధ్యక్షుడు ట్రంప్ చేరుకున్నారు. అమెరికా ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్, రక్షణ మంత్రి మార్క్ ఎస్పర్, అమెరికా భద్రతా సలహాదారు రాబర్ట్ ఓబ్రీన్‌లు సిట్యుయేషన్ రూమ్‌కి వచ్చారు. బాగ్దాదీపై సైనిక రహస్యదాడిని వీడియోలో వీక్షించేందుకే సిద్ధమయ్యారు.

**గంటల్లో అంతా బూడిద**

గ్రామంపై చక్కర్లు కొడుతున్న హెలికాప్టర్లను గ్రామస్తులు గమనించారు. అమెరికా హెలికాప్టర్లు, సైన్యాన్ని చూసిన ఉగ్రవాదులు వారిపై కాల్పులు జరిపారు. వెంటనే వారందరినీ అమెరికా సైనికులు మట్టుబెట్టారు. ఆ తర్వాత బాగ్దాదీ ఉంటున్న ఇంటి ముఖద్వారాన్ని బాంబులతో పేల్చారు. సైన్యం దాడి విషయం తెల్సి బాగ్దాదీ వెంటనే రహస్య సొరంగ మార్గం ద్వారా భూగృహం(బంకర్)లోకి చొరబడ్డాడు. ఆయనను బంకర్ చివరివరకు అమెరికా సైనిక సేనలు, సైనిక శునకాలు తరిమాయి. బయటపడే మార్గం లేకపోవడంతో తన శరీరానికున్న బాంబుల జాకెట్‌ను పేల్చుకుని బాగ్దాదీ చనిపోయాడు.

## మరణించింది బాగ్దాదేనా?

గతంలో అతను చనిపోయాడన్న పుకార్లు వచ్చాయి. ఈసారి ఆ అనుమానానికి తావులేకుండా శాస్త్రీయంగా నిర్ధారించుకోవాలనుకున్నారు. తునాతునకలైపోయిన శరీరం తప్ప అక్కడేం మిగల్లేదు. ఆ శరీర అవశేషాలను అక్కడ సైన్యం సిద్ధం చేసిన తాత్కాలిక వైద్యపరీక్ష ల్యాబ్‌కి తరలించారు. డీఎన్‌ఏ పరీక్షలు జరిపి ఆ మృతదేహపు అవశేషాలు బాగ్దాదీవేనని నిర్ధారించుకున్నారు.

## పిచ్చివాడిలా అరుచుకుంటూ..

అమెరికా సైనికులు చుట్టుముట్టడంతో ప్రాణభయంతో బాగ్దాదీ అరుచుకుంటూ, ఏడ్చుకుంటూ పరిగెత్తాడని ట్రంప్ వెల్లడించారు. అమెరికా సైనిక కే9 శునకాలు తరుముతుండడంతో చివరకు సొరంగంలోని బంకర్ చివరి అంచులకు చేరి తన ముగ్గురు పిల్లలతో సహా బాంబులతో పేల్చుకుని కుక్కచావు చచ్చాడని ట్రంప్ వ్యాఖ్యానించారు.

సాక్షి
మంగళవారం, అక్టోబర్, 29

# బాగ్దాదీ 'ఆపరేషన్'!

కరడుగట్టిన ఉగ్రవాద సంస్థ ఇస్లామిక్ స్టేట్(ఐఎస్) అధినాయకుడు, ఉగ్రవాది అబూ బకర్ అల్ బాగ్దాదీ కోసం అమెరికా అయిదారేళ్లుగా సాగిస్తున్న వేట ముగిసింది. అతగాడిని సిరియాలో తమ దళాలు వెంటాడి ఓ సొరంగంలో చిక్కుకున్నాక మట్టుబెట్టాయని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆదివారం ప్రకటించారు. ముందు ట్విటర్ ద్వారా ఏకవాక్య ప్రకటన చేసి, ఆ తర్వాత మీడియా సమావేశం ద్వారా బాగ్దాదీ మృతి వివరాలను ఆయన వెల్లడించారు. వీక్షకుల్లో ఉత్కంఠ రేపేందుకు చానెళ్లు సస్పెన్స్ దట్టించి మధ్యమధ్యలో విడుదల చేసే టీజర్ల మాదిరి ఆ ట్వీట్ ఉంది. తమ బలగాల చర్య పర్యవసానంగా ఐఎస్ నడ్డి విరచగలిగామని ట్రంప్ సంతోషపడుతున్నారు. ఆ మాటెలా ఉన్నా రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిత్వాన్ని మళ్లీ గెలుచుకోవాల్సిన సమయం దగ్గర పడుతున్న వేళ బాగ్దాదీ మరణం ఖచ్చితంగా ఆయనకు కలిసిరావొచ్చు. ఇరాక్ తదితర దేశాల్లో అనేకానేక దురాగతాలకూ, దుర్మార్గాలకూ కారణమైన సంస్థ అధినాయకుడు మరణించాడంటే సహజంగానే ప్రపంచమంతా ఊపిరి పీల్చుకుంటుంది. అయితే ఈ సందర్భంగా ఒక జర్మన్ పాత్రికేయుడు యుర్గన్ టోడెన్ హ్యోపర్‌కి అయిదేళ్లక్రితం ఎదురైన అనుభవాన్ని గుర్తుకు తెచ్చుకోవాలి. ఇరాక్‌లోని మోసుల్‌లోఐఎస్ ముఠాలో కొందరిని కలిసి బాగ్దాదీని ఇంటర్వ్యూ చేయడానికి అవకాశం ఇవ్వాలని కోరిన ఆయనతో 'అతను కేవలం వ్యక్తిమాత్రుడు. విద్యావంతులు, నాయకులు సభ్యులుగా ఉండే ఒక మండలి ఆయన్ను నాయకుడిగా ఉంచింది. ఆయన మరణిస్తే ఆ మండలి మరొకరిని ఆ స్థానంలో ప్రతిష్టిస్తుంది. మీరు కలవదల్చుకుంటే మండలి సభ్యుల్ని కలవండి' అని సలహా ఇచ్చారట! కనుక బాగ్దాదీ మరణంతో ఐఎస్, దాని దుర్మార్గాలు కనుమరుగవుతాయని భావించడం దురాశే. ఒకపక్క దురాగతాలకు పాల్పడుతున్నవారిపై చర్యలు కొనసాగిస్తూనే.... ఆ సంస్థ పుట్టుకకూ, అది పుంజుకోవడానికి ఏ కారణాలు దోహదపడ్డాయో గుర్తించడం, అందుకు కారకులెవరో తేల్చడం, వారిపట్ల ఎలా వ్యవహరించాలో నిర్ణయించడం ఇప్పుడు ప్రపంచ ప్రజల కర్తవ్యం. లేనట్టయితే బాగ్దాదీలాంటివారు మున్ముందు కూడా పుట్టుకొస్తూనే ఉంటారు. ఊహకందని మారణహోమాలు సృష్టిస్తూనే ఉంటారు.

సరిగ్గా ఎనిమిదేళ్లక్రితం అల్ కాయిదా నాయకుడు బిన్ లాడెన్‌ను అమెరికా మెరైన్లు మట్టుబెట్టినప్పుడు కూడా అప్పటి అమెరికా అధ్యక్షుడు ఒబామా మీడియా సమావేశం ద్వారా ప్రపంచానికి వెల్లడించారు. అయితే అందులో ట్రంప్ ప్రదర్శించినంత నాటకీయత లేదు. ఆయన ఒక ప్రకటన చదవబోతున్నట్టు తెలుసుకున్న వెంటనే అప్పటికప్పుడు చానెళ్లు అన్నిటినీ నిలిపి దాన్ని ప్రత్యక్ష ప్రసారం చేశాయి. ఒబామా ప్రకటనలో అవసరమైన వివరాలేమీ లేవు. కానీ ట్రంప్ తీరు వేరు. ఆపరేషన్ మొత్తం ఎలా జరిగిందో పూసగుచ్చినట్టు చెప్పారు. ఆయన మాటలు జాగ్రత్తగా విన్న ప్రతి ఒక్కరూ అది కళ్లముందే జరిగిందన్న భ్రాంతికి లోనుకావడం ఖాయం. అమెరికన్ బలగాలు గుర్తించి కాల్పులు మొదలెట్టిన వెంటనే బాగ్దాదీ ముగ్గురు పిల్లల్ని తీసుకుని లబోదిబోమంటూ ఒక సొరంగంలో దూరిన వైనం, ఆ సొరంగానికి బయటకుపోయే మార్గం లేకపోవడం గురించి ట్రంప్ వివరించారు. అనంతరం పాత్రికేయులడిగిన సందేహాలన్నిటికీ జవాబిచ్చారు. మొత్తం నలభై నిమిషాలపాటు ట్రంప్ ప్రసంగించారు. బాగ్దాదీ తొలిసారి ప్రపంచానికి పరిచయమైననాటికీ, ఇప్పుడు మరణించేనాటికీ పరిస్థితుల్లో వచ్చిన వ్యత్యాసాన్ని గమనిస్తే ఐఎస్ ఉత్థానపతనాల గురించి స్థూలంగా అర్థమవుతుంది. 2010లో ఐఎస్ ఆవిర్భావాన్ని ప్రకటించినప్పుడు అది ప్రపంచ ముస్లింలందరికీ మార్గదర్శకత్వంవహిస్తుందని బాగ్దాదీ చెప్పుకున్నాడు. కానీ ఇరాక్, ఇరాన్, సిరియా, అఫ్ఘానిస్తాన్ వగైరాల్లో అమెరికా అనుసరిస్తున్న ధోరణుల్ని గట్టిగా వ్యతిరేకించే ప్రపంచ ముస్లిం ప్రజానీకంలో సైతం అతనికి పెద్దగా మద్దతు లభించింది లేదు. సరిగదా కార్యకలాపాలు సాగించిన ప్రాంతాల్లోనే అది క్షీణించింది. తన చుట్టూ ఉండేవారిలో ఎవరిని నమ్మాలో, ఎవరిని నమ్మకూడదో తెలియని స్థితికి అతను చేరుకున్నాడు. అల్ కాయిదా, ఐఎస్ మొదట్లో కలిసి పనిచేసినా 2013లో తెగదెంపులు చేసుకున్నాక ఆ రెండు సంస్థలూ పరస్పరం ఆరోపణలు చేసుకున్నాయి. అమెరికాకు సాగిలబడిన ద్రోహులు మీరంటే మీరని నిందించుకున్నాయి. పిరికిపందలని తిట్టుకున్నాయి. కానీ అల్ కాయిదా అనుబంధ సంస్థ హయత్ తహ్రీర్ అల్ షామ్(హెచ్‌టీఎస్)కు పలుకుబడి ఉన్న సిరియాలోని అద్లిబ్ ప్రాంతంలో ఇప్పుడు బాగ్దాదీ పట్టుబడటాన్ని గమనిస్తే చిట్టచివరిలో అతని స్థితేమిటో అర్థం చేసుకోవచ్చు. నిజానికి ఖలీఫాగా తనను తాను ప్రకటించుకున్నాక అతను నేరుగా దానికి నాయకత్వంవహించింది తక్కువ. పైగా దానికంటూ ప్రత్యేకించి ఒక స్థావరం లేదు.

2003లో అమెరికా దురాక్రమించే సమయానికి ఇరాక్ ఎంతో ప్రశాంతంగా ఉండే సోషలిస్టు, సెక్యులర్ రాజ్యం. రాజ్యాంగంలో ఇస్లామ్‌ను అధికార మతంగా ప్రకటించడానికి ఆ దేశాధ్యక్షుడు సద్దాంహుస్సేన్ నిరాకరించారు. అలాంటి దేశాన్ని వల్లకాడుగా మార్చి అప్పటికి పాఠశాల చదువు కూడా పూర్తిచేయని బాగ్దాదీ లాంటివారిని ఉగ్రవాదులుగా రూపాంతరం చెందే స్థితికి చేర్చింది అమెరికాయే. ఐఎస్ బాధితుల్లో అత్యధికులు ముస్లింలే. ఈ వాస్తవాన్ని దాచి అది మత సంస్థగా చిత్రించడం పాశ్చాత్య మీడియా అవగాహన లేమి పర్యవసానం. సిరియా అధ్యక్షుడు అసద్‌ను పదవీచ్యుతుణ్ణి చేయడం కోసం యథేచ్ఛగా డాలర్లు, ఆయుధాలు కుమ్మరించి, ఎందరు మొత్తుకుంటున్నా వినక ఐఎస్‌ను పెంచి పోషించిన అమెరికాయే ఇప్పుడు బాగ్దాదీ మరణంలో తన విజయాన్ని వెదుక్కుంటున్న తీరు విడ్డూరం. కనీసం ఇప్పటికైనా తన చేష్టలు ఎలాంటి పర్యవసానాలకు దారితీస్తున్నాయో గ్రహించి తీరు మార్చుకోవడం అమెరికా బాధ్యత. ఆ బాధ్యతను అది గుర్తించేలా చేయడం ప్రపంచ ప్రజానీకం కర్తవ్యం.

### గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు కార్తీక మాసం, తిథి శు.పాడ్యమి ఉ.7.42 వరకు, తదుపరి విదియ నక్షత్రం విశాఖ రా.2.10 వరకు, తదుపరి అనూరాధ, వర్జ్యం ఉ.8.28 నుంచి 10.01 వరకు, దుర్ముహూర్తం ఉ.8.17 నుంచి 9.03 వరకు, తదుపరి రా.10.28 నుంచి 11.18 వరకు అమృతఘడియలు... సా.5.43 నుంచి 7.14 వరకు.

**సూర్యోదయం :** 6.01
**సూర్యాస్తమయం:** 5.28
**రాహుకాలం :** ప. 3.00 నుంచి 4.30 వరకు
**యమగండం :** ఉ.9.00 నుంచి 10.30 వరకు

# అమెరికా అగ్రవాదమే ఈ ఉగ్రవాదం!



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

''అబద్ధాల మీద ఆధారపడి యుద్ధాల ద్వారా అమెరికా లక్షలాది ప్రజల్ని చంపేసిన మాట నిజమే. ఇందుకు గాను అమెరికా 8 ట్రిలియన్ డాలర్లు (సుమారు రూ. 566 లక్షల కోట్లు) ఖర్చు చేయవలసి వచ్చింది.''
– అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్
ఒప్పుకోలు : అమెరికా 'ఇన్ఫర్మేషన్ క్లియరింగ్ హౌస్'' (ఐసీహెచ్) సమాచారం: బిల్ వాన్ ఆకెన్; 10–10–2019

**'సిరియాలో తిష్ట వేసిన ఇస్లామిక్ స్టేట్ అగ్రనాయకుడు అబూ బక్రాలా బాగ్దాదీ అమెరికా సైన్యం జరిపిన దాడిలో కుక్కచావు చచ్చాడు, పిరికివాడిలా చచ్చాడు. డీఎన్ఏ పరీక్ష ద్వారా అతడు బాగ్దాదీ అని చెబుతున్నారు' (అసోసియేటెడ్ ప్రెస్). కానీ హతమైంది బాగ్దాదీయేనని ప్రెసిడెంట్ ట్రంప్ ఒక మూవీ చూస్తున్నట్లు ఓ ప్రకటనలో ధృవీకరించాడు. కానీ బాగ్దాదీని వేటాడటానికి సైనికులు సహాయం తీసుకుంది డాగ్ స్క్వాడ్‌కి చెందిన ఒక కుక్కనే అన్న సంగతి ట్రంప్ మరిచిపోయాడు. కారణం.. పాశవిక హింసాప్రియుడు ట్రంప్. ''నీవు నేర్పిన విద్యయే నీరజాక్ష'' అన్నట్లు 26వ తేదీన చంపామని ట్రంప్ ఉద హరించిన బాగ్దాదీ ఎవరో కాదు. మీరు పెంచి పోషించిన వ్యక్తే సుమా అని కామన్ డ్రీమ్స్ సంస్థ తరపున సీఎన్‌బీసీ రిపోర్టర్ జాన్ హార్వుడ్ ప్రకటించారు (27–10–2019). ఇరాన్ నాయకులు కూడా అలానే ప్రకటించారు.**

ఈ గాథలు, ప్రపంచ ఘటనలు, అమెరికా నాయకస్థానంలో ఉన్న వలస సామ్రాజ్య వాద పాలకుల చేష్టలు, ప్రకటనలు గమనిస్తూంటే, ప్రపంచ ఉగ్రవాద ప్రమాదం గురించిన వీరి అంచనాలు ఒకరకంగా ఉంటూ, ఉగ్రవాద నిర్మూలన పేరిట నేడు జరుగుతున్నది అమెరికా అగ్రవాదమే అనిపిస్తోంది. ఇంకా స్పష్టంగా చెప్పుకోవాలంటే, కొన్నేళ్ల క్రితం బిన్ లాడెన్ పేరిట ప్రపంచవ్యాప్తంగా అమెరికా–బ్రిటన్‌లు జరిపిన వేటకు, ఆ ముసుగులో అఫ్ఘానిస్తాన్, ఇరాక్, ఇరాన్‌ల మీద జరిపిన పాశవిక దాడులకు ఇటీవల సిరియాలో జోక్యం దారీ వేటకు ఎత్తుగడలు, వ్యూహాలన్నీ రిపబ్లికన్, డెమోక్రాటిక్ పార్టీల నాయకుల కనుసన్నలలోనే జరుగుతున్నాయని పైన తెల్పిన ట్రంప్ ప్రకటనే (అబద్ధాలపై ఆధారపడి యుద్ధాలను అమెరికా నిర్వహిస్తోందని) చెప్పక చెబుతోంది! బాగ్దాదీని అంతం చేశామని ప్రకటించిన ట్రంప్ తీరు చూస్తే సామ్రాజ్యవాద పాలకులే కాదు.. కొన్ని దేశాల పాలకులు కూడా ఎన్నికలలో విజయావకాశాలను పెంచుకునేందుకు కూడా ఎన్నికలకు కొద్ది నెలల ముందు నుంచి ఇరుగు పొరుగు మీదకో లేదా తమకు పడని దేశాల మీదకో యుద్ధకాహళులూది, ఉద్రిక్తతలు పెంచడానికి వెనుదీయరని గత చరిత్రే కాదు, నడుస్తున్న చరిత్రకూడా దాఖలాలుగా ఉన్నాయి.

ట్రంప్ ఇంత సీరియస్‌గా బాగ్దాదీ చావు గురించి అంత హడావుడిగా చేసిన ప్రకటన ఆధారాల్ని పాశ్చాత్య పరిశీలకులు, కొన్ని పత్రికలు ప్రశ్నిస్తున్నాయి. అవి: 1. కొన్ని నెలల్లో రానున్న అధ్యక్ష ఎన్నికల పూర్వ రంగంలో ఇటీవల ట్రంప్ రష్యా, చైనాల పైన పొంతన లేని ఆరోపణలు చేస్తుండటం, తద్వారా అమెరికా ప్రతిష్టను దిగజార్చడానికి నిరసనగా అమెరికా పార్లమెంటులో ట్రంప్‌కు వ్యతిరేకంగా అభిశంసన తీర్మానం రాబోవడం. 2. సిరియాలో అమెరికా, కుర్దిష్ అనుయాయులపై టర్కీ జరిపే దాడులకు దూరంగా ఉండటం కోసం సిరియా నుంచి అమెరికా సేనలను ఉపసంహరించుకోవాలని ట్రంప్ అకస్మాత్తుగా ప్రకటించడాన్ని రిపబ్లికన్, డెమోక్రాటిక్ పక్షాలు రెండూ విమర్శించడం. ఇందుకు అనుగుణంగా టర్కీ, కుర్దూల మధ్య యుద్ధవిరమణను ప్రకటిస్తున్నట్లు ట్రంప్ వెల్లడించ డమూ! ఇది ఇలా ఉండగా, బాగ్దాదీని ఖతం చేసినట్లు స్వయానా ట్రంప్ అకస్మాత్తుగా చేసిన ప్రకటనను స్వయానా అమెరికన్ సైనిక యుద్ధ తంత్ర కార్యాలయం (పెంటగన్) సైతం ధృవీకరించడానికి నిరాకరించింది. చివరకు 'ఆసులో గొట్టాం' మాదిరిగా చీమ చిటుక్కుమంటే చాలు

### రెండో మాట



విసుగూ విడుపూ లేకుండా ప్రచారం కోసం ప్రకటనలు విడుదల చేస్తూండే ట్రంప్ అధ్యక్ష ప్రాసాద సాధికార ప్రతినిధి హొగన్ గిడ్లీ సహితం నోరు మెదపకుండా అదంతా ట్రంపే చూసుకుంటాడులెమ్మని ముక్తసరిగా చెప్పాడు. పైగా బాగ్దాదీని అంతమొందించడానికి జరిగిన దాడి ప్రయత్నం 'జయ ప్రదమయిందా' అన్న ప్రశ్నకు దాడిని నిర్వహించానని చెప్పిన అధికారి కూడా వివరాలు తెల్పడానికి నిరాకరించాడు. ఇక సుప్రసిద్ధ ప్రపంచ వార్తా సంస్థ 'రాయిటర్స్' సంప్రదించిన అమెరికన్ అధికారులు కూడా నిజానిజాల గురించి వ్యాఖ్యానించడానికి నిరాకరించారు. ఇన్ని వైరుధ్యాల మధ్య బాగ్దాదీ 'హతం, ఖతం' వార్తలు విడుదలయ్యాయి. అందుకే, గతంలో '9/11' (2001–2002) నాటి అమెరికా జంట వాణిజ్య కేంద్ర భవన సముదాయంపై జరిగిన ఆకస్మిక దుర్మార్గపు దాడిలో 3,000 మంది ప్రాణాలు కోల్పోయినప్పుడు ఆ దాడికి వ్యూహకర్త, ఇస్లామిక్ ఉగ్రవాద నాయకుడు బిన్‌లాడెన్ స్వయంగా దాడికి కారకుడని ప్రచార ప్రకటన జార్జిబుష్ ప్రెసి డెంట్‌గా ఉన్న కాలంలో జరిగింది. కానీ, ఆ తర్వాత 1,500 మంది అంతర్జాతీయ ఖ్యాతి గడించిన ప్రసిద్ధ భవన నిర్మాణ ఇంజనీర్లు, స్ట్రక్చరల్ ఇంజనీర్లు, పలువురు శాస్త్రవేత్తలు, భౌగోళికంగా భవన పునాదుల నిర్మాణ సంబంధమైన వాస్తు శిల్పులు, సామాజిక శాస్త్ర వేత్తలతో ఏర్పడిన కమిటీ భేటీ జరిపి సమర్పించిన నివేదికలో న్యూయార్క్, వాషింగ్టన్ వ్యూహ కేంద్రాలపై దాడి చేసిన సివిలియన్ విమానాలు ఎక్కడివో కావు, అమెరికావేననీ, ఫ్లారిడా (అమెరికా)లోని సైనిక కేంద్రం నుంచి బయలు దేరినవేనని ప్రకటించారు.. అంతవరకూ అమెరికా ప్రజలు, ప్రపంచ ప్రజలూ అది ఉగ్రవాద మూకల దాడేనని నమ్మాల్సి వచ్చింది, విశ్వసించాల్సి వచ్చింది. ఆ విశిష్ట నిపుణుల సంఘం ఇప్పటికీ దాడి అనంతర వాస్తవాలను తవ్వి తీయడం మానలేదు సుమా! పైగా, ట్విన్ టవర్లపై దాడి, బిన్ లాడెన్‌పై దాడి, అతగాడి మృతి గురించి కూడా పరస్పర విరుద్ధ కథనాలు ఎన్నో ప్రచారంలో ఉన్నాయి. 2001 సెప్టెంబర్ 11న జంట వాణిజ్య సముదాయాలపై ఉగ్రవాద దురాగతం జరిగిందనీ, ఈ దాడిని నిర్వహించినవాడు బిన్‌లాడెన్ అనీ మనం నమ్ముతూ వస్తున్నాం. కానీ, ఆ లాడెన్ 2001 అక్టోబర్ 10న రావల్పిండి ఆసుపత్రిలో ఉన్నాడని కొన్ని పత్రికల్లో వార్తలు వచ్చాయి. అమెరికాలోని జంట వాణిజ్య సముదాయ భవనాలు కూలిపోయింది 2001 సెప్టెంబర్ 11న అనీ, 2001 సంవత్సరం మధ్యలో లాడెన్ దుబాయ్‌లోని అమెరికన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడనీ సీబీఎస్ న్యూస్ యాంకర్ డాన్ రాదర్ రాశాడు. ఇక 'న్యూయార్క్ టైమ్స్' అయితే, లాడెన్ మృతిని 2001 డిసెంబర్‌గా పేర్కొన్నది. అతణ్ణి ఖననం చేసింది అఫ్ఘానిస్తాన్ అని చెప్పింది. ఇక అమెరికా అయితే లాడెన్‌ను పట్టుకుని ఖతం చేసింది అబ్బాటోబాద్‌లో అని రాసింది. ఇన్ని వైరుధ్యాల మధ్య లాడెన్ వాస్తవాలు దోబూచులాడుతూ వచ్చాయి. అసలింతగా లాడెన్ వెనుక దాగివున్న అసలు రహస్యమేమిటి? అది అమెరికాకే తెలుసు. ఎందుకంటే ఆఫ్ఘనిస్తాన్‌లో ఏలుబడిలో ఉన్న సోషలిస్టు అనుకూల 'ప్రజాస్వామ్య' ప్రభుత్వాన్ని ఈ లాడెన్, అతని అనుయాయుల సహకారంతోనే ఆయుధాలిచ్చి అమెరికా కూలదోసింది. ఆ తర్వాత లాడెన్ తనకు 'ఏకు మేకై' పోయాడు కాబట్టి, అతణ్ణి హత మార్చాలి. లాడెన్‌ను ఖతం చేసిన అమెరికా అతని అస్థిపంజరం ఆధారంగా వరస వారీగా ఇరాక్, ఇరాన్, సిరియాలపై యథేచ్ఛగా దాడులు చేసి, ఆ దేశాల వాస్తు శిల్ప సంపదను దోచేసి అమెరికాకు తరలించుకుపోవడం మరపురాని సామ్రాజ్యవాద యుద్ధ సత్యాలు.

కనుకనే, సామాజిక చేతనాజీవులైన అసాంజే (వికీలీక్స్), అమెరికా యుద్ధతంత్ర వ్యవస్థలో జాతీయ భద్రతా దళ శాఖలో పనిచేసి కళ్లారా చూసిన ఘోరాలకు చలించిపోయి కాందిశీకుడై ప్రపంచ ప్రజలకు అమెరికా యుద్ధోన్మాద వ్యవస్థ స్వరూప స్వభావాలను ప్రాణాలకు తెగించి ఈరోజుదాకా ఎండగడుతూ వచ్చిన ఎడ్వర్డ్ స్నోడెన్ మరపురాని త్యాగశీలురుగా సజీవులై బాధలను భరిస్తూ మనకళ్ల ముందే అమెరికాకు చిక్కకుండా నిత్య సింహస్వప్నాలై వెలుగొందుతున్నారని మరవరాదు. 9/11 జంట వాణిజ్య సముదాయాల ఘోర కలికి అమెరికా పాలకులు ఎలా కారకులో నిరూపిస్తూ ప్రపంచ ప్రజలు ఎన్నటికీ మరవకూడని 'శాశ్వత రికార్డు' (పర్మనెంట్ రికార్డ్) పేరిట ఇటీవలనే (2019) ఒక ప్రసిద్ధ గ్రంథాన్ని రాశాడు స్నోడెన్. ''9/11 ఘోరకలి ఘటనలు ప్రతిచోట అగాథాలు సృష్టించాయి. కుటుంబాలలో ఛిద్రాలు, వివిధ వర్గాల ప్రజలు, సామాజికుల మధ్య విచ్ఛిన్నాలు, కమ్యూనికేషన్స్ విచ్ఛిత్తీ, ఉపరితలంపైనే కాదు, భూగర్భంలోనూ విచ్ఛిన్న శకలాలే''నని రాశాడు. ఈ స్వవినాశన చర్యకు ఫలితంగా అమెరికా చెప్పిన సమాధానం– పదిలక్షలమంది ప్రజల హత్యాకాండ అని రాశాడు (పేజి 77–78). అలాగే, 9/11 దుర్మార్గ ఘటన గురించి అమెరికా ప్రభుత్వం 'సాధికారిక నివేదిక' పేరిట (మిస్టీరియస్ కొలాప్స్ ఆఫ్ వరల్డ్ ట్రేడ్ సెంటర్–7, ది ఫైనల్ రిపోర్ట్, ఎబౌట్ 9/11) వెలువరించిన కవిలకట్ట కాస్తా 'శుద్ధ అబద్ధపు అశాస్త్రీయ దస్తరం' అని డేవిడ్ రే అనే పరిశోధకుడు వెల్లడించారు. ఈ 'నివేదిక' మనకాలపు పచ్చి అబద్ధాల పుట్టే కాదు, ప్రపంచంలో ఎవరి మీద కాలు దువ్వని అనేక శాంతి కాముక దేశాలపై ఏదో ఒక మిష పైన అమెరికన్ దురాక్రమణ యుద్ధాలు నిర్వహించడానికి ఈ తప్పుడు నివేదిక ద్వారాలు తెరిచిందని నిపుణులు పేర్కొంటున్నారు.

abkprasad2006@yahoo.co.in

### సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



**సోషల్ మీడియా**

#### దేశభక్తి



"ద్వేషాన్ని, హింసను, బెదిరింపులను ఎదుర్కొంటున్న సాటి పౌరులకు అండగా నిలబడటమే దేశభక్తి. దేశం అంటే ఆ దేశ ప్రజలే. దేశంలోని బలహీనులపట్ల ఎలా వ్యవహరిస్తారనే దానిపైనే ఆ దేశం యొక్క గొప్పదనం ఆధారపడి ఉంటుందని గాంధీ చెప్పారు"
– రోహిణీ సింగ్, జర్నలిస్ట్

#### లక్ష్యం



"కశ్మీర్ ఆర్థికవ్యవస్థ పూర్తిగా విధ్వంసం కావడం నిర్బంధం వలన కాదు, నిర్బంధం లక్ష్యాల్లోనే అది ఒకటి. కశ్మీరీలు తన దగ్గరకు వచ్చి సహాయం చేయాలని అర్థించాలని మోదీ భావిస్తున్నారు"
– నిఖిల్ థాతే, వ్యాపారవేత్త

#### తెలివి



"భారత్ ఆహ్వానం మేరకు కశ్మీర్‌లో పర్యటించనున్న యూరప్ పార్లమెంట్ సభ్యుల వివరాలను గోప్యంగా ఉంచుతున్నారు. యూరప్ రాజకీయ నాయకుల పేర్లను, వారు ఏ పార్టీకి చెందినవారో మనం గూగుల్ ద్వారా తెలుసుకోలేమని ప్రధాన మంత్రి కార్యాలయం భావిస్తున్నట్టుంది. అదీ వారి తెలివి"
– కృషన్ ప్రతాప్ సింగ్, రచయిత

#### ఆర్ట్



"అదీలా సులేమాన్ పని తనాన్ని పరిరక్షించే ధైర్యం చేయకపోవడం కరాచీ ప్రజలకే అవమానం. 'కిల్లింగ్ ఫీల్డ్స్ ఆఫ్ కరాచీ' అనేది తీవ్రమైన, అవసరమైన కళాకృతి. ప్రభుత్వం విధించే సెన్సార్‌షిప్‌లను కళా సంస్థలు ఎదుర్కోలేనప్పుడు అవి కళా సంస్థలుగా ఉండతగవు"
– ఫాతిమా భుట్టో, రచయిత్రి

#### అవమానం



"కశ్మీర్‌లో 370 అధికరణం రద్దుపై లోక్‌సభలో చర్చ సందర్భంగా ఎంపీల అఖిలపక్ష బృందాన్ని అక్కడకు పంపి, పరిస్థితిని స్వయంగా అంచనా వేసే వీలు కల్పించమన్న నా అభ్యర్థన ఇప్పటికీ ఆమోదం పొందలేదు. కానీ, యూరప్ పార్లమెంట్ సభ్యులు మాత్రం ప్రభుత్వ అతిథులుగా అక్కడ పర్యటిస్తారా? భారత దేశపు ప్రజాస్వామ్యానికి ఎంత అవమానం"
– శశిథరూర్, కాంగ్రెస్ నేత

#### చరిత్ర



"జరగబోయే పరిణామాలపట్ల, అమలుపట్ల ఎటువంటి ఆలోచనా లేకుండా నోట్ల రద్దు, 370 అధికరణం ఎత్తివేత వంటి తీవ్రమైన, నాటకీయమైన నిర్ణయాలు తీసుకోవడం అంటే ప్రధాని నరేంద్ర మోదీకి ఎంతో ఇష్టం. మోదీ చర్యలన్నీ చరిత్ర పుస్తకాలకు ఎక్కుతాయి, కాకపోతే అనేక తప్పుడు కారణలతో"
– స్వాతి చతుర్వేది, జర్నలిస్ట్

#### ఎందుకని?



"తమకు ప్రత్యేకమైన రాజ్యాంగం, జెండా ఉన్నాయని చెప్పుకునే నాగాలాండ్‌తో నిరంతరం, సహనంతో సంప్రదింపులు జరిపే మన దేశం, అదే పద్ధతిలో కశ్మీర్‌తో ఎందుకు వ్యవహరించదో నాకు అర్థం కాదు"
– వర్ధిని భట్టాచార్జీ, విద్యావేత్త

#### బుక్ షెల్ఫ్



"పుస్తకాల అలమారాను సర్దడం మనల్ని ఎంత జ్ఞాపకాల జాతరలోకి లాక్కుపోతుందో కదా. ఎన్నో జ్ఞాపకాలు, అనుభూతులు, ప్రేమ, గుణపాఠాలు అన్నీ కలగలిసిన అనుభవం"
– సంగీత, రచయిత

# జర్నలిస్టులలో దీపధారి-రాఘవాచారి



ఎన్ వేణుగోపాల్

ఎనభై సంవత్సరాలు నిండిన జీవితంలో అరవై సంవత్సరాల ప్రజా జీవితం, అందులో నలభై సంవత్సరాల పాత్రికేయ జీవితం గడిపి, విలువలతో, విద్వత్తుతో, విస్పష్టమైన దృక్పథంతో, ప్రపంచం పట్ల అపారమైన ప్రేమతో అజాత శత్రువుగా జీవించి సోమవారం ఉదయం హైదరాబాద్‌లో మరణించిన చక్రవర్తుల రాఘవాచారి (సెప్టెంబర్ 10, 1939 – అక్టోబర్ 28, 2019) జీవితమూ, కృషీ, ప్రవర్తన ఉదాహరణప్రాయమైనవి, ఆదర్శప్రాయమైనవి.

పాత వరంగల్ జిల్లా పాలకుర్తి మండలం శాతాపురం గ్రామంలో సంపన్న భూస్వామ్య శ్రీవైష్ణవ కుటుంబంలో చక్రవర్తుల వెంకట వరదాచార్యులు, కనకవల్లి దంపతుల సంతానంలో చివరివాడుగా జన్మించిన రాఘవాచారి కుటుంబ ఆచారాన్ని అనుసరించి ఇంట్లోనే సంస్కృతం, ఉర్దూ, తెలుగు, తమిళం చదువుకున్నారు. మతాచార పరులైనప్పటికీ కుటుంబానికి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం పట్ల సానుభూతి ఉండడం, గెరిల్లాలకు ఇంట్లో ఆశ్రయం ఇవ్వడం, సమీప బంధువు ఒకరు గెరిల్లాగా పని చేస్తూ పోలీసు కాల్పుల్లో చనిపోవడం ఆయన తొమ్మిది, పదేళ్ల వయసు నాటికే కలిగిన అనుభవాలు. పాఠశాల విద్య హనుమకొండలో, పీయూసీ హైదరాబాదులో చదివి, బీఎస్సీ కోసం 1957లో వరంగల్ ఆర్ట్స్ కాలేజి చేరేనాటికే ఆయనలో వామపక్ష భావాలు బలపడ్డాయి. అక్కడే కళాశాల విద్యార్థి సంఘం కార్యదర్శిగా కూడా ఉండి, ఆ తర్వాత ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం చదవడానికి వచ్చేసరికి ఆయన అప్పటి కమ్యూనిస్టు పార్టీ అనుబంధ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులయ్యారు. కులాచారపరంగా వేదాధ్యయనమూ ఉపనయనమూ జరిగి, తొమ్మిదో ఏటి నుంచి పద్దెనిమిదో ఏటి దాకా పూజా పునస్కారాలు చేసిన వ్యక్తే, జంధ్యం ధరించిన వ్యక్తే ఒకటొకటిగా వాటన్నిటినీ వదిలేశారు. ఆ వదిలేయడం కూడా ఏదో ఉద్వేగం కొద్దీ కాదు, క్రమక్రమంగా అధ్యయనంతో దృక్పథం బలోపేతమవుతుండగా కమ్యూనిస్టుగా మారి 1960 నాటికి కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. అలా బ్రాహ్మణ భూస్వామ్య విలువల్లో పుట్టి పెరిగి, తనలో తాను సంఘర్షణతో, ప్రశ్నలతో, చర్చలతో, అధ్యయనంతో ప్రజానుకూల ప్రగతిశీల వామపక్ష అభిప్రాయాలు పెంపొందించుకుని కొత్త విలు వల కమ్యూనిస్టు కార్యకర్తగా మారారు. ఆ విలువలతోనే అరవై ఏళ్లకు పైగా జీవించారు. ఉద్వేగంతో కొన్ని విలువలు ఏర్పడతాయి, కానీ అధ్యయనంతో వాటిని స్థిరపరచుకోవాలి అని ఆయనే ఒక ఇంటర్వ్యూలో చెప్పినట్టు ఈ ప్రయాణం సులభంగా సాగిందేమీ కాదు.

చదువుకున్న న్యాయశాస్త్ర విద్యతో న్యాయవాదిగా మారి ఉంటే ఏమై ఉండేవారో తెలియదు గానీ, డిగ్రీ రోజుల నుంచే సామాజిక విషయాల మీద రచన అలవాటు ఉండడంతో పత్రికారచనలోకి వచ్చారు. పార్టీ చీలిక సందర్భంగా మొహిత్ సేన్, తానూ కలిసి రాఘవాచారిని న్యాయవాద వృత్తి ఆలోచన నుంచి తప్పించి విశాలాంధ్రలోకి తీసుకువచ్చామని సంస్మరణ సభలో కందిమళ్ళ ప్రతాపరెడ్డి అన్నారు. అలా ఆయన 1965లో విశాలాంధ్ర దినపత్రికలో విలేకరిగా చేరడం న్యాయవ్యవస్థకు జరిగిన నష్టమేమో గాని, తెలుగులో వామపక్ష పత్రికా రచనకు అందిన అద్భుతమైన కానుక. అప్పటికే ఆయనకు ఇంగ్లిష్ రచనలో కూడా ప్రావీణ్యం ఉండడంతో పేట్రియట్, లింక్



నివాళి

పత్రికలకు హైదరాబాద్ లోనూ, ఢిల్లీలోనూ కూడా కరెస్పాండెంట్‌గా పని చేశారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ ప్రధాన కార్యదర్శిగా జర్నలిస్టు ఉద్యమ నిర్మాణంలో పనిచేశారు. విశాలాంధ్ర దినపత్రికకు సంపాదకుడిగా 1972 నుంచి 2000 వరకు ఇరవై ఎనిమిది సంవత్సరాలు పని చేసి, అతి ఎక్కువ కాలం సంపాదకుడిగా ఉన్న ఏకైక వ్యక్తి అయ్యారు. ఈ ఇరవై ఎనిమిది సంవత్సరాలలో ఆయన రాసిన వేలాది సంపాదకీయాలతో పాటు, తీర్చిదిద్దిన పాత్రికేయులు వందల మంది ఉన్నారు.

విశాలాంధ్ర ఒక కమ్యూనిస్టు పార్టీ దినపత్రిక గనుక పత్రికా రచన చరిత్రలో దానికి, సంపాదకుడిగా రాఘవాచారిగారికి దక్కవలసిన స్థానం దక్కకపోయినా, ఆయన వ్యక్తిత్వంలోని ఇతర ప్రభావశీల అంశాలు ఆయనను అపురూపమైన తెలుగు మేధావిగా నిర్ధారించాయి.

ఆయన ఒక గొప్ప ఉపన్యాసకుడు. విషయం ఏదైనా, సభా నిర్వాహకులెవరైనా, కొన్నిసార్లు ఆయన భావాలను వ్యతిరేకించేవారైనా ఆయన ఉపన్యాసకుడిగా ఉండాలని కోరుకునేవారు. ఆయన ఉపన్యాసమంటే ఒక ప్రవాహంలా సాగేదేమీ కాదు, నింపాదిగా సాగుతున్నట్టే ఉండేది. కానీ హాస్యం, చమత్కారం, విద్వత్తు నిండిన ఆయన ఉపన్యాసం ఎంతసేపు సాగినా వినాలనిపించేట్టు ఉండేది. అది ఐదు పది నిమిషాల చిన్న ఉపన్యాసమైనా, గంటకు పైగా వివరంగా సాగే ఉపన్యాసమైనా అందులో ఇంగ్లిష్, ఉర్దూ, సంస్కృతం, తెలుగు సాహిత్యాల నుంచీ, సమాజం నుంచీ ఎన్నో ఉటంకింపులు ఉండేవి. ఆయనే ఒక ఇంటర్వ్యూలో చెప్పుకున్నట్టు ఆయన జ్ఞాపకశక్తి విస్తారమైనది. ఉటంకింపులు షేక్ స్పియర్‌వి అయినా, కాళిదాసువైనా, మార్క్స్, లెనిన్‌లవి అయినా, గాంధీవైనా ఉపన్యాసం మధ్యలో, తెచ్చిపెట్టుకున్నట్టుగా కూడా కాకుండా, చాలా సహజంగా, అనివార్యంగా వచ్చినట్టుగా ఇమిడిపోయేవి. శ్రోతలకు తెలియని సమాచారం, తెలిసిన సమాచారంలోనే కొత్త కోణాలు, అతి సులభమైన, వివరమైన పద్ధతిలో ఉండేవి. అందువల్ల విజయవాడలో ఆయన ఉపన్యాసం లేకుండా జరిగిన సభలు అరుదు. ఆయన శ్రోతగా వచ్చి కూచున్నా మాట్లాడమని పిలిచిన సందర్భాలెన్నో.

అన్నిటికీ మించి ఆయన ఒక అద్భుతమైన మానవీయమైన మనిషి. అంత జ్ఞానసంపన్నుడై కూడా అత్యంత నిరాడంబరంగా, అందరితోనూ ఆప్యాయంగా ఉండేవారు. నడుస్తున్న గ్రంథాలయంగా, విజ్ఞాన సర్వస్వంగా పేరు తెచ్చుకుని కూడా కొత్త విషయాలు తెలుసుకోవాలని ఆసక్తి చూపేవారు. తనకన్న ముప్పై నలభై సంవత్సరాల చిన్నవారితో కూడా గౌరవంగా ప్రవర్తించేవారు. పూర్తిగా వ్యతిరేకమైన భావజాలం ఉన్నవారి నుంచి కూడా గౌరవాదరాలు పొందిన అజాతశత్రువు. నలభై సంవత్సరాలుగా నాకు తెలిసి ఆయన ఆహార్యం తెల్లని మల్లెపూవు లాంటి దుస్తులే. ఆహార్యంలో మాత్రమే కాదు ఆయన హృదయంలోనూ, మానవ సంబంధాలలోనూ అటువంటి స్వచ్ఛమైన మల్లెపూల సుగంధాన్నే నింపుకున్నారు. వందల సంపుటాల ఉద్గ్రంథం లాంటి జ్ఞానసంపదను మల్లెపూల పరిమళంలా వ్యక్తిగత సంభాషణల్లోనూ, సభల్లోనూ వెదజల్లారు.

వ్యాసకర్త వీక్షణం పత్రిక సంపాదకులు
మొబైల్: 98485 77028

# శివ దర్శనం

శివుడు సర్వ మంగళ స్వరూపుడు. భక్త వశంకరుడు. తారకాసురుడు శివపుత్రునివల్ల మాత్రమే మరణం పొందేటట్లు బ్రహ్మవల్ల వరం పొందాడు. తన తపస్సుతో శివుని మెప్పించి అమృతలింగాన్ని పొంది మెడలో ధరించాడు. అది మెడలో ఉన్నంతవరకు తనను శత్రువులు గెలవలేరనే వరం పొందాడు. వర గర్వంతో లోక కంటకుడై ప్రవర్తించాడు. శివ కుమారుడైన కుమారస్వామి నారాయణుని సూచనతో తారకుని మెడలో ఉన్న అమృత లింగాన్ని ఆగ్నేయాస్త్రంతో ఖండఖండాలుగా చేశాడు. అవి మరలా అతుక్కోకుండా వాటిని ప్రతిష్ఠించి దేవాలయాలు కట్టించమని నారాయణుడు చెప్పగా దేవతలు ఆ శకలాలు పడిన చోట్ల దేవాలయాలు నిర్మించి ప్రతిష్ఠించారు. తారకుని మెడలోని అమృతలింగం భాగాలు పడిన ఐదు ప్రదేశాలను పంచారామాలుగా పిలుస్తున్నాం.

ఈ పంచారామ క్షేత్రాలు నాలుగు గోదావరి తీరంలోనూ, ఒకటి కృష్ణా తీరంలోనూ ఉండటం, ఐదూ ఆంధ్రప్రదేశ్‌కే చెందటం ఓ విశేషం.



జ్యోతిర్మయం

తూర్పుగోదావరి జిల్లాలోని ద్రాక్షారామంలో భీమేశ్వర లింగాన్ని సూర్యుడు ప్రతిష్టించాడు. ఇది పంచారామ క్షేత్రంగానే కాక, అష్టాదశ శక్తి పీఠాలలో ఒక శక్తి పీఠంగా ప్రసిద్ధి చెందింది. ఇదే జిల్లాలో సామర్లకోటలో కుమార భీమేశ్వరలింగాన్ని కుమారస్వామి ప్రతిష్టించాడు. ఇది కుమారారామంగా ప్రసిద్ధి చెందింది. పశ్చిమ గోదావరి జిల్లాలోని పాలకొల్లులో క్షీరరామలింగేశ్వర లింగాన్ని జనార్ధనుడు ప్రతిష్టించాడు. పంచారామాల్లో ఇది క్షీరారామంగా ప్రసిద్ధి పొందింది. ఇదే జిల్లాలో భీమవరం గునుపూడిలో సోమేశ్వర లింగాన్ని చంద్రుడు ప్రతిష్టించాడు. ఇది సోమారామంగా ప్రశస్తి పొందింది. కృష్ణాతీరంలోని గుంటూరు జిల్లాలోని అమరావతిలో అమరేశ్వర లింగాన్ని ఇంద్రుడు ప్రతిష్టించాడు. ఇది అమరారామంగా ప్రసిద్ధి చెందింది.

ఈ పంచారామాలను కార్తీక మాసంలో ఒక రోజున దర్శిస్తే మంచిదని, పుణ్యమని భక్తుల నమ్మకం. పంచారామ యాత్రలో కలిసి ప్రయాణిస్తూ ఆనందంగా శివ దర్శనం చేసుకోవటం ఎంత అపూర్వానుభవం. ఎంత ఆరోగ్యకరం. ఇటువంటి యాత్రలవల్ల పుణ్యమూ, పురుషార్థమూ రెండూ దక్కుతాయి.

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
మంగళవారం
29-10-2019



నచ్చిన కానుక
సినిమా పేజీలో...



రోడ్ మూవీస్

# రోడ్డు చెప్పే కథ



**కథలను హీరో చెప్తాడు. హీరోయిన్ చెప్తుంది.**
**కేరెక్టర్ ఆర్టిస్ట్ చెప్తాడు.**
**కాని ఒక్కోసారి రోడ్ కూడా చెప్తుంది.**
**కథ రోడ్ మీద నడుస్తుంది. రోడ్ కథలో పాత్ర అవుతుంది.**
**హాలీవుడ్‌లో రోడ్ మూవీస్ ప్రత్యేకమైనవి.**
**మన దేశంలో అలాంటి కథలు తక్కువ.**
**కాని తీసిన రోడ్ మూవీస్ ప్రేక్షకులకు నచ్చాయి.**
**నల్లరోడ్డు మీద తెల్ల అక్షరాలతో చెక్కిన కథలు ఇవి.**

మనిషి ప్రయాణం చేస్తాడు. ఒక్కోసారి తెలిసిన గమ్యం కోసం ప్రయాణిస్తాడు. ఒక్కోసారి తెలియని లక్ష్యం కోసం ప్రయాణిస్తాడు. ఒక్కోసారి భౌతిక ప్రయాణం చేస్తాడు. మరోసారి ఆత్మిక ప్రయాణం చేస్తాడు. ఒక ప్రయాణంలో పరులను తెలుసుకుంటాడు. ఒక ప్రయాణంలో తనను తాను కనుక్కుంటాడు. ఈ మొత్తం ప్రయాణాల్లో ఎవరు తోడు ఉన్నా ఎవరు లేకపోయినా తప్పక ఉండే పాత్ర ఒకే ఒక్కటి. రోడ్డు. ఆ రోడ్డుకు కథంతా తెలుసు లేదా అదే కథంతా మనకు చెప్తుంటుంది.

## ఖైదీ

పదేళ్ల జైలు శిక్ష అనుభవించి ఆ రోజు విడుదలవుతాడు కార్తి. సాయంత్రం బస్సెక్కి అనాథ శరణాలయంలో ఉన్న కూతురిని మరుసటిరోజు ఉదయం కలవాలి. కాని అతడి వాలకం చూసి పోలీసులు అనుమానంతో అరెస్ట్ చేస్తారు. అప్పటికే పోలీసులు మరోచోట దాదాపు 900 కోట్ల రూపాయల విలువైన మాదక ద్రవ్యాలు పట్టుకొని ఎస్.పి.ఆఫీస్‌లో దాచి ఉంటారు. వాటి కోసం మాదక ద్రవ్యాల ముఠా ఆ రాత్రి ఎస్.పి. ఆఫీస్ మీద దాడి చేయాలనుకుంటుంది. పోలీస్ ఆఫీసర్లందరూ ఒకచోట పార్టీ చేసుకుంటుంటే వారు తాగే మద్యంలో మాదక ద్రవ్యాలు కలుపుతుంది ముఠా. ఆ మద్యం తాగి ఆఫీసర్లు చావు బతుకుల్లోకి వెళతారు. ఒక్క ఆఫీసరే మద్యం తాగక స్పృహలో ఉంటాడు. అతనికి గత్యంతరం లేక కార్తిని సాయం కోరతాడు. మీడియాకు తెలియకుండా పోలీసులందరికీ వేరే ఊరిలో ఉన్న ప్రయివేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించాలి. అలాగే ఎస్.పి. ఆఫీస్ మీద జరిగే దాడిని ఎదుర్కోవాలి. ఈ రెంటి కోసం మాత్రమే కాకుండా తన కూతురు కోసం కూడా కార్తి చేసే ప్రయాణమే 'ఖైదీ'. దర్శకుడు లోకేష్ కనకరాజ్ ఆరేడు గంటల్లో జరిగే ఈ కథను ఎంతో బిగువుగా చెప్పి ప్రేక్షకులను ఆకట్టుకుంటాడు. దుర్మార్గం తన లక్ష్యాన్ని చేరే లోపల మంచే తన గమ్యానికి చేరుతుందని ఈ కథ చెబుతుంది. మానవోద్వేగాలు బయల్పడాలంటే మనిషికి ఒక గట్టి ప్రయాణం తగలాలని చెబుతుందీ సినిమా.

## నిమజ్జనంతో మొదలయ్యి...

తెలుగులో 'రోడ్డు ప్రయాణం' ప్రధానాంశంగా వచ్చిన సినిమాలలో 'నిమజ్జనం' (1979)ను మొదట చెప్పుకోవాలి. ఇందులో మామ గారి అస్తికలు గంగలో నిమజ్జనం చేయడానికి భర్తతోపాటు ఎడ్లబండిలో బయలు దేరుతుంది శారద. ఊరి నుంచి చాలా దూరంలో ఉన్న రైలుస్టేషన్‌కి ఎడ్లబండిలో ప్రయాణం చేయాలి. కాని బండివాడు శారద మీద కన్నేస్తాడు. అస్తికల కుండ నేల జారేలా చేసి భర్తను అది వెతుక్కుంటూ వెళ్లేలా చేసి ఆమెపై అఘాయిత్యం చేస్తాడు. ఈ విషయం ఆమె ఎవరితోనూ చెప్పుకోలేక గంగలో నిమజ్జనం సమయంలో నీట మునిగి ప్రాణాలు వదులుతుంది. తిరుగు ప్రయాణంలో ఒక్కడే వచ్చిన భర్తను చూసి బండివాడు భార్య గురించి వాకబు చేస్తే ఆమె ఆత్మహత్య చేసుకుందని భర్త చెబుతాడు. పాపభీతితో, పశ్చాత్తాపంతో బండివాడు తాను చేసిన తప్పు ఒప్పుకొని ప్రాణం వొదులుతాడు.

## నాగార్జున 'చైతన్య'- వర్మ 'అనగనగా ఒకరోజు'

ప్రతాప్‌పోతన్ తీసిన 'చైతన్య' తెలుగులో పూర్తిస్థాయి రోడ్ మూవీ అని చెప్పొచ్చు. ఇందులో మద్రాసు నుంచి గోవా వరకు ఒక ర్యాలీ జరుగుతుంది. ఆ ర్యాలీలో దొంగలు, స్మగ్లర్లు, పోలీసులు, హీరో, హీరోయిన్ అందరూ ఉంటారు. అయితే సరైన కథాంశమే లేదు. ఆ తర్వాత వచ్చిన ఎస్.వి. కృష్ణారెడ్డి 'గన్ షాట్'(1996) ఒక సైకో నుంచి తప్పించుకోవడానికి హీరో అలీ చేసే రోడ్డు ప్రయాణం కూడా నిరాశ పరిచింది. కాని రామ్‌గోపాల్ వర్మ దర్శకత్వంలో వచ్చిన 'అనగనగా ఒకరోజు' హిట్టయ్యింది. ఇంటి నుంచి పారిపోయిన ప్రేమ జంట ఒకరోజులో ఎన్ని అనూహ్య సంఘటనలు ఎదుర్కొందనేది కథ. శ్రీదేవి, వెంకటేశ్‌ల 'క్షణక్షణం' కూడా రోడ్ మూవీనే. సంబంధం లేని చోరీ కేసులో తామే నిందితులమని భావించి వీరు అడవుల్లోకి పారిపోతారు. ఆ తర్వాత సిటీకి ప్రయాణం చేస్తారు. ఈ ప్రయాణాల మధ్య జరిగే ప్రేమకథ ఇది.




## ఓయ్- గమ్యం

తాను ప్రేమించిన అమ్మాయి కేన్సర్ వల్ల మరి కొన్ని రోజుల్లో చనిపోబోతున్నదని తెలిసిన అబ్బాయి ఆమె తన జీవితంలో నెరవేర్చుకోవాలనుకున్న కోరికలు కొన్నింటిని తీర్చడానికి ఆమెను తీసుకొని ప్రయాణం మొదలుపెడతాడు. సిద్ధార్థ, షామిలి నటించిన ఈ సినిమా అనుకున్నంత స్థాయిలో ఫలితం ఇవ్వలేదు. కాని క్రిష్ తన తొలి సినిమాగా తీసిన రోడ్ మూవీ 'గమ్యం' ప్రేక్షకుల, విమర్శకుల మెప్పు పొందింది. ఒక ధనిక కుర్రవాడు శర్వానంద్ తన ప్రియురాలిని వెతుక్కుంటూ చేసే ప్రయాణం ఈ కథ. ఈ ప్రయాణంలో అతడు నిజమైన భారతదేశాన్ని కనుగొంటాడు. జనం ఎలా ఉన్నారో చూస్తాడు. ప్రజల కోసం అడవుల్లో ఉండి పని చేయడం కన్నా ప్రజల మధ్య ఉండి పని చేయడం మంచిదని గ్రహిస్తాడు. క్రిష్‌కు పేరు తెచ్చిన రోడ్ మూవీ ఇది.

## ఖలేజా

త్రివిక్రమ్ తీసిన రోడ్ మూవీ 'ఖలేజా' కల్ట్ మూవీగా నిలిచింది. రిలీజైనప్పుడు కన్నా టీవీల్లో ఇది ఎక్కువగా ఆదరణ పొందుతోంది. 'గమ్యం'ను పోలిన కథతో తయారైన 'ఎవడే సుబ్రహ్మణ్యం' మనిషి విలువలతో ప్రయాణం చెయ్యాలని చెబుతుంది. ఎన్ని కష్టాలు ఎదురైనా ప్రేమ కోసం సఫలమైన ప్రయాణం చేయాలని 'కృష్ణగాడి వీరప్రేమగాథ' చెబుతుంది. ఒక పిల్లవాడితో ఏర్పడిన అనుబంధంతో విలన్ భరతం పట్టడానికి సాయితేజ్ చేసిన ప్రయాణమే 'సుప్రీమ్'.

**ముగింపు:** కథలన్నీ కంచికి చేరతాయని పెద్దల మాట. ఆ కంచికి చేరడంలో కొన్ని కథలు రోడ్డు మీద జారిపోయి ఉంటాయి. కంచికి పోతూ పోతూ మనకూ తారసపడుతూ ఉంటాయి. అందువల్ల మంచి కథ కోసం రోడ్డు మీద పడి వాటిని పట్టుకోవడంలో తప్పులేదు. రోడ్డుతో పాటు జరిగే ఈ సినీ ప్రయాణం కొనసాగాలి.

– సాక్షి ఫీచర్స్ డెస్క్

షార్ట్ ఫిల్మ్

# మౌనంగా మీ టూ







ప్రస్తుతం నెట్టింట్లో షార్ట్ ఫిలిమ్స్ కి మంచి ఫాలోయింగ్ ఉంది. ముఖ్యంగా ప్రేమ కథలకు...అందుకే యూత్ ఈమధ్య చిన్న కెమెరాలు చేత పట్టుకుని తమ ప్రతిభను నిరూపించుకునే ప్రయత్నాలు సీరియస్‌గానే కాదు.. సిన్సియర్‌గా కూడా చేస్తున్నారు.

అలాంటి కోవకే చెందుతాడు హరికుమార్ దేవరపల్లి అనే 26 సంవత్సరాల విజయవాడ కుర్రాడు. ఇటీవల కొంతకాలంగా వింటున్న, పత్రికలలో చదువుతున్న... సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న 'మీ టూ' అనే సామాజిక సమస్యని తీస్కొని చక్కటి షార్ట్ ఫిలిమ్ తీసేశాడు. అందులో తాను చెప్పదలచుకున్నది సూటిగా సుత్తి లేకుండా చెప్పేసాడు. సమస్య ఇదీ అని చెప్పటమే కాదు... దానికి తనదైన పరిష్కారం చెప్పే ప్రయత్నం కూడా చేశాడు.

ఒక చిన్న కథ... చక్కటి స్క్రీన్ ప్లే, చిక్కటి క్లైమాక్స్‌తో సాగిందే 'మీ టూ' షార్ట్ ఫిలిం. దాదాపు పదిమంది యువతీ యువకులు... అదీ టీనేజ్ గ్రూప్ వాళ్లు నటించిన ఈ షార్ట్ ఫిలింలో భావాలను పలికించేందుకు ఎవరికి తోచిన విధంగా వారు బాగానే ప్రయత్నం చేశారు. సక్సెస్ అయ్యారు కూడా... వీరందరూ ఫేస్‌బుక్ మిత్రులు కావడం విశేషం. దీనిని నీట్‌గా ఎడిటింగ్ చేసిన 'శశి నాగ్' ఈ సినిమాకి అసెట్...

ఈ లఘుచిత్రంలో మాటలు లేకపోయినా పూజ, స్వర్ణ ప్రియ, స్నేహ లతా మంచి ఎక్స్‌ప్రెషన్స్‌తో... అంతకుమించిన అభినయంతో చివరిదాకా షార్ట్ ఫిలింని ఆసక్తిగా చూసేలా చేశారు.

నెగటివ్ రోల్స్‌లో కూడా ఇంత బాగా నటిస్తారా అనేలా చిరంజీవి, ఆనంద్ రెడ్డి, దుర్గారావు పాత్రలలో చక్కగా ఇమిడిపోయారు. ఇంకాస్త చెప్పాలంటే జీవించేశారు.

వీలయితే వెండితెర... లేదంటే కనీసం బుల్లితెర మీద హీరోయిన్‌గా ఏలాలని లేదా పోనీ చిన్న క్యారెక్టర్ అయినా ఫరవాలేదు అని శతకోటి ఆశలతో ప్రయత్నాలు చేసే యూత్ ముఖ్యంగా మహిళలను ఉద్దేశించి తీసినట్లు ఉంది ఈ షార్ట్ ఫిలిం. లింక్...
https://youtu.be/NjXIZ4piekY

– డి.వి.ఆర్.

- నేను సినిమా దర్శకుడు అవ్వాలన్న ఆసక్తితో గత 5 సంవత్సరాలుగా ప్రయత్నిస్తున్నాను
- అవకాశాల కోసం, నా ప్రతిభని చూపించుకోటానికి నేను MeToo అనే ఒక షార్ట్ ఫిలిం తీసాను... ఇది నా 11వ షార్ట్ ఫిలిం
- ప్రస్తుతం ప్రపంచాన్ని ఊపేస్తున్న Me Too అనే మహిళల సమస్యల మీద షార్ట్ ఫిలిం చేశాను
- సమస్య చూపించటం మాత్రమే కాకుండా, పరిష్కారాన్ని కూడా చూపిస్తూ, కేవలం ఒక భాషకు కాకుండా అందరికీ చేరువ అవ్వాలి అని నేను ఈ ప్రయత్నం చేశాను
- కేవలం 14 గంటలలో షూటింగ్, ఎడిటింగ్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ చేసి, ఫైనల్ కాపీ రెడీ చేశాను
- దీపావళి ముందురోజున యూట్యూబ్ లో రిలీజ్ చేసిన నా ఈ లఘుచిత్రానికి వీక్షకుల నుంచి మంచి స్పందన వస్తున్నందుకు ఆనందంగా ఉంది.

– దేవరపల్లి హరికుమార్
మీ టూ షార్ట్ ఫిలిమ్ దర్శకుడు, స్క్రిప్ట్ రైటర్





– శశినాగ్, వీడియో ఎడిటర్

బ్యూటిప్స్

# పొడిబారిన చర్మానికి...

**ఈ కాలం చర్మం పొడిబారడం, జీవం కోల్పోవడం వంటివి చూస్తుంటాం. అలాగే మేకప్‌కు వాడే సౌందర్య ఉత్పాదనల వాడకం వల్ల కూడా చర్మం తాజాదనాన్ని కోల్పోతుంది. చర్మానికి సరైన పోషణ లభించేలా ఇంట్లోనే కొన్ని ఉత్పాదనలు తయారు చేసుకొని వాడచ్చు. వాటిలో...**

## పెదాలకు లిప్‌బామ్



రెండు టీ స్పూన్ల మైనం, టీ స్పూన్ కోకోపౌడర్, రెండు టీ స్పూన్లు బాదం నూనె, 5–6 చుక్కల ఎసెన్షియల్ ఆయిల్ తీసుకోవాలి. ముందుగా మైనాన్ని కరిగించాలి. దీంట్లో కోకో పౌడర్ వేసి బాగా కలపాలి. కోకోపౌడర్ బాగా కలిసిపోయాక బాదం నూనె, ఎసెన్షియల్ ఆయిల్ వేసి కలపాలి. దీన్ని ఒక చిన్న బాటిల్‌లో భద్రపరుచుకొని రోజుకు రెండు మూడుసార్లు పెదాలకు రాసుకోవాలి. ఈ బామ్ చలికాలం పెదాల పగుళ్ల సమస్యను నివారిస్తుంది.

## మేనికి సోప్

గతంలో వాడిన బాత్‌సోప్ ముక్కలు, అరకప్పు పాలు, కొన్ని గులాబీ పూల రెక్కలు, కొద్దిగా తురిమిన నారింజ తొనల పిప్పి, సబ్బు ముక్కలను సన్నగా తరిగి, ఒక పాత్రలో వేసి, అందులో గ్లాసు నీళ్లు పోసి వేడి చేయాలి. సబ్బు ముక్కలు కరిగాక దాంట్లో అర గ్లాసు పాలు పోసి మరగించాలి. మిశ్రమం చిక్కబడుతుండగా పూల రేకలు, తురిమిన నారింజ తొనల జిస్ట్ వేసి చిక్కబడే వరకు సన్నని మంట మీద మరిగించాలి. ఈ మిశ్రమాన్ని అచ్చులలో పోసి ఆరబెట్టాలి. గట్టిపడగానే సోప్‌ను బయటకు తీసి వాడుకోవచ్చు.



## బాడీ స్క్రబ్

రెండు టీ స్పూన్ల తేయాకు , కప్పు బ్రౌన్ షుగర్, అర కప్పు నీళ్లు, పావు కప్పు కొబ్బరి నూనె తీసుకోవాలి. ముందుగా నీళ్లు మరిగించి, అందులో తేయాకులు వేసి మూత పెట్టి, మంట తీసేయాలి. ఐదు నిమిషాల తర్వాత నీళ్లను వడకట్టాలి. ఈ నీళ్లలో బ్రౌన్ షుగర్, కొబ్బరి నూనె కలపాలి. షుగర్ పూర్తిగా కరగనివ్వాలి. అవసరం అనుకుంటే మరికొంత పంచదార, కొబ్బరి నూనె కలుపుకోవచ్చు. ఈ మిశ్రమాన్ని గాలి తగలని జార్‌లో నిల్వ చేసుకోవాలి. ఈ కాలం మృత కణాల సమస్య ఎక్కువ కనుక ఈ స్క్రబ్ మిశ్రమాన్ని మేనికి పట్టించి, రుద్ది, నీళ్లతో శుభ్రపరుచుకోవాలి. రోజూ ఈ స్క్రబ్‌ను వాడుకోవచ్చు.



మనవాడు

# కండ ఉంది... సాయం చేసే గుండె కావాలి

**దేశ విదేశాల్లో జరుగుతున్న బాడీ బిల్డింగ్ పోటీల్లో పతకాలు సాధిస్తున్న రవి కుమార్ కేవలం పేదరికం కారణంగా నవంబర్‌లో జరిగే 'ప్రపంచ బాడీ బిల్డింగ్ ఛాంపియన్ షిప్'కు హాజరు కాలేకపోతున్నాడు. ఈ తెలుగు వీరుడికి గెలిచే సత్తా ఉంది. తోడు నిలిచే సాయం కావాలి.**

ప్రతి రోజూ ఏడు గంటల వ్యాయం. రుచీ పచీ లేని ఆహారం. సరదాగా తిరగాల్సిన వయసులో ఏదో సాధించాలనే తపన. మరోవైపు బీదరికంతో పోరాటం. కష్టంగా ఉన్నా ఎంతో ఇష్టంతో ముందుకెళుతూ అంతర్జాతీయ పతకాలు సాధిస్తున్నాడు ఈ యువ యోధుడు. ఇంటర్మీడియట్ చదువుకున్న ఎన్.రవి కుమార్ (21) తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటి వరకు ఎవరూ సాధించని అరుదైన రికార్డు సొంతం చేసుకున్నాడు. సెప్టెంబర్‌లో ఇండోనేషియాలో జరిగిన ఏషియన్ బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకం సాధించాడు. నవంబర్‌లో సౌత్ కొరియాలో జరగనున్న ప్రపంచ బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైన తొలి తెలుగువ్యక్తి రవికుమారే. అయితే పేదరికం మూలన ఆ ప్రపంచ కప్ పోటీలకు దూరం అయ్యాడు. ప్రతిభ పుష్కలంగా ఉన్నా ఆర్థిక ఇబ్బందులను అధిగమించడమే అతనికి కష్టంగా ఉంది. నెలకు ఆహార ఖర్చులకే దాదాపు రూ.లక్ష అవుతుంది. స్పాన్సర్‌షిప్ కోసం శత విధాలా ప్రయత్నిస్తున్నాడు. కొంత చేయూతనిస్తే తప్పకుండా ప్రపంచ మెడల్ సాధిస్తానని ఆత్మ విశ్వాసంతో చెబుతున్నాడు.

## లారీడ్రైవర్ కుమారుడు

రవి కుమార్‌ది గుంటూరు జిల్లా ఏటుకూరు గ్రామం. తండ్రి వెంకట్రావు లారీడ్రైవర్. అమ్మ వెంకట నరసమ్మ గృహిణి. వారిది సాధారణ కుటుంబం. తండ్రి సంపాదన కుటుంబ పోషణకు సరిపోతుంది. అయితే వారు రాత్రింబగళ్లు కష్టం చేసి కుమారుడికి తమ వంతు ప్రోత్సాహం ఇస్తున్నారు. కొడుకు బంగారు పతకం సాధిస్తే చాలని నాన్న లారీ డ్రైవర్‌గా కష్టపడుతుంటే తల్లి చిల్లర అంగడి పెట్టుకొని వచ్చిన సంపాదనను కుమారునికే ఖర్చుపెడుతోంది. పోటీలకు వెళ్లేందుకు డబ్బులు లేకపోతే తన బంగారు నగలు తాకట్టు పెట్టి మరీ పోటీలకు పంపిందామె. ఆ తర్వాత



2019లో మిస్టర్ ఇండియా బాడీబిల్డింగ్‌పోటీల్లో బంగారుపతకం సాధించిన రవికుమార్



మిస్టర్ ఏసియా పోటీల్లో బ్రాంజ్ మెడల్ సాధించిన రవికుమార్

ఆంధ్ర బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ప్రోత్సాహం లభించింది. కండలు పెంచే వ్యాయామం కోసం రవి కుమార్ తీసుకునే పాలు, గుడ్లు, చికెన్, పండ్లు, చేపలు, కూరగాయలు, ప్రోటీన్ పౌడర్లు వీటి ఖర్చు చాలా ఎక్కువ. ప్రస్తుతం స్నేహితుల సాయం, పోటీల ద్వారా వచ్చే ప్రైజ్‌మనీతో సాధన నడుస్తోంది.

## సరదాగా మొదలైన సాధన

రవి కుమార్ తన 15వ ఏట స్నేహితులతో సరదాగా వ్యాయామం ప్రారంబించాడు. రోజుకు గంట సేపు చేస్తున్నా సీరియస్‌గా తీసుకుని చేసింది లేదు. 2014లో గుంటూరులో జి.శ్రీనివాసరావు అనే సీనియర్ బాడీ బిల్డర్ ఏర్పాటు చేసిన పోటీలకు అన్ని జిమ్‌లకూ ఆహ్వానం అందింది. రవి కుమార్ కూడా ఆ పోటీల్లో సరదాగా పాల్గొన్నాడు. అప్పుడు రవి దేహాన్ని చూసి కొంత మంది నవ్వారు. అది అతని మనస్సులో నాటుకుపోయింది. అప్పుడు కోచ్ జి.శ్రీనివాసరావును కలసి మంచి బాడీ బిల్డర్ అవ్వాలంటే ఏం చేయాలని అడగడం, అందుకు ఆయన కొన్ని సూచనలు చేయడంతో రవి జీవితం ఒక్కసారిగా మారిపోయింది. ఇక అప్పటి నుంచి సాధన గంట నుంచి రెండు, మూడు.. నాలుగు గంటలైంది. 'మిస్టర్ ఆంధ్ర' టైటిల్ సొంతమయ్యింది. ప్రస్తుతం రవికుమార్ 75 కేజీల విభాగంలో ఇండియాలోనే బెస్ట్‌గా కొనసాగుతున్నాడు.

## ఆహార నియమాలు కఠోరం

బాడీ బిల్డర్స్ ఆహార నియమాలు చాలా కఠినంగా ఉంటాయి. రవి కుమార్ తీసుకునే చికెన్, ఫిష్, కూరగాయలలో కనీసం ఉప్పుగాని, మసాలాలుగాని వాడరు. సగం ఉడికినవే తినాలి. అంతే కాదు పోటీలకు 10 రోజుల ముందు నుంచి మంచినీరు తాగడం క్రమేపీ తగ్గించేస్తారు. పోటీలకు మూడు రోజుల ముందునుంచి చుక్క నీరు కూడా తీసుకోరు. అప్పుడే బాడీలో ఉండే మజిల్స్‌ను పోటీల్లో ప్రదర్శించే అవకాశం లబిస్తుంది. ఈ మూడు రోజులు వారు పడే అవస్థలు వర్ణాతీతం. అయినా వాటిని ఎంతో ఆనందంగా స్వీకరిస్తారు. అప్పుడే కదా పతకాలు సాధించేది.



మిస్టర్ ఇండియా, మిస్టర్ ఏసియా, మిస్టర్ వరల్డ్ ట్రయల్స్ పోటీల్లో...



ఇటీవల సెప్టెంబరు నెలలో ఇండోనేషియా బాటమ్‌లో జరిగిన ప్రపంచ బాడీ బిల్డింగ్ పోటీల్లో పతకం సాధించి, పతకంతోపాటు, భారతదేశ జెండాను ప్రదర్శిస్తూ...



సాధించిన పతకాలతో...



తల్లి వెంకట నరసమ్మతో చిల్లర కొట్టులో...

## ప్రపంచ కప్ పోటీలకు దూరం

నవంబరు 5 నుంచి 11 వరకు దక్షిణ కొరియాలో జరిగే ప్రపంచ బాడీ బిల్డింగ్ పోటీలకు ఎంపిక అయ్యాడు రవి. కాని పేదరికం అడ్డొచ్చింది. స్పాన్సర్‌లు దొరకకపోవడంతో పోటీలకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. పతకం సంపాదించాలనే తపన ఉన్నా డబ్బులు లేక వెళ్లలేకపోయాననే బాధ అతనిని పట్టి పీడిస్తోంది. అతను మాత్రం పట్టు వదలకుండా మిస్టర్ ఇండియా బాడీ బిల్డింగ్ పోటీలకు వెళ్లాలని కఠోర శ్రమ చేస్తూనే ఉన్నాడు. ఈ పోటీలు ఫిబ్రవరి 1–2, 2020 సంవత్సరంలో జరగనున్నాయి. స్పాన్సర్‌లు, ప్రభుత్వం చేయూతనిస్తే, తెలుగోడి సత్తా చాటి బంగారు పతకం సాధిస్తానని ధీమాగా చెబుతున్నాడు. 'నాకు ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం అందలేదు. గతంలో ప్రయత్నించి వదిలేసాను. వ్యాయామమే జీవితంలా బతుకుతున్నాను. దాని కోసం ఇంట్లో భారంగా ఉన్నా నెట్టుకొస్తున్నాను. ఒక్కొక్కసారి వదిలేద్దామని అనుకున్నా మళ్ళీ రెట్టించిన ఉత్సాహంతో ముందుకెళుతున్నాను. త్వరలో ముఖ్యమంత్రి జగనన్నను కలుస్తాను. ఆయనకు నా పతకాలన్నీ చూపిస్తాను' అని ఆశగా చెబుతున్నాడు రవి కుమార్.

– ఒ.వెంకట్రామిరెడ్డి,
సాక్షి అమరావతి బ్యూరో

epaper.sakshi.com

సాక్షి ఫ్యామిలీ సినిమా
నల్లగొండ
మంగళవారం
29-10-2019

# కొత్తగా వచ్చారు



● 'డిస్కోరాజా'లో రవితేజ, నభా నటేష్



● 'రెడ్'లో రామ్



● '1945'లో రానా

దీపావళికి ముందు రోజు ఆ తర్వాత కొత్త లుక్స్ విడుదల సందడి సాగింది. కొత్తగా వచ్చిన ఆ స్టార్స్ చిత్రాల విశేషాల్లోకి వస్తే... ఇప్పటివరకు ఒంటరిగానే దర్శనం ఇచ్చిన రాజా ఈ దీపావళి పండగకి జంటగా కనిపించి ప్రేమ గొడుగు కింద కాస్తంత చోటు దక్కించుకున్నాడు. రవితేజ హీరోగా వీఐ ఆనంద్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న సినిమా 'డిస్కో రాజా'. ఈ చిత్రంలో పాయల్ రాజ్‌పుత్, నభా నటేష్, తాన్యా హోప్ కథానాయికలుగా నటిస్తున్నారు. రామ్ తాళ్ళూరి నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ''ప్రస్తుతం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ జరుగుతోంది. 'సిరివెన్నెల' సీతారామశాస్త్రి రచనలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఓ పాట పాడారు. ఈ పాట పూర్తిగా రెట్రో ఫీల్‌ని కలిగిస్తుంది. విడుదల చేసిన పోస్టర్స్‌కు మంచి స్పందన లభిస్తోంది. త్వరలో టీజర్‌ను విడుదల చేస్తాం'' అని చిత్రబృందం పేర్కొంది. దీపావళి పండగ సందర్భంగా ఈ సినిమా కొత్త పోస్టర్స్‌ను విడుదల చేశారు. డిసెంబరు 20న సినిమాను విడుదల చేయాలనుకుంటున్నారు.

భారతీయ సైనికుడి పాత్రలో రానా నటిస్తున్న చిత్రం '1945'. శివకుమార్ తెరకెక్కిస్తున్న ఈ సినిమాకు రాజరాజన్ నిర్మాత. ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసి, సినిమాను జనవరి 24న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ''సినిమాను పూర్తి చేయడంలో నిర్మాత సఫలం కాలేదు. ఏడాదిగా వారిని నేను కలవలేదు. ఇదొక అసంపూర్ణమైన సినిమా. ఇప్పుడు పోస్టర్‌ను విడుదల చేశారు. మోసం చేసి సంపాదించాలనుకోవడమే వారి ఆలోచన అనుకుంటా'' అని ఈ చిత్రం గురించి సోషల్ మీడియాలో రానా పేర్కొన్నారు. ''షూటింగ్ కోసం చాలా ఖర్చు చేశాను. పూర్తి కాని సినిమాను ఎవరూ విడుదల చేయరు. సినిమా పూర్తయిందా? లేదా? అనే విషయాన్ని ఆడియన్స్ నిర్ణయిస్తారు'' అని నిర్మాత పేర్కొన్నారు.



● 'భీష్మ'లో రష్మిక, నితిన్

'ఇస్మార్ట్ శంకర్'తో మాస్ హిట్‌ను ఖాతాలో వేసుకున్న రామ్ మరో మాస్ ఫిల్మ్ చేయడానికి రెడీ అయ్యారు. రామ్ హీరోగా కిశోర్ తిరుమల దర్శకత్వంలో తెరకెక్కనున్న ఈ సినిమాకు 'రెడ్' అనే టైటిల్ ఖరారు చేసి, ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. 'స్రవంతి' రవికిశోర్ ఈ సినిమాను నిర్మిస్తారు. పీటర్ హెయిన్స్ ఈ సినిమాకు ఫైట్స్ కొరియోగ్రఫీ చేస్తారు.

వెండితెర భీష్మగా కనిపించనున్నారు నితిన్. ఆయన హీరోగా వెంకీ కుడుముల దర్శకత్వంలో పీడీవీ ప్రసాద్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్న చిత్రం 'భీష్మ'. ఈ చిత్రంలో రష్మిక మండన్నా కథానాయికగా నటిస్తున్నారు. తాజాగా ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్స్‌ను విడుదల చేశారు. ఫిబ్రవరిలో చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నారు.



● నగేష్ కుకునూర్

''సినిమా రాయడాన్ని పాత్రలు తయారు చేయడాన్ని చాలా ఎంజాయ్ చేస్తాను. ఫస్ట్ కాపీ సిద్ధమైనప్పుడు సాంకేతిక నిపుణులతో కలిసి సినిమా చూస్తాను. నా సినిమాని ఫైనల్‌గా చూసేది కూడా అప్పుడే. ఆ తర్వాత జరిగేదాన్ని పట్టించుకోను. సినిమా ఎలా ఆడుతుంది? కలెక్షన్లు, రివ్యూలు పెద్దగా పట్టించుకోను" అన్నారు దర్శకుడు నగేశ్ కుకునూర్. 'హైదరాబాద్ బ్లూస్'తో దర్శకుడిగా మారిన ఈ తెలుగు దర్శకుడు కొన్ని హిందీ చిత్రాలకు దర్శకత్వం వహించారు. 22 ఏళ్ల తర్వాత తెలుగులో తొలి చిత్రంగా 'గుడ్ లక్ సఖీ'ని తెరకెక్కిస్తున్నారు. ఆది పినిశెట్టి, కీర్తీ సురేశ్, జగపతిబాబు ముఖ్య పాత్రధారులు. సుధీర్ చంద్ర నిర్మాణంలో తెరకెక్కుతోంది. ఈ చిత్రవిశేషాలను నగేశ్ కుకునూర్ పంచుకున్నారు.

# ఎందుకొచ్చావురా బాబూ అనుకోకూడదు

● నేను పక్కా హైదరాబాదీ. నేను దాచుకున్న సేవింగ్స్‌తో నా తొలి సినిమా 'హైదరాబాద్ బ్లూస్' చేశాను. నాన్న ప్రొడక్షన్ చూసుకున్నారు. అమ్మ కుక్, ఆంటీ కాస్ట్యూమ్స్ చూసుకున్నారు. మొదటిసారి స్క్రీన్ మీద నా పేరు చూసుకోగానే నేను దర్శకుడినయిపోయాను అని గర్వంగా ఫీల్ అయ్యాను. 'హైదరాబాద్ బ్లూస్' చిత్రాన్ని అమెరికాలో ఫిల్మ్ ఫెస్టివల్‌కు పంపుదాం అనుకుని ప్రింట్లను సూట్‌కేస్‌లో అమెరికా తీసుకెళ్లాను. అనుకోకుండా ముంబై ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శించాం. ప్రేక్షకులకు నచ్చింది. అక్కడే ఉండిపోయి సినిమాలు చేస్తున్నాను. ● నేను హిందీ రాయగలను, మాట్లాడగలను. అయితే తెలుగు మాట్లాడతాను. తెలుగు సినిమా చేయాలంటే భాష మీద పూర్తి అవగాహన ఉండాలనుకునేవాణ్ణి. నాకున్న పెద్ద చాలెంజ్ తెలుగు సినిమా చేయడం. హిందీలోనే ఉండకుండా ఇక్కడికెందుకు వచ్చావురా బాబూ అని ప్రేక్షకులు అనుకోకూడదు. ● కీర్తీ సురేశ్‌తో వర్క్ చేయడం బెస్ట్ ఎక్స్‌పీరియన్స్. ఇందులో మేకప్ లేకుండా యాక్ట్ చేసింది. ఇప్పుడు చేస్తున్న ఈ సినిమాకి టైటిల్ 'గుడ్‌లక్ సఖీ' అనుకుంటున్నాం. 60 శాతం షూటింగ్ చేశాం. 25 రోజుల షూటింగ్ ఉంది. నాటకాలు వేసే కంపెనీలో పనిచేస్తుంటాడు ఆది. జగపతిబాబు కోచ్ పాత్రలో కనిపిస్తారు. ● నాకు ఇద్దరు దర్శకులంటే విపరీతంగా ఇష్టం. టాలీవుడ్‌లో కె. విశ్వనాథ్‌గారు, బాలీవుడ్‌లో రిషికేశ్ ముఖర్జీ. ఈ సినిమాలో ముఖర్జీగారి స్టయిల్ కనిపిస్తోంది. ఇది ఆడియన్స్ టేస్ట్‌కి నచ్చుతుందా లేదా? అని నేను చెప్పలేను. ఇప్పటికీ ఆడియన్స్‌కు ఏం నచ్చుతుందో నాకు తెలియదు. ● నా సినిమా నాకు బిడ్డలాంటిది. కథను తయారు చేయడానికి మానసికంగా, ఎమోషనల్‌గా చాలా శ్రమిస్తాం. ఎవ్వరైనా వచ్చినప్పుడు మీ బిడ్డ బాలేదు అంటే ఎవరికి నచ్చుతుంది? దర్శకులు విమర్శలను తీసుకోవాలి అంటారు? ఎందుకు తీసుకోవాలి? అది విమర్శ కాదు.. వాళ్ల అభిప్రాయం? నీ అభిప్రాయం ఎంత కరెక్ట్ అయినా నేను వినదలచుకోలేదు. ఎవరి గురించైనా మంచి ఉంటే చెప్పండి. ఏదైనా చెడు చెప్పాలనుకుంటే మీలోనే ఉంచుకోండి. దానికి ఎటువంటి విలువ లేదు. ● నా సినిమాలన్నీ నాకు నచ్చినట్టుగానే తీస్తాను. కొన్ని వర్క్ అవుతాయి.. కొన్ని అవ్వవు. పెద్ద పెద్ద స్టార్స్‌తో చేయాలని పరుగులు పెట్టను. నాకు స్టోరీ నరేషన్ ఇవ్వడం రాదు. రాసింది నా యాక్టర్స్‌కి ఇస్తాను. 'మీరు అర్థం చేసుకోండి. దాన్ని మనం డిస్కస్ చేసుకుందాం' అని చెబుతుంటాను. నేను సినిమాలు ఎక్కువగా చూడను. ట్రెండ్‌ని పట్టించుకోను. అప్‌డేట్ కాను. అప్‌డేట్ అవాల్సిన అవసరం కూడా లేదు. అప్‌డేట్ అయితే ప్రేక్షకులకు ఎలాంటి సినిమా నచ్చుతుందో దానికి తగ్గట్టు ఓ సినిమా చేస్తాం. ఆ లోపు వాళ్ల ఇష్టాలు మారిపోవచ్చు.



రాజారవీంద్ర, చిరంజీవి, ఐరా విద్య, విరానికా, విష్ణు



కృష్ణంరాజు, రాఘవేంద్రరావు, సత్యానంద్, చిరంజీవి, మోహనబాబు

**కాకర పువ్వొత్తులు రంగుపూలు పూశాయి. చిచ్చుబుడ్లు మెరుపులు విరజిమ్మాయి. లక్ష్మీ పూజ ఘనంగా జరిగింది. లడ్డూలు ఇష్టంగా లాగించారు. దీపావళిని అందరూ ఘనంగా జరుపుకొని ఉంటారు. సినిమా తారలు కూడా ఘనంగా జరుపుకున్నారు. పూజ విశేషాలను, పండగ సంబరాలను ఎవరెవరు ఎలా జరుపుకున్నారో తెలుసుకుందాం.**

# స్టార్స్ సందడి

దీపావళి ముందు రోజు రాత్రి మోహన్‌బాబువాళ్ల ఇంట్లో దీపావళి సంబరాలు జరిగాయని తెలిసింది. ఈ వేడుకలకు పలువురు సినీ ప్రముఖులను మంచు కుటుంబం ఆహ్వానించింది. కృష్ణంరాజు, చిరంజీవి, ప్రభాస్, రచయిత సత్యానంద్, దర్శకుడు రాఘవేంద్రరావు, రచయితలు బీవీఎస్ఎన్ రవి, గోపీ మోహన్, హీరో రాజ్ తరుణ్.. ఇలా పలువురు తారలు మంచు ఇంటి విందుకి హాజరయ్యారు. ఆ వేడుక విశేషాలను పక్కన ఫొటోల్లో గమనించవచ్చు. విష్ణు చిన్న కుమార్తె ఐరా విద్యా మంచుని చిరంజీవి ఆప్యాయంగా ఎత్తుకున్న ఫొటోతో పాటు ఈ విందుకి సంబంధించిన పలు ఫొటోలు బయటికొచ్చాయి. ఇక కొత్తగా రీమోడలింగ్ చేయించిన ఇంట్లో దీపావళిని జరుపుకున్నారు చిరంజీవి కుటుంబ సభ్యులు. చిరంజీవి, నాగబాబు, పవన్‌కల్యాణ్.. ఇలా మొత్తం కుటుంబసభ్యులు పండగ చేసుకున్నారు. దీపావళిని అక్కినేని ఫ్యామిలీ కూడా గ్రాండ్‌గానే చేసుకుంది. ఈ సందర్భంగా దిగిన ఫ్యామిలీ ఫొటోను సమంత షేర్ చేశారు. పెదనాన్న కృష్ణంరాజుతో కలసి దీపావళిని ఎంజాయ్ చేశారు ప్రభాస్. అలాగే అల్లు అర్జున్ ఫ్యామిలీ ఫొటోను పక్కన చూడవచ్చు. ఒక్కసారి బాలీవుడ్ సైడ్ వెళ్తే బోనీకపూర్ ఫ్యామిలీ మొత్తం దీపావళి సాయంత్రాన్ని ఎంజాయ్ చేశారు. దీపావళి ఈవెంట్‌ను అమితాబ్ బచ్చన్ ఫ్యామిలీ నిర్వహించింది. ఆ వేడుకకు పలువురు తారలు హాజరయ్యారు. ప్రముఖ నిర్మాత కరణ్ జోహార్ ధర్మా ప్రొడక్షన్స్ ఆఫీస్‌లో ఫెస్టివల్‌ను ఎంజాయ్ చేశారు స్టార్స్. ఫ్యామిలీతో తాప్సీ దీపావళిని జరుపుకున్నారు. తమన్నా, శ్రుతీహాసన్ సెల్ఫీను షేర్ చేశారు. రంగోలీతో పూజా హెగ్డే ఫొటో పంచుకున్నారు. ఇలా దీపావళి కాంతిని ఫేస్‌బుక్, ట్వీటర్ల ద్వారా అభిమానులకు కూడా షేర్ చేశారు స్టార్స్.



నాగార్జున, అమల, సమంత, నాగచైతన్య, అఖిల్



శ్యామల, కృష్ణంరాజు, ప్రభాస్



విష్ణు, విరానికా, ప్రభాస్



అక్కాచెల్లెళ్లు, స్నేహితులతో వరుణ్‌తేజ్



అల్లు అర్జున్, స్నేహ



రామ్‌చరణ్, ఉపాసన



అర్జున్‌కపూర్, జాన్వీకపూర్

# నచ్చిన కానుక

బహుమతులు ఎవరికి ఇష్టం ఉండవు? సందర్భం ఉన్నా లేకున్నా బహుమతులు అందుకోవడం అందరికీ ఇష్టమే. నచ్చిన వస్తువే బహుమతిగా వస్తే? ఆ ఆనందమే వేరు. దీపావళికి తనకు నచ్చిన కారును బహుమతిగా పొందారు హన్సిక. దీపావళి కానుకగా హన్సిక తల్లి మోనా మొత్వాని రోల్స్ రాయిస్ కార్‌ను కుమార్తెకు గిఫ్ట్‌గా అందించారు. ఈ విషయాన్ని తన సోషల్ మీడియా అకౌంట్‌లో పంచుకున్నారు హన్సిక. ఈ కారు ఖరీదు సుమారు 6 కోట్లు పైనే ఉంటుందని సమాచారం. కొత్త కారు పొందిన ఆనందాన్ని వీడియో రూపంలో షేర్ చేశారామె. ప్రస్తుతం తెలుగులో ఓ సినిమా, తమిళంలో రెండు సినిమాలు, ఒక వెబ్ సిరీస్‌తో బిజీ బిజీగా ఉన్నారు హన్సిక.



● హన్సిక

# అప్పటి నుంచి మా ప్రయాణం మొదలైంది

**- శ్రీవిష్ణు**

''అసుర' సినిమా నుంచి విజయ్ కృష్ణ, నా ప్రయాణం కొనసాగుతోంది. మాకు ఒక ప్లాట్‌ఫామ్ కావాలని రెండు మూడు సినిమాలు నిర్మించాం. అందులో నేను చిన్న చిన్న వేషాలు వేశాను. నేను కొంచెం మంచి సినిమాలు చేశాక ఇద్దరం సినిమా చేద్దామనుకున్నాం. తను ఇచ్చిన మాట కోసం నాతో 'తిప్పరా మీసం' సినిమా చేశాడు'' అని శ్రీవిష్ణు అన్నారు. 'అసుర' ఫేమ్ విజయ్ కృష్ణ ఎల్. దర్శకత్వంలో శ్రీవిష్ణు, నిక్కీ తంబోలి జంటగా తెరకెక్కిన చిత్రం 'తిప్పరా మీసం'. శ్రీ హోమ్ సినిమాస్ సమర్పణలో రిజ్వాన్ నిర్మించిన ఈ సినిమా నవంబర్ 8న గ్లోబల్ సినిమాస్ ద్వారా విడుదలవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో దర్శకుడు విజయ్ కృష్ణ మాట్లాడుతూ– ''ఒక మంచి సినిమా చేద్దామని నేను, శ్రీవిష్ణు 'తిప్పరామీసం' స్టార్ట్ చేశాం. ఆ తర్వాత నా ఫ్రెండ్ అచ్యుత రామారావు, రిజ్వాన్ జాయిన్ అయ్యారు. శ్రీవిష్ణు, నిక్కి బాగా నటించారు'' అన్నారు. ''ఈ సినిమాలో నటించే అవకాశం ఇచ్చిన రిజ్వాన్‌గారికి థ్యాంక్స్'' అన్నారు నిక్కీ తంబోలి. ''ఈ సినిమాకి విజయ్ హార్ట్ అయితే, శ్రీవిష్ణు ప్రాణం. వారిద్దరూ కష్టపడి ఈ సినిమా చేశారు'' అన్నారు రిజ్వాన్. సహనిర్మాత అచ్యుత రామారావు, హాస్యనటుడు నవీన్, సంగీత దర్శకుడు సురేష్ బొబ్బిలి, ఎడిటర్ ధర్మేంద్ర, పాటల రచయిత పూర్ణచారి పాల్గొన్నారు.



● విజయ్ కృష్ణ, రిజ్వాన్, నిక్కీ తంబోలి, శ్రీవిష్ణు, అచ్యుత రామారావు



● అభినవ్, తరుణ్‌భాస్కర్

# నేను హీరో ఏంటి అనుకున్నా

**- తరుణ్ భాస్కర్**

''మీకు మాత్రమే చెప్తా' సినిమాలో నువ్వే హీరో అని విజయ్ దేవరకొండ అన్నప్పుడు, నేను హీరో ఏంటి? అనుకున్నాను. 'నాకు జుట్టు తక్కువ, పొట్ట ఎక్కువ' అని విజయ్‌తో చెప్పాను. 'ఏం ఫర్వాలేదు' అన్నాడు'' అని అన్నారు తరుణ్ భాస్కర్. 'పెళ్ళి చూపులు', 'ఈ నగరానికి ఏమైంది' చిత్రాలతో దర్శకుడిగా మంచి పేరు తెచ్చుకున్న తరుణ్ భాస్కర్ 'మీకు మాత్రమే చెప్తా' సినిమా ద్వారా హీరోగా పరిచయం అవుతున్నారు. వాణీ భోజన్, అనసూయ, అభినవ్ గోమటం ముఖ్యపాత్రల్లో షమ్మీర్ సుల్తాన్ దర్శకత్వంలో ఈ సినిమా రూపొందింది. హీరో విజయ్ దేవరకొండ, వర్ధన్ దేవరకొండ నిర్మించిన ఈ చిత్రం నవంబర్ 1న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా తరుణ్ భాస్కర్, చిత్రంలో కీలక పాత్ర చేసిన అభినవ్ గోమటం చెప్పిన విశేషాలు.

*తరుణ్ భాస్కర్ మాట్లాడుతూ* – ''విజయ్ దేవరకొండ కోసం తమిళ దర్శకుడు షమ్మీర్ సుల్తాన్ ఈ కథను వినిపించారు. విజయ్‌కి కథ చాలా నచ్చింది కానీ తనకు సెట్ కాదనిపించింది. ఈ కథ మిస్ అవ్వకూడదనుకున్నాడు. నన్ను కథ వినమన్నాడు. ఫ్రెండ్లీగా విన్నాను. ఆ తర్వాత నువ్వే హీరో అన్నాడు. నిర్మాతగా విజయ్ ఎక్కడ వరకూ ఇన్వాల్వ్ అవ్వాలో అక్కడి వరకే ఉండేవాడు. ఈ సినిమా ప్రీ–ప్రొడక్షన్ అంతా ముగిసిన తర్వాత 'బరువు తగ్గాలి తరుణ్' అని విజయ్ చెప్పాడు. 'పెరగడం తప్ప తగ్గడం నాకు తెలియదు' అన్నాను. ఆ తర్వాత మెల్లిగా తగ్గాను.

– నేను హీరోగా చేయాలనుకున్నప్పుడు మా ఆవిడ నాతో మాట్లాడలేదు (నవ్వుతూ). చిన్న చిన్న పాత్రలు చేస్తున్నప్పుడు ఎంకరేజ్ చేసింది. కానీ హీరోగా చేయడం నచ్చలేదు. అయితే మా అమ్మ ప్రోత్సహించారు. మా నాన్నగారు చనిపోయిన తర్వాత 'ఫిదా' సినిమాలో మా అమ్మకు నటించే అవకాశం వచ్చింది. 'విధవరాలికి ఇవన్నీ ఎందుకు?' అని కొందరు బంధువులు కామెంట్ చేశారు. 'అమ్మా ఇది నీ లైఫ్. నువ్వు చేయాలనుకుంది చెయ్. పక్కనోళ్ల మాటలు పట్టించుకోకు' అని ధైర్యం చెప్పాను. అవే మాటలు నాకు మళ్లీ గుర్తు చేసింది అమ్మ. కొడుకు హీరో అంటే ఏ అమ్మకైనా ఆనందమే కదా.

– ప్రస్తుతం వెంకటేశ్‌గారి కోసం ఒక కథ సిద్ధం చేస్తున్నాను. 'ఈ నగరానికి ఏమైంది' కొనసాగింపుగా వెబ్ సిరీస్ చేస్తున్నాం. 'లస్ట్ స్టోరీస్' వెబ్ సిరీస్‌లో నా పోర్షన్‌కి కథ సిద్ధం చేసుకున్నాను.

## సెల్‌ఫోన్ వల్ల ఇబ్బందులు

*అభినవ్ గోమటం మాట్లాడుతూ* – ''నేను పుట్టి పెరిగిందంతా హైదరాబాద్‌లోనే. సినిమాలంటే ఆసక్తితో థియేటర్ ఆర్టిస్ట్‌గా చేశాను. ఆ తర్వాత సినిమాల్లోకి వచ్చాను. 'ఈ నగరానికి ఏమైంది' చిత్రం హిట్ కావడంతో పాటు నా పాత్రకు మంచి గుర్తింపు వచ్చింది. తరుణ్ భాస్కర్‌తో నాకున్న ప్రయాణంతో 'మీకు మాత్రమే చెప్తా'లో చేయమని అడిగినప్పుడు వెంటనే ఒప్పుకున్నాను. ఈ కాన్సెప్ట్‌ని షమ్మీర్ మొదట విజయ్‌కు చెప్పాడు. 'అర్జున్ రెడ్డి' విడుదల తర్వాత విజయ్ చేద్దామనుకున్న ప్రాజెక్ట్ ఇది. తరుణ్ భాస్కర్‌లో డైరెక్షన్ స్కిల్స్‌తో పాటు యాక్టింగ్ స్కిల్స్ ఉన్నాయని తెలియడంతో హీరోగా నటించాడు. మొబైల్ వాడకం వల్ల ఎలా ఇబ్బందులు పడ్డారనే విషయాన్ని వినోదాత్మకంగా చెప్పాం. ప్రస్తుతం నితిన్ 'రంగ్ దే', జయంత్ సి. పరాన్జీగారి సినిమాతో పాటు సుశాంత్ సినిమాలో నటిస్తున్నాను'' అన్నారు.



సాక్షి సాగుబడి
నల్లగొండ
మంగళవారం 29-10-2019

పౌష్టికాహార లోపం, ఉపాధి లేమి, పేదరికం, నీటి కరువు, అంతరిస్తున్న జీవవైవిధ్యం.. ఇటువంటి సమస్యలన్నిటికీ సేంద్రియ వ్యవసాయాన్ని వ్యాప్తిలోకి తేవడమే పరిష్కారం!
- డా. వందనా శివ, ప్రసిద్ధ దేశీ విత్తనోద్యమకారిణి



స్వాతి కార్తె : నవంబర్ 6 వరకు

# చింతలు తీర్చే ఎర్రచింత!



**తీవ్ర కరువు, గాలివానలు వంటి తీవ్రమైన ప్రకృతి వైపరీత్యాలను సైతం తట్టుకోవడంతోపాటు రైతుకు స్థిరంగా ఏటేటా మంచి ఆదాయాన్నివ్వగలిగిన మంచి తోట పంట 'ఎర్ర చింత'. దీని అసలు పేరు 'అనంత రుధిర'. ఇది సహజ రకమే. అనంతపురం ఉద్యాన పరిశోధనా స్థానం శాస్త్రవేత్తల కృషి ఫలితంగా వెలుగులోకి వచ్చింది. దేశ వ్యాప్తంగా అధికారికంగా విడుదలైంది. ఈ చింతపండు ఎరుపు రంగులో ఉండటం, సాధారణ చింతలో కన్నా పోషక విలువలు అధికంగా కలిగి ఉండడంతో ఇతర ఉత్పత్తుల్లో కలపడానికి.. అంటే విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీకి ఇది బాగా అనుకూలమైనది. బత్తాయి తదితర పండ్ల తోటలు ఎండిపోతున్న తీవ్ర కరువు పరిస్థితుల్లోను, గాలివానలకు తట్టుకొని దిగుబడిని ఇవ్వగలగడం దీని ప్రత్యేకత..**

కాయ లోపల ఎర్రని కండ

గుత్తులుగా ఎర్ర చింత కాయలు

- ఎర్రని చింతపండు ఆకర్షణకే కాదు, పోషకాల్లోనూ మిన్న
- అంటు నాటిన ఐదేళ్లకే దిగుబడి ప్రారంభం
- తీవ్ర కరువు పరిస్థితులనూ సమర్థంగా తట్టుకుంటుంది
- ఫలించిన అనంతపురం శాస్త్రవేత్తల కృషి

**చిం**తపండుతో దక్షిణాదిప్రజలకు, రైతులకు విడదీయరాని అనుబంధం ఉంది. కేరళ, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మధ్య ప్రదేశ్ రాష్ట్రాల్లో చింత సాగు జరుగుతోంది. ఇంట్లో రోజువారీ వంటల్లో వాడుకోవడానికి, నిల్వపచ్చడి పెట్టుకోవడానికి మాత్రమే చింతపండును ప్రస్తుతం మనం వాడుతున్నాం. చింత పండు అంటే నల్లగానే ఉంటుంది కదా అనుకోవద్దు. ఎందుకంటే ఇటీవలే ఎర్రని చింత రకం ఒకటి వెలుగులోకి వచ్చింది.మామూలు చింత రకాలకు భిన్నంగా ఎర్ర చింత రకాన్ని అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలం రేకులకుంటలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు వెలుగులోకి తెచ్చారు. పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి. శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఐదేళ్లపాటు కొనసాగిన పరిశోధనల ఫలితంగా ఎరుపు రంగులో ఉండే చింత రకం రైతులకు అందుబాటులోకి వచ్చింది. 'అనంత రుధిర' అనే పేరుతో ఈ కొత్త రకాన్ని భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి దేశవ్యాప్తంగా విడుదల చేసింది.

దేశవ్యాప్తంగా ఇప్పటివరకూ ఉద్యాన శాస్త్రవేత్తలు విడుదల చేసిన చింత రకాలు రెండే రెండు. ఉత్తరప్రదేశ్లో 'యోగేశ్వరి' అనే రకం(దీని వివరాలు పెద్దగా అందుబాటులో లేవు) మొదటిది కాగా, మన అనంతపురం శాస్త్రవేత్తలు గుర్తించి, అభివృద్ధి చేసి వెలుగులోకి తెచ్చిన 'ఎర్ర చింత' (అనంత రుధిర) రెండోది కావడం విశేషం.

రేకులకుంటలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధనా స్థానంలో 40కి పైగా రకాల చింతచెట్లను సాగు చేస్తూ పరిశోధనలు సాగిస్తున్నారు. వీటిలో 30 ఏళ్ల వయసున్న ఒక చెట్టు కాయల్లో గుజ్జు ఎర్రగా ఉన్నట్లు, ఈ చెట్టు ప్రతి ఏటా కాయలు కాస్తున్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. దీనికి 'ఛాంపియన్ ట్రీ' అని పేరు పెట్టి ప్రత్యేకంగా చూసుకుంటున్నారు. ఈ చెట్టు కొమ్మల ద్వారా అంట్లను ఉత్పత్తి చేస్తూ రైతులకు అందిస్తున్నారు. ఈ ఏడాది కనీసం 20 వేల అంట్లు ఉత్పత్తి చేయాలనుకుంటున్నారు. గత కొన్నేళ్లుగా ఈ రకం మొక్కలు కొన్నిటిని ఈ పరిశోధనా స్థానంలో నాటారు. అవి పూతకు వచ్చిన తర్వాత ఆ చెట్లకు కూడా అంట్లు కట్టడం ప్రారంభిస్తామని డా. శ్రీనివాసులు తెలిపారు.

'అనంత రుధిర' రకంతోపాటు సాధారణరకాలైన తెట్టు అమాలిక, ధార్వాడ్ సెలక్షన్-1, ధార్వాడ్ సెలక్షన్-2 చింత రకాల అంటు మొక్కలు కూడా రేకులకుంటలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధనా స్థానంలో అందుబాటులో ఉన్నాయి.

## ఎర్ర గరప, రేగడి నేలలు అనుకూలం



ఎర్ర చింత చెట్ల సాగుకు ఎర్ర గరప నేలలతోపాటు తేలికపాటి నల్లరేగడి నేలలు అనుకూలం. కోస్తా ప్రాంతాల్లో సారవంతమైన భూముల్లో అయితే మెట్ట ప్రాంతాల్లో కన్నా అధిక దిగుబడి కూడా రావచ్చు. గాలి వానలకు దీని కాయలు పండిన దశలో కూడా రాలిపోవు. తక్కువ వర్షపాతం ఉండే రాయలసీమ వంటి ప్రాంతాల్లో తీవ్ర కరువు పరిస్థితులను సైతం తట్టుకొని బతుకుతుంది. అందువల్లనే బత్తాయి, దానిమ్మ, నిమ్మ తోటలు ఎండిపోతున్న ప్రాంతాల్లో రైతులు ఇటీవల కాలంలో చింత మొక్కలు నాటుకుంటున్నారు. ఇతర తోటల్లో మాదిరిగా డ్రిప్ పెట్టుకొని, ఎరువులు వేసుకొని కొంచెం శ్రద్ధ చూపితే ఎటువంటి భూముల్లోనైనా చక్కగా పెరిగి దశాబ్దాలపాటు లాభదాయకమైన దిగుబడినిస్తుంది. ఎర్ర చింత అంటు మొక్కలకు రైతుల నుంచి ఇప్పటికే గిరాకీ బాగా వచ్చింది. తెలంగాణ ఉద్యాన శాఖ వారు కూడా 3 వేల మొక్కలకు ఆర్డర్ ఇచ్చారు. వచ్చే నెలలో వారికి సరఫరా చేస్తున్నాం. టిష్యూకల్చర్ పద్ధతి విజయవంతం కాకపోవడంతో అంటు మొక్కలనే రైతులకు అందిస్తున్నాం. ఎర్రచింతపండును వంటకాల్లో చింతపండుగా కాకుండా విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీలో వాడటానికి ఎక్కువ ఉపయోగపడుతుంది. ఎగుమతి అవకాశాలు కూడా ఎక్కువే.

**– డా. బి. శ్రీనివాసులు** (73826 33667),
**అధిపతి, డా. వైఎస్సార్ ఉద్యాన పరిశోధనా స్థానం, రేకులకుంట, అనంతపురం జిల్లా**



పంపిణీకి సిద్ధంగా ఉన్న ఎర్రచింత అంటుమొక్కలు

**ఎర్ర చింతకు గుత్తులుగా కాయలు**

ఉద్యాన క్షేత్రంలో ఉన్న అనంత రుధిర రకం ప్రతి ఏటా కాపు కాస్తున్నది. కాయలు గుత్తులుగా వస్తాయి. పిందెను విరిచి చూస్తే రక్తం మాదిరిగా ఎర్రగా కండ కనిపిస్తుంది. కాయ ముదిరిన తర్వాత రోజ్ రెడ్గా మారుతుంది. యాంటోసైనిన్స్ అనే పిగ్మెంట్ కారణంగా ఎరుపు రంగు సహజసిద్ధంగానే వస్తున్నదని డా. శ్రీనివాసులు తెలిపారు.

**ఆరోగ్యదాయకం**

మామూలు చింత రకాల నుంచి వచ్చే చింతకాయల ద్వారా చింతతొక్కు, చింతపండుగానే ఎక్కువ శాతం ఆహారంలో ఉపయోగిస్తారు. అయితే, ఎర్రచింతతో అనేక ఉత్పత్తులు తయారు చేసుకోవచ్చు. ఈ రకం చింత పండు, ఇతర ఉత్పత్తులు ఆరోగ్యపరంగా మనిషి ఎంతగానో మేలు చేస్తాయని శాస్త్రవేత్తలు తెలిపారు. ఆరోగ్యానికి ఎంతగానో మేలు చేసే యాంటీ ఆక్సిడెంట్స్ ఇందులో పుష్కలంగా ఉంటాయి. మానవ శరీరంలో ఉన్న ఫ్రీ రాడికల్స్ (చెడు కలిగించే పదార్థాల)ను ఇవి నిర్వీర్యం చేస్తాయని శాస్త్రవేత్తలు తెలిపారు. అలాగే ఇందులో టార్టారిక్ యాసిడ్, భాస్వరం, పొటాషియం, నియాసిన్, రెబోఫ్లేవిన్, బీటా కెరోటిన్ లాంటి విటమిన్లు, మినరల్స్(ఖనిజాలు) ఉన్నట్లు తేలింది. మరీ ముఖ్యంగా టార్టారిక్ యాసిడ్ 16 శాతం ఉంటుంది. దీన్ని చింత తొక్కుగా, చింతపండుగా వంటకాల్లో వాడితే మంచి రుచిని ఇస్తుందన్నారు.



పొలుసు ఒలిచిన తర్వాత చింతపండు



గింజలు తీసిన ఎర్రచింతపండు

**ఆకర్షణీయంగా ఆహారోత్పత్తులు**

ఎరుపు రంగు ఆకర్షణీయంగా ఉంటుంది కాబట్టి ఎర్ర చింతపండుతో పులిహోర, సాంబారును మరింత ఆకర్షణీయంగా తయారు చేసుకోవచ్చు. అంతేకాదు.. ఎర్ర చింతపండును వినియోగించి జామ్, జెల్లీ, సాస్, చిక్కటిగుజ్జు, పొడి, టోఫీస్(చాక్లెట్లు), బేకరీ పదార్థాల తయారీలో వాడుకుండే ఆయా ఉత్పత్తులు సహజమైన ఎర్ర రంగుతో అదనపు పోషక విలువలతో కూడి మరింత ఆకర్షణీయంగా మారుతాయని డా. శ్రీనివాసులు అంటున్నారు. ఎగుమతుల పెరుగుదలకు కూడా అవకాశం ఉంటుంది.

**ఐదో ఏడాది నుంచి దిగుబడి**

'అనంత రుధిర' రకం సాగుకు అన్ని రకాల నేలలు అనుకూలమైనవే అయినప్పటికీ, ఎర్రగరప నేలలు, తేలికపాటి నల్ల రేగళ్లలో మంచి దిగుబడులు వస్తాయని డా.శ్రీనివాసులు తెలిపారు. సాధారణంగా చింత మొక్కలను చౌడు నేలల్లోనో, వ్యవసాయానికి పనికిరాని భూముల్లోనో నాటుతూ ఉంటారని.. అయితే సాగు యోగ్యమైన భూముల్లో ఇతర తోట పంటల మాదిరిగానే చింత అంట్లను నాటుకొని, డ్రిప్ ద్వారా నీటిని, ఎరువులను అందిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని ఆయన అంటున్నారు. సాళ్ల మధ్య, మొక్కల మధ్య 8 మీటర్ల ఎడంలో ఎకరాకు 62 మొక్కలు నాటుకోవచ్చు. చెట్లు, కొమ్మలు గుబురుగా, దట్టంగా పెరుగుతాయి, కొన్ని దశాబ్దాల పాటు పెద్ద చెట్లుగా ఎదుగుతాయి కాబట్టి ఎటు చూసినా 8 మీటర్ల దూరంలో చింత మొక్కలు నాటుకోవాలన్నారు. మొక్కలు నాటిన తర్వాత ఐదో ఏడాది కాపునకు వస్తాయి. పూత వచ్చిన 7–8 నెలలకు పండ్లు తయారవుతాయి. తొలి ఏడాది చెట్టుకు 15–20 కిలోల చింతపండ్ల దిగుబడి వస్తుంది. 10–12 సంవత్సరాల చెట్టు ఏటా 40–50 కిలోల దిగుబడినిస్తుంది. 20 సంవత్సరాల నుంచి ఒక్కో చెట్టుకు ఏటా 70–80 కిలోల చొప్పున చింత పండ్ల దిగుబడి వస్తుంది. చింత పండ్లను సేకరించి పైన పొలు, ఈనెలు, గింజలు తీసేస్తే.. 40–45 శాతం మేరకు నికరంగా చింత పండు చేతికి వస్తుందని డా. శ్రీనివాసులు తెలిపారు. ఏటా కాపు కాయడం ఈ రకం విశిష్టత కావడంతో రైతుకు లాభదాయకంగా ఉంటుంది.

అంటు మొక్కలు నాటుకుంటే 70–80 ఏళ్ల వరకు దిగుబడినిస్తాయి.

చింత గింజలు నాటితే చెట్లు 10–12 ఏళ్లకు గానీ కాపునకు రావు. కానీ, వందేళ్ల వరకు దిగుబడినిస్తాయి. అయితే, గింజ నాటినప్పటికన్నా అంటు నాటుకున్నప్పుడు జన్యుపరంగా ఖచ్చితమైన నాణ్యమైన చెట్లు రావడానికి అవకాశం ఉందన్నారు.

**అంతర పంటలుగా పప్పు ధాన్యాలు**

చింత మొక్కల మధ్య ఎటుచూసినా 8 మీటర్ల దూరం ఉంటుంది కాబట్టి.. మామిడి, చీనీ తోటల్లో మాదిరిగానే.. చింత తోటలు నాటిన కొన్ని ఏళ్ల పాటు రైతులు నిశ్చింతగా అంతర పంటలు వేసుకోవచ్చని డా. శ్రీనివాసులు తెలిపారు. అన్ని రకాల కూరగాయ పంటలు, వేరుశనగ, అలసంద, పెసర, మినుము, బీన్స్ వంటి పప్పుజాతి పంటలను అంతరపంటలుగా సాగు చేసుకోవచ్చన్నారు.

చింత చెట్లకు కాయతొలిచే పురుగు ఒక్కటే సమస్యగా గుర్తించారు. మూడు నాలుగు నెలల పాటు ఉండే పిందె దశలో 1 మి.లీ క్లోరిపైరిపాస్ లేదా 1.6 మి.లీ మోనోక్రోటోఫాస్ లేదా 2 మి.లీ డైమిథోయేట్ లేదా 1 మి.లీ డైక్లోరోవాస్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకుంటే కాయతొలిచే పురుగును నివారించుకోవచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు. డ్రిప్ ద్వారా నీటిని తగుమాత్రంగా అందించాలి. సేంద్రియ ఎరువులు, వేప చెక్కతో పాటు తగిన మోతాదులో రసాయన ఎరువులు వేసుకోవాలని డా. శ్రీనివాసులు సిఫారసు చేస్తున్నారు. అయితే, ప్రకృతి/సేంద్రియ వ్యవసాయ పద్ధతులను పాటించే రైతులు తమ పద్ధతుల ప్రకారం ఎరువులను, కషాయాలను వాడుకుంటూ చింత తోటలు సాగు చేసుకోవచ్చు.



ఎర్ర చింతపండుతో తయారైన వివిధ ఉత్పత్తులు

**– గంగుల రామలింగారెడ్డి,**
**సాక్షి, అంతపురం అగ్రికల్చర్**

# ప్రకృతి సేద్యమే ప్రాణం!

- ఐదేళ్లుగా రసాయనాల్లేని సేద్యం చేస్తున్న యువ రైతు దంపతులు
- ఎకరానికి రూ. 5 వేల వరకు తగ్గిన ఖర్చు, 30 బస్తాల ధాన్యం దిగుబడి
- సన్న రకం దేశీ వంగడం మైసూరు మల్లిగ సాగుపై దృష్టి



ఆకుకూరలకు ఘన జీవామృతం వేస్తున్న మాధవి

**ఆ**రోగ్యానికి, ఆదాయానికి ప్రకృతి వ్యవసాయమే మేలని యువ రైతు జిన్న రాజు, మాధవి దంపతుల కుటుంబం అనుభవపూర్వకంగా చెబుతోంది. గత ఐదేళ్లుగా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో వరి, కూరగాయలు, పప్పుధాన్యాలు సాగు చేసుకుంటూ రసాయనిక అవశేషాల్లేని ఆరోగ్యవంతమైన ఆహారాన్ని తాము తింటూ, పరిసర గ్రామాల ప్రజలకు కూడా అందుబాటులోకి తేవడం విశేషం. మెదక్ జిల్లా పాపన్నపేట మండలం నార్సింగి గ్రామానికి చెందిన జిన్న బేతయ్య–లింగమ్మ దంపతుల సంతానం బాలయ్య, రాజు, కృష్ణ. రెండు బోరుబావులతో కూడిన ఐదు ఎకరాల సాగు భూమే వీరి జీవనాధారం. అందరి లాగే రసాయనిక ఎరువులు, పురుగు మందులతో వీరి వ్యవసాయం కొనసాగింది. ఆ క్రమంలో ఎంసీఏ చదువుకున్న బాలయ్య సాఫ్ట్వేర్ ఉద్యోగం చేస్తూ గ్రామభారతి ద్వారా ప్రకృతి వ్యవసాయం గురించి తెలుసుకొని తన కుటుంబానికి పరిచయం చేశారు. పంట పొలాన్నే ప్రాణంగా నమ్ముకున్న భర్త రాజు, అతని భార్య మాధవి ప్రకృతి వ్యవసాయంపై పాలేకర్ పుస్తకం చదివి.. ఆ ప్రకారంగా ఐదేళ్ల క్రితం వరి, కూరగాయలను ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేయనారంభించారు. టేక్మాల్ మండలం శేరిపల్లి గ్రామంలో విఠల్–బూదెమ్మ దంపతుల కుమార్తె అయిన మాధవి తొమ్మిదో తరగతి వరకు చదువుకుంది. రాజును పెళ్లి చేసుకున్న తర్వాత ఆమె పొలం పనుల్లో తన భర్తకు చేదోడు వాదోడుగా ఉంటోంది. రాజు, మాధవి సహా ఇంటిల్లపాదీ పొలానికి వెళ్లి పనులన్నీ చేసుకుంటారు.

**ఎకరానికి 400 కిలోల ఘనజీవామృతం**

మాచవరంలో ప్రకృతి వ్యవసాయదారుడు కోటపాటి మురహరి రావు, హైదరాబాద్లో విజయరామ్ ఆధ్వర్యంలో జరిగిన సభల్లో పాల్గొన్న రాజు ప్రకృతి వ్యవసాయంలో పాటించాల్సిన ముఖ్య సూత్రాలు, ఎరువులు, కషాయాలు తయారీ పద్ధతులపై అవగాహన పెంచుకున్నాడు. అతని భార్య మాధవి పాలేకర్ పుస్తకాన్ని చదివి ప్రకృతి వ్యవసాయ పరిజ్ఞానం పెంచుకున్నారు. దంపతులు శ్రద్ధగా ఆచరణలో పెట్టారు. ఘనజీవామృతం, జీవామృతం, కషాయాలను సొంతంగానే తయారు చేసుకొని వాడుతున్నారు. రసాయనిక ఎరువులు, పురుగుమందులకు స్వస్తి చెప్పడంతో వరి సాగులో ఎకరానికి రూ. 4 వేల నుంచి 5 వేల వరకు ఖర్చు తగ్గిపోయిందని, ఐదెకరాలకు సరిపోను ఘనజీవామృతం, జీవామృతం తయారీకి రూ. రెండు వేల ఖరీదైన బెల్లం కొంటే సరిపోతున్నదని రాజు చెప్పాడు. వరిలో ఎకరానికి దుక్కిలో 200 కిలోలు, కలుపు తీసిన తర్వాత మరో 200 కిలోల చొప్పున ఘన జీవామృతం వాడుతున్నారు. ప్రతి 15 రోజులకోసారి ద్రవ జీవామృతం నీటితోపాటు క్రమం తప్పకుండా అందిస్తున్నారు. వరి దిగుబడి ఎకరానికి 30 బస్తాలు(20 క్వింటాళ్ల) వరకు వస్తున్నదని రాజు వివరించారు. వరితోపాటు ఇంట్లోకి అవసరమైన ఇతర పంటలన్నీ కొద్ది విస్తీర్ణంలో పండించుకుంటుండడం ఈ రైతు కుటుంబం ప్రత్యేకత. కూరగాయలు, ఆకుకూరలు, ఉల్లి, వెల్లుల్లి, పప్పులు.. తమ కుటుంబానికి సరిపడా ఏడాది పొడవునా సాగు చేసుకొని తింటుండడం విశేషం.



మైసూరు మల్లిగ పొలంలో రాజు, బాలయ్య

**దేశీ వంగడం మైసూరు మల్లిగ**

గతంలో సాధారణ వరి రకాలు సాగు చేసిన రాజు, మాధవి గత ఏడాది నుంచి దేశీ వంగడాలను సాగు చేస్తున్నారు. హైదరాబాద్ సేవ్ సంస్థ దేశీ విత్తనోత్సవంలో పాల్గొని తెచ్చుకున్న ఐదు రకాల దేశీ వరి వంగడాలను ఒక్కో ఎకరంలో గత ఏడాది సాగు చేశారు. అందులో దిగుబడి మెరుగ్గా ఉన్న సన్న రకం దేశీ వంగడం మైసూరు మల్లిగను ఈ ఏడాది మూడున్నర ఎకరాల్లో సాగు చేస్తున్నారు. దూదేశ్వర్ అనే మరో దేశీ రకాన్ని అరెకరంలో సాగు చేస్తున్నారు. పండించిన ధాన్యాన్ని నిల్వ పెట్టుకొని చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వారికి బియ్యం క్వింటాలు రూ. 6,500 చొప్పున అమ్ముతూ మంచి ఆదాయం గడిస్తున్నామని, రసాయనాల్లేని ఆహారం తింటూ ఆరోగ్యంగా ఉన్నామని రాజు(99634 49223) అన్నారు.

**– కిషోర్ పెరుమాండ్ల, సాక్షి, మెదక్**

# చలికాలపు ఇంటిపంటలు



**చ**లికాలంలో ఇంటిపెరట్లో, మేడపైన సేంద్రియ పద్ధతుల్లో సాగు చేసుకోదగిన ప్రత్యేక కూరగాయ రకాలు కొన్ని ఉన్నాయి. ఆకుకూరలను ఏడాదిలో ఎప్పుడైనా సాగు చేసుకోవచ్చు. వర్షాకాలం ముగిసి శీతాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఆలూ/బీన్స్, క్యాబేజ్, క్యాలీ ఫ్లవర్, కాప్సికం, ఉల్లి, ముల్లంగి, వంగ, క్యారట్, టమాట, గోరుచిక్కుడు, పాలకూర, మెంతికూర వంటి రకాలను ఈ సీజన్లో నిక్షేపంగా సాగు చేసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. వర్షాకాలం సుదీర్ఘంగా కొనసాగడం వల్ల శీతాకాలపు పంటలకు సంబంధించి ఇప్పుడు నారు పోసుకోవడం కన్నా.. దగ్గరల్లోని నర్సరీల నుంచో, సీనియర్ ఇంటిపంటల సాగుదారుల నుంచో మొక్కల నారును తెచ్చుకొని నాటుకోవడం మేలు. ఈ సీజన్లో కుండీలు, మడుల్లో మొక్కలకు నీరు అంత ఎక్కువగా అసవరం ఉండదు. తేమను బట్టి తగుమాత్రంగా నీటిని అందించుకోవడం అవసరమని ఇంటిపంటల సాగుదారులు గుర్తించాలి.

## 1న తిరుపతిలో సిరిధాన్యాలపై రౌండ్ టేబుల్ సమావేశం

**సి**రిధాన్యాలు సాగు చేస్తున్న రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిం చేందుకు భారతీయ కిసాన్ సంఘ్, ఆం.ప్ర. గోఆధారిత వ్యవసాయదారుల సంఘం ఆధ్వర్యంలో నవంబర్ 1వ తేదీ(శుక్రవారం)న తిరు పతిలోని యూత్ హాస్టల్ (ముత్యాలరెడ్డి పల్లి)లో ఉ. 10 గం. నుంచి రౌండ్ టేబుల్ సమావేశం జరగనుంది. సిరిధాన్యాలు సాగు చేసే రైతుల సమస్యలను క్రోడీకరించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరింపజేయడానికి ఈ సమావేశం నిర్వహిసున్నట్లు బీకేఎస్ నేత కుమారస్వామి తెలిపారు. వివరాలకు.. గంగాధర్ – 98490 59573.

## 3న మేలైన పశుగ్రాసాల సాగుపై కొర్నెపాడులో శిక్షణ

**రై**తునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా పుల్లడిగుంట దగ్గర కొర్నెపాడులో నవంబర్ 3వ తేదీ(ఆదివారం)న ఉ.10 గం. నుంచి సా. 4 గం. వరకు సూపర్ నేపియర్ తదితర మేలైన పశుగ్రాసాల సాగుపై గన్నవరం పశువైద్యకళాశాల ప్రొఫెసర్ డా.సి.హెచ్. వెంకటశేషయ్య, పాడి రైతు విజయ్ (గుంటూరు) రైతులకు శిక్షణ ఇస్తారని ఫౌండేషన్ చైర్మన్ డా. వై. వెంకటేశ్వరరావు తెలిపారు. సూపర్ నేపియర్ కణుపులు కొన్నిటిని శిక్షణ పొందే రైతులకు పంపిణీ చేస్తామన్నారు. వివరాలకు.. 97053 83666, 0863–2286255.

## 3న బసంపల్లిలో ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

**ప్ర**కృతి వ్యవసాయ పద్ధతిలో సీజనల్ పంటలు, పండ్లతోటల సాగుపై నవంబర్ 3వ తేదీ (ప్రతి నెలా మొదటి ఆదివారం)న అనంతపురం జిల్లా సికెపల్లి మండలం బసంపల్లిలోని దేవాలయ ఆశ్రమ ప్రాంగణంలో రైతులకు సీనియర్ ప్రకృ తి వ్యవసాయదారుడు నాగరాజు శిక్షణ ఇస్తారు.

ఉ. 9 గం. నుంచి సా. 4 గం. వరకు శిక్షణ ఇస్తారు. రుసుము రూ. 100. వివరాలకు.. 91826 71819, 94403 33349.

## నారాయణపేట, నాగర్కర్నూల్, రంగారెడ్డి జిల్లాల్లో నవంబర్ 10, 11 తేదీల్లో డా. ఖాదర్వలి సభలు

**సి**రిధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం పొందే మార్గాలు, సిరిధాన్యాల సాగు పద్ధతులపై రైతులోకం ఫౌండేషన్, తెలంగాణ ఇంజనీర్ల సంఘం ఆధ్వర్యంలో నవంబర్ 10 (ఆదివారం) ఉ. 10 గం. నుంచి మ. 2 గం. వరకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లా కేంద్రం **నారాయణపేట**లోని జీపీ శెట్టి ఫంక్షన్ హాల్లో జరిగే సదస్సులో ప్రముఖ స్వతంత్ర శాస్త్రవేత్త, ఆహార – ఆరోగ్య నిపుణులు డా. ఖాదర్ వలి (మైసూరు) ప్రసంగిస్తారు. వివరాలకు.. జె.సి.ఎం. – 93965 84805.

అదేరోజు సా. 4 గం. నుంచి 7 గం. వరకు **నాగర్కర్నూల్**లో మార్కెట్ యార్డు (కలెక్టర్ ఆఫీసు ఎదురుగా) జరిగే సభలో డా. ఖాదర్ ప్రసంగిస్తారు. వివరాలకు.. నవీన్ – 90522 22244.

నవంబర్ 11(సోమవారం)న మధ్యాహ్నం 2 గం. నుంచి సా. 5 గం. వరకు రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం **పాల్మకుల్** గ్రామంలోని స్కూల్ గ్రౌండ్లో జరిగే సభలో డా. ఖాదర్ వలి ప్రసంగిస్తారు. వివరాలకు.. రాజ్ భూపాల్ – 90901 29999. ప్రొఫెసర్ (డా.) డి. రామ్కిషన్– 94407 12021, మేరెడ్డి శ్యాంప్రసాద్రెడ్డి – 99638 19074. ప్రవేశం ఉచితం. అందరూ ఆహ్వానితులే.

**3న ఆదిలాబాద్, 4న కొత్తపేట(హైదరాబాద్)లో..**

ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ సహకారంతో నవంబర్ 3 (ఆదివారం) ఉ. 10 గం. నుంచి ఆదిలాబాద్లోని జిల్లా పరిషత్ మీటింగ్ హాల్లో సిరిధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యంపై జరిగే అవగాహన సదస్సులో డా. ఖాదర్ వలి ప్రసంగిస్తారని రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ డా. వై. వెంకటేశ్వరరావు తెలిపారు. అదేవిధంగా, 4(సోమవారం)న సా. 4 గం. నుంచి 7 గం. వరకు హైదరాబాద్ దిల్సుఖ్నగర్ వద్ద కొత్తపేటలోని బాబూ జగ్జీవన్రాం హాల్ (రైతు బజార్ పక్కన)లో జరిగే సదస్సులో డా. ఖాదర్వలి ప్రసంగిస్తారని ఆయన తెలిపారు. ప్రవేశం ఉచితం. వివరాలకు.. 70939 73999, 96767 97777.

• డెయిరీ డైరీ-13

## పాడి పశువుల ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే అంశాలు



**పా**డి పశువుల పోషణ, నిర్వహణతోపాటు వాటి ఆరోగ్యం పట్ల కూడా శ్రద్ధవహించడం ఎంతో ముఖ్యం. పాడి పశువులు సక్రమంగా మేత మేస్తూ, ఇతర ఇబ్బందులు లేకుండా, దిగుబడి తగ్గకుండా పాలు ఇస్తున్నట్లయితే అవి ఆరోగ్యంగా ఉన్నాయని తెలుసుకోవాలి.

**అనారోగ్య సూచనలు:** పశువు మందకొడిగా ఉండడం, ముట్టె తడి ఆరిపోయి ఉండడం, కళ్లు ఎర్రబడడం లేదా పుసులు కారడం, మేత తినదు, నెమరు వేయదు, పొట్ట కదలకుండా ఉబ్బరంగా ఉండడం, శరీరం వేడిగా జ్వరంతో ఉండడం, పలుచటి పేడ వేయడం, వణకటం, దద్దుర్లు రావడం, పాల ఉత్పత్తి ఒకేసారి తగ్గించడం/ క్రమేపీ తగ్గించడం, మూత్రం రంగు మారడం. ఈ లక్షణాలు పాడి పశువుల్లో కనిపించినట్లయితే ఊగిలెనంత త్వరగా పశువైద్యుడ్ని సంప్రదించి చికిత్స చేయించుకోవాలి.

**పశువుల ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే అంశాలు**

**వాతావరణం:** విదేశీ ఆవులు వేడి వాతావరణాన్ని తట్టుకోలేవు. అందుకే 50% సంకర జెర్సీ ఆవును లేదా సంకరజాతి హెచ్.ఎఫ్. జాతి ఆవులను ఎన్నుకోవాలి. ఎండలో మేపకుండా ఇంటి వద్దనే చెట్ల నీడలలో గానీ, పాక లేదా తాటాకు షెడ్ల కింద చల్లటి వాతావరణంలో పోషించినట్లయితే మంచి పాలదిగుబడినిస్తాయి.

గేదెలు నల్ల చర్మం కలిగి ఉండటం వలన వేసవి తాపాన్ని తట్టుకోలేవు. వాటిని ఉదయం పూటనే మేతకు పంపాలి. పగటిపూట ఇంటి వద్ద చల్లటివాతావరణంలో పోషించాలి. అప్పుడే వాటి ఉత్పాదకత కోల్పోకుండా మంచి పాలదిగుబడినిస్తాయి.

**పరిసరాలు :** పాడి పశువులను పెంచే స్థలాల వద్ద పరిసరాలు శుభ్రతగా ఉండే విధంగా చూసుకోవాలి. సరైన గాలి, వెలుతురు వచ్చే విధంగా చూసుకోవాలి. మురికి నీరు నిలవకుండా చూసుకోవాలి. దాని వల్ల దోమలు, ఈగలు మొదలగు వాటిని అరికట్టి కొన్ని రకాల వ్యాధులు సోకకుండా చూసుకోవచ్చు.

**మేత, తాగునీరు:** పాడి పశువులకు మంచి పోషకాహార పదార్థాలు కలిగిన మేత సరిపోయేంత ఇవ్వాలి. పాడి పశువులకు ఇచ్చే మేత దాని శరీర అవసరానికి పోను పాల ఉత్పత్తి కోసం, ఒక వేళ సూడితో ఉన్నట్లయితే గర్భంలో పెరిగే పిండానికి అధిక పోషకాహారం అందించవలసి ఉంటుంది. అందుకే పాడి పశువులకు నాణ్యమైన మేత, దాణా సరిపోయేంత ఇవ్వాలి. పరిశుభ్రమైన తాగునీరు ఎల్లవేళలా అందుబాటులో ఉంచాలి. మురికినీరు, కలుషితప్రాంతాలలో నీరు తాగించడం వల్ల పాడి పశువులు అనారోగ్యానికి గురవుతాయి.

రైతు ప్రతి రోజూ తన పాడి పశువులను గమనించి ఏవైనా అనారోగ్య లక్షణాలు కనిపిస్తే పశువైద్యునిచే చికిత్స చేయించాలి. అశ్రద్ధ కనపరిస్తే నష్టం అపారం కాబట్టి అప్రమత్తంగా ఉండాలి.



epaper.sakshi.com

# సాక్షి భవిత

**స్పర్ధయా వర్ధతే విద్య**

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

మంగళవారం
29-10-2019


## విద్య, ఉద్యోగ సమాచారం

### జేపీసీలో 4 పోస్టులు

కోల్‌కతాలోని భారత ఉక్కు మంత్రిత్వ శాఖకు చెందిన జాయింట్ ప్లాంట్ కమిటీ ఒప్పంద ప్రాతిపదికన 4 యంగ్ ప్రొఫెషనల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ/బీటెక్/ఎంసీఏ/ఎంఎస్సీ/ఎంబీఏ/ పీజీడీఎం/ఐసీఏ/ఐసీఎంఏ ఉత్తీర్ణతతో పాటు అనుభవం ఉండాలి.
- **వయసు:** 2019, నవంబర్ 4 నాటికి 32 ఏళ్లు మించకూడదు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఎంపిక:** షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తుకు చివరితేదీ:** నవంబర్ 4, 2019.
- **వెబ్‌సైట్:** http://jpcindiansteel.nic.in

### సీజీడబ్ల్యూఏలో 5 పోస్టులు

న్యూఢిల్లీలోని భారత ప్రభుత్వ జల శక్తి మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ గ్రౌండ్ వాటర్ అథారిటీ (సీజీడబ్ల్యూఏ) ఒప్పంద ప్రాతిపదికన 5 యంగ్ ప్రొఫెషనల్ (గ్రౌండ్ వాటర్, లీగల్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో బ్యాచిలర్స్ డిగ్రీ, ఎంఎస్సీ/ఎంటెక్ ఉత్తీర్ణతతో పాటు అనుభవం ఉండాలి.
- **వయసు:** 2020, జనవరి 1 నాటికి 30 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక:** షార్ట్‌లిస్టింగ్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఈ-మెయిల్/ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** నవంబర్ 15, 2019.
- **వెబ్‌సైట్:** http://legalaffairs.gov.in

### జవహర్ నవోదయ విద్యాలయాల్లో తొమ్మిదో తరగతి ప్రవేశాలు

కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ పరిధిలోని అటానమస్ సంస్థ నవోదయ విద్యాలయ సమితి... దేశవ్యాప్తంగా (తమిళనాడు మినహా) ఉన్న జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2020-21 విద్యా సంవత్సరానికి తొమ్మిదో తరగతిలో ఖాళీ సీట్ల భర్తీకి(లేటరల్ ఎంట్రీ టెస్ట్) దరఖాస్తులు కోరుతోంది.

- **ఏ తరగతిలో:** తొమ్మిదో తరగతిలో ఖాళీగా ఉన్న సీట్లలో ప్రవేశాలు.
- **అర్హత:** 2019-20 విద్యా సంవత్సరంలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు.
- **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్ష ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** డిసెంబర్10, 2019
- **పరీక్ష తేదీ:** ఫిబ్రవరి 10, 2020. సంబంధిత జిల్లాలోని జవహర్ నవోదయ విద్యాలయం లేదా నవోదయ విద్యాలయ సమితి కేటాయించిన కేంద్రంలో పరీక్ష ఉంటుంది.
- **వెబ్‌సైట్:** https://navodaya.gov.in/nvs/en/Home1

### నిఫ్ట్‌లో 2020 ప్రవేశాలు

భారత ప్రభుత్వ టెక్స్‌టైల్ మంత్రిత్వ శాఖకు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (నిఫ్ట్)-2020కి గాను బ్యాచిలర్ డిగ్రీ, పీజీ ప్రోగ్రాముల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

**విభాగాలు**
1. బ్యాచిలర్ ప్రోగ్రాములు (బి.డిజైన్, బి.ఫ్యాషన్ టెక్నాలజీ)
2. పీజీ ప్రోగ్రాములు (ఎం.డిజైన్, ఎం.ఫ్యాషన్ టెక్నాలజీ, ఎం.ఫ్యాషన్ మేనేజ్‌మెంట్).

- **అర్హత:** బ్యాచిలర్ ప్రోగ్రాములకు ఇంటర్మీడియట్/డిప్లొమా ఉత్తీర్ణత. పీజీ ప్రోగ్రాములకు బీఎఫ్‌టెక్/బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతో పాటు సాట్, జీమ్యాట్, జీఆర్ఈ స్కోర్ ఉండాలి.
- **ఎంపిక:** ప్రవేశ పరీక్ష (క్యాట్, గ్యాట్), సిట్యుయేషన్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **పరీక్ష తేదీ:** జనవరి 19, 2020.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ (ఎన్‌సీఎల్), జనరల్-ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.2 వేలు; ఎస్సీ, ఎస్టీ, వికలాంగులకు రూ.1000.
- **దరఖాస్తుకు చివరితేదీ:** డిసెంబర్ 31, 2019. (రూ.5 వేల ఆలస్య రుసుముతో జనవరి 4, 2020 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు).
- **వెబ్‌సైట్:** https://nift.ac.in


**సాక్షి ఎడ్యుకేషన్ వెబ్‌సైట్లో..**

- వీక్లీ కరెంట్ అఫైర్స్ బిట్‌బ్యాంక్
- డీఎస్సీ స్టడీ మెటీరియల్, బిట్‌బ్యాంక్, మోడల్‌పేపర్స్, వీడియో గైడెన్స్
- టెన్త్ స్టడీ మెటీరియల్, మోడల్‌పేపర్స్
- ఎస్ఐ, కానిస్టేబుల్ స్టడీ మెటీరియల్, మోడల్ పేపర్స్, వీడియో గైడెన్స్

విద్య, ఉద్యోగ సమాచారం కోసం
WWW.SAKSHIEDUCATION.COM
SAKSHI CURRENT AFFAIRS
యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి


# కెనడా వయా ఎస్‌పీపీ

**స్టడీ అబ్రాడ్, పోస్ట్ స్టడీ వర్క్ పరంగా ఇటీవల కాలంలో మన దేశ విద్యార్థుల ప్రాథమ్యంగా మారుతోంది కెనడా..! ఆ దేశ ప్రభుత్వం విదేశీ విద్యార్థులను ఆకర్షించేందుకు నిబంధనలను సరళీకృతం చేస్తుండటమే ఇందుకు కారణం! అంతేకాకుండా.. భారతీయ విద్యార్థులు కెనడాలోని కళాశాలల్లో సులభంగా ప్రవేశాలు పొందేలా ప్రత్యేక ఒప్పందాలు కూడా చేసుకుంటోంది. ఇంటర్మీడియెట్ నుంచే కెనడాలో అడుగుపెట్టేందుకు.. ఆపై అక్కడే వర్క్ పర్మిట్ పొందేందుకు.. వీలు కల్పించే విధానమే.. ఎస్‌పీపీ (స్టూడెంట్ పార్ట్‌నర్‌షిప్ ప్రోగ్రామ్)!! ఆయా కోర్సులకు సంబంధించి అవసరమైన ప్రామాణిక పరీక్షల స్కోర్ల మినహాయింపు, వీసా, ఎస్‌పీపీ విధానంతోపాటు కెనడాలో విద్య, ఉద్యోగావకాశాలపై కథనం..**




- ఇంటర్మీడియెట్ అర్హతతోనే కెనడాలో అడుగు పెట్టే అవకాశం
- పబ్లిక్, ప్రయివేట్ యూనివర్సిటీల్లో స్టడీ, పోస్ట్ స్టడీ అవకాశాలు విస్తృతం

విదేశీ విద్య అంటే ఎక్కువ మంది మాస్టర్ కోర్సుల గురించే ఆలోచిస్తారు. అయితే కెనడాలో ప్రస్తుతం అమల్లో ఉన్న స్టూడెంట్ పార్ట్‌నర్‌షిప్ ప్రోగ్రామ్(ఎస్‌పీపీ) కాలేజెస్ విధానంలో ఇంటర్‌తోనే అక్కడి కళాశాలల్లో అడుగుపెట్టొచ్చు. ఆ తర్వాత రెండేళ్ల వర్క్ పర్మిట్ కూడా సొంతం చేసుకునే వీలుంది.

#### ఎస్‌పీపీ కాలేజెస్ అంటే

వాస్తవానికి ఎస్‌పీపీ (స్టూడెంట్ పార్ట్‌నర్‌షిప్ ప్రోగ్రామ్) కాలేజెస్ అనేది కెనడా విద్యా విధానాల్లో ఒకటి. ఇందులో అసోసియేషన్ ఆఫ్ కెనడియన్ కమ్యూనిటీ కాలేజెస్, సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ కెనడా భాగస్వామ్యంలో.. కోర్సులు అందిస్తున్న కళాశాలలనే ఎస్‌పీపీ కాలేజెస్ అని పిలుస్తారు.

#### భారత్‌తో ఒప్పందం

ఎస్‌పీపీ కాలేజెస్ విధానంలో భారత విద్యార్థులను ఆకర్షించేందుకు కెనడా, భారత్‌తో ఒప్పందం చేసుకుంది. ఫలితంగా ఆ దేశ కళాశాలల్లో భారతీయ విద్యార్థులు సులభంగానే ప్రవేశం పొందొచ్చు. వీసా మంజూరు, ట్యూషన్ ఫీజు, ప్రామాణిక టెస్ట్ స్కోర్ల పరంగా సరళమైన నిబంధనలు అమలుచేస్తోంది. ముఖ్యంగా కోర్సు పూర్తయ్యాక రెండేళ్ల వ్యవధికి వర్క్ పర్మిట్ అందించడం.. భారత విద్యార్థులకు అత్యంత ప్రయోజనకరంగా చెప్పొచ్చు.

#### సర్టిఫికెట్ నుంచి అడ్వాన్స్‌డ్ డిప్లొమా వరకు

ఎస్‌పీపీ కాలేజెస్ విధానంలో ఆయాకళాశాలల్లో ఇంటర్మీడియెట్, బ్యాచిలర్ డిగ్రీ, మాస్టర్ డిగ్రీ అర్హతగా పలు కోర్సులు అందుబాటులో ఉన్నాయి. డిప్లొమా ప్రోగ్రామ్స్‌కు ఇంటర్ అర్హతతోనే దరఖాస్తు చేసుకోవచ్చు. అడ్వాన్స్‌డ్ డిప్లొమా ప్రోగ్రామ్స్‌కు మాత్రం బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత తప్పనిసరి. ఆయా కళాశాలల నిబంధనల ప్రకారం- ఇంటర్, బ్యాచిలర్ డిగ్రీలో 50శాతం నుంచి 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. లాంగ్వేజ్ టెస్ట్ స్కోర్ పరంగా ఐఈఎల్‌టీఎస్‌లో 6-6.5 బ్యాండ్స్ పొందాలి.

#### జీఆర్ఈ లేకపోవడం

ఎస్‌పీపీ కాలేజెస్ విధానంలో మరో ప్రధాన ప్రత్యేకత.. సైన్స్, టెక్నాలజీ కోర్సులకు అవసరమైన జీఆర్ఈ టెస్ట్ స్కోర్ నుంచి మినహాయింపు ఇవ్వడం. కొన్ని కళాశాలలు ఐఈఎల్‌టీఎస్ స్కోర్ విషయంలోనూ మినహాయింపు ఇస్తున్నాయి. 5.5 బ్యాండ్స్ స్కోర్‌తోనూ దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. ఈ కళాశాలల్లో టెక్నాలజీ, డిజైన్, ఫ్యాషన్, మీడియా అండ్ ఆర్ట్స్, అకౌంటింగ్ అండ్ ఫైనాన్స్, మార్కెటింగ్, హెచ్ఆర్, మేనేజ్‌మెంట్, సోషల్ అండ్ కమ్యూనిటీ సర్వీసెస్, కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్, హెల్త్ సైన్సెస్, హాస్పిటల్ అండ్ హోటల్ మేనేజ్‌మెంట్ వంటి విభాగాల్లో డిప్లొమా నుంచి అడ్వాన్స్‌డ్ డిప్లొమా వరకు పలు కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

#### ఉద్యోగావకాశాలు

ఎస్‌పీపీ కళాశాలల్లో కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థులు అక్కడే ఉద్యోగావకాశాలు అందుకోవచ్చు. ఎస్‌పీపీ కాలేజెస్‌లో కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థులకు సీఎస్ఈ, ఐటీ, బిజినెస్ అండ్ ఫైనాన్స్, బయో సైన్సెస్, మెడిసిన్ అండ్ హెల్త్‌కేర్, మీడియా అండ్ జర్నలిజం ఇలా పలు రంగాల్లో ఉద్యోగావకాశాలు సులభంగా లభిస్తున్నాయి. వేతనం నెలకు సగటున నాలుగు వేల నుంచి అయిదు వేల కెనడియన్ డాలర్ల మధ్యలో ఉంటోంది. కోర్సు సమయంలో ఇన్ క్యాంపస్-ఔట్ క్యాంపస్ పరిధిలో పలు పార్ట్ టైమ్ వర్క్ అవకాశాలు కూడా అందుకోవచ్చు. ఈ విధానంలో వారానికి 20 గంటలు పని చేసే వీలుంటుంది. సగటున నెలకు 800 నుంచి 1000 కెనడియన్ డాలర్లు పార్ట్ టైమ్ వర్క్ చేస్తూ సంపాదించుకోవచ్చు.

#### పబ్లిక్ యూనివర్సిటీస్

కెనడాలో ప్రస్తుతం యూనివర్సిటీ స్థాయిలోనూ సరళీకృత విధానాలు అమలవుతున్నాయి. ప్రభుత్వ పరిధిలో ఉండే పబ్లిక్ యూనివర్సిటీస్‌లో ప్రవేశం పొందాలంటే.. అకడమిక్‌గా ఉత్తమ ప్రతిభ(70 శాతంపైగా మార్కులతో ఉత్తీర్ణత)తోపాటు ఐఈఎల్‌టీఎస్, జీఆర్ఈలలో బెస్ట్ స్కోర్స్ ఉండాలి. ఐఈఎల్‌టీఎస్‌లో 7 బ్యాండ్స్, జీఆర్ఈ స్కోర్ 300-310 మధ్య శ్రేణిలో ఉంటే.. ప్రవేశం సులభంగా లభిస్తుంది. వీటిలో మాస్టర్ స్థాయి కోర్సులు పూర్తి చేసుకున్న అభ్యర్థులకు మెరుగైన అవకాశాలు లభిస్తాయని చెప్పొచ్చు. ట్యూషన్ ఫీజుకు సంబంధించి 50 శాతం మేరకు స్కాలర్‌షిప్ లభించే అవకాశం ఉంది.

#### ప్రైవేటు యూనివర్సిటీలు

భారతీయ విద్యార్థులు ఎక్కువగా ప్రైవేట్ యూనివర్సిటీల్లోనే చేరుతున్నారు. వీటిలోనూ ప్రధానంగా మేనేజ్‌మెంట్, సీఎస్, ఐటీ కోర్సుల్లో పీజీ ప్రోగ్రామ్స్ కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. పబ్లిక్ యూనివర్సిటీలతో పోల్చితే ప్రైవేటు యూనివర్సిటీల్లో ఫీజులు కొంత ఎక్కువనే చెప్పాలి. ఏడాదికి రూ. పది లక్షల నుంచి రూ.12లక్షల వరకు ట్యూషన్ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. అదే విధంగా అకడమిక్‌గా నాలుగేళ్ల బ్యాచిలర్ డిగ్రీ, 6.5 బ్యాండ్స్‌తో ఐఈఎల్‌టీఎస్, 290కు పైగా జీఆర్ఈ స్కోర్ తప్పనిసరి.

#### వీరికి మూడేళ్ల వర్క్ పర్మిట్

యూనివర్సిటీ స్థాయిలో మాస్టర్ కోర్సులు పూర్తి చేసిన వారికి కోర్సు పూర్తయ్యాక మూడేళ్ల వర్క్ పర్మిట్ మంజూరు చేస్తారు. అంతేకాకుండా వీరికి లభించే ఉద్యోగావకాశాలు, వేతనాలు కూడా ఆకర్షణీయంగా ఉంటున్నాయి. ప్రారంభంలోనే సగటున నెలకు అయిదు వేల నుంచి ఎనిమిది వేల కెనడియన్ డాలర్లతో ఉద్యోగం సొంతం చేసుకోవచ్చు. అదే విధంగా చదువుకుంటున్న సమయంలో పార్ట్ టైమ్ వర్క్ విధానంలో నెలకు ఎనిమిది వందల నుంచి రెండు వేల కెనడియన్ డాలర్ల మేరకు ఆదాయం పొందొచ్చు. వీటిద్వారా నివాస ఖర్చులు, ఇతర వ్యక్తిగత ఖర్చుల నుంచి కొంత ఉపశమనం లభిస్తుంది.

#### కెనడా స్టడీ / పోస్ట్ స్టడీ వర్క్.. ముఖ్యాంశాలు



- ఎస్‌పీపీ కాలేజెస్ విధానంలో ఇంటర్ అర్హతతోనే అడుగు పెట్టే అవకాశం.
- డిప్లొమా, పీజీ డిప్లొమా కోర్సులు పూర్తి చేసుకోవడం ద్వారా మంచి వేతనాలతో ఉద్యోగం సొంతం చేసుకునే అవకాశం.
- జీఆర్ఈ అవసరం లేకుండానే ఎస్‌పీపీ కాలేజెస్‌లో ప్రవేశం.
- కోర్సు పూర్తయ్యాక రెండేళ్ల వర్క్ పర్మిట్.
- యూనివర్సిటీ స్థాయిలో ప్రైవేటు, పబ్లిక్ యూనివర్సిటీల్లో పీజీ కోర్సులు పూర్తి చేసుకొని నైపుణ్యాలు అందిపుచ్చుకుంటే నెలకు అయిదు వేల నుంచి ఎనిమిది వేల వరకు కెనడియన్ డాలర్ల వేతనం అందుకునే అవకాశం.

#### సగటు విద్యార్థులకు ఎస్‌పీపీ కాలేజ్‌లు అనుకూలం

అకడమిక్‌గా యావరేజ్‌గా ఉన్న విద్యార్థులకు, ఐఈఎల్‌టీఎస్‌లో తక్కువ స్కోర్ సాధించిన వారికి, జీఆర్ఈ స్కోర్ లేకున్నా.. కెనడాలో అడుగుపెట్టాలనుకునే విద్యార్థులకు ఎస్‌పీపీ కాలేజ్‌లు చక్కటి మార్గం అని చెప్పొచ్చు. ఇవి కేవలం డిప్లొమా, పీజీ డిప్లొమా కోర్సులనే అందిస్తున్నప్పటికీ.. ప్రవేశ ప్రక్రియ సులభంగా ఉంటుంది. వీసా కూడా సులభంగా మంజూరవుతుంది. అంతేకాకుండా ఫీజుల పరంగానూ విద్యార్థులకు ఇవి ఎంతో అనుకూలంగా నిలుస్తున్నాయి. ముఖ్యంగా వీటిలో డిప్లొమా, పీజీ డిప్లొమా పూర్తి చేసుకోవడం ద్వారా ఉద్యోగావకాశాలు అందుకోవచ్చు. అయితే అకడమిక్‌గా చక్కటి ప్రతిభ, ఇతర స్టాండర్డ్ టెస్ట్ స్కోర్స్ పరంగా ఉన్నతంగా ఉన్న విద్యార్థులు పబ్లిక్ యూనివర్సిటీలకు దరఖాస్తు చేసుకోవడం మంచిది.



– పాలెపు సుమంత్, సీఎండ
Conduira WWEC

# 2019 బుకర్ ప్రైజ్ విజేతలు..?

**పోటీ పరీక్షల ప్రత్యేకం**
**జీకే అండ్ కరెంట్ అఫైర్స్**




**2019 బుకర్ ప్రైజ్‌ను ఎవరికి ప్రకటించారు?**
1) మార్గరెట్ అట్‌వుడ్, లూసీ ఎల్‌మన్
2) మార్గరెట్ అట్‌వుడ్, సల్మాన్ రష్దీ
3) ఎలిఫ్ షఫాక్, మార్గరెట్ అట్‌వుడ్
4) మార్గరెట్ అట్‌వుడ్, బెర్నార్డైన్ ఎవరిస్టో
**సమాధానం: 4**

- ఆంగ్ల సాహిత్యంలో ఉత్తమ రచనకుగాను ప్రతియేటా బ్రిటన్‌లో బుకర్ ప్రైజ్‌ను ప్రధానం చేస్తారు. 2019కి గాను ఈ ఏడాది అక్టోబర్ 14న లండన్‌లో ప్రకటించారు. కెనెడియన్ రచయిత్రి మార్గరెట్ అట్‌వుడ్, బ్రిటన్ రచయిత్రి బెర్నార్డిన్ ఎవరిస్టోలకు సంయుక్తంగా ఈ బహుమతి లభించింది. మార్గరెట్ అట్‌వుడ్ రాసిన 'ద టెస్టామెంట్స్', బెర్నార్డిన్ ఎవరిస్టో రాసిన 'గర్ల్, ఉమెన్, అదర్' అనే పుస్తకాలకు ఈ ప్రైజ్ లభించింది. నగదు బహుమతి కింద లభించే 50వేల పౌండ్లను ఈ ఇద్దరు సమానంగా పంచుకుంటారు. ఈ పురస్కారం గెలుచుకున్న తొలి నల్లజాతి మహిళగా ఎవరిస్టో చరిత్రకెక్కింది. 1969లో తొలిసారి దీన్ని ప్రధానం చేశారు. ఇది సాహిత్యంలో నోబెల్ తర్వాత అత్యున్నతమైన బహుమతి.

**2019 ప్రపంచ ఆకలి సూచీలో భారత్ స్థానం?**
1) 101 2) 102
3) 103 4) 104
**సమాధానం: 2**

- 2019 ప్రపంచ ఆకలి సూచీ(గ్లోబల్ హంగర్ ఇండెక్స్)ని అక్టోబర్ 16న విడుదల చేశారు. మొత్తం 117 దేశాలను పరిగణలోకి తీసుకోగా భారత్ 102వ స్థానంలో నిలిచింది. దక్షిణాసియా దేశాల్లో భారత్ చివరి స్థానంలో ఉండటం ఆందోళన కలిగించే అంశం. అత్యంత వెనుకబడిన దేశాలైన నేపాల్(73), బంగ్లాదేశ్(88), పాకిస్తాన్ (94)ల కన్నా భారత్ వెనుకబడి ఉంది. గత ఐదేళ్లలో భారత్ ర్యాంకులు 2015-93, 2016-97, 2017-100, 2018-103, 2019-102గా ఉన్నాయి. భారత్‌లో ఆకలి తీవ్రత పెరగడం ఆందోళనకరం. 2019 గ్లోబల్ హంగర్ ఇండెక్స్‌ను జర్మన్ సంస్థ వెల్ట్ హంగర్ లైఫ్, ఐర్లాండ్‌కు చెందిన కన్సర్న్ వరల్డ్ వైడ్‌లు సంయుక్తంగా రూపొందించాయి. బెలారస్, క్యూబా, కువైట్, టర్కీ, ఉక్రెయిన్ వంటి 17 దేశాలు సంయుక్తంగా మొదటి స్థానంలో నిలవగా.. సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్ చివరి(117) స్థానంలో నిలిచింది.

**ప్రపంచంలో అత్యంత నివాసయోగ్యమైన నగరం?**
1) మెల్‌బోర్న్ 2) టొరాంటో
3) వియన్నా 4) కోపెన్ హాగెన్
**సమాధానం: 3**

- ది ఎకనమిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్(ఈఐయూ) ప్రపంచ నివాసయోగ్య సూచీ 2019 (గ్లోబల్ లివబిలిటీ ఇండెక్స్)ని సెప్టెంబర్ 3న విడుదల చేసింది. మొత్తం 140 నగరాల్లో సర్వేను నిర్వహించగా.. ఆస్ట్రియా రాజధాని వియన్నా వరుసగా రెండో ఏడాది అగ్రస్థానం దక్కించుకుంది. ఆరోగ్య సేవల నాణ్యత, విద్య, మౌలిక వసతులు, స్థిరత్వం, సంస్కృతి వంటి అంశాలను సర్వే సమయంలో పరిగణలోకి తీసుకుంటారు. తొలి వంద నగరాల్లో ఒక్క భారతీయ నగరమూ చోటు దక్కించుకోలేకపోయింది. ఢిల్లీ 118వ స్థానంలో, ముంబై 119వ స్థానంలో నిలిచాయి. సిరియా రాజధాని డమాస్కస్ చివరి స్థానంలో నిలిచింది. (7వ స్థానంలో టోక్యో, టొరాంటో నగరాలు సంయుక్తంగా నిలిచాయి).

» **టాప్ నగరాలు:**
1. వియన్నా(ఆస్ట్రియా)
2. మెల్‌బోర్న్(ఆస్ట్రేలియా)
3. సిడ్నీ(ఆస్ట్రేలియా)
4. ఒసాకా(జపాన్)
5. కాల్గరి(కెనడా)
6. వాంకూవర్ (కెనడా)
7. టోక్యో(జపాన్)
7. టొరాంటో(కెనడా)
9. కోపెన్ హాగన్(డెన్మార్క్)
10. అడిలైడ్(ఆస్ట్రేలియా)

**2019 గ్లోబల్ గోల్ కీపర్ పురస్కార విజేత?**
1) నదియా మురాద్ 2) గ్రెటా థన్‌బర్గ్
3) ఇమాన్యుయేల్ మాక్రోన్
4) నరేంద్ర మోదీ
**సమాధానం: 4**

- స్వచ్ఛ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసినందుకుగాను బిల్ అండ్ మెలిందా గేట్స్ ఫౌండేషన్ ప్రధాని నరేంద్ర మోదీకి ప్రతిష్టాత్మక గ్లోబల్ గోల్ కీపర్ పురస్కారాన్ని ప్రకటించింది. సెప్టెంబర్ 24న న్యూయార్క్‌లో బిల్‌గేట్స్ చేతుల మీదుగా ప్రధాని మోదీ ఈ పురస్కారాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. గత ఐదేళ్లలో దేశవ్యాప్తంగా 11 కోట్లకు పైగా మరుగుదొడ్లను నిర్మించినట్లు తెలిపారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని 2014, అక్టోబర్ 2న ప్రారంభించారు.

**ఐదో తూర్పు ఆర్థిక వేదిక సదస్సును ఇటీవల ఎక్కడ నిర్వహించారు?**
1) మాస్కో 2) వ్లాది వొస్తోక్
3) సోచి 4) సెయింట్ పీటర్స్‌బర్గ్
**సమాధానం: 2**

- రష్యాలోని దూర ప్రాచ్యంలో విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించడానికి ప్రతియేటా వ్లాదివొస్తోక్ నగరంలో తూర్పు ఆర్థిక వేదిక (ఈస్టర్న్ ఎకనమిక్ ఫోరం-ఈఈఎఫ్) సదస్సు జరుగుతుంది. ఐదో ఈఈఎఫ్ సదస్సుకు భారత ప్రధాని నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సెప్టెంబర్ 5న వ్లాదివొస్తోక్ నగరంలో జరిగిన ఈ సమావేశంలో రష్యాలోని దూరప్రాచ్య(ఫార్ ఈస్ట్) ప్రాంత అభివృద్ధికి భారత్ 1 బిలియన్ డాలర్ల రుణం ఇస్తుందని ప్రధాని మోదీ ప్రకటించారు. 'యాక్ట్ ఈస్ట్' విధానంలో భాగంగా భారత ప్రభుత్వం తూర్పు ఆసియా దేశాలతో వాణిజ్యాన్ని పెంపొందించుకుందని మోదీ తెలిపారు. ఈ సదస్సులో భారత్‌తో పాటు మలేషియా, జపాన్, ఆస్ట్రేలియా, దక్షిణ కొరియా దేశాలు పాల్గొన్నాయి.

**వైమానిక దళ నూతన అధిపతిగా ఇటీవల ఎవరు బాధ్యతలు స్వీకరించారు?**
1) హెచ్.ఎస్ అరోరా 2) ఎం.ఎస్.డీ మీనన్
3) ఆర్.కె.ఎస్.బదౌరియా
4) ప్రదీప్ పద్మాకర్ బాపత్
**సమాధానం: 3**

- 26వ వైమానిక దళ అధిపతిగా రాకేష్ కుమార్ సింగ్ బదౌరియా 2019 సెప్టెంబర్ 30న బాధ్యతలు చేపట్టారు. పదవీ విరమణ చేసిన ఎయిర్ చీఫ్ మార్షల్ బి.ఎస్.ధనోవా స్థానంలో ఈయన బాధ్యతలు స్వీకరించారు. ఈయన పదవీ కాలం రెండేళ్లు. ఆర్.కె.ఎస్ బదౌరియా పుణేలోని నేషనల్ డిఫెన్స్ అకాడమీ(ఎన్‌డీఏ) విద్యార్థి. 1980లో భారత వాయుసేనలో చేరారు. తన 40 ఏళ్ల కెరీర్‌లో ఎన్నో రకాల యుద్ధ విమానాలను నడిపారు. 4,250 గంటలపాటు విమానాలను నడిపిన అనుభవం ఉంది. ఫ్రాన్స్ నుంచి 36 రఫేల్ యుద్ధ విమానాలను కొనుగోలు చేయడంలో కీలకపాత్ర పోషించారు. అందుకే ఆయన గౌరవార్థం రఫేల్ విమానంపై 'ఆర్‌బీ' అనే అక్షరాలను ముద్రించారు.

**2019 సెప్టెంబర్‌లో దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారాన్ని ఎవరికి ప్రకటించారు?**
1) వినోద్ ఖన్నా 2) మనోజ్ కుమార్
3) శశికపూర్ 4) అమితాబ్ బచ్చన్
**సమాధానం: 4**

- 2018కి గాను ప్రముఖ బాలీవుడ్ నటుడు అమితాబ్ బచ్చన్‌కు ప్రతిష్టాత్మక దాదాసాహెబ్ ఫాల్కే అవార్డును ప్రకటించారు. దేశ సినీ రంగంలో అత్యున్నతమైన ఈ అవార్డుకు అమితాబ్‌ను ఎంపిక చేసినట్లు 2019 సెప్టెంబర్ 24న కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ ప్రకటించారు. అమితాబ్ నాలుగుసార్లు జాతీయ చలన చిత్ర పురస్కారాల్లో ఉత్తమ నటుడి అవార్డును అందుకున్నారు. అగ్నిపథ్, బ్లాక్, పా, పీకూ అనే హిందీ చిత్రాలకు ఈ అవార్డులను గెలుచుకున్నారు. పద్మశ్రీ (1984), పద్మభూషణ్ (2001), పద్మవిభూషణ్ (2015) అవార్డులు కూడా అమితాబ్‌ను వరించాయి. గత ఐదేళ్లలో దాదాసాహెబ్ ఫాల్కే అవార్డులను గెలుచుకున్న సినీ ప్రముఖులు.. శశి కపూర్(2014), మనోజ్ కుమార్(2015), కె.విశ్వనాథ్(2016), వినోద్ ఖన్నా (2017), అమితాబ్ బచ్చన్ (2018).

**ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఇటీవల ఎక్కడ జరిగాయి?**
1) హెల్సింకీ 2) బెర్లిన్
3) దోహా 4) లండన్
**సమాధానం: 3**

- 1983 నుంచి ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలను రెండేళ్లకోసారి నిర్వహిస్తున్నారు. 17వ ప్రపంచ అథ్లెటిక్స్‌ను 2019 సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 6 వరకు ఖతార్ రాజధాని దోహాలో నిర్వహించారు. ప్రతిష్టాత్మక 100 మీటర్ల పరుగులో అమెరికాకు చెందిన క్రిస్టియన్ కోల్‌మన్ స్వర్ణం సాధించగా.. మహిళల విభాగంలో జమైకా క్రీడాకారిణి షెల్లీ ఆన్ ఫ్రేజర్ ప్రైస్ స్వర్ణం సాధించింది. అమెరికా 14 స్వర్ణాలు, 11 రజత, 4 కాంస్య పతకాలు.. మొత్తం 29 పతకాలు సాధించి పతకాల పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది. 5 స్వర్ణాలతో కెన్యా రెండో స్థానంలో, 3 స్వర్ణాలతో జమైకా మూడో స్థానంలో నిలిచాయి. భారత్ క్రీడాకారులు ఒక్క పతకమూ సాధించలేదు. 2021లో జరిగే ప్రపంచ అథ్లెటిక్స్‌కు అమెరికాలోని యుజీన్ నగరం ఆతిథ్యమివ్వనుంది.



ఎన్.విజయేందర్‌రెడ్డి,
సీనియర్ ఫ్యాకల్టీ

సాక్షి స్పోర్ట్స్
మంగళవారం
29-10-2019


తమ డబుల్స్ కోచ్ ఫ్లాండీ లింపేలేతో సాత్విక్, చిరాగ్ శెట్టి

# రన్నరప్ సాత్విక్–చిరాగ్ జంట

## ఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్ జోడీ చేతిలో ఓటమి ● ఫ్రెంచ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ

**పారిస్:** వరుసగా మూడు మ్యాచ్‌ల్లో తమకంటే మెరుగైన ర్యాంక్ ఉన్న జోడీలను బోల్తా కొట్టించిన భారత యువ ద్వయం సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి తుది మెట్టుపై పోరాడి ఓడింది. ఫ్రెంచ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–750 టోర్నీలో సాత్విక్ (ఆంధ్రప్రదేశ్)–చిరాగ్ శెట్టి (మహారాష్ట్ర) జంట రన్నరప్‌గా నిలిచింది. కెరీర్‌లో తొలిసారి వరల్డ్ టూర్–750 స్థాయి టోర్నీ ఫైనల్ ఆడిన భారత జంట 18–21, 16–21తో ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ జోడీ మార్కస్ ఫెర్నాల్డి గిడియోన్–కెవిన్ సంజయ సుకముల్జో (ఇండోనేసియా) చేతిలో పరాజయం పాలైంది. సాత్విక్–చిరాగ్ జంటకు 26,250 డాలర్ల ప్రైజ్‌మనీ (రూ. 18 లక్షల 55 వేలు)తోపాటు 9,350 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. 121 వారాల నుంచి నంబర్‌వన్ ర్యాంక్‌లో ఉన్న గిడియోన్–కెవిన్ జోడీ చేతిలో సాత్విక్–చిరాగ్‌లకు వరుసగా ఇది ఏడో ఓటమి కావడం గమనార్హం. ఆగస్టులో థాయ్‌లాండ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–500 టోర్నీలో డబుల్స్ టైటిల్ నెగ్గిన సాత్విక్–చిరాగ్‌లు ఈసారి ఫైనల్లో ఒత్తిడికి లోనయ్యారు. రెండు గేముల్లోనూ భారత జంట ప్రతి పాయింట్ కోసం తీవ్రంగా పోరాడింది. తొలి గేమ్‌లో 17–17తో స్కోరును కూడా సమం చేసింది. కానీ కీలకదశలో అనుభవజ్ఞులైన ఇండోనేసియా జంట పైచేయి సాధించింది. రెండో గేమ్ కూడా హోరాహోరీగా సాగింది. మూడుసార్లు 6–6, 8–8, 11–11తో స్కోరు సమమైంది. ఈ గేమ్‌లోనూ కీలకదశలో ఇండోనేసియా జట్టు తమ ఆధిపత్యాన్ని చాటుకొని విజయాన్ని అందుకుంది. ఒకవేళ సాత్విక్–చిరాగ్ గెలిచుంటే 1983లో పార్థో గంగూలీ–విక్రమ్ సింగ్ బిష్త్ తర్వాత ఈ టైటిల్ నెగ్గిన భారత జంటగా గుర్తింపు పొందేది. గతంలో పురుషుల సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్ (2017), మహిళల సింగిల్స్‌లో సైనా నెహ్వాల్ (2012) విజేతలుగా నిలిచారు. ఈ టోర్నీలో సాత్విక్–చిరాగ్ జంట ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ చాంపియన్స్ మొహమ్మద్ హసన్–సెతియావాన్ (ఇండోనేసియా)లను, క్వార్టర్ ఫైనల్లో ఎనిమిదో ర్యాంకర్స్ కిమ్ అస్ట్రప్–ఆండెర్స్ రస్ముసేన్ (డెన్మార్క్)లను, సెమీఫైనల్లో ఆరో ర్యాంకర్స్ హిరోయుకి ఎండో–యుటా వతనాబె (జపాన్)లను ఓడించింది.

ఫైనల్లో మేము రెండు గేమ్‌లనూ నెమ్మదిగా ప్రారంభించాం. ఆరంభంలోనే ఆధిక్యాన్ని సమర్పించుకున్నాం. ఆ తర్వాత కోలుకొని స్కోరును సమం చేసినా కీలకదశలో తప్పిదాలు చేశాం. ఈ టోర్నీలో మా ఆటతీరుతో సంతృప్తిగా ఉన్నాం. మా కెరీర్‌లో ఇది రెండో గొప్ప ప్రదర్శనగా చెబుతాం. థాయ్‌లాండ్ ఓపెన్ టైటిల్ మా కెరీర్‌లో అత్యుత్తమ ప్రదర్శన.

–సాత్విక్, చిరాగ్ శెట్టి

## యాన్ సె యంగ్ సంచలనం

ఫ్రెంచ్ ఓపెన్ పురుషుల సింగిల్స్‌లో చెన్ లాంగ్ (చైనా), మహిళల సింగిల్స్‌లో యాన్ సె యంగ్ (దక్షిణ కొరియా) విజేతలుగా నిలిచారు. ఫైనల్స్‌లో చెన్ లాంగ్ 21–19, 21–12తో జొనాథన్ క్రిస్టీ (ఇండోనేసియా)పై నెగ్గగా... యాన్ సె యంగ్ 16–21, 21–18, 21–5తో రియో ఒలింపిక్స్ చాంపియన్, మూడుసార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన కరోలినా మారిన్ (స్పెయిన్)పై సంచలన విజయం సాధించింది. ఈ క్రమంలో పిన్న వయస్సులో సూపర్–750 టైటిల్ నెగ్గిన క్రీడాకారిణిగా యాన్ సె యంగ్ (17 ఏళ్ల 264 రోజులు) చరిత్ర సృష్టించింది.



# మేం సిద్ధం... మీరేమంటారు?

## డే అండ్ నైట్ టెస్టు నిర్వహణకు బీసీసీఐ రెడీ

### బంగ్లాదేశ్ నిర్ణయంపై ఎదురుచూపు

### కోల్‌కతాలో 'గులాబీ' మ్యాచ్!

**కోల్‌కతా:** డే అండ్ నైట్ టెస్టుల నిర్వహణపై చాలా కాలంగా తన ఆసక్తిని ప్రదర్శించిన సౌరవ్ గంగూలీ ఇప్పుడు బోర్డు అధ్యక్ష హోదాలో దానికి కార్యరూపం ఇచ్చేందుకు సన్నద్ధమయ్యాడు. బీసీసీఐ పగ్గాలు చేపట్టిన తర్వాత పలు మార్లు గులాబీ బంతితో టెస్టు నిర్వహణ గురించి సౌరవ్ వ్యాఖ్యానించడంతోనే పరోక్షంగా అతని ఆలోచన అర్థమైంది. ఈ విషయంపై బీసీసీఐ అధికారిక నిర్ణయం తీసుకుంది. బంగ్లాదేశ్‌తో కోల్‌కతాలో భారత్ ఆడే రెండో టెస్టును డే అండ్ నైట్‌గా నిర్వహించాలని తాము భావిస్తున్నట్లు బోర్డు ప్రకటించింది. తన సొంత మైదానంలో ఈ మ్యాచ్ జరుగుతుందని స్వయంగా దీనిని నిర్ధారించిన సౌరవ్... మీ అభిప్రాయం చెప్పాలంటూ బంగ్లాదేశ్ బోర్డును కోరాడు. నవంబర్ 22 నుంచి 26 వరకు ఈడెన్ గార్డెన్స్‌లో ఈ మ్యాచ్ జరగనుంది. 'నేను బంగ్లాదేశ్ బోర్డు అధ్యక్షుడు నజ్ముల్ హసన్‌తో మాట్లాడాను. వాళ్లు దాదాపుగా అంగీకరించారు. అయితే తమ ఆటగాళ్లతో మాట్లాడాల్సి ఉందని నాతో చెప్పారు. ఇది కచ్చితంగా డే అండ్ నైట్ మ్యాచ్ అవుతుందని నేను నమ్ముతున్నా. వారు వీలైనంత తొందరగా తమ అధికారిక ప్రకటన చేస్తారు. ఒక్కసారి బంగ్లా బోర్డు నుంచి సమాధానం వస్తే మేం టెస్టు నిర్వహణ కోసం ఏర్పాట్లు మొదలు పెడతాం' అని గంగూలీ వ్యాఖ్యానించాడు. భారత్‌లాగే బంగ్లాదేశ్ కూడా ఇప్పటి వరకు ఒక్క డే అండ్ నైట్ టెస్టు కూడా ఆడలేదు. తమకు గులాబీ బంతితో ఏ మాత్రం అనుభవం లేదనేది ఆ జట్టు ఆటగాళ్ల భావన.



### ఒలింపియన్లకు సన్మానం....

కోల్‌కతా టెస్టు సందర్భంగా షూటర్ అభినవ్ బింద్రా, బాక్సర్ మేరీకోమ్, షట్లర్ పీవీ సింధు తదితర ఒలింపియన్లను ఘనంగా సన్మానించనున్నట్లు సౌరవ్ వెల్లడించాడు. ఆస్ట్రేలియాలో క్యాన్సర్ నిర్మూలన కోసం పని చేస్తున్న జేన్ మెక్‌గ్రాత్ ఫౌండేషన్ కోసం ప్రతీ ఏటా 'పింక్ టెస్టు'ను నిర్వహిస్తారు. అదే తరహాలో ఈడెన్ గార్డెన్స్ మ్యాచ్ కూడా ప్రతీ సంవత్సరం సాగే వేడుక కావాలని తాను కోరుకుంటున్నట్లు మాజీ కెప్టెన్ మనసులో మాట చెప్పాడు.

### ఫస్ట్‌క్లాస్ క్రికెటర్లకు కాంట్రాక్టులు...

మరోవైపు తొలిసారి ఫస్ట్‌క్లాస్ క్రికెటర్లకు కూడా కాంట్రాక్ట్ పద్ధతిని ప్రవేశపెట్టనున్నట్లు గంగూలీ ప్రకటించాడు. బోర్డు కొత్త ఫైనాన్స్ కమిటీ దీనికి సంబంధించి కార్యాచరణ రూపొందిస్తుందని అతను చెప్పాడు. ప్రస్తుతం భారత దేశవాళీ క్రికెటర్లు ఏడాదికి తాము ఆడే మ్యాచ్‌ల సంఖ్యను బట్టి రూ. 25 లక్షల నుంచి 30 లక్షల వరకు ఆర్జిస్తున్నారు.

# న్యూ గినియా వచ్చేసింది

**దుబాయ్:** వచ్చే ఏడాది ఆస్ట్రేలియాలో జరిగే టి20 ప్రపంచ కప్‌కు పపువా న్యూ గినియా (పీఎన్‌జీ) అర్హత సాధించింది. ఆ జట్టు తొలిసారి ఐసీసీ టోర్నీకి ఎంపిక కావడం విశేషం. యూఏఈలో జరుగుతున్న క్వాలిఫయింగ్ టోర్నీ ద్వారా పపువా న్యూ గినియాకు ఆ అవకాశం దక్కింది. ఈ టోర్నీ లీగ్ దశ ముగిసేసరికి గినియా గ్రూప్ 'ఎ'లో 6 మ్యాచ్‌లలో 5 విజయాలు సాధించి 10 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. ఆదివారం జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో 54 పరుగులతో కెన్యాను ఓడించి గినియా ముందంజ వేసింది. ముందుగా బ్యాటింగ్ చేసిన గినియా 19.3 ఓవర్లలో 118 పరుగులకు ఆలౌటైంది. ఒక దశలో 19 పరుగులకే 6 వికెట్లు కోల్పోగా... నార్మన్ వనువా (48 బంతుల్లో 54; 3 ఫోర్లు, 2 సిక్సర్లు) జట్టును ఆదుకున్నాడు. ఆ తర్వాత కెన్యా 18.4 ఓవర్లలో 73 పరుగులకే కుప్పకూలింది. మరోవైపు గ్రూప్ 'బి'నుంచి కొంత అదృష్టం కలిసొచ్చి ఐర్లాండ్ కూడా ప్రపంచ కప్‌కు అర్హత సాధించింది. ఈ గ్రూప్‌లో ఐర్లాండ్ 4 విజయాలతో 8 పాయింట్లు సాధించి మొదటి స్థానంలో నిలిచింది. ఆదివారం జరిగిన చివరి మ్యాచ్‌లో యూఏఈ చేతిలో ఐర్లాండ్ ఓడింది. ఫలితంగా ఐర్లాండ్‌తో పాటు ఒమన్, యూఏఈ కూడా తలా 8 పాయింట్లతో సమంగా నిలిచాయి. అయితే రన్‌రేట్‌తో ఐర్లాండ్ ముందంజ వేసింది. ఐర్లాండ్ 2007లో జరిగిన తొలి ప్రపంచ కప్ మినహా మిగిలిన ఐదు టి20 వరల్డ్ కప్‌లలో కూడా ఆడింది.




టి20 ప్రపంచ కప్‌కు తొలిసారి అర్హత

### నేటినుంచి ప్లే ఆఫ్‌లు...

టి20 ప్రపంచ కప్ టోర్నీకి అర్హత సాధించేందుకు మొత్తం 6 జట్లకు అవకాశం ఉండగా ఇప్పటికే 2 జట్లు క్వాలిఫై అయ్యాయి. మరో 4 స్థానాల కోసం నేటి నుంచి ఐపీఎల్ తరహాలో ప్లే ఆఫ్ మ్యాచ్ నిర్వహిస్తున్నారు. రెండు గ్రూప్‌లలో 2, 3, 4 స్థానాల్లో నిలిచిన మొత్తం ఆరు జట్లు ఇందు కోసం పోటీ పడుతున్నాయి. నెదర్లాండ్స్–యూఏఈ, నమీబియా–ఒమన్ మధ్య మ్యాచ్‌లలో విజేతగా నిలిచే రెండు జట్లు ముందంజ వేస్తాయి. ఇక్కడ ఓడిన వాటిలో ఒక జట్టు స్కాట్లాండ్‌తో, మరో జట్టు హాంకాంగ్‌తో తలపడుతుంది. ఈ మ్యాచ్‌లలో గెలిచిన టీమ్‌లు వరల్డ్ కప్‌కు అర్హత సాధిస్తాయి.

### పీఎన్‌జీ గురించి...

పసిఫిక్ మహా సముద్రంలో ఆస్ట్రేలియాకు ఉత్తర భాగంలో ఉండే పపువా న్యూ గినియా 'ఓషియానియా' ఖండం పరిధిలోకి వస్తుంది. సమీప దేశం ఇండోనేసియా. బ్రిటన్ నుంచి 1975లో స్వాతంత్య్రం లభించింది. ఎక్కువ భాగం చిన్న చిన్న దీవులతో నిండిన దేశం. సుమారు 80 లక్షల జనాభా. ఇప్పటికీ దీవుల్లోని పెద్ద సంఖ్యలో ప్రజలు సాధారణ ప్రపంచానికి దూరంగా ఆటవిక జీవితాన్ని గడిపేవారే. తమ దేశంలో 851 రకాల భాషలు ఉన్నాయని పపువా న్యూ గినియా అధికారికంగా ప్రకటించుకుంది. మహిళలు, చిన్న పిల్లలపై అత్యాచారాలు ఎక్కువగా నమోదయ్యే దేశాల జాబితాలో దీని పేరు తరచుగా ముందు వరుసలోనే వినిపిస్తుంది. పీఎన్‌జీలో రగ్బీ ఎక్కువ ఆదరణ ఉన్న క్రీడ. గతంలో రెండు సార్లు (2013, 2015లలో) వరల్డ్ కప్‌కు అర్హత సాధించేందుకు బాగా చేరువగా వచ్చి దానిని చేజార్చుకుంది. ఈ టోర్నీలో ఆ జట్టు తమ గ్రూప్‌లో నెదర్లాండ్స్, నమీబియా, కెన్యా, బెర్ముడా, సింగపూర్‌లపై గెలిచి స్కాట్లాండ్ చేతిలో ఓడింది.

# షకీబ్ భారత్‌కు వస్తాడా!

### సిరీస్‌లో పాల్గొనడంపై సందేహం

**ఢాకా:** బంగ్లాదేశ్ స్టార్ క్రికెటర్ షకీబ్ అల్ హసన్ కీలకమైన భారత పర్యటనకు దూరమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. బంగ్లా బోర్డుతో ఇటీవల చెలరేగిన వివాదాల కారణంగా షకీబ్ భారత్ వెళ్లేందుకు ఆసక్తి చూపించడం లేదని తెలుస్తోంది. ముందుగా కాంట్రాక్ట్ విషయంలో సహచరులతో కలిసి సమ్మెకు నాయకత్వం వహించిన షకీబ్... ఆ తర్వాత తన వ్యక్తిగత స్పాన్సర్ ఒప్పందం విషయంలో కూడా బోర్డుతో తలపడాల్సి వచ్చింది. టెలికామ్ సంస్థ 'రోబీ' బంగ్లా జట్టుకు ప్రధాన స్పాన్సర్‌గా ఉండగా... దానికి ప్రత్యర్థి అయిన 'గ్రామీన్‌ఫోన్'కు షకీబ్ ప్రచారకర్తగా వ్యవహరించేందుకు సిద్ధమయ్యాడు. దీనిపై బోర్డు షోకాజ్ నోటీసు జారీ చేయగా, షకీబ్ ఇప్పటి వరకు స్పందించలేదు. భారత్‌తో సిరీస్‌కు సన్నాహాల్లో



భాగంగా గత మూడు రోజుల్లో బంగ్లాదేశ్ మొత్తం జట్టు రెండు ప్రాక్టీస్ సెషన్లలో పాల్గొనగా, ఎలాంటి సమాచారం ఇవ్వకుండా షకీబ్ గైర్హాజరయ్యాడు. టీమ్ బుధవారం భారత్‌కు బయల్దేరాల్సి ఉంది. షకీబ్‌తో పాటు మరికొందరు క్రికెటర్లు కావాలనే ఇదంతా చేస్తూ జట్టును దెబ్బ తీయాలని ప్రయత్నిస్తున్నారని బంగ్లా బోర్డు అధ్యక్షుడు నజ్ముల్ ఆగ్రహంగా వ్యాఖ్యానించారు. సిరీస్‌లో ఆడేందుకు సిద్ధమైన ఆటగాళ్లు కూడా చివరి నిమిషంలో తప్పుకునే ప్రమాదం ఉన్నట్లు తనకు అనిపిస్తోందన్న హసన్... షకీబ్ పేరును ప్రత్యేకంగా ప్రస్తావించారు.

# పాక్ హాకీ జట్టుకు దక్కని 'టోక్యో' బెర్త్

**అమ్‌స్టర్‌డమ్ (నెదర్లాండ్స్):** గతంలో మూడుసార్లు ఒలింపిక్ చాంపియన్‌గా నిలిచిన పాకిస్తాన్ హాకీ జట్టు వరుసగా రెండోసారి ఒలింపిక్స్ క్రీడల్లో పాల్గొనే అవకాశాన్ని చేజార్చుకుంది. నెదర్లాండ్స్‌తో జరిగిన టోక్యో ఒలింపిక్స్–2020 క్వాలిఫయర్స్‌లో పాకిస్తాన్ 5–10 గోల్స్ సగటుతో ఓడిపోయింది. తొలి మ్యాచ్‌ను 4–4తో 'డ్రా' చేసుకున్న పాకిస్తాన్... రెండో మ్యాచ్‌లో 1–6తో ఓటమి చవిచూసింది. 'ఇదో దుర్దినం. మేము ఒలింపిక్స్‌కు అర్హత పొందలేకపోయాం. టోక్యో బెర్త్ దక్కించుకోవాలంటే గెలవాల్సిన రెండో మ్యాచ్‌లో మేము చాలా తప్పిదాలు చేశాం' అని పాక్ ఆటగాడు రషీద్ మెహమూద్ వ్యాఖ్యానించాడు. పాక్ 1960 రోమ్, 1968 మెక్సికో, 1984 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకాలు సాధించింది.

# వార్నర్ మెరుపు సెంచరీ

● తొలి టి20లో ఆస్ట్రేలియా ఘన విజయం
● 134 పరుగులతో శ్రీలంక చిత్తు

**అడిలైడ్:** సొంతగడ్డపై కొత్త సీజన్‌ను ఆస్ట్రేలియా ఘనంగా ప్రారంభించింది. డేవిడ్ వార్నర్ (56 బంతుల్లో 100 నాటౌట్; 10 ఫోర్లు, 4 సిక్సర్లు) అంతర్జాతీయ టి20ల్లో తొలి శతకం సాధించడంతో... తొలి టి20 మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 134 పరుగుల తేడాతో శ్రీలంకపై ఘన విజయం సాధించింది. పరుగుల పరంగా టి20ల్లో కంగారూలకు ఇదే అతి పెద్ద విజయం. వార్నర్‌కు తోడు కెప్టెన్ ఆరోన్ ఫించ్ (36 బంతుల్లో 64; 8 ఫోర్లు, 3 సిక్సర్లు), గ్లెన్ మ్యాక్స్‌వెల్ (28 బంతుల్లో 62; 7 ఫోర్లు, 3 సిక్సర్లు) కూడా చెలరేగారు. ఫలితంగా 20 ఓవర్లలో ఆసీస్ 2 వికెట్లకు 233 పరుగులు సాధించింది. ఒక అంతర్జాతీయ టి20 మ్యాచ్‌లో టాప్–3 ఆటగాళ్లు ముగ్గురూ కనీసం అర్ధ సెంచరీ సాధించడం ఇదే మొదటిసారి కావడం విశేషం. అనంతరం లంక కనీసం వార్నర్ స్కోరును కూడా చేరలేక చతికిలపడింది. ఆ జట్టు 20 ఓవర్లలో 9 వికెట్లకు 99 పరుగులే చేయగలిగింది. షనక (17)దే టాప్ స్కోరు. జంపా 3 వికెట్లు పడగొట్టగా, స్టార్క్, కమిన్స్ చెరో 2 వికెట్లు తీశారు. రెండో టి20 బుధవారం బ్రిస్బేన్‌లో జరుగుతుంది. తన సోదరుడి వివాహం కారణంగా ఈ మ్యాచ్‌లో స్టార్క్‌పాల్గొనడంలేదు.



**75** శ్రీలంక పేసర్ కసున్ రజిత 4 ఓవర్లలో ఇచ్చిన పరుగులు. అంతర్జాతీయ టి20ల్లో అత్యధిక పరుగులు ఇచ్చిన బౌలర్‌గా రజిత కొత్త రికార్డును నెలకొల్పాడు. గతంలో టర్కీ బౌలర్ తునాహన్ తురాన్ (చెక్ రిపబ్లిక్‌పై) ఇచ్చిన 70 పరుగుల రికార్డు బద్దలైంది.

# టైగర్ వుడ్స్ రికార్డు విజయం



**ఇన్‌జాయ్ (జపాన్):** గోల్ఫ్ దిగ్గజం టైగర్ వుడ్స్ అద్భుత కెరీర్‌లో మరో కొత్త ఘనత చేరింది. తాజాగా జోజో చాంపియన్‌షిప్‌లో అతను విజేతగా నిలిచాడు. ఈ గెలుపుతో టైగర్ వుడ్స్ యూఎస్ పీజీఏ టూర్ టైటిల్స్ సంఖ్య 82కు చేరింది. దీంతో స్యామ్ స్నీడ్ పేరిట ఉన్న అత్యధిక టైటిల్స్ రికార్డును వుడ్స్ సమం చేశాడు. కెరీర్‌లో 15 'మేజర్' టైటిల్స్ సాధించిన ఈ స్టార్ తన తొలి టూర్ టైటిల్‌ను 20 ఏళ్ల క్రితం గెలవడం విశేషం. తాజా విజయంతో ప్రపంచ ర్యాంకింగ్స్‌లో కూడా టైగర్ వుడ్స్ పది నుంచి ఆరో స్థానానికి చేరుకున్నాడు.



# ఫెడరర్ @103

### పదోసారి స్విస్ ఇండోర్స్ ఓపెన్ టైటిల్ నెగ్గిన స్విట్జర్లాండ్ దిగ్గజం

**బాసెల్ (స్విట్జర్లాండ్):** సొంతగడ్డపై తన ఆధిపత్యాన్ని చాటుకుంటూ... స్విట్జర్లాండ్ టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెడరర్ పదోసారి స్విస్ ఇండోర్స్ ఓపెన్‌లో విజేతగా నిలిచాడు. అలెక్స్ డి మినార్ (ఆస్ట్రేలియా)తో ఏకపక్షంగా జరిగిన ఫైనల్లో ఫెడరర్ 6–2, 6–2తో గెలిచాడు. తాజా విజయంతో ఫెడరర్ కెరీర్ సింగిల్స్ టైటిల్స్ సంఖ్య 103కు చేరింది. జిమ్మీ కానర్స్ (అమెరికా–109 టైటిల్స్) పేరిట ఉన్న ఆల్‌టైమ్ రికార్డును సమం చేయడానికి ఫెడరర్ మరో ఆరు టైటిల్స్ దూరంలో ఉన్నాడు. రాకెట్ పట్టిన తొలినాళ్లలో ఈ టోర్నీలో 'బాల్ బాయ్'గా పనిచేసిన ఫెడరర్ టైటిల్ గెలిచిన ప్రతీసారి ఈ టోర్నీలో బాల్ బాయ్స్, బాల్ గర్ల్స్‌గా వ్యవహరించిన వారందరికీ పిజ్జాలు కానుకగా ఇస్తాడు. వారితో కలిసి తింటాడు. ఈ టోర్నీలో 15వ సారి ఫైనల్ చేరిన ఫెడరర్‌కు తుది పోరులో ప్రత్యర్థి నుంచి ఎలాంటి ప్రతిఘటన ఎదురుకాలేదు. 68 నిమిషాల్లో ముగిసిన ఫైనల్లో 38 ఏళ్ల ఫెడరర్ నాలుగు ఏస్‌లు సంధించడంతోపాటు, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశాడు. విజేతగా నిలిచిన ఫెడరర్‌కు 4,30,125 యూరోలు (రూ. 3 కోట్ల 37 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 500 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. గతంలో ఫెడరర్ 2006, 2007, 2008, 2010, 2011, 2014, 2015, 2017, 2018 ఈ టోర్నీలో చాంపియన్‌గా నిలిచాడు. స్విస్ ఇండోర్స్‌లో టైటిల్ నెగ్గిన ఫెడరర్ వచ్చే సీజన్ కోసం ఫిట్‌గా ఉండేందుకు సోమవారం మొదలైన పారిస్ మాస్టర్స్ సిరీస్ టోర్నీ నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించాడు.

# హామిల్టన్ జోరు

### సీజన్‌లో పదో టైటిల్ సొంతం



**మెక్సికోసిటీ:** ఈ ఏడాది ఫార్ములా వన్ (ఎఫ్1) సీజన్‌లో తన జోరు కొనసాగిస్తూ మెర్సిడెస్ జట్టు డ్రైవర్ హామిల్టన్ పదో టైటిల్‌ను సాధించాడు. మెక్సికో గ్రాండ్‌ప్రిలో ఈ బ్రిటన్ డ్రైవర్ విజేతగా నిలిచాడు. 71 ల్యాప్‌ల ఈ రేసులో హామిల్టన్ గంటా 36 నిమిషాల 48.904 సెకన్లలో గమ్యానికి చేరి టైటిల్ సొంతం చేసుకున్నాడు. వెటెల్ (ఫెరారీ) రెండో స్థానంలో, బొటాస్ (మెర్సిడెస్) మూడో స్థానంలో నిలిచారు. మరో మూడు రేసులు మిగిలి ఉన్న ఈ సీజన్‌లో ప్రస్తుతం హామిల్టన్ 363 పాయింట్లతో డ్రైవర్స్ చాంపియన్‌షిప్ టైటిల్ రేసులో అగ్రస్థానంలో ఉన్నాడు.

### గోవా, బెంగళూరు మ్యాచ్ 'డ్రా'

**మార్గావ్:** ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్) ఫుట్‌బాల్ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్ బెంగళూరు, గోవా జట్ల మధ్య సోమవారం జరిగిన మ్యాచ్ 1–1తో 'డ్రా' అయింది. 62వ నిమిషంలో ఉదాంతా సింగ్ గోల్‌తో బెంగళూరు ఖాతా తెరిచింది. అయితే 90వ నిమిషంలో గోవా ప్లేయర్ కోరో గోల్ చేసి స్కోరును సమం చేశాడు.

## స్టాక్ మార్కెట్లు

**దేశీ సూచీలు** (ఆదివారం ముగింపు)

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 192 ▲ | 43 ▲ |
| 39,250 | 11,627 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు** (తొలి రెండు రాత్రి 11.30గం॥లకు)

| | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 8,324 | ▲ | 80 |
| డోజోన్స్ | 27,053 | ▲ | 94 |
| ఎఫ్‌టీఎస్ఈ 100 | 7,331 | ▲ | 7 |
| డాక్స్ | 12,942 | ▲ | 47 |
| షాంఘై | 2,980 | ▲ | 25 |
| నికాయ్ | 22,867 | ▲ | 67 |

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | | ● కొనుగోలు | ● అమ్మకం |
|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | 69.99 | 72.27 |
| £ | బ్రిటన్ పౌండ్ | 89.40 | 93.03 |
| € | యూరో | 77.63 | 80.57 |
| ¥ | జపాన్ ఎన్ (100) | 62.00 | 74.00 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | 47.58 | 49.84 |
| S$ | సింగపూర్ డాలర్ | 51.23 | 53.45 |
| SAR | సౌదీ రియాల్ | 18.11 | 19.72 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | 18.84 | 19.84 |
| ¥ | చైనా యువాన్ | 9.40 | 10.81 |

# 7,614 కోట్లు సమీకరించిన జీవీకే

**విమానాశ్రయ వ్యాపారంలో వాటా విక్రయం ● ముంబై ఎయిర్‌పోర్టులో వాటా పెంపు**



**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** మౌలిక రంగంలో ఉన్న జీవీకే గ్రూప్ రుణ భారం తగ్గించుకునే పనిలో ఉంది. ఇందులో భాగంగా జీవీకే ఎయిర్‌పోర్ట్ హోల్డింగ్స్‌లో 79.1 శాతం వాటాను విక్రయించింది. తద్వారా రూ.7,614 కోట్లు సమీకరించింది. అబుదాబీ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (ఏడీఐఏ), పబ్లిక్ సెక్టార్ పెన్షన్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డ్ (పీఎస్‌పీ ఇన్వెస్ట్‌మెంట్స్), నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్‌తో (ఎన్ఐఐఎఫ్) ఈ మేరకు జీవీకే పవర్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అనుబంధ కంపెనీలైన జీవీకే ఎయిర్‌పోర్ట్ డెవలపర్స్, జీవీకే ఎయిర్‌పోర్ట్ హోల్డింగ్స్ మధ్య ఆదివారం ఒక ఒప్పందం కుదిరింది. డీల్ తదనంతరం జీవీకే ఎయిర్‌పోర్ట్ హోల్డింగ్స్‌లో జీవీకే ఎయిర్‌పోర్ట్ డెవలపర్స్, ఏడీఐఏ, పీఎస్‌పీ ఇన్వెస్ట్‌మెంట్స్, ఎన్ఐఐఎఫ్ వాటాదారులుగా ఉంటాయి. జీవీకే ఎయిర్‌పోర్ట్ హోల్డింగ్స్‌లో జీవీకే గ్రూప్ వాటా 20.9 శాతానికి పరిమితం అవుతుంది. డీల్‌లో భాగంగా ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్, నవీ ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌ను రూ.9,608 కోట్లుగా విలువ కట్టారు.

**ముంబై ఎయిర్‌పోర్ట్‌లో..**

డీల్ ద్వారా వచ్చిన నిధులను ప్రాథమికంగా హోల్డింగ్ కంపెనీల్లో సుమారు రూ.5,500 కోట్ల రుణ భారం తగ్గించుకోవడానికి వినియోగించనున్నారు. అలాగే ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్‌లో (ఎంఐఏఎల్) జీవీకే ఎయిర్‌పోర్ట్ హోల్డింగ్స్ తన వాటాను పెంచుకోనుంది. ఇందు కోసం ఎంఐఏఎల్‌లో దక్షిణాఫ్రికా సంస్థలు అయిన బిడ్‌వెస్ట్, ఎయిర్‌పోర్ట్స్ కంపెనీ సౌత్ ఆఫ్రికాలకు (ఏసీఎస్ఏ) ఉన్న వాటాను కొనుగోలు చేయనుంది. ఎంఐఏఎల్‌లో బిడ్‌వెస్ట్‌కు 13.5 శాతం, ఏసీఎస్ఏకు 10 శాతం వాటా ఉంది. ముంబైలోని ఛత్రపతి శివాజీ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని జీవీకే గ్రూప్ కంపెనీ అయిన ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ నిర్వహిస్తోంది. ఇక కొత్తగా నిర్మితమవుతున్న నవీ ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధి ప్రాజెక్టును ఎంఐఏఎల్ దక్కించుకున్న సంగతి తెలిసిందే. నవీ ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో (ఎన్ఎంఐఏ) ఎంఐఏఎల్‌కు 74 శాతం వాటా ఉంది.

**జీవీకే నిర్వహణలోనే..**

వాటా విక్రయం తర్వాత ఎయిర్‌పోర్ట్ వ్యాపార నిర్వహణ, బ్రాండింగ్ అంతా జీవీకే గ్రూప్ కిందనే ఉంటాయని సంస్థ తెలిపింది. గ్లోబల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్టర్లు వెనుక ఉండడం ఎంఐఏఎల్, ఎన్ఎంఐఏ విస్తరణకు కలిసి వస్తుందని వివరించింది. ఎయిర్‌పోర్టుల వ్యాపారం మరింత బలంగా ఎదిగేందుకు దోహద పడుతుందని తెలిపింది. ఎంఐఏఎల్, నవీ ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా జీవీకే రెడ్డి, ఎండీగా జీవీ సంజయ్ రెడ్డి కొనసాగనున్నారు. వాస్తవానికి ఎయిర్‌పోర్ట్ వ్యాపారంలో 49 శాతం వాటాను ఏడీఐఏ, ఎన్ఐఐఎఫ్‌లకు విక్రయించాలన్న ప్రతిపాదనపై ఏప్రిల్‌లో సంతకాలు జరిగాయి.

**నిష్క్రమణ కోసం..**

ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్‌లో (ఎంఐఏఎల్) వాటాదారులైన బిడ్‌వెస్ట్, ఏసీఎస్ఏ ఎప్పటి నుంచో తప్పుకోవాలని చూస్తున్నాయి. ఈ రెండు సంస్థలకు ఉన్న 23.5 శాతం వాటాను అదానీ కొనుగోలు చేయాలని భావించింది. తాజా పరిస్థితుల నేపథ్యంలో అదానీ ప్రయత్నానికి అడ్డుకట్ట పడ్డట్టే. ఎంఐఏఎల్‌లో జీవీకే గ్రూప్‌నకు 50.5 శాతం, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాకు 26 శాతం వాటా ఉంది. బిడ్‌వెస్ట్, ఏసీఎస్ఏల నుంచి 23.5 శాతం వాటా దక్కించుకోవడం ద్వారా.. జీవీకే గ్రూప్ వాటా 74 శాతానికి చేరనుంది. అయితే రైట్ ఆఫ్ ఫస్ట్ రెఫ్యూజల్ కింద ఈ ఏడాది ప్రారంభంలో బిడ్‌వెస్ట్ తన 13.5 శాతం వాటాను విక్రయించనున్నట్టు జీవీకేకు తెలిపింది. అందుకు జీవీకే అంగీకరించింది. వాటా కింద ఇవ్వాల్సిన రూ.1,248 కోట్ల చెల్లింపు ఆలస్యం కావడంతో ఢిల్లీ హైకోర్టును బిడ్‌వెస్ట్ ఆశ్రయించింది. హైకోర్టు సూచన మేరకు వివాదాల పరిష్కార ట్రిబ్యునల్‌ను బిడ్‌వెస్ట్ ఆశ్రయించింది. అక్టోబరు 31లోగా ఈ చెల్లింపు పూర్తి చేయాలని జీవీకేను ట్రిబ్యునల్ ఆదేశించింది.

## ఈ-కామర్స్ వ్యాపారాలపై విచారణ జరపండి

**కేంద్రానికి ట్రేడర్ల సమాఖ్య విజ్ఞప్తి**



**న్యూఢిల్లీ:** ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ వంటి ఈ-కామర్స్ దిగ్గజాలు పాటిస్తున్న వ్యాపార విధానాలపై విచారణ జరపాలంటూ అఖిల భారత ట్రేడర్ల సమాఖ్య (సీఏఐటీ) కేంద్రాన్ని కోరింది. ఈ-కామర్స్ కంపెనీలు ప్రకటిస్తున్న భారీ డిస్కౌంట్లతో కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలకు రావాల్సిన జీఎస్‌టీపరమైన ఆదాయాలకు కూడా గణనీయంగా గండిపడుతోందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు రాసిన లేఖలో ఆరోపించింది. ఈ నేపథ్యంలో ఆయా సంస్థల వ్యాపార విధానాలపై విచారణ జరపాలని, బిల్లింగ్ ధర, మార్కెట్ ధరల మధ్య వ్యత్యాసాలకు సంబంధించి వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ)ని రాబట్టాలని కోరింది. సీఏఐటీ ఇప్పటికే కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్‌తో పాటు అన్ని రాష్ట్రాల ఆర్థిక మంత్రులకు ఇందుకు సంబంధించి లేఖలు రాసింది.

## టాప్ 10లోకి బయోకాన్



**బెంగళూరు:** బయో ఫార్మాసూటికల్స్ కంపెనీ బయోకాన్ .. గ్లోబల్ బయోటెక్ ఎంప్లాయర్స్ 2019 ర్యాంకింగ్‌లో 6వ స్థానానికి ఎగబాకింది. అమెరికాకు చెందిన సైన్స్ మ్యాగజైన్ నిర్వహించే సైన్స్ కెరీర్స్ టాప్ 20 ఎంప్లాయర్స్ జాబితాలో ఈ ర్యాంకును సొంతం చేసుకుంది. ఈ అంశంపై సంస్థ చైర్‌పర్సన్, ఎండీ కిరణ్ మజుందార్ షా మాట్లాడుతూ.. 'రోగుల అవసరాలను తీర్చడానికి అవసరమైన సంస్కృతిని ఏర్పాటుచేశాం. దీంతోనే ఈ స్థాయి ర్యాంక్ దక్కింది' అని అన్నారు.

## బోర్డ్ మీటింగ్స్

భారతీ ఎయిర్‌టెల్, హిందుస్తాన్ జింక్, పెట్రోనెట్ ఎల్ఎన్‌జీ, టాటా మెటాలిక్స్, ఎస్‌కేఎఫ్ ఇండియా, వండర్‌లా, డీసీఎమ్ శ్రీరామ్ ఇండస్ట్రీస్, అట్లాస్ సైకిల్స్

# వృద్ధికి మరిన్ని సంస్కరణలే కీలకం..

**ప్రపంచ బ్యాంకు ప్రెసిడెంట్ మల్‌పాస్**



**న్యూఢిల్లీ:** అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితులే భారత ఆర్థిక వ్యవస్థ మందగమనానికి కూడా కారణమని ప్రపంచ బ్యాంకు ప్రెసిడెంట్ డేవిడ్ మల్‌పాస్ పేర్కొన్నారు. మరిన్ని సంస్కరణలు, నవకల్పనలు భారత వృద్ధికి కీలకంగా ఉంటాయని ఆయన అభిప్రాయపడ్డారు. అలాగే, 2024-25 నాటికి 5 లక్షల కోట్ల డాలర్ల ఎకానమీగా భారత్ ఎదగాలంటే.. ఆర్థిక రంగంలో కొత్త ఆవిష్కరణలు అవసరమని డేవిడ్ తెలిపారు. ఆర్థిక రంగంలో భారత్ ఎంతో పురోగతి సాధించినా.. బ్యాంకింగ్ రంగం, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ రంగం (ఎన్‌బీఎఫ్‌సీ), క్యాపిటల్ మార్కెట్ల వంటి వాటి విషయంలో మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉందన్నారు. 'మూడు ప్రధాన రంగాల్లో పురోగతి సాధించాలి. ముందుగా ప్రైవేట్ రంగం సహా బ్యాంకింగ్ పరిశ్రమ వృద్ధికి తోడ్పాటు అందించాలి. కార్పొరేట్ బాండ్ మార్కెట్, తనఖా రుణాల మార్కెట్ మరింతగా విస్తరించేందుకు చర్యలు తీసుకోవాలి. భారత ఆర్థిక వ్యవస్థతో పాటే ఎదిగిన ఎన్‌బీఎఫ్‌సీల్లో రిస్కులు ఉన్న నేపథ్యంలో వాటిని నియంత్రించాలి. సరైన నియంత్రణ చర్యలు తీసుకుంటే.. ఆర్థిక రంగం మరింత మెరుగుపడుతుంది' అని డేవిడ్ పేర్కొన్నారు. ప్రస్తుతం భారత్‌లో 97 ప్రాజెక్టులకు ప్రపంచ బ్యాంకు ఆర్థిక సహాయం అందిస్తోందని డేవిడ్ చెప్పారు. ఈ ప్రాజెక్టుల కోసం 24 బిలియన్ డాలర్లు అందించేందుకు ప్రపంచ బ్యాంకు కట్టుబడి ఉందన్నారు.

# ఐసీఐసీఐ బ్యాంక్ లాభం 1,131 కోట్లు

- 6 శాతం డౌన్
- 26 శాతం పెరిగిన నికర వడ్డీ ఆదాయం
- జీవిత కాల గరిష్టానికి చేరిన షేరు



**న్యూఢిల్లీ:** ప్రైవేట్ రంగ ఐసీఐసీఐ బ్యాంక్ నికర లాభం ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసిక కాలంలో 6 శాతం తగ్గింది. గత ఆర్థిక సంవత్సరం క్యూ2లో రూ.1,205 కోట్లుగా ఉన్న నికర లాభం(కన్సాలిడేటెడ్) ఈ క్యూ2లో రూ.1,131 కోట్లకు చేరిందని ఐసీఐసీఐ బ్యాంక్ తెలిపింది. మొత్తం ఆదాయం మాత్రం రూ.31,915 కోట్ల నుంచి 17 శాతం వృద్ధితో రూ.37,425 కోట్లకు పెరిగిందని పేర్కొంది. స్టాండ్‌అలోన్ పరంగా చూస్తే, గత క్యూ2లో రూ.909 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ2లో 28 శాతం తగ్గి రూ.655 కోట్లకు తగ్గిందని, ఆదాయం మాత్రం రూ.18,262 కోట్ల నుంచి 25 శాతం వృద్ధితో రూ.22,760 కోట్లకు ఎగసిందని వివరించింది. రూ.3,712 కోట్ల పన్ను వ్యయాల కారణంగా లాభం తగ్గిందని పేర్కొంది. నికర వడ్డీ ఆదాయం రూ.6,417 కోట్ల నుంచి 26 శాతం వృద్ధితో రూ.8,057 కోట్లకు, నికర వడ్డీ మార్జిన్ 3.33 శాతం నుంచి 3.64 శాతానికి చేరిందని తెలిపింది.

**మెరుగుపడిన రుణ నాణ్యత...**

నికర లాభం తగ్గినా, ఈ బ్యాంక్ రుణ నాణ్యత మెరుగుపడింది. గత క్యూ2లో 8.54 శాతంగా ఉన్న స్థూల మొండి బకాయిలు ఈ క్యూ2లో 6.37 శాతానికి అలాగే నికర మొండి బకాయిలు 3.65 శాతం నుంచి 1.60 శాతానికి తగ్గాయని ఐసీఐసీఐ బ్యాంక్ తెలిపింది. మొండి బకాయిలు తగ్గడంతో కేటాయింపులు కూడా తగ్గాయి. మొత్తం కేటాయింపులు రూ.3,994 కోట్ల నుంచి రూ.2,506 కోట్లకు తగ్గాయి.

**ఆల్‌టైమ్ హైకి ఐసీఐసీఐ బ్యాంక్...**

నికర వడ్డీ ఆదాయం, నికర వడ్డీ మార్జిన్‌లు ఆరోగ్యకరమైన వృద్ధి సాధించడంతో ఐసీఐసీఐ బ్యాంక్ షేర్ ఆదివారం జరిగిన ప్రత్యేక మూరత్ ట్రేడింగ్‌లో జీవిత కాల గరిష్ట స్థాయి, రూ.473ను తాకింది. చివరకు స్వల్ప నష్టంతో రూ.469 వద్ద ముగిసింది.

# స్టాండర్డ్ గ్లాస్ కొత్త ప్లాంటు

- జిన్నారం వద్ద రూ.35 కోట్లతో ఏర్పాటు
- ఈ ఏడాది రూ.140 కోట్ల టర్నోవర్



ఒప్పందంపై సంతకాలు చేస్తున్న సాండర్డ్ గ్రూప్ ఎండీ నాగేశ్వర రావు, హక్కో సాంగ్యో ఎండీ టోరు టనక (కుడి)

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** ఔషధ, రసాయనాల ఉత్పత్తికి అవసరమైన కీలక పరికరాల తయారీలో ఉన్న స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ మరో ప్లాంటును నెలకొల్పుతోంది. హైదరాబాద్ సమీపంలోని జిన్నారం వద్ద రూ.35 కోట్లతో దీనిని స్థాపిస్తోంది. ఏప్రిల్‌లో ఉత్పత్తి ప్రారంభం అవుతుందని స్టాండర్డ్ గ్రూప్ ఎండీ కందుల నాగేశ్వర రావు సాక్షి బిజినెస్ బ్యూరోకు తెలిపారు. నెలకు 200ల రియాక్టర్ల తయారీ సామర్థ్యంతో ఇది రానుందని చెప్పారు. ఇప్పటికే కంపెనీకి జీడిమెట్ల వద్ద రియాక్టర్ల తయారీ కేంద్రాలు రెండున్నాయి. ఈ రెండు యూనిట్లకు రూ.35 కోట్లు వెచ్చించారు. 63 నుంచి 20,000 లీటర్ల కెపాసిటీ గల రియాక్టర్లను రూపొందిస్తున్నారు. 2018–19లో రూ.80 కోట్ల టర్నోవర్ సాధించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.140 కోట్లు లక్ష్యంగా చేసుకుంది.

**దేశంలో తొలిసారిగా...:** జపాన్ సంస్థ హక్కో సాంగ్యోతో స్టాండర్డ్ గ్లాస్ చేతులు కలిపింది. ఈ కంపెనీ భాగస్వామ్యంతో దేశంలో తొలిసారిగా కండక్టివిటీ గ్లాస్ లైనింగ్ రియాక్టర్లను స్టాండర్డ్ ప్రవేశపెట్టనుంది. ఈ రియాక్టర్లతో విద్యుత్ ప్రమాదాలు జరగవని కంపెనీ చెబుతోంది. డిసెంబరు నుంచి ఇవి మార్కెట్లోకి రానున్నాయి. జీడిమెట్లతో పాటు కొత్తగా రానున్న ప్లాంటులోనూ ఇవి తయారు చేస్తారు. 32,000 లీటర్ల సామర్థ్యం గల రియాక్టర్లు సైతం జిన్నారం యూనిట్‌లో రూపుదిద్దుకోనున్నాయి. కాగా, స్టాండర్డ్ గ్లాస్ దక్షిణాదిన అగ్ర శ్రేణి కంపెనీగా ఉంది. 400లకుపైగా కంపెనీలు క్లయింట్లుగా ఉన్నాయి. ఇప్పటి వరకు 4,000 పైచిలుకు రియాక్టర్లను సరఫరా చేసింది. ఒమన్, టర్కీ, దుబాయిలోనూ కస్టమర్లున్నారు. త్వరలో రష్యాకు సరఫరా చేయనుంది.

**అయిదేళ్లలో రూ.1,000 కోట్లు..**

స్టాండర్డ్ గ్రూప్ 2010లో ప్రారంభమైంది. ప్రస్తుతం సంస్థకు 800 మంది ఉద్యోగులున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.330 కోట్ల టర్నోవర్ నమోదు చేసింది. 2019–20లో రూ.400 కోట్లు ఆశిస్తోంది. అయిదేళ్లలో రూ.1,000 కోట్ల టర్నోవర్‌కు చేరుకోవాలన్నది లక్ష్యమని నాగేశ్వర రావు వెల్లడించారు. 'మరిన్ని ఇంజనీరింగ్ ఉత్పత్తులు ప్రవేశపెడతాం. ప్రస్తుతం ఎగుమతుల వాటా 5 శాతమే. 2024 నాటికి ఎగుమతులను 50 శాతానికి చేర్చాలన్నది మా ధ్యేయం. గ్రూప్ కింద ఎనిమిది తయారీ కేంద్రాలున్నాయి. యూకేలో ఆర్‌అండ్‌డీ కేంద్రం ఉంది' అని వివరించారు.

# 39,440 పైన ముగిస్తే ర్యాలీ

**మార్కెట్ పంచాంగం**

అమెరికా–చైనాల మధ్య ట్రేడ్‌డీల్ కుదిరే అవకాశాలు మెరుగుపడటంతో అంతర్జాతీయ మార్కెట్లు గతవారం స్థిరంగా ట్రేడయినప్పటికీ, మహారాష్ట్ర, హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి మెజార్టీరాకపోవడంతో దేశీయ స్టాక్ సూచీలు ఒడిదుడుకులకు లోనయ్యాయి. అయితే ఈ వారం అమెరికా కేంద్ర బ్యాంక్ ఫెడరల్ రిజర్వ్ సమావేశం, బ్రెగ్జిట్ సందిగ్ధత వంటి అంశాలున్నప్పటికీ, చాలా నెలల తర్వాత అటు విదేశీ ఇన్వెస్టర్లు, ఇటు దేశీయ ఫండ్స్ కలిసి గత కొద్దిరోజులుగా కొనుగోళ్లు జరుపుతున్న కారణంగా సమీప భవిష్యత్తులో మార్కెట్ గరిష్టస్థాయిలోనే స్థిరపడే అవకాశాలున్నాయి. ఇక సూచీల సాంకేతికాంశాల విషయానికొస్తే...

**సెన్సెక్స్ సాంకేతికాంశాలు...**




అక్టోబర్ 27తో ముగిసిన వారంలో (ఆదివారంనాటి మూరత్ ట్రేడింగ్‌తో కలిపి) బీఎస్ఈ సెన్సెక్స్ 39,426– 38,718 పాయింట్ల మధ్య హెచ్చుతగ్గులకు లోనై, చివరకు అంతక్రితం వారంతో పోలిస్తే 48 పాయింట్ల స్వల్ప నష్టంతో 39,250 పాయింట్ల వద్ద ముగిసింది. ర్యాలీ కొనసాగాలంటే ఈ వారం 39,440 పాయింట్ల స్థాయిని (సెప్టెంబర్ 23నాటి గరిష్టస్థాయి) సెన్సెక్స్ అధిగమించాల్సివుంటుంది. ఈ స్థాయి పైన వేగంగా 39,650 పాయింట్ల స్థాయికి పెరగవచ్చు. ఈ స్థాయిని సైతం అధిగమిస్తే 39830–40,030 పాయింట్ల శ్రేణిని అందుకోవొచ్చు. ఈ వారం తొలి నిరోధస్థాయిని ఛేదించలేకపోతే 38,840 పాయింట్ల సమీపంలో తొలి మద్దతు లభిస్తున్నది. ఈ దిగువన 38,715 పాయింట్ల వద్ద తగ్గవచ్చు. ఈ లోపున క్రమేపీ 38,500 పాయింట్ల వరకూ క్షీణత కొనసాగవచ్చు.

**నిఫ్టీ 11,695పైన ముగిస్తే మరింత ర్యాలీ...**




గత మార్కెట్ పంచాంగంలో ప్రస్తావించిన అంచనాలకు అనుగుణంగా ఎన్ఎస్ఈ నిఫ్టీ తొలిస్థాయి వద్ద నిరోధాన్ని ఎదుర్కొని 11,500లోపునకు పడిపోయింది. 11,714–11,490 పాయింట్ల మధ్య హెచ్చుతగ్గులకు లోనై చివరకు అంతక్రితం వారంతో పోలిస్తే 35 పాయింట్ల నష్టంతో 11,627 పాయింట్ల వద్ద ముగిసింది. ఈవారం నిఫ్టీకి 11,695 పాయింట్ల స్థాయి కీలకం. గత నెల 27నాటి ఈ గరిష్టస్థాయిని అధిగమించి, ముగిస్తే మరింత పెరిగే అవకాశాలు ఏర్పడతాయి. ఈ స్థాయిపైన 11,790 పాయింట్ల వద్దకు చేరవచ్చు. అటుపైన ముగిస్తే 11,870–11980 పాయింట్ల శ్రేణి వరకూ ర్యాలీ కొనసాగే చాన్స్ ఉంటుంది. ఈ వారం నిఫ్టీ తొలి నిరోధస్థాయిని దాటలేకపోతే 11,535 పాయింట్ల వద్ద తక్షణ మద్దతు లభిస్తున్నది. ఈ లోపున 11,490 పాయింట్ల వద్దకు పడిపోవచ్చు. ఈ స్థాయిని సైతం వదులుకుంటే క్రమేపీ 11,420 పాయింట్ల వరకూ తగ్గవచ్చు.

– పి. సత్యప్రసాద్

## బులియన్ రూ.లలో

| | |
|---|---|
| **ముంబై** | |
| బంగారం (24 క్యారెట్లు) | 39,690 |
| బంగారం (22 క్యారెట్లు) | 37,800 |
| వెండి (కిలో) | 50,300 |
| **చెన్నై** | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,690 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,850 |
| వెండి (కిలో) | 50,300 |
| **హైదరాబాద్** | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,690 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,850 |
| వెండి (కిలో) | 50,300 |
| **ప్రొద్దుటూరు** | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,650 |
| బంగారం (22 క్యారెట్లు) | 35,840 |
| వెండి (కిలో) | 47,700 |
| **విశాఖపట్నం** | |
| బంగారం (24 క్యారెట్లు) | 39,620 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,850 |
| వెండి (కిలో) | 48,000 |
| **ఏపీ బులియన్ అసోసియేషన్** | |
| బంగారం (24 క్యారెట్లు) | 39,840 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,850 |
| వెండి (కిలో) | 50,300 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

## ముడిచమురు... (బ్యారెల్)

| | | |
|---|---|---|
| నైమెక్స్ లైట్ స్వీట్ | 55.85 (రాత్రి 11.30కు) | $56.66 (శుక్రవారం ముగింపు) |
| బ్రెంట్ | 61.23 (రాత్రి 11.30కు) | $62.02 (శుక్రవారం ముగింపు) |

## కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్/100కు రూ.లలో) 29-10-2019

| | |
|---|---|
| విశాఖ | 400-00 |
| చిత్తూరు | 423-00 |
| వరంగల్ | 396-00 |
| చెన్నై | 430-00 |
| ముంబై | 441-00 |
| **28-10-2019 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 393-00 |
| రిటైల్ (ఒక గుడ్డుకు) | 4.50 |
| విజయవాడ | 398-00 |
| నమక్కల్ | 415-00 |
| గోదావరి | 398-00 |
| బెంగళూరు | 415-00 |
| కోల్‌కతా | 433-00 |
| ఢిల్లీ | 408-00 |

# ఏడాది చివరికి 42,000కు పసిడి!

**విశ్లేషకుల అంచనా**



**ముంబై:** పసిడి 10 గ్రాముల ధర ఈ సంవత్సరాంతానికి దేశంలో రూ.42,000ను తాకుతుందని కమోడిటీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. భౌగోళిక రాజకీయ అనిశ్చితి, ఉద్రిక్తతలు, డాలర్ మారకంలో రూపాయి విలువ బలహీనత, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) పసిడి కొనుగోళ్లు వంటి అంశాలు దేశంలో పసిడి ధర పరుగుకు దోహదపడతాయని వారి విశ్లేషణ.

**అంతర్జాతీయంగా 1,650 డాలర్లకు..!**

''మధ్య ప్రాచ్యంలో భౌగోళిక రాజకీయ అనిశ్చితి పరిస్థితులు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంది. దీనితో ఈ ఏడాది డిసెంబర్ నాటికి అంతర్జాతీయ ఫ్యూచర్స్ కమోడిటీ మార్కెట్ నైమెక్స్‌లో పసిడి ఔన్స్ (31.1గ్రా) ధర 1,650 డాలర్లకు చేరవచ్చు. ఇక దేశీయ ఫ్యూచర్స్ మార్కెట్ మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్(ఎంసీఎక్స్)లో ఈ ధర 10 గ్రాములకు ఏకంగా రూ.42,000కి చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి'' అని కాంట్రెంజ్ రిసెర్చ్ సహ వ్యవస్థాపకులు, సీఈఓ జ్ఞానశేఖర్ త్యాగరాజన్ పేర్కొన్నారు. ఈ ఏడాది చివరి వరకూ పసిడి ధర పెరుగుదల ధోరణే కనబరుస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈక్విటీల్లో సంవత్సరాంత డెరివేటివ్ పొజిషన్ల స్క్వేరాఫ్ అవకాశాలు కూడా పసిడి ధర పెరుగుదలకు దోహదపడుతుందని ఆయన విశ్లేషించారు. పెట్టుబడులకు సురక్షిత సాధనంగా ఇన్వెస్టర్ పసిడిని చూస్తాడనడానికి పలు కారణాలు కనబడుతున్నాయని అన్నారు. ఎంసీఎక్స్‌లో పసిడి 10 గ్రాముల ధర శుక్రవారం ట్రేడింగ్ చివరకు రూ.38,293 వద్ద ముగిసింది. ఇక నైమెక్స్‌లో ఔన్స్ ధర సోమవారం ఈ వార్తరాసే రాత్రి 8 గంటల సమయానికి 1,492 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. సోమవారం దేశీయ మార్కెట్లకు సెలవు.

# మార్కెట్.. లాభాల బోణి

- సంవత్ 2076 శుభారంభం
- ఆదివారం ప్రత్యేక మూరత్ ట్రేడింగ్
- 192 పాయింట్ల లాభంతో 39,250కు సెన్సెక్స్
- 43 పాయింట్లు పెరిగి 11,627కు నిఫ్టీ

విక్రమ శకం(సంవత్) 2076ను స్టాక్ మార్కెట్ లాభాలతో శుభారంభం చేసింది. ఆదివారం సా.6.00గం. లనుంచి రాత్రి గం. 7.15 ని. వరకూ జరిగిన ప్రత్యేక మూరత్ ట్రేడింగ్‌లో సెన్సెక్స్, నిఫ్టీలు లాభాల్లో ముగిశాయి. సంవత్ 2076 ఆరంభం కారణంగా ఇన్వెస్టర్లు, ట్రేడర్లు తాజా పొజిషన్లు తీసుకోవడంతో స్టాక్ మార్కెట్ లాభాలతో కళకళలాడింది. సెన్సెక్స్ 192 పాయింట్ల లాభంతో 39,250 పాయింట్ల వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 43 పాయింట్లు పెరిగి 11,627 పాయింట్ల వద్ద ముగిశాయి. టెలికం, కన్సూమర్ డ్యూరబుల్స్ సూచీలు మినహా మిగిలిన అన్ని రంగాల బీఎస్ఈ సూచీలు లాభాల్లోనే ముగిశాయి. బలి పాడ్యమి సందర్భంగా సెలవు కావడంతో బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో సోమవారం ట్రేడింగ్ జరగలేదు. మూరత్ ట్రేడింగ్‌లో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు రూ.7 కోట్లు, దేశీయ ఇన్వెస్టర్లు 54 కోట్లు చొప్పున కొనుగోళ్లు జరిపారు.

**ఫెడ్ నిర్ణయం, క్యూ2 ఫలితాలే కీలకం..!**

అమెరికా ఫెడరల్ రిజర్వ్ రెండు రోజుల సమావేశం.. మంగళ, బుధవారాల్లో జరగనుంది. ఈ సమావేశంలో వడ్డీ రేట్లు మరో 25 బేసిస్ పాయింట్లు తగ్గేందుకు అవకాశం ఉందని అంచనాలు వెలువడుతున్నాయి. దీనికి తోడు గురువారం వెల్లడికానున్న బ్యాంక్ ఆఫ్ జపాన్ రేట్ల నిర్ణయం, దేశీ కంపెనీల రెండో త్రైమాసిక ఫలితాలు ఈ వారం మార్కెట్ గమనాన్ని నిర్దేశిస్తాయని దలాల్ స్ట్రీట్ వర్గాలు చెబుతున్నాయి.



**సంవత్ 2076లో ఒడిదుడుకులు**

సంవత్ 2075లో బీఎస్ఈ సెన్సెక్స్ 4,066 పాయింట్లు (12 శాతం), ఎన్ఎస్ఈ నిఫ్టీ 1,054 పాయింట్లు (10 శాతం) చొప్పున లాభపడ్డాయి. ఈ లాభాలు సంవత్ 2076లో కొనసాగే అవకాశాల్లేవని పలువురు నిపుణులంటున్నారు. ఆర్థిక మందగమనం, వివిధ దేశాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు తదితర అంశాల ప్రభావమే దీనికి కారణమని వారంటున్నారు.



దీపావళి సందర్భంగా ఓ చిన్నారితో గవర్నర్ తమిళిసై

## త్వరలో గిరిజన ప్రాంతాల్లో పర్యటిస్తా

- ఆర్టీసీ సమస్యను ప్రభుత్వం పరిశీలిస్తుంది
- గవర్నర్ తమిళిసై వెల్లడి

హైదరాబాద్: మరో 25 రోజుల్లో గిరిజన నివాసుల ప్రాంతాల్లో పర్యటించి వారి జీవన విధానంపై అధ్యయనం చేస్తానని గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ వెల్లడించారు. దీపావళి సందర్భంగా ఆదివారం రాజ్‌భవన్‌లో 'మీట్ అండ్ గ్రీట్'కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు, ప్రముఖులు గవర్నర్ దంపతులను కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ.. రాజ్‌భవన్‌లో ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించామని తెలిపారు. రాజ్‌భవన్‌కు వచ్చే వారు ప్లాస్టిక్ పూలు, బొకేలు తీసుకురావద్దని సూచించారు. ప్రధాని మోదీ ఇచ్చిన 'ఫిట్ ఇండియా'పిలుపు మేరకు నెలరోజుల పాటు రాజ్‌భవన్‌లో యోగా కార్యక్రమాలు నిర్వహించామని, ఇందులో ఉద్యోగులు భారీ సంఖ్యలో పాల్గొన్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం తనకు సొంతిల్లు లాంటిదని.. ఇక్కడి ప్రజలు గవర్నర్ అక్కా అని పిలవడంతో తాను పులకరించానని తెలిపారు. ఆర్టీసీ సమ్మెపై స్పందించాలని కోరగా సమ్మె విషయం ప్రభుత్వం పరిశీలిస్తుందని, దీనిపై ఇరు వర్గాల నుంచి తనకు వినతిపత్రాలు అందాయని పేర్కొన్నారు.

## మంత్రి నిరంజన్‌రెడ్డి విదేశీ పర్యటన

- జర్మనీ, నెదర్లాండ్‌లలో నేటి నుంచి 8 రోజుల పర్యటన
- మంత్రి వెంట వెళ్లనున్న ప్రత్యేక ప్రతినిధి బృందం



సాక్షి, హైదరాబాద్: వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ప్రత్యేక ప్రతినిధి బృందంతో కలసి విదేశీ పర్యటనకు వెళ్లనున్నారు. నేటి నుంచి 8 రోజులపాటు వీరు జర్మనీ, నెదర్లాండ్స్‌లలో పర్యటించనున్నారు. ఇండో–జర్మన్ విత్తనరంగ సహకార ప్రాజెక్టులో భాగంగా జర్మనీ ఆహార, వ్యవసాయశాఖ ఆహ్వానం మేరకు అక్కడికి వెళుతున్నారు. ఈ పర్యటనకు మంత్రితోపాటు వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి, విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వర్‌రావు, వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్, దేవరకద్ర ఎమ్మెల్యే ఆలె వెంకటేశ్వర్‌రెడ్డి, విత్తనాభివృద్ధి సంస్థ డైరెక్టర్ డాక్టర్ కేశవులుతో కూడిన ప్రతినిధి బృందం వెళ్లనుంది. ఈ బృందం ఆ దేశాల్లో వ్యవసాయరంగంలో వాడుతున్న అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, సహకార సంఘాల వ్యవస్థ, పనితీరు, ఆర్థిక అంశాలపై అధ్యయనం చేయనుంది. బెర్లిన్‌లో అక్కడి అధికారులతో సమావేశమై విత్తనరంగ అంశాలు, పాలసీలు, వ్యవసాయరంగం, పంటల సాగు విధానం, పథకాలపై చర్చించనుంది. అలాగే బెర్లిన్‌లో అంతర్జాతీయంగా గుర్తింపుపొందిన ఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీలను, ఆమ్‌స్టర్‌డాంలో ఆధునిక సౌకర్యాలతో నిర్మించిన విత్తన ధ్రువీకరణ ల్యాబ్‌ను వారు సందర్శిస్తారు. అక్కడి సీడ్ వ్యాలీలో ఉన్న విత్తన కంపెనీలు, ప్రాసెసింగ్ సౌకర్యాలను పరిశీలిస్తారు. యూరోపియన్ అంతర్జాతీయ సంబంధాల శాఖ అధికారులతోనూ సమావేశం కానున్నారు.

## మంత్రి కేటీఆర్‌ను కలసిన సైదిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో టీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించిన శానంపూడి సైదిరెడ్డి సోమవారం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కె.తారక రామారావును కలిశారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత తొలిసారిగా మంత్రి జగదీశ్‌రెడ్డి, పార్టీ నేతలతో హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో కేటీఆర్‌ను కలసి ధన్యవాదాలు తెలిపారు. హుజూర్‌నగర్‌లో తొలిసారిగా టీఆర్‌ఎస్ అభ్యర్థి విజయం సాధించడంపై కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. పార్టీ నేతలు, కార్యకర్తల సమష్టి కృషివల్లే హుజూర్‌నగర్‌లో భారీ మెజారిటీ సాధ్యమైందని అన్నారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో ఎమ్మెల్యే రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, పార్టీ నేతలు ఉన్నారు.

## పోలీసు, న్యాయవ్యవస్థ నాణేనికి రెండు ముఖాలు

### హైకోర్టు చీఫ్ జస్టిస్ రాఘవేంద్ర సింగ్ చౌహాన్



సాక్షి, హైదరాబాద్: పోలీసు, న్యాయవ్యవస్థలు ఒకే నాణేనికి ఉన్న రెండు ముఖాల వంటివని హైకోర్టు చీఫ్ జస్టిస్ రాఘవేంద్ర సింగ్ చౌహాన్ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లో రాజాబహద్దూర్ వెంకటరామిరెడ్డి (ఆర్‌బీవీఆర్ఆర్) తెలంగాణ రాష్ట్ర పోలీసు అకాడమీలో 2019 కొత్త ఎస్సై(సివిల్) బ్యాచ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ రాఘవేంద్ర సింగ్ చౌహాన్ మాట్లాడుతూ న్యాయ, పోలీస్ విధుల్లో వ్యత్యాసమున్నా లక్ష్యం ఒక్కటేనన్నారు. పోలీసు అధికారులు సమాజం పట్ల సున్నితత్వంతో వ్యవహరించాలని సూచించారు. ఫిర్యాదులు ఇచ్చేందుకు వచ్చే ప్రజలతో సహనంతో వ్యవహరించాలన్నారు. డీజీపీ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న నేరాలపై శాస్త్రీయ దృక్పథం పెంచుకోవాలన్నారు. ప్రాథమిక హక్కులతోపాటు, చట్టాలన్నింటిపైనా పట్టు సాధించాలని సూచించారు. బృందస్ఫూర్తి, స్మార్ట్‌వర్క్, సిటిజన్ ఫ్రెండ్లీ విధానాలకనుగుణంగా విధులు నిర్వహించాలన్నారు. ముడిరాళ్లను వజ్రాలుగా సానబెట్టే అవకాశం టీఎస్‌పీఏకి వచ్చిందని తెలంగాణ రాష్ట్ర పోలీసు అకాడమీ డైరెక్టర్ వినయ్‌కుమార్ సింగ్ పేర్కొన్నారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని ట్రైనీ ఎస్సైలకు సూచించారు. కాగా, డిప్యూటీ డైరెక్టర్ బి.నవీన్‌కుమార్.. టీఎస్‌పీఏ నిబంధనలను వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ జానకీషర్మిల తదితరులు పాల్గొన్నారు.

## నేడు టీపీసీసీ కోర్‌కమిటీ సమావేశం

### రాష్ట్ర రాజకీయాలు, హుజూర్‌నగర్ ఉప ఎన్నిక, ఆర్టీసీ సమ్మెపై చర్చ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) కోర్ కమిటీ సమావేశం మంగళవారం గాంధీభవన్‌లో జరగనుంది. మధ్యాహ్నం 12:30 గంటలకు టీపీసీసీ అధ్యక్షుడు ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జితో పాటు ఏఐసీసీ కార్యదర్శులు, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు, కోర్ కమిటీ సభ్యులు హాజరు కానున్నారు. సమావేశంలో రాష్ట్ర రాజకీయ పరిణామాలపై చర్చించడంతో పాటు హుజూర్‌నగర్ ఉప ఎన్నికపై సమీక్ష జరుగుతుందని, ఆర్టీసీ సమ్మె, మున్సిపల్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించనున్నట్లు గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి. అనంతరం టీపీసీసీ కార్యవర్గ సమావేశం కూడా జరగనుంది. అలాగే భారత ఆర్థిక వ్యవస్థ దిగజారుతున్న తీరు గురించి ఏఐసీసీ ప్రతినిధులు ఈ సమావేశంలో కార్యవర్గ సభ్యులకు వివరించనున్నారు. దేశ వ్యాప్తంగా ఏఐసీసీ పిలుపు మేరకు బీజేపీకి వ్యతిరేకంగా నిర్వహించాల్సిన ఆందోళన కార్యక్రమాలపై దిశానిర్దేశం చేయనున్నారు.

# 'నీరా' వచ్చేస్తోంది

- త్వరలోనే మార్కెట్లోకి ఉత్పత్తులు
- మార్గదర్శకాలు విడుదల.. గీత కార్మిక సొసైటీ సభ్యులకు పదేళ్ల లైసెన్సులు
- మున్సిపాలిటీలు, పర్యాటక ప్రాంతాల్లో రిటైల్ ఔట్‌లెట్లు
- తాటి బెల్లం, పంచదార లాంటి అనుబంధ ఉత్పత్తుల తయారీకి అనుమతి
- నిబంధనలు ఉల్లంఘించినా, కల్తీ చేసినా లైసెన్సులు రద్దు



నీరా ఉత్పత్తుల తయారీ మార్గదర్శకాలను విడుదల చేస్తున్న మంత్రులు హరీశ్, కేటీఆర్, శ్రీనివాస్‌గౌడ్. చిత్రంలో సీఎస్ జోషి, ఎక్సైజ్ కమిషనర్ సోమేశ్‌కుమార్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో నీరా ఉత్పత్తులు త్వరలోనే మార్కెట్‌లోకి రానున్నాయి. నీరాను తీయడంతోపాటు అనుబంధ ఉత్పత్తుల తయారీకి అనుమతిస్తూ ఎక్సైజ్ శాఖ మార్గదర్శకాలు విడుదల చేసింది. ఇందుకు సంబంధించిన జీవోను ఎక్సైజ్ కమిషనర్ సోమేశ్‌కుమార్ సోమవారం విడుదల చేశారు. ఈ జీవో ప్రకారం రాష్ట్రంలోని కల్లుగీత సహకార సొసైటీలు, తెలంగాణ గీత పారిశ్రామిక, ఆర్థిక సంక్షేమ సంస్థ, లేదా గౌడ, ఈడిగ కులాలకు చెందిన ఇతర సొసైటీల్లో సభ్యులుగా ఉన్న వారికి నీరా లైసెన్సులు ఇవ్వనున్నారు. లైసెన్సులు పదేళ్ల కాలం చెల్లుబాటు అవుతాయి. అనంతరం మళ్లీ వాటిని రెన్యువల్ చేస్తారు. నీరా ఉత్పత్తులను అమ్ముకునేందుకు మున్సిపాలిటీలు, పర్యాటక ప్రాంతాల్లో అనుమతివ్వనున్నారు. ఇందుకు సంబంధించి రిటైల్ ఔట్‌లెట్లను కూడా ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంది. కేవలం నీరాతోపాటు వాటి అనుబంధ ఉత్పత్తులైన తాటి బెల్లం, తాటి పంచదార లాంటి వాటిని కూడా లైసెన్సీలు తయారు చేసుకోవచ్చు. ప్రభుత్వ సహకార సంస్థలు, ప్రభుత్వం అనుమతిచ్చిన పరిశ్రమలకు కూడా నీరాను నాన్ ఆల్కహాలిక్ ఉత్పత్తుల తయారీకి ముడిసరుకుగా ఉపయోగించుకునేందుకు అమ్ముకునేలా లైసెన్సీలకు వెసులుబాటు ఇచ్చారు. అయితే నీరా లైసెన్సులు కేవలం నీరాను అమ్ముకునేందుకే వర్తిస్తాయి తప్ప కల్లు అమ్ముకునేందుకు వర్తించవని మార్గదర్శకాల్లో స్పష్టంగా పేర్కొన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలను ఉల్లంఘించినా, నీరాను కల్తీ చేసేందుకు యత్నించినా సంబంధిత లైసెన్సులను రద్దు చేయనున్నారు. మార్గదర్శకాలతో కూడిన ప్రతులను మంగళవారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ)లో జరిగిన కార్యక్రమంలో మంత్రులు టి.హరీశ్‌రావు, కె. తారక రామారావు, వి.శ్రీనివాస్‌గౌడ్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషి, ఎక్సైజ్ కమిషనర్ సోమేశ్‌కుమార్‌లతోపాటు గౌడ కులానికి చెందిన ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్, ఎమ్మెల్యే వివేకానందగౌడ్, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజేశంగౌడ్, ఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ నాగేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గౌడ ప్రజాప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

**త్వరలోనే ప్రభుత్వ స్టాల్స్: శ్రీనివాస్‌గౌడ్**

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గౌడ కులస్తుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం నీరా పాలసీని ప్రకటించిందని, త్వరలోనే ప్రభుత్వ నీరా స్టాల్స్ ఏర్పాటు చేస్తామని, హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ పరిసరాల్లోనే మొదటి స్టాల్ ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ఎక్సైజ్ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు. 70 ఏళ్లుగా పాలించిన ప్రభుత్వాలు గీత కార్మికులపై ఆంక్షలు పెట్టడమే కానీ వారి వృత్తికి సంబంధించిన ఎలాంటి సాయం చేయలేదన్నారు. నీరా పేరుతో ఇతర దేశాల్లో పర్యటించారు కానీ అమల్లోకి తేలేదని, గౌడవృత్తిని కాపాడటం కోసం 'హరితహారం'లో తాటిచెట్లను నాటిన ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. హైదరాబాద్‌లో నీరా అమ్మకాలకు అనుమతివ్వడం ఆనందంగా ఉందని, దశలవారీగా అన్ని జిల్లాల్లో అమ్మకాలు జరిగేలా చూస్తామన్నారు. నీరాను గీయడం, అమ్మడం కేవలం గౌడ కులస్తులే చేయాలని సీఎం చెప్పారని, ఈ మేరకు గౌడ కులస్తులకే నీరా లైసెన్సులిస్తామని చెప్పారు. నీరాలో అనేక ఔషధ గుణాలున్నాయని, షుగర్, మధుమేహ వ్యాధులకు ఔషధంగా పనిచేస్తుందని చెప్పారు. ఔటర్ రింగ్‌రోడ్డు చుట్టూ నీరా స్టాల్స్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.

# సంపాదక చక్రవర్తి రాఘవాచారి కన్నుమూత

- సాహితీవేత్త, మేధావి, విజ్ఞాన నిఘంటువుగా పేరు ప్రఖ్యాతులు
- 1972లో విశాలాంధ్ర ఎడిటర్‌గా బాధ్యతలు
- మఖ్దూం భవన్‌లో భౌతికకాయానికి నివాళులు అర్పించిన ప్రముఖులు



సాక్షి, హైదరాబాద్ : ప్రముఖ సంపాదకుడు, సాహితీవేత్త, కమ్యూనిస్టు నేత చక్రవర్తుల రాఘవాచారి (80) కన్నుమూశారు. కిడ్నీ కేన్సర్‌తో ఆయన హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో నెలక్రితం చేరారు. ఈ క్రమంలో సోమవారం తెల్లవారుజామున ఆయన తీవ్ర అస్వస్థతకు గురై తుదిశ్వాస విడిచారు. ఉదయం 7గంటల సమయంలో ఆయన భౌతికకాయాన్ని హిమాయత్‌నగర్‌లోని మఖ్దూం భవన్‌లో ఉంచారు. అక్కడ ప్రముఖులు నివాళులర్పించిన అనంతరం విజయవాడకు తరలించారు. రాఘవాచారికి భార్య జ్యోత్స్న, కుమార్తె డాక్టర్ సి.అనుపమ ఉన్నారు.

**విశాలాంధ్ర సంపాదకునిగా 33 ఏళ్లు**

రాఘవాచారి వరంగల్ జిల్లా పాలకుర్తి మండలం శాంతాపురానికి చెందిన వరదాచారి, కనకమ్మ దంపతులకు 1939 సెప్టెంబర్ 10న జన్మించారు. నిబద్ధత, విలువలతో కూడిన జర్నలిజానికి మారుపేరుగా నిలిచారు. ప్రాథమిక, కళాశాల విద్యాభ్యాసం వరంగల్‌లోనే పూర్తి చేశారు. హైదరాబాద్‌లో లా చదివారు. ఆయనకు విజ్ఞాన నిఘంటువుగాను, మేధావిగాను ఎనలేని గుర్తింపు ఉంది. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా విద్యార్థి ఉద్యమానికి ఆయన అందించిన సేవలు ఎనలేనివి. సీపీఐకి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్‌గా, జాతీయ కంట్రోల్ కమిషన్ సభ్యునిగా వ్యవహరించారు. 1972లో విశాలాంధ్ర ఎడిటర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన 2005 వరకు ఆ పదవిలో కొనసాగారు. ఢిల్లీ నుంచి వెలువడే 'పేట్రియట్'దినపత్రిక, లింక్ వార పత్రికలకు ఆయన హైదరాబాద్ పాత్రికేయునిగా పనిచేశారు.

**ఏడేళ్ల కిందటే కిడ్నీ కేన్సర్..**

ఏడేళ్ల క్రితం రాఘవాచారి కిడ్నీ కేన్సర్‌తో అనారోగ్యానికి గురయ్యారు. ఆ సమయంలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఆయనకు శస్త్ర చికిత్స జరిగింది. ఇటీవల కిడ్నీ కేన్సర్ తిరగబెట్టడంతో తన కుమార్తె అనుపమ వైద్యురాలిగా పనిచేస్తున్న ఆసుపత్రిలోనే చికిత్సకు చేరారు. అక్కడే తుదిశ్వాస విడిచారు.

**సీఎం కేసీఆర్ దిగ్భ్రాంతి**

రాఘవాచారి మృతి పట్ల సీఎం కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నిబద్ధత కలిగిన జర్నలిస్టుగా, విలువలు కలిగిన సామాజిక కార్యకర్తగా ఆయన సాగించిన జీవితం ఆదర్శ ప్రాయమన్నారు. కుటుంబ సభ్యులు, సహచరులకు సానుభూతి తెలిపారు. సీపీఐ జాతీయ ప్రధానకార్యదర్శి డి.రాజా, సీపీఐ అగ్రనేత సురవరం సుధాకరరెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్, టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి, తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, ప్రముఖ పరిశోధకుడు, కవి జయధీర్ తిరుమలరావు రాఘవాచారి మరణం పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

**రాఘవాచారి సేవలు మరువలేనివి: జగన్**

రాఘవాచారి మృతి పట్ల ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. రాఘవాచారి విలువల ఆధారిత జర్నలిజాన్ని విశ్వసించారని కొనియాడారు. తెలుగు పాత్రికేయ రంగంలో రాఘవాచారి చేసిన సేవలు మరువలేనివని శ్లాఘించారు. ఆయన రచనలు నేటి తరానికి ప్రేరణగా నిలుస్తాయన్నారు. రాఘవాచారి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

DELL SMALL BUSINESS
India's #1 Trusted Brand^
DIWALI OFFER
ప్రత్యేకమైన వ్యాపార స్పెషల్
బిస్నెస్ డీల్‌లు.
ఈ పండుగ సీజన్‌లో కొత్త టెక్ తో సరికొత్త ఆరంభం చేయండి.
ENDS 02/11




ఎంపిక చేయబడిన Dell వ్యాపార PCs పై Rs. 26,000# వరకు విలువైన ఆఫర్లు పొందండి.
OFFERS
PIXMA MG3070S Canon Printer
Free 3-Years ProSupport
Instant Cash Off
Shop directly on Dell.co.in/SmallBizDeals or Contact a Small Business Advisor: 1800 425 4023+
+Toll Free Mon-Fri 9am-6pm
#Offers valid until 02 November, 2019. Applicable only for business establishments. GSTIN requirement is mandatory. Select features on select products.
^Research by TRA's 'The Brand Trust Report, India Study 2019'.
*Subject to T&Cs. For more details, see https://www.dell.co.in/tnc.
Mistakes: While all efforts are made to check pricing and other errors, inadvertent errors do occur from time to time and Dell reserves the right to decline orders arising from such errors. More information: Go to https://www.dell.co.in/details Trademarks: Dell and Vostro are trademarks of Dell Inc. All other trademarks are the property of their respective owners. Copyright: © 2019 Dell Inc. All rights reserved.
With 8th Gen Intel® Core™ i5 processor.
intel CORE i5 8th Gen

# ఔటర్‌పై జర్నీ ఇక బేఫికర్

ఘట్‌కేసర్ నుంచి శంషాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు మార్గమధ్యంలో వెళ్తున్న కారును వెనుక నుంచి వచ్చిన ఓ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. మరొకరికి స్వల్ప గాయమైంది. అదే మార్గంలో వెళ్తున్న మరో వాహనదారుడు ఈ ఘటన చూసి పోలీసులకు సమాచారం అందించాలనుకున్నాడు. అయితే సెల్‌ఫోన్ సిగ్నల్ సరిగాలేక కనెక్ట్ కాలేదు. ఆ వెంటనే అక్కడే మెయిన్ క్యారేజ్‌వేపై ఉన్న ఎమర్జెన్సీ కాల్‌బాక్స్ ద్వారా చేసిన కాల్ వారి ప్రాణాలను నిలపగలిగింది.

శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్లడం కోసం గచ్చిబౌలి నుంచి తన బంధువులతో కలసి ఓ వ్యక్తి బయలుదేరాడు. తెల్లవారుజామున 4 కావడంతో ఆ మార్గాన్ని పొగమంచు కప్పేసింది. అతడు ఆ పక్కనే ఉన్న భారీ స్క్రీన్‌ను చూశాడు. అక్కడ 'మీ వాహన లైట్లు, ఇండికేటర్స్ వేసుకొని 40 కిలోమీటర్ల వేగంతో మాత్రమే ముందుకెళ్లాలి అని డిస్‌ప్లే అవుతోంది. దీంతో సాఫీగా అతడి ప్రయాణం పూర్తయింది.

- వాహనదారుల భద్రతకు అత్యాధునిక సాంకేతికత దన్ను
- ఏ ప్రమాదం జరిగినా సెకన్లలో తెలిసేలా ఎమర్జెన్సీ కాల్‌బాక్స్‌లు
- వాహనదారులను అప్రమత్తం చేసేలా వేరియబుల్ సైన్ బోర్డులు
- నానక్‌రామ్‌గూడలోని ట్రాఫిక్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం
- 2 వారాల్లో అమల్లోకి పూర్తిస్థాయి హెచ్‌టీఎంఎస్ సేవలు


కమాండ్ కంట్రోల్ సెంటర్

సాక్షి, హైదరాబాద్: ఔటర్ రింగ్ రోడ్డు మార్గాన్ని ప్రమాద రహిత రహదారిగా మార్చేందుకు గాను పై రెండు సందర్భాల్లోని సేవలను అత్యాధునిక సాంకేతికతలో భాగంగా హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రస్తుతం ప్రయోగాత్మకంగా జరుగుతున్న హైవే ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (హెచ్‌టీఎంఎస్) సేవలను మరో 2 వారాల్లో వాహనదారులకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడంపై అధికారులు దృష్టి సారించారు. ఇప్పటికే ఎమర్జెన్సీ కాల్ బాక్స్‌లు, వేరియబుల్ సైన్ బోర్డులు, మెటిరోలాజికల్ ఎక్విప్‌మెంట్లు, సీసీటీవీ కెమెరాలు, ఆటోమెటిక్ ట్రాఫిక్ కౌంటర్ కమ్ క్లాషిఫయర్స్ (ఏటీసీసీ)లు ఏర్పాటు చేశారు. వీటన్నింటిని నానక్‌రామ్‌గూడలోని ట్రాఫిక్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు హెచ్‌ఎండీఏ ఓఆర్‌ఆర్ విభాగ అధికారులు అనుసంధానం చేస్తున్నారు. ఇప్పటికే దాదాపు 80 శాతం అనుసంధానం పనులు పూర్తి కావడంతో 2 వారాల్లో అధికారికంగా హెచ్‌ఎంటీఏఎస్ సేవలు అందుబాటులోకి రానున్నాయి.

### సైన్ స్క్రీన్‌లో సమాచారం..

158 కిలోమీటర్లు ఉన్న ఓఆర్‌ఆర్‌లో 19 ఇంటర్‌ఛేంజ్‌లు ఉన్నాయి. ఈ ఇంటర్‌ఛేంజ్‌లకు 1.3 కిలోమీటర్ల ముందు రెండు వైపులా వేరియబుల్ సైన్ స్క్రీన్ బోర్డులు 37 ఏర్పాటు చేశారు. అలాగే నేషనల్ హైవే అనుసంధానమయ్యే మార్గాల్లో 10 సైన్ స్క్రీన్ బోర్డులు అమర్చారు. మెటిరోలాజికల్ సెన్సార్స్, పొగమంచు, వెలుతురు మందగించడం, రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు, భారీ వర్షం కురిసినప్పుడు, ట్రాఫిక్ జామ్ ఏర్పడినప్పుడూ.. ఆయా సందర్భాల్లో వాహనచోదకులను అప్రమత్తం చేసేందుకు ఈ సైన్‌స్క్రీన్ బోర్డులపై ఆయా సమాచారాన్ని డిస్‌ప్లే చేస్తారు.

### ఆపదలో బటన్ నొక్కితే చాలు..

ఇప్పటివరకు ఓఆర్‌ఆర్‌లో ఎక్కడైనా రోడ్డు ప్రమాదం జరిగి గుర్తించినా ఆయా ప్రాంతాల్లో సెల్‌ఫోన్ సిగ్నల్ సరిగా పనిచేయక కొన్ని నిమిషాల పాటు ఇటు పోలీసులు, అటు అంబులెన్స్‌లకు ప్రయత్నించిన సందర్భాలున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఎమర్జెన్సీ కాల్ బాక్స్‌ను ప్రతి కిలోమీటర్‌కు మెయిన్ క్యారేజ్‌వే ఎడమ వైపు, కుడి వైపున ఏర్పాటు చేశారు. ఇలా 328 ఎమర్జెన్సీ కాల్ బాక్స్‌లను బిగించారు. ఆ బాక్స్‌ల్లో ఉన్న బటన్ నొక్కితే చాలు ఆటోమేటిక్‌గా నానక్‌రామ్‌గూడలోని హెచ్‌ఎండీఏ ట్రాఫిక్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు కనెక్ట్ అవుతుంది. దీంతో సంబంధిత అధికారులు నిమిషాల వ్యవధిలో ఘటనాస్థలికి వెళ్లే అవకాశం ఉంటుంది.

### ఇంటర్‌ఛేంజ్‌లపై నిఘానేత్రం..

రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నట్లు గుర్తించిన 19 ఇంటర్‌ఛేంజ్‌లు అంటే వాహనం ఓఆర్‌ఆర్‌పైకి వచ్చే దారుల వద్ద దాదాపు 38 సీసీటీవీ కెమెరాలను బిగించారు. అలాగే జాతీయ రహదారులకు అనుసంధానంగా ఉన్న ప్రాంతాల్లో మరో 3 సీసీటీవీ కెమెరాలను అమర్చారు. ఇంటర్‌ఛేంజ్‌ల వద్ద వాహనం మరొక వాహనాన్ని ఢీకొట్టి ప్రమాదాలు జరగడంతోపాటు కొన్ని సందర్భాల్లో గొడవలు కూడా జరుగుతున్నాయి. దీంతో ఈ ప్రాంతాల్లోని నిఘానేత్రాలు వాటిని పసిగట్టి సమాచారాన్ని చేరవేస్తాయి.

### పక్కాగా వాహనాల లెక్క..

ఓఆర్‌ఆర్‌పై రోజూ ఎన్ని వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయనే విషయాన్నే ఆటోమేటిక్ ట్రాఫిక్ కౌంటర్ కమ్ క్లాషిఫయర్స్ (ఏటీసీసీ) తేల్చనుంది. ఈ పరికరాలను ప్రతి ఇంటర్‌ఛేంజ్‌కు ముందు సైన్ స్క్రీన్ బోర్డుల మాదిరిగానే 72 ఏర్పాటు చేశారు. ఇవి ఏ రోజుకారోజూ ఎన్ని వాహనాలు ప్రయాణం చేశాయి. ఏ రకమైన వాహనాలు ఎక్కువగా ఉన్నాయనే వివరాలను ట్రాఫిక్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు చేరవేస్తుంది. దీనివల్ల టోల్ రుసుం వసూళ్లు మరింత పారదర్శకంగా జరగనున్నాయి. అలాగే నగరంలో ఏదైనా నేరం చేసి ఓఆర్‌ఆర్ మీదుగా వెళ్లే నిందితులు వాహనాన్ని సులువుగా గుర్తించే అవకాశం ఉంది. ఇలా ఓఆర్‌ఆర్‌పై వస్తున్న హెచ్‌టీఎంఎస్ సేవలతో వాహనదారుల భద్రతకు అలర్ట్‌లు ఇవ్వడంతో పాటు నేరం చేసి పారిపోయే నిందితుల వాహనాలను కూడా గుర్తించే అవకాశముందని హెచ్‌ఎండీఏ అధికారులు చెబుతున్నారు.


సీసీటీవీ కెమెరాలు



ఎమర్జెన్సీ కాల్ బాక్స్ సెంటర్‌లు

### వాతావరణ సమాచారం..

ఔటర్ రింగ్ రోడ్డుపై ఇప్పటివరకు 4 ప్రాంతాల్లో మెటిరోలాజికల్ ఎక్విప్‌మెంట్ అమర్చారు. శామీర్‌పేట, రాజేంద్రనగర్, తుక్కుగూడ, సుల్తాన్‌పూర్ ప్రాంతాల్లో ఈ ఆధునిక సాంకేతికతను అమర్చారు. ఇవి ఆయా ప్రాంతాల్లో ఉన్న వాతావరణ పరిస్థితులను వాహనదారులకు డిస్‌ప్లే చేస్తుంది. ఒకవేళ పొగమంచు తీవ్రత ఎక్కువగా ఉంటే ఇదే సమాచారం ఓఆర్‌ఆర్‌లో ఏర్పాటు చేసిన సైన్‌స్క్రీన్ బోర్డులపై వాహనదారులను అప్రమత్తం చేసేలా డిస్‌ప్లే చేస్తుంది.

| | |
|---|---|
| 158 కిలోమీటర్లు | ఔటర్ రింగ్ రోడ్డు |
| 19 | ఇంటర్ ఛేంజ్‌లు |
| 47 | సైన్‌స్క్రీన్ బోర్డులు |
| 72 | ఏటీసీసీ పరికరాలు |
| 328 | ఎమర్జెన్సీ కాల్ బాక్స్ సెంటర్‌లు |
| 41 | సీసీటీవీ కెమెరాలు |
| 4 | మెటిరోలాజికల్ ఎక్విప్‌మెంట్ బోర్డులు |

# సోషల్ మీడియా.. మనమే నం.1

▶ మొదటి పేజీ తరువాయి

దాదాపు 130 కోట్లు. ప్రపంచ దేశాలన్నింటికీ ముమ్మాటికీ అతిపెద్ద మార్కెట్ మన దేశమే. అందుకు సోషల్ మీడియా ఏమీ తీసిపోదు. అందుబాటులోకి వస్తోన్న స్మార్ట్‌ఫోన్ ధరలు, ఇంటర్నెట్ డేటా ప్యాకేజీల వల్ల సోషల్ మీడియా వినియోగంలో పట్టణాలు, పల్లెల్లోనూ అనూహ్య పెరుగుదల నమోదవుతోంది. ఎంతలా అంటే దాదాపు ప్రపంచ సోషల్‌మీడియా వినియోగంలో మనదే 40 శాతం భాగస్వామ్యం ఉండేంతలా. ఫలితంగా సోషల్ మీడియా విభాగంలో ఎన్ని కొత్త యాప్‌లు వచ్చిన ఇండియాలో వాటికి తప్పకుండా కొత్త వినియోగదారులు పుట్టుకొస్తూనే ఉన్నారు. ముఖ్యంగా టిక్‌టాక్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, యూట్యూబ్‌లకు సంబంధించి భారతీయుల వినియోగం అసాధారణ స్థాయిలో ఉంది. ఈ విషయంలో అగ్రరాజ్యం అమెరికా, యూరప్ దేశాలను సైతం తలదన్ని మనదేశం అగ్రస్థానం దక్కించుకుంది.

### టిక్‌టాక్..

కొంతకాలంగా దేశవ్యాప్తంగా టిక్‌టాక్ సృష్టిస్తోన్న హంగామా అంతాఇంతా కాదు. కాపురాలు కూలుతున్నా.. ప్రాణాలు పోతున్నా.. దీన్ని ఎవరూ వదలడం లేదు. యువత, టీనేజీ వారే కాదు.. పిల్లలు, వృద్ధులు సైతం దీన్ని తెగవాడేస్తున్నారు. కొందరు ఈ వ్యసనంతో ప్రభుత్వ ఉద్యోగాలు కోల్పోతున్నా వాడటం మానుకోవడం లేదు. ప్రపంచవ్యాప్తంగా ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఈ యాప్‌ను అధికం (44 శాతం)గా మనమే డౌన్‌లోడ్ చేసుకున్నాం. ఒక్క సెప్టెంబర్‌లోనే 6 కోట్ల మంది ఈ యాప్‌ను కొత్తగా డౌన్‌లోడ్ చేసుకున్నారంటే అర్థం చేసుకోవచ్చు ఈ యాప్ క్రేజ్ ఎంతగా ఉందో. మార్చిలో టిక్‌టాక్ యాప్‌ను ప్రపంచవ్యాప్తంగా 18 కోట్ల మంది డౌన్‌లోడ్ చేయగా అందులో 8 కోట్ల మంది భారతీయులే కావడం గమనార్హం. 15 సెకన్లకు ఓ కొత్త వీడియో ఇందులో అప్‌లోడ్ అవుతోంది. ప్రధాన సోషల్ మీడియా యాప్‌లైన ఫేస్‌బుక్, వాట్సాప్‌లకు ఇది తీవ్ర పోటీనిస్తోంది. వినియోగంలో భారత్ టాప్‌ప్లేస్‌లో ఉండగా.. అమెరికా, టర్కీ తర్వాత స్థానాల్లో నిలిచాయి.

### మరికొన్ని విశేషాలు

- టిక్‌టాక్‌లో 41 శాతం మంది 16 నుంచి 24 ఏళ్ల వయసులోపు వారే.
- యూజర్లలో 56 శాతం పురుషులు, 44 శాతం మహిళలు.
- ప్రతీరోజు సగటు వినియోగదారుడు గడుపుతున్న సమయం 52 నిమిషాలు.
- 90 శాతం వినియోగదారులు రోజుకు ఒక్కసారైనా యాప్ ఓపెన్ చేస్తున్నారు.
- ఇంతవరకూ టిక్‌టాక్ చూసిన వారి సంఖ్య సరాసరిగా 100 కోట్లు.

### ఫేస్‌బుక్..

ఫేస్‌బుక్ విషయానికి వస్తే.. గత నెలలో ఇండియన్లు అత్యధికంగా డౌన్‌లోడ్ చేసుకున్న యాప్‌ల్లో ఇది రెండోస్థానంలో నిలిచింది. ఈ సెప్టెంబర్‌లో ఇండియాలో కొత్తగా 5 కోట్ల మంది ఫేస్‌బుక్ యాప్ డౌన్‌లోడ్ చేసుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా డౌన్‌లోడ్ చేసుకున్న 100 శాతంలో భారత్ భాగస్వామ్యం 23 శాతంగా నమోదైంది. ఉదయాన్నే లేచిన దగ్గర నుంచి పడుకునే దాకా భారతీయులు అధికంగా వినియోగిస్తున్న యాప్‌ల్లో ఫేస్‌బుక్ కూడా ఒకటి. ఎన్ని యాప్‌లొచ్చినా దీనికి ఉండే ఆదరణ తగ్గకపోవడం గమనార్హం. ఫేస్‌బుక్‌కి అగ్రరాజ్యం అమెరికాలో 24 కోట్ల మంది యూజర్లు ఉండగా.. భారత్‌లో మాత్రం 24.1 కోట్ల మంది ఉన్నారు. జనవరి నుంచి జూన్ వరకు ఫేస్‌బుక్ యూజర్ల పెరుగుదల భారత్‌లో 12 శాతంగా నమోదైంది.

**ఫేస్‌బుక్ యూజర్లు..**
ఇండియా: **24.1** కోట్లు
అమెరికా: **24** కోట్లు
ఇండోనేషియా: **13** కోట్లు

### యూట్యూబ్‌కు సైతం..

ఇండియాలో ఆదరణ పెరుగుతున్న వాటిలో యూట్యూబ్ కూడా ముందువరసలో ఉంది. మన దేశంలో 26.5 కోట్ల మంది యూజర్లు ఉన్నారు. 1,200 చానళ్లకు 10 లక్షలకుపైగా సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. ఐదేళ్ల క్రితం కేవలం 2 చానళ్లకు మాత్రమే 10 లక్షల మంది సబ్‌స్క్రైబర్లు ఉండేది. కాలక్రమంలో ఈ చానళ్లకు మంచి ఆదరణ దక్కుతోంది. వీటిలో 95 శాతం ప్రాంతీయ భాషలకు చెందినవి కావడం గమనార్హం. నీల్సన్ సర్వే ప్రకారం.. అధికంగా ఆదరణ ఉన్న వీడియోల్లో స్పోకెన్ ఇంగ్లిష్, ఇతర విద్యా సంబంధమైన కంటెంట్ ఉంది.

**యూట్యూబ్ యూజర్లు..**
అమెరికా: **50** కోట్లు
ఇండియా: **24** కోట్లు
జపాన్: **12** కోట్లు

# కూతురు మిగిల్చిన విషాదం

**ప్రియుడితో కలసి తల్లిని చంపిన కుమార్తె**
- మూడు రోజులు ఇంట్లోనే శవం
- దుర్వాసన రావడంతో పట్టాలపై పడేసిన వైనం
- ఇద్దరు యువకులతో ప్రేమాయణం
- తల్లి మందలించడంతో ఘాతుకం


మృతురాలు రజిత



నిందితులు కీర్తి, శశికుమార్

హైదరాబాద్: ప్రియుడితో కలసి కన్న కూతురే ఓ తల్లిని చంపేసింది. తప్పుదారిలో వెళ్తున్నావని తల్లి మందలించినందుకే ఈ పాపానికి ఒడిగట్టింది. హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం నిర్నేముల గ్రామానికి చెందిన పల్లెర్ల శ్రీనివాస్‌రెడ్డి, రజిత అలియాస్ రుద్రమ్మ(38) దంపతులు. వీరికి కీర్తి ఏకైక కూతురు. శ్రీనివాస్‌రెడ్డి లారీ డ్రైవర్‌గా పని చేస్తూ బతుకుదెరువు కోసం కుటుంబంతో కలిసి పదేళ్ల కింద హైదరాబాద్‌కు వచ్చాడు. తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని మునుగనూర్‌లో ఉంటూ అక్కడే ద్వారకా సాయినగర్ కాలనీలో ఇల్లు కట్టుకున్నాడు. కీర్తి(19) దిల్‌సుఖ్‌నగర్‌లోని ఓ డిగ్రీ కాలేజీలో రెండో సంవత్సరం చదువుతోంది. ఆమె కొన్ని నెలల కింద వేరే కాలనీలో నివసించే కృష్ణారెడ్డి కుమారుడు బాల్‌రెడ్డితో ప్రేమలో పడింది. ఈ విషయం బయటకు తెలియడంతో ఇరువురి తల్లిదండ్రులు వివాహం చేయాలని అనుకున్నారు. అయితే కీర్తి కొంతకాలంగా ఇంటి పక్కనే ఉండే శశికుమార్‌తో కూడా ప్రేమాయణం నడిపిస్తోంది. ఈ విషయం తెలిసిన తల్లి ఓ వైపు బాల్‌రెడ్డితో వివాహం కుదిరిన తర్వాత శశికుమార్‌తో సన్నిహితంగా ఎందుకు ఉంటున్నావని కూతురును మందలించింది. తన ప్రవర్తన మార్చుకోవాలని హెచ్చరించింది. శశికుమార్‌తో సంబంధానికి అడ్డొస్తుందనే భావనతో కీర్తి తన తల్లిని చంపాలనుకుంది. దీనికి ప్రియుడు శశికుమార్ సహకారం తీసుకుంది. ఈ నెల 19న తండ్రి ఇంట్లో లేని సమయంలో కీర్తి, శశికుమార్‌లు రజిత మెడకు చున్నీతో ఉరి బిగించి చంపారు.

**కారులో శవం తరలింపు**

తల్లి శవాన్ని ఇంట్లోనే పెట్టుకుని ప్రియుడు శశికుమార్‌తో కలసి కీర్తి 3 రోజులు గడిపింది. తర్వాత దుర్వాసన రావడంతో శవాన్ని తరలించాలని నిర్ణయించుకున్నారు. శశికుమార్ తండ్రి కారులో శవాన్ని తీసుకెళ్లి రామన్నపేట సమీపంలో రైలు పట్టాలపై పడేశారు. రామన్నపేట రైల్వే పోలీసులు ఆ మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని రెండ్రోజుల పాటు వేచి చూసి గుర్తుతెలియని మృతదేహంగా దహన సంస్కారాలు నిర్వహించారు.

**తండ్రిపైకి నెట్టే యత్నం**

తన తండ్రి వేధింపులు భరించలేకే తల్లి ఇంటి నుంచి వెళ్లిపోయిందని నమ్మించేందుకు కీర్తి ప్రయత్నించింది. తల్లి శవాన్ని పడేసిన తర్వాత తాను స్నేహితులతో కలిసి వైజాగ్ టూర్‌కు వెళ్తున్నానని ఈ నెల 23న తండ్రికి ఫోన్ చేసి చెప్పింది. ఆమె టూర్‌కు వెళ్లకుండా ప్రియుడి ఇంట్లోనే ఉంది. ఈ నెల 24న ఇంటికి వచ్చిన తండ్రి 'అమ్మ కనిపించడం లేద'ని కీర్తికి ఫోన్ చేశాడు. దీంతో టూర్ మధ్యలో నుంచి వచ్చినట్లు కీర్తి ఇంటికి చేరుకుంది. బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా తల్లి ఆచూకీ దొరకలేదు. దీంతో తన తండ్రి తరచూ తాగి వచ్చి అమ్మను వేధించేవాడని, ఈ క్రమంలో అమ్మ రజిత ఇంటి నుంచి వెళ్లిపోయిందని కీర్తి ఈ నెల 26న పోలీసులకు ఫిర్యాదు చేసింది.

**ఇలా దొరికిపోయింది...**

కీర్తి పోలీసులకు ఫిర్యాదు చేయడంపై శ్రీనివాస్‌రెడ్డి కంగు తిన్నాడు. కూతురును గుచ్చి గుచ్చి అడగడంతో పొంతనలేని సమాధానాలు చెప్పింది. వైజాగ్ టూర్‌కు ఎందుకు వెళ్లావు? ఎవరెవరు నీ వెంట వచ్చారు? వారి వివరాలు, ఫోన్ నంబర్లు ఇవ్వాలని కీర్తిని ప్రశ్నించారు. పోలీసులు తమదైన శైలిలో విచారించగా కీర్తి నేరం చేసినట్లు ఒప్పుకుంది. నిందితులు కీర్తి, ప్రియుడు శశికుమార్‌లను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారిస్తున్నారు.







Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.